www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

మండిన కోస్తా

నెల్లూరులో 40.2 డిగ్రీలు.. దేశంలోనే అత్యధికం
పశ్చిమ గోదావరి నుంచి నెల్లూరు దాకా వడగాడ్పులు
జూలై తొలి పక్షంలో నిరాశపరచిన రుతుపవనాలు
రాష్ట్రంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు
సాధారణం కంటే 38.6 శాతం తక్కువ వర్షపాతం
రేపు నైరుతి బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం
దాని ప్రభావంతో 22వ తేదీ వరకు వర్షాలు

14

పీఎం ధన్ ధాన్య కృషి యోజనకు ఆమోదం



కేంద్ర క్యాబినెట్ కీలక నిర్ణయం
దేశవ్యాప్తంగా 100 జిల్లాల్లో అమలు
ఏడాదికి 24 వేల కోట్లు కేటాయింపు
ఉత్పాదన, రుణ సౌలభ్యం పెంపు లక్ష్యం
1.7 కోట్ల రైతులకు ప్రయోజనం
రేపు రైతుల ఖాతాల్లోకి పీఎం కిసాన్!

2

గురువారం | 17-7-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 | సంచిక (Issue) : 131 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, బహుళపక్షం, తిథి: సప్తమి రా.7:09 తదుపరి అష్టమి, నక్షత్రం: రేవతి తె.3:39 తదుపరి అశ్విని, వర్జ్యం: సా.4:14-5:45, దుర్ముహూర్తం: ఉ.10:12-11:03, మ.3:22-4:14, అమృతఘడియలు: రా.1:22-2:53, రాహుకాలం: మ.1:30-3:00, సూర్యోదయం: 5:53, సూర్యాస్తమయం: 6:49 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



బుధవారం ఢిల్లీలో జరిగిన భేటీలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు

తెలుగు రాష్ట్రాలే నాకు ముఖ్యం

ఒక్కరే బాగుండాలనుకునే వ్యక్తిని కాను: చంద్రబాబు

గోదావరిలో మా వాటా కిందే బనకచర్ల ప్రాజెక్టు

సమస్యలు సామరస్యంగా పరిష్కరించుకుందాం
నిపుణుల కమిటీ ముందు అన్నిటిపైనా చర్చిద్దాం
అయినా తెగకపోతే అపెక్స్ కౌన్సిల్‌లో చర్చిద్దాం
వృథా పోయే వరద నీరే బనకచర్లకు వాడుకుంటాం
అది కూడా ఎగువ రాష్ట్రాలు వాడుకున్నాకే
తెలంగాణ పథకాలకు ఎప్పుడూ అడ్డుచెప్పను
వాటి కోసం కర్ణాటక, మహారాష్ట్రలతో పోరాడా
బాబ్లీ పోరులో రేవంత్‌రెడ్డి కూడా పాల్గొన్నారు
ఢిల్లీ భేటీలో ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యలు

బనకచర్ల, కృష్ణా, గోదావరి సమస్యలపై

నిపుణుల కమిటీ



కేంద్రం ఆధ్వర్యంలో 21లోగా ఏర్పాటు: నిమ్మల
సీఎంల భేటీలో 3 అంశాలపై నిర్ణయాలు
రిజర్వాయర్ల అవుట్‌ఫ్లోల వద్ద టెలిమెట్రీలు
శ్రీశైలం డ్యాంకు తక్షణమే మరమ్మతులు
అమరావతికి కృష్ణా బోర్డు, హైదరాబాద్‌లో గోదావరి బోర్డు
స్నేహపూర్వక వాతావరణంలో, ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో చర్చలు

50 ఏళ్ల గోదావరి వరద లెక్కలను పరిగణనలోకి తీసుకుని.. ఎగువ రాష్ట్రాలన్నీ వాడుకున్నాక మిగిలిన జలాలు సముద్రంలోకి వృథాగా పోకుండా రాష్ట్రావసరాల కోసం వినియోగించుకోవడం పోలవరం-బనకచర్ల పథకం ఉద్దేశం. గోదావరి జలాల్లో మా రాష్ట్ర వాటా మేరకే దీనిని చేపడుతున్నాం.

తెలంగాణ ప్రాజెక్టుల నిర్మాణానికి నేనెప్పుడూ అడ్డుచెప్పను. రెండు రాష్ట్రాలుగా విడిపోయినా.. ప్రాంతాలు, పార్టీలకు అతీతంగా తెలుగు ప్రజలు కలిసే ఉంటారు.

\- సీఎం చంద్రబాబు

అమరావతి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాలే తనకు ముఖ్యమని.. రెండు రాష్ట్రాలూ బాగుండాలని కోరుకునే వారిలో తాను ముందుంటానని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఒక రాష్ట్రం బాగుండాలని.. మరో రాష్ట్రం వెనుకబడిపోవాలని భావించే వ్యక్తిని కానని తేల్చిచెప్పారు. బుధవారం ఢిల్లీలో కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ వద్ద జరిగిన సమావేశంలో చంద్రబాబు,

మిగతా 13వ పేజీలో...

ఉభయ రాష్ట్రాల మధ్య గొడవల కోసం

కొందరి ఎదురుచూపు

జాలిపడడం తప్ప ఏమీ చేయలేం
వివాదరహిత పరిష్కారమే మా ఎజెండా
బనకచర్లపై చర్చ జరగలేదు
సీఎంల భేటీ.. సమస్యలను పెద్దవి చేసుకోవడానికి కాదు: రేవంత్‌రెడ్డి

13




హంద్రీ-నీవాకు కృష్ణా జలాలను తరలించే మల్యాల ఎత్తిపోతల పథకం ట్రయల్‌రన్

హంద్రీ-నీవాకు కూటమి హారతి

సీమలో పథకానికి ఎన్టీఆర్ రూపకల్పన
కరువు పల్లెలకు కృష్ణా జలాల మళ్లింపే లక్ష్యం
1.7 కోట్లు క్యూబిక్ మీటర్ల మట్టి తవ్వకాలు
45 లక్షల చదరపు మీటర్ల లైనింగ్
120 రోజుల్లో రికార్డు స్థాయిలో పనులు
పిల్ల కాలువలు పూర్తయితేనే లక్ష్య సాకారం
నేడు కృష్ణా జలాలు విడుదల చేయనున్న సీఎం చంద్రబాబు

11

ప్రాజెక్టు మీది.. భరోసా మాది!



పారిశ్రామిక వేత్తలకు చంద్రబాబు హామీ

ఏపీలో పెట్టుబడులు పెట్టండి.. మీ ప్రాజెక్టులను సర్కారువిగా భావిస్తాం

2047 నాటికి దేశంలోనే ఉత్తమ రాష్ట్రంగా ఏపీ
అంతర్జాతీయ ప్రమాణాల మేరకు అభివృద్ధి చేసేందుకు కృత నిశ్చయంతో అడుగులేస్తున్నాం
ఐటీలో బిల్‌గేట్స్ వంటి వారితో కలిసి పనిచేస్తున్నాం
పెట్టుబడిదారులకు రాష్ట్రంలో అపార అవకాశాలు

పరిశ్రమల సమాఖ్య సమావేశంలో 'స్వర్ణాంధ్ర-2047' నివేదికను ఆవిష్కరించిన సీఎం

₹ 10 వేల కోట్లు ఇవ్వండి

రెవెన్యూ లోటును భర్తీ చేయండి
నిర్మలకు బాబు వినతి

13

న్యూఢిల్లీ, జూలై 16(ఆంధ్రజ్యోతి): "ప్రాజెక్టు మీది.. భరోసా మాది. ఏపీలో పెట్టుబడి పెట్టి మీరు ప్రారంభించే ప్రాజెక్టులను ప్రభుత్వానివిగా భావిస్తాం. 2047 నాటికి ఏపీ దేశంలోనే ఉత్తమ రాష్ట్రంగా అభివృద్ధి చెందుతుంది. అంతర్జాతీయ ప్రమాణాల మేరకు అభివృద్ధి చేసేందుకు కృత నిశ్చయంతో అడుగులు వేస్తున్నాం." అని జాతీయస్థాయి పారిశ్రామిక వేత్తలను ఉద్దేశించి ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. బుధవారం ఢిల్లీలో జరిగిన భారత పరిశ్రమల సమాఖ్య(సీఐఐ) సమావేశంలో రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి సంబంధించి సమగ్ర వివరాలతో

మిగతా 14వ పేజీలో...

ప్రసన్నకుమార్‌రెడ్డికి నో బెయిల్

'అర్నేష్‌కుమార్' కేసు మార్గదర్శకాలు పాటించండి
పోలీసులకు హైకోర్టు ఆదేశం

14

రప్పా రప్పా.. తప్పేందప్పా?

సినిమా డైలాగులు పోస్టరుగా వేస్తే తప్పా?
మరోసారి సమర్థించిన వైఎస్ జగన్

13

డీఐజీలు డాన్‌లుగా మారారు

డీఎస్పీలు, సీఐలతో డబ్బులు వసూళ్లు
ఎమ్మెల్యేలు, పెద్దబాబు, చినబాబుకు వాటాలు
పోలీసు వ్యవస్థపై జగన్ తీవ్ర ఆరోపణలు



మిగులు జలాలు అంచనా వేయకుండా బనకచర్ల సరికాదంటూ అడ్డగోలు వాదన

నిన్నటి ఆయుధాలతో నేటి యుద్ధం గెలవలేం!

దేశ రక్షణ సామర్థ్యాన్ని తక్షణం ఆధునీకరించాల్సి ఉంది
సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్

2

లారీలపై జగన్ గ్రీన్ బాదుడు భారీగా తగ్గింపు

12

ఉత్తర్వులు జారీ చేసిన చంద్రబాబు ప్రభుత్వం.. ఏపీ లారీ ఓనర్స్ అసోసియేషన్ హర్షం

నిన్నటి ఆయుధాలతో.. నేటి యుద్ధం గెలవలేం!

▸ సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్ వెల్లడి



న్యూఢిల్లీ, జూలై 16: భారత రక్షణ సామర్థ్యాన్ని తక్షణమే ఆధునీకరించాల్సిన అవసరం ఉందని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్(సీడీఎస్) జనరల్ అనిల్ చౌహాన్ అన్నారు. "నిన్నటి ఆయుధాలతో నేటి యుద్ధం గెలవలేం. రేపటి సాంకేతికతతో ఈ రోజు యుద్ధం చేయాలి. కాలం చెల్లిన వ్యవస్థలతో కాదు." అని వ్యాఖ్యానించారు. బుధవారం ఢిల్లీలో మానవ రహిత వైమానిక వాహనాలు(యూఏవీ), కౌంటర్ మానవ రహిత వైమానిక వ్యవస్థ స్వదేశీకరణపై జరిగిన వర్క్‌షాపులో సీడీఎస్ మాట్లాడారు. దేశం తన వ్యూహాత్మక లక్ష్యాలకు కీలకమైన సాంకేతిక పరిజ్ఞానంపై విదేశాలపై ఆధారపడడం తగ్గించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పాకిస్థాన్‌లోని ఉగ్రస్థావరాలే లక్ష్యంగా మే నెలలో చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'ను ప్రస్తావించారు. ఆ సమయంలో పాకిస్థాన్ మన సరిహద్దుల వెంబడి మానవ రహిత డ్రోన్లతో పాటు మందుగుండు సామాగ్రిని మోహరించిందని తెలిపారు. అయితే, పాక్ ప్రయోగించిన యూఏవీతో భారత సైన్యానికికానీ, పౌరుల మౌలిక సదుపాయాలకు కానీ ఎలాంటి నష్టం వాటిల్లలేదని పేర్కొన్నారు.

వచ్చే నెలలో చైనాకు ప్రధాని మోదీ!

న్యూఢిల్లీ, జూలై 16: ప్రధాని నరేంద్ర మోదీ త్వరలో చైనాలో పర్యటించనున్నారు. ఆగస్టు 31 నుంచి సెప్టెంబరు 1 వరకు జరగబోయే షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) సదస్సుకు ఆయన హాజరుకానున్నట్లు సమాచారం. ఈ సదస్సులో చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్‌తో ప్రధాని మోదీ చర్చలు జరిపే అవకాశం ఉంది. వీరిద్దరూ గతేడాది అక్టోబరులో రష్యాలో జరిగిన బ్రిక్స్ సదస్సులో చివరిసారిగా కలుసుకున్నారు. ఇరుదేశాల మధ్య ప్రస్తుతం ఉద్రిక్తంగా ఉన్న సంబంధాలు మోదీ పర్యటనతో మెరుగుపడతాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. కాగా, 2020లో తూర్పు లద్దాఖ్‌లోని గల్వాన్ లోయలో సైనిక ఘర్షణల తర్వాత మోదీ చైనాను సందర్శించడం ఇదే మొదటిసారి కానుంది.

నిమిషప్రియకు క్షమాభిక్ష ప్రసక్తే లేదు..!

▸ యెమెన్ మృతుడి సోదరుడి స్పష్టీకరణ

న్యూఢిల్లీ, జూలై 16: కేరళ నర్సు నిమిషప్రియకు క్షమాభిక్ష ప్రసక్తే లేదని యెమెన్‌కు చెందిన మృతుడు తలాల్ మెహదీ సోదరుడు అబ్దుల్ ఫతా మెహదీ స్పష్టం చేశారు. 2017లో తలాల్ మెహదీని హత్య చేసిన కేసులో నిమిషప్రియకు యెమెన్ ప్రభుత్వం మరణ శిక్ష విధించిన సంగతి తెలిసిందే. బుధవారం ఆమెకు శిక్షను అమలు చేయాల్సి ఉండగా.. దాన్ని వాయిదా వేశారు. ఈ క్రమంలో మృతుడి సోదరుడు స్పందిస్తూ.. నిమిషప్రియను క్షమించే ప్రసక్తే లేదన్నారు. ఆమెకు మరణ శిక్షను అమలు చేయాలని కోరారు. మరోవైపు నిమిషప్రియను కాపాడేందుకు భారత ప్రభుత్వం, కొన్ని సంస్థలు తీవ్ర ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాయి. మృతుని కుటుంబ సభ్యులను ఒప్పించడమే మత పెద్దలకు, అధికారులకు సవాలుగా మారింది. వారు అంగీకరిస్తే ఎంత మొత్తంలో 'బ్లడ్ మనీ' ఇవ్వాలన్న దానిపై చర్చలు జరపనున్నారు.

అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడతాం

▸ సీఎం మార్పు వార్తలపై కర్ణాటక సీఎం సిద్దరామయ్య

బెంగళూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి పదవి విషయంలో అధిష్ఠానం తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉంటానని కర్ణాటక సీఎం సిద్దరామయ్య అన్నారు. కాంగ్రెస్ ఓబీసీ సలహా మండలి సమావేశం ముగిసిన అనంతరం బెంగళూరులో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఐదేళ్లు తానే ముఖ్యమంత్రిగా ఉంటానని ఇటీవల ఢిల్లీ పర్యటనలో సిద్దరామయ్య ప్రకటించిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మౌనంగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో మీడియాతో మాట్లాడిన సీఎం, అధిష్ఠానం తీసుకునే నిర్ణయాన్ని తాను, డీకే శివకుమార్ పాటిస్తామని అన్నారు.

క్యాంటీన్‌లో ఎంపీలకు కేంద్రం కొత్త మెనూ

న్యూఢిల్లీ, జూలై 16: పార్లమెంట్ క్యాంటీన్‌లో ఇప్పుడు ఎంపీలు ఆరోగ్యకరమైన, తక్కువ క్యాలరీలతో కూడిన పోషకాహారాన్ని ఆస్వాదించనున్నారు. కొత్తగా ప్రవేశపెట్టిన హెల్దీ మెనూ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా సూచనలతో రూపుదిద్దుకుంది. ఈ కొత్త జాబితాలో చిరుధాన్యాలతో చేసే వంటకాలకు ప్రాధాన్యం లభించింది. ఫిట్ ఇండియా మూవ్‌మెంట్, పోషణ్ అభియాన్, ఈట్ రైట్ ఇండియా వంటి జాతీయ ఆరోగ్య కార్యక్రమాలకు అనుగుణంగా ఈ మెనూను తయారయింది. ప్రతి వంటకానికి సంబంధించిన క్యాలరీల వివరాలు అధికారులు మెనూలో పేర్కొన్నారు. ఈ జాబితాలో రాగి ఇడ్లీ, సాంబార్, చట్నీ, జొన్న ఉప్మా, చనా చాట్, మూంగ్ దాల్ చిల్లా, ఫైబర్ అధికంగా ఉండే జొన్న, బార్లీ సలాడ్, వెజిటెబుల్ సూపులు ఉన్నాయి. అలాగే మాంసాహారుల కోసం గ్రిల్డ్ చికెన్, ఫిష్ అందుబాటులో ఉన్నాయి.

మీకు కావాల్సింది ఆయన కాదు.. నిఘంటువు

▸ అశోకా వర్సిటీ ప్రొఫెసర్ అలీఖాన్ వివాదాస్పద వ్యాఖ్యల కేసులో సిట్‌పై సుప్రీంకోర్టు ఆగ్రహం

న్యూఢిల్లీ, జూలై 16: 'ఆపరేషన్ సిందూర్'పై అశోకా యూనివర్సిటీ ప్రొఫెసర్ అలీ ఖాన్ మహమూదాబాద్ పెట్టిన వివాదాస్పద పోస్టుల మీద దర్యాప్తు జరుపుతున్న సిట్‌పై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. దర్యాప్తు బృందానికి కావాల్సింది ఆయన కాదని.. (ఆయన పోస్టులను అర్థం చేసుకోవడానికి) నిఘంటువు అని వ్యాఖ్యానించింది. వివాదాస్పద పోస్టులకు సంబంధించి కోర్టు పరిధిలో ఉన్న అంశంపై తప్ప.. మిగతా ఏ అంశంపైన అయినా ఆన్‌లైన్‌లో వ్యాసాలు రాసే హక్కు అలీ ఖాన్‌కు ఉందని తేల్చిచెప్పింది. ఈ కేసుపై దర్యాప్తు చేస్తున్న సిట్.. అలీఖాన్‌కు సంబంధించిన ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకుందని, గత పదేళ్లుగా ఆయన ఏయే దేశాలకు వెళ్లారో వివరాలు ఇవ్వాల్సిందిగా అడుగుతోందని ఆయన తరపు న్యాయవాది కపిల్ సిబల్ బుధవారం కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. సిట్ ఇప్పటికే ఆయన్ను నాలుగుసార్లు విచారణకు పిలిపించిందని తెలిపారు. దీంతో.. అలీ ఖాన్ పెట్టిన రెండు సోషల్ మీడియా పోస్టుల్లోని పదాల భావాలను సంపూర్ణంగా అర్థం చేసుకోవడానికి, ఆయా వ్యక్తీకరణలను సరిగ్గా అంచనా వేయడానికి మాత్రమే సిట్ ఏర్పాటైందని ధర్మాసనం గుర్తుచేసింది.

మొక్కల 'మాటలు' కీటకాలకు అర్థమవుతాయ్!

టెల్అవీవ్ వర్సిటీ పరిశోధకుల వెల్లడి.. ఆడ చిమ్మటలపై ప్రయోగాల ద్వారా ఆవిష్కరణ

▸ ప్రకృతిలోని ధ్వని సమాచార వ్యవస్థల అధ్యయనంలో కొత్త పరిణామం

న్యూఢిల్లీ, జూలై 16: మొక్కల 'మాటలను' కీటకాలు అర్థం చేసుకోగలవని ఓ తాజా పరిశోధన వెల్లడించింది. ప్రకృతిలో ఉన్న ధ్వనిపరమైన సమాచార వ్యవస్థల అధ్యయనంలో ఇది ఒక కొత్త పరిణామం. ఇజ్రాయెల్‌లోని టెల్అవీవ్ యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్తలు ఈ పరిశోధన జరిపారు. దీంట్లో భాగంగా ఆడ చిమ్మటల మీద వారు కొన్ని ప్రయోగాలు జరిపారు. సాధారణంగా, ఆడ చిమ్మటలు తమ గుడ్లను టమాటో మొక్కల మీద పొదుగుతుంటాయి. గుడ్ల నుంచి బయటకు వచ్చే లార్వాలకు అవసరమైన ఆహారం కోసం అవి ఆ పని చేస్తుంటాయి. అయితే, ఆరోగ్యవంతమైన టమాటో మొక్కను గుర్తించటానికి ఆడ చిమ్మటలు ధ్వనితరంగాల మీద ఆధారపడుతుంటాయి. నీళ్లు లేక అలమటించే టమాటో మొక్కలు తమ పరిస్థితిని అల్ట్రాసోనిక్ సంకేతాల ద్వారా తెలుపుతుంటాయి. ఈ సంకేతాలను అర్థం చేసుకోవటం ద్వారా ఆడ చిమ్మటలు.. నీళ్లు లేక ఎండిపోతున్న వాటి మీద కాకుండా.. ఆరోగ్యంగా ఉన్న టమాటో మొక్క మీద తమ గుడ్లను పొదుగుతాయని టెల్అవీవ్ వర్సిటీ పరిశోధకులు జరిపిన ప్రయోగాల ద్వారా తెలిసింది. ఈ పరిశోధనకు సారథ్యం వహించిన ప్రొఫెసర్ ర్యా సెల్జర్, ప్రొఫెసర్ గ్యూజెర్ ఎషల్ ఒక ప్రకటన విడుదల చేస్తూ.. మొక్కలకు, కీటకాలకు మధ్య ధ్వనిపరమైన కమ్యూనికేషన్ ఉంటుందని తొలిసారిగా రుజువైందన్నారు. వ్యవసాయం, కీటక నియంత్రణ, పంటల నాణ్యత తదితర రంగాల్లో ఈ పరిశోధన ఉపయోగపడవచ్చని భావిస్తున్నారు.

మెటా ఏఐ.. మెగా ప్లాన్

రూ.లక్షల కోట్ల వ్యయంతో ఏఐ సూపర్ క్లస్టర్లు.. 1341 మెగావాట్ల సామర్థ్యంతో తొలి క్లస్టర్ ప్రొమెథియస్

▸ వచ్చే ఏడాది నాటికి అందుబాటులోకి: మార్క్ జుకెర్‌బెర్గ్

▸ తర్వాత మరిన్ని క్లస్టర్లు.. 5గిగావాట్లతో హైపరియన్ క్లస్టర్

▸ ఓపెన్ ఏఐ, యాపిల్, ఆంత్రోపిక్ వంటి పెద్ద సంస్థల నుంచి ప్రతిభావంతులకు వల

▸ నియామకాల కోసం స్కేల్ ఏఐతో రూ.1.2 లక్షల కోట్ల ఒప్పందం





'ఏఐ' రంగంలో ఇప్పటికే దూసుకుపోతున్న ఓపెన్ ఏఐ, డీప్‌సీక్ వంటివాటికి మరింత గట్టిపోటీ ఇచ్చేందుకు.. ఫేస్‌బుక్ వ్యవస్థాపకుడు, మెటా సీఈవో జుకెర్‌బెర్గ్ భారీ ప్రణాళికలు రచించారు! రూ.లక్షల కోట్ల ఖర్చుతో భారీ 'ఏఐ' సూపర్‌క్లస్టర్ల నిర్మాణానికి నడుం బిగించారు!! 'ప్రొమెథియస్' పేరుతో.. వచ్చే ఏడాది నాటికి 1341 మెగావాట్ల ఏఐ సూపర్ క్లస్టర్‌ను ఏర్పాటు చేయనున్నట్టు ఆయన ప్రకటించారు. ఆ తర్వాత క్రమంగా ఆ శక్తిని పెంచుకుంటూ పోయి కొన్నేళ్ల తర్వాత 5 వేల గిగావాట్ల 'హైపరియన్' సూపర్‌క్లస్టర్‌ను నిర్మించనున్నట్టు వెల్లడించారు. ఇంతకీ ఏమిటీ సూపర్ క్లస్టర్లు? వీటివల్ల ఉపయోగం ఏంటి? అంటే.. కృత్రిమ మేధ ఎలా పనిచేస్తుందో ముందు తెలుసుకోవాలి. సాధారణంగా మనం గూగుల్‌లో ఏదైనా ప్రశ్నకు సమాధానం తెలుసుకోవాలంటే.. సెర్చ్ చేసి, వచ్చిన సమాచారాన్నంతటినీ ఒక్కొక్కటిగా స్క్రోల్ చేసి, పనికొచ్చే డేటాను తీసుకుని దాన్ని క్రోడీకరిస్తేగానీ మన పని పూర్తి కాదు. ఇంత పనినీ చాట్‌జీపీటీ, డీప్‌సీక్ వంటి ఏఐలు కన్నుమూసి తెరిచేంతలో పూర్తిచేస్తున్న విషయం తెలిసిందే కదా! అవి అంత వేగంగా సమాచారాన్ని సేకరించడం వెనుక అసలు కిటుకు.. ఈ సూపర్ క్లస్టర్లే. ఇవి నేరుగా సమాచారాన్ని సేకరించడంలో ఉపయోగపడవుగానీ.. ఎలా సేకరించాలో ఏఐ మోడల్స్‌కు రోజులు, వారాలు, నెలల తరబడి శిక్షణ ఇస్తాయి. ఇంత శిక్షణ ఇవ్వడం మనుషులకు సాధ్యం కాదు కాబట్టి ఈ సూపర్ క్లస్టర్లను వినియోగిస్తారు. అలా.. డీప్‌సీక్ ఏఐ మోడల్‌కు శిక్షణ ఇవ్వడానికి ఉపయోగిస్తున్న సూపర్ క్లస్టర్ సామర్థ్యం ఎంతో తెలుసా? కేవలం 12 నుంచి 14 మెగావాట్లు. చాట్‌జీపీటీకి శిక్షణ ఇవ్వడానికి ఉపయోగిస్తున్న సూపర్ క్లస్టర్ సామర్థ్యం 300 నుంచి 500 మెగావాట్లు! దానికి దాదాపు రెండున్నర రెట్ల అధిక సామర్థ్యంతో.. ఏకంగా 1341 మెగావాట్ల సామర్థ్యం కలిగిన సూపర్ క్లస్టర్ ఏర్పాటుకు మెటా సిద్ధమవుతోందంటే అది ఎంత శక్తిమంతమైనదో అర్థం చేసుకోవచ్చు. అందునా అది ఆరంభం మాత్రమే. మెటా ప్రణాళికలో తుది ప్రాజెక్టు.. అక్షరాలా 5 గిగావాట్ల సామర్థ్యం గల సూపర్ క్లస్టర్ నిర్మాణం. అంటే 'ప్రొమెథియస్' కన్నా.. దాదాపు ఐదు రెట్ల అధిక సామర్థ్యం. అందుకే టెక్ ప్రపంచమంతా ఈ ప్రాజెక్టువైపు ఆసక్తిగా చూస్తోంది.

1341 మెగావాట్లంటే...

మెటా అభివృద్ధి చేయనున్న సూపర్ క్లస్టర్ సామర్థ్యం 1341 మెగావాట్లు. అర్థమయ్యేలా చెప్పాలంటే.. మన ఇంట్లో తిరిగే సీలింగ్ ఫ్యాన్ సగటున 75 వాట్ల కరెంటును వినియోగించుకుంటుందనుకుంటే.. ఒకేసారి 1,80,00,000 (1.8 కోట్ల) ఫ్యాన్లు తిరిగితే ఎంత శక్తి ఖర్చవుతుందో అంత శక్తి! ఆ శక్తితో 1,34,10,000 టీవీలను ఒకేసారి చూడొచ్చు. 89 లక్షల 40 వేల రిఫ్రిజిరేటర్లను లేదా 6.7 కోట్ల ట్యూబ్‌లైట్లను పనిచేయించవచ్చు. దీనికే అంత శక్తి ఉందంటే.. 5 గిగావాట్ల సామర్థ్యం అంటే ఎంతో మీరే ఊహించుకోండి!!

ఉద్యోగావకాశాలూ..

ఈ భారీ ప్రాజెక్టు కోసం భారీగా పెట్టుబడులు పెట్టడంపైనే కాదు.. అంతే భారీ స్థాయిలో ఏఐ రంగంలో ప్రతిభావంతులను నియమించుకోవడంపైనా మెటా దృష్టి సారించింది. నియామకాల కోసం ఆ సంస్థ ఇటీవలే 'స్కేల్ ఏఐ' సంస్థతో 14 బిలియన్ డాలర్ల (మన కరెన్సీలో రూ.1.2 లక్షల కోట్లు) ఒప్పందం కుదుర్చుకుంది. అలాగే.. ఈ ప్రాజెక్టు నిర్వహణ కోసం 'మెటా సూపర్ ఇంటెలిజెన్స్ ల్యాబ్స్' అనే సంస్థను స్థాపించింది. ప్రపంచ ప్రఖ్యాత ఏఐ పరిశోధకులు, ఇంజనీర్లను ఆ సంస్థలోకి తీసుకుంటోంది. స్కేల్ ఏఐ సీఈవో అలెగ్జాండర్ వాంగ్, గిట్‌హబ్ మాజీ చీఫ్ నాట్ ఫ్రెడ్‌మన్ వంటివారిని ఇప్పటికే ఆ సంస్థలో నియమించుకున్నారు. యాపిల్, ఆంత్రోపిక్, ఓపెన్‌ఏఐ నుంచి పెద్ద సంఖ్యలో ప్రతిభావంతులను చేర్చుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అత్యుత్తమ ప్రతిభావంతులకు రూ.850 కోట్ల దాకా ప్యాకేజీలు కూడా ఆఫర్ చేస్తున్నారు.

-సెంట్రల్ డెస్క్

లోకం తీరు



అక్బర్ పాలనలో మత అసహనం

▸ పుర్రెలపై విజయ సౌధాలు కట్టిన బాబర్

▸ 8వ తరగతి సాంఘిక శాస్త్ర పాఠ్యాంశంలో ఎన్‌సీఈఆర్టీ మార్పులు



న్యూఢిల్లీ, జూలై 16: ఎనిమిదో తరగతి విద్యార్థులకు బోధించే సాంఘిక శాస్త్రంలో 'ఎన్‌సీఈఆర్టీ' కీలకమార్పులు చేసింది. భారతదేశాన్ని 13 నుంచి 17వ శతాబ్దంవరకు పాలించిన ఢిల్లీ సుల్తానులు, విజయనగర రాజులు, మొఘల్ చక్రవర్తులు, మరాఠాలు, సిక్కు రాజుల చరిత్రలకు సంబంధించి, గతంలో చేర్చని పలు అంశాలను కొత్త పాఠ్యాంశంలో భాగం చేసింది. అక్బర్ పాలన మత అసహనంతో సాగిందని, మరో మొఘల్ చక్రవర్తి బాబర్.. శత్రు సేనలను వధించి, వారి పుర్రెలపై విజయ సౌధాలు నిర్మించారని పేర్కొన్నారు. చిత్తోర్‌కోటను జయించినప్పుడు వేలాదిమందిని అక్బర్ వధించారని తెలిపారు. ఈ సందర్భంగా అక్బర్ తన సన్నిహితులతో మాట్లాడుతూ... "అవిశ్వాసులకు చెందిన పలు కోటలు, నగరాలు జయించాం. ఇస్లామ్ రాజ్యాన్ని వ్యాపింపజేశాం" అని అన్నట్టు రాశారు. 'భారతదేశ రాజకీయ పటాన్ని తిరగరాసిన శతాబ్దాలు' అనే శీర్షికతో ఇలాంటి అంశాలెన్నో పొందుపరిచారు. గతంలో జరిగిపోయిన ఘటనలకు ఎవరినీ బాధ్యులను చేయలేం.. అని ఒక అధ్యాయంలో 'ఎన్‌సీఈఆర్టీ' పేర్కొంది. అలాగే.. 'చరిత్రలో కొన్ని చీకటి ఘట్టాలు' అనే పేరిట రాసిన ఉపోద్ఘాతంలో ఎందుకు సాంఘిక శాస్త్ర పాఠ్యాంశాన్ని సవరించాల్సి వచ్చిందో వివరించింది. శ్రీరంగం, చిదంబరం సహా పలు హిందూ ధార్మిక స్థలాలను అల్లావుద్దీన్ ఖిల్జీ దళవాయి మాలిక్ కఫూర్ నాశనం చేశాడని ఎన్‌సీఈఆర్టీ పుస్తకంలో వివరించింది.

రేపు రైతుల ఖాతాల్లోకి

పీఎం కిసాన్ నిధులు..!

న్యూఢిల్లీ, జూలై 16: పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజన 20వ విడత నిధులను ప్రధాని మోదీ శుక్రవారం బిహార్‌లో జరగనున్న భారీ బహిరంగ సభలో విడుదల చేసే అవకాశముందని ఓ జాతీయ వార్తా సంస్థ నివేదిక పేర్కొంది. పీఎం కిసాన్ నిధులను ప్రతి నాలుగు నెలలకోసారి విడుదల చేస్తారు. చివర 19వ విడత నిధులను 2025 ఫిబ్రవరిలో విడుదల చేశారు. గతేడాది జూన్ వాయిదాను నెల ముగియక ముందే విడుదల చేశారు. అయితే ఈ సారి నిధుల విడుదలలో జాప్యం జరుగుతోంది. పీఎం కిసాన్ ద్వారా దేశవ్యాప్తంగా 9.8 కోట్ల మంది రైతులకు లబ్ధి చేకూరుతోంది.

పాఠశాలల్లో నూనె సూచికలు

▸ పిల్లల ఆరోగ్యం కోసం సీబీఎస్ఈ ఆదేశాలు

హైదరాబాద్, జూలై 16(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడానికి తమ పరిధిలోని అన్ని పాఠశాలల్లో నూనె సూచికలు(ఆయిల్ బోర్డు) ఏర్పాటు చేయాలని సీబీఎస్ఈ నిర్ణయించింది. ఈ మేరకు సీబీఎస్ఈ డైరెక్టర్ ప్రగ్యా ఎం.సింగ్ బుధవారం ఆదేశాలు జారీచేశారు. ఊబకాయానికి కారణమవుతోన్న తీపికి దూరంగా ఉండాలంటూ గత మేలో మధుమేహ(షుగర్) బోర్డులు ఏర్పాటుచేయాలని ఆదేశించిన బోర్డు.. తాజాగా ఆయిల్ బోర్డుల ఏర్పాటుపై మార్గదర్శకాలు విడుదల చేసింది. ఆహార పదార్థాల్లో నూనెల వినియోగం వల్ల కలిగే హని గురించి విద్యార్థులకు అవగాహన కల్పించేలా.. చిత్రాలతో కూడిన సూచికలను క్యాంటీన్లు, నోటీసు బోర్డులు, ఆట స్థలాల్లో ఏర్పాటు చేయాలని సూచించారు. తాజా ఆదేశాలతో విద్యార్థులకు ఆహార పదార్థాలపై అవగాహన పెరుగుతుందన్నారు.

వర్షాకాల సమావేశాల్లో 12 బిల్లులు

పార్లమెంటులో ప్రవేశపెట్టనున్న మోదీ సర్కారు.. భౌగోళిక వారసత్వ ప్రదేశాల పరిరక్షణ, క్రీడలు సహా 8 కొత్త బిల్లులు

▸ జస్టిస్ వర్మపై అభిశంసన తీర్మానం కూడా

▸ 21 నుంచి ఆగస్టు 21దాకా సమావేశాలు

న్యూఢిల్లీ, జూలై 16: వచ్చేవారం మొదలవుతున్న పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో 12 బిల్లులకు ఆమోద ముద్ర వేయించుకోవాలని మోదీ ప్రభుత్వం భావిస్తోంది. వీటిలో కొన్ని ఇప్పటికే ప్రవేశపెట్టినవి కాగా.. సుపరిపాలన ద్వారా క్రీడల్లో నైతిక ఆచరణలు, భౌగోళిక వారసత్వ ప్రదేశాలు, అవశేషాల పరిరక్షణ బిల్లు సహా 8 బిల్లులు కొత్తగా రానున్నాయని లోక్‌సభ సచివాలయం అంతర్గత బులెటిన్‌లో పేర్కొంది. ఆదాయ పన్ను సవరణ బిల్లు, ప్రస్తుత సాంకేతిక శకానికి వర్తించని పురాతన నిబంధనల తొలగింపునకు జన విశ్వాస్ సవరణ బిల్లు(2025), వివిధ క్రీడాసంస్థల్లో జవాబుదారీతనం కోసం జాతీయ క్రీడల పరిపాలన బిల్లు(2025), 1908నాటి భారతీయ రేవుల చట్టం స్థానంలో నూతన బిల్లు (2025), మర్చెంట్ షిప్పింగ్ బిల్లు (2024), ప్రపంచ యాంటీ డోపింగ్ సంస్థ నియమాళికి అనుగుణంగా జాతీయ డోపింగ్ వ్యతిరేక సవరణ బిల్లు(2025), గనులు, ఖనిజాల అభివృద్ధి, క్రమబద్ధీకరణ బిల్లు (2025), ట్యాక్సేషన్ చట్టాల సవరణ బిల్లు(2025), గోవా అసెంబ్లీలో ఎస్టీలకు ప్రాతినిధ్యం కల్పించే బిల్లు, సముద్రమార్గాన వస్తు రవాణా బిల్లు (2024), గువాహటి ఐఐఎంను చట్టంలో చేర్చేందుకు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ సవరణ బిల్లులను ఉభయసభల్లో చర్చించి ఆమోదం తీసుకోవాలని ప్రభుత్వం సంకల్పించింది. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అలహాబాద్ హైకోర్టు సిటింగ్ న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్‌వర్మను అభిశంసించే తీర్మానం కూడా పార్లమెంటు ముందుకు రానుంది. ఈ నెల 21న ఉభయ సభలు ప్రారంభం కానున్నాయి. ఆగస్టు 21న సమావేశాలు ముగుస్తాయి.

పహల్గాంపై సర్కారుతో కాంగ్రెస్ ఢీ

పహల్గాంలో ఉగ్రవాద దాడి, ఆపరేషన్ సిందూర్, సోమవారం నుంచి ప్రారంభం కానున్న ఓటర్ల జాబితాల సవరణ వ్యవహారాలపై పార్లమెంటులో మోదీ ప్రభుత్వాన్ని ఇరుకునపడేయాలని కాంగ్రెస్ భావిస్తోంది. ఆ పార్టీ పార్లమెంటు వ్యూహ కమిటీ గత మంగళవారం కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ (సీపీపీ) చైర్‌పర్సన్ సోనియాగాంధీ నివాసంలో జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ఉభయసభల్లో ప్రతిపక్ష నేతలు రాహుల్‌గాంధీ, ఖర్గే, రాజ్యసభలో ఉపనేత ప్రమోద్ తివారీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఈ భేటీలో పాల్గొన్నారు. పహల్గాంలో పర్యాటకులపై కాల్పులు జరిపిన ఉగ్రవాదులను ఎందుకు పట్టుకోలేదో జవాబు చెప్పాలని.. ఆపరేషన్ సిందూర్ వివరాలు సమగ్రంగా తెలియజేయాలని తాము డిమాండ్ చేయనున్నట్లు తివారీ ఆ తర్వాత విలేకరులకు వెల్లడించారు.

పీఎం ధన ధాన్య కృషి యోజనకు ఆమోదం

▸ కేంద్ర క్యాబినెట్ కీలక నిర్ణయం



వ్యవసాయ, అనుబంధ రంగాల అభివృద్ధికి కేంద్ర క్యాబినెట్ బుధవారం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశం 'పీఎం ధన ధాన్య కృషి యోజన'కు ఆమోదం తెలిపింది. కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన ఈ పథకానికి ఏడాది రూ.24 వేల కోట్లు కేటాయించి, దేశవ్యాప్తంగా 100 జిల్లాల్లో ఆరేళ్ల పాటు అమలు చేయనున్నారు. ఉత్పాదకతను పెంచడం, సుస్థిర వ్యవసాయ విధానాలు, ఎక్కువ మంది పంటల మార్పిడి విధానాన్ని అనుసరించేలా చూడడం ఈ పథకం లక్ష్యం. పీఎం ధన ధాన్య కృషి యోజన ద్వారా కోటీ 70 లక్షల మంది రైతులకు ప్రయోజనం కలుగుతుందని కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ చెప్పారు. అక్టోబరు నుంచి ఇది అమల్లోకి వస్తుందన్నారు. పంటల ఉత్పాదకత, రుణ లభ్యత అత్యంత తక్కువగా ఉన్న 100 జిల్లాలను ఈ పథకం అమలుకు ఎంపిక చేస్తారు. ఇందులో రాష్ట్రానికి ఒక జిల్లా తప్పనిసరిగా ఉంటుంది. కాగా, పునరుత్పాదక ఇంధన రంగంలో ఎన్టీపీసీ పెట్టుబడి పరిమితిని రూ.20 వేల కోట్లకు పెంచేందుకు కూడా క్యాబినెట్ ఆమోదం తెలిపింది. దీంతో 2032 నాటికి ఎన్టీపీసీ 60 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని సాధిస్తుందని అంచనా.

వీసా హక్కు కాదు.. ప్రత్యేక అధికారం మాత్రమే

▸ నిబంధనలు ఉల్లంఘిస్తే బహిష్కరణ తప్పదు

▸ యూఎస్ స్టేట్ డిపార్ట్‌మెంట్ హెచ్చరిక

న్యూఢిల్లీ, జూలై 16: తమ దేశ వీసా కలిగిఉన్న వారికి అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్ గట్టి వార్నింగ్ ఇచ్చింది. వీసా హక్కు కాదని, అదొక ప్రత్యేక అధికారం మాత్రమేనని ఓ ప్రకటనలో స్పష్టం చేసింది. తమ దేశ చట్టాలను ఉల్లంఘించిన వారి వీసాను రద్దుచేస్తామని హెచ్చరించింది. అలాగే అమెరికాలో ఉన్న సమయంలో దాడులు, గృహహింస, ఇతర తీవ్రమైన నేరాల్లో ఎవరైనా అరెస్టు అయితే వెంటనే వారి వీసాను రద్దు చేస్తామని, భవిష్యత్‌లో కూడా వారికి వీసా అర్హత ఉండదని ఆ ప్రకటనలో తేల్చి చెప్పింది. గత శనివారం భారత్‌లోని అమెరికా ఎంబసీ కూడా ఇలాంటి హెచ్చరిక ఒకటి జారీ చేసింది. ఇదిలా ఉండగా, సామాజిక మాధ్యమాల ఖాతాలు పబ్లిక్‌లో ఉంచకపోతే వీసా దరఖాస్తులను అమెరికా అధికారులు తిరస్కరిస్తున్నారు. రెడిట్ ఖాతా వివరాలు ఇవ్వడంలో విఫలమైన ఓ భారతీయ విద్యార్థి దరఖాస్తును అమెరికా అధికారులు తిరస్కరించిన ఘటన ఇటీవల జరిగింది. ఆ వివరాలను ఆ విద్యార్థి సోషల్ మీడియాలో వివరించి తన ఆవేదన వ్యక్తం చేశాడు. "ఇటీవలే ఎఫ్-1 వీసా ఇంటర్వ్యూకు వెళ్లాను. నా రెడిట్ ఖాతా వివరాలను డీఎస్-160 ఫామ్‌లో పేర్కొనలేదు. ఆ ఖాతా గురించి వీసా ఆఫీసర్ అడిగారు. ఆ ఖాతా పబ్లిక్‌లోనే ఉంది. దానిలో ఎలాంటి హింసాత్మక కంటెంట్ కూడా లేదు. అయినా దరఖాస్తుకు క్లియరెన్స్ ఇవ్వలేదు. 221(జి) స్లిప్పు ఇచ్చారు" అని వివరించాడు. అయితే తాత్కాలికంగా తిరస్కరించిన దరఖాస్తులకు 221 (జి) స్లిప్పులు ఇస్తారు. అంటే పూర్తిగా తిరస్కరించినట్లు కాదు. వీసా దరఖాస్తులకు అదనపు వివరాలు అవసరమని, వాటిని తొందరగా సమర్పించాల్సి ఉంటుందని, దీనివల్ల వీసా జారీ జాప్యం అవుతుంది నిపుణులు చెప్పారు.

మొత్తం 17 మంది జడ్జిలపై వేటు

వలసదారులను సామూహికంగా బహిష్కరిస్తున్న ట్రంప్ ప్రభుత్వం కారణాలేవీ లేకుండా ఇటీవల కాలంలో 17 మంది ఇమ్మిగ్రేషన్ కోర్టు జడ్జిలను తొలగించిందని ఓ యూనియన్ విమర్శించింది. దేశవ్యాప్తంగా పది రాష్ట్రాల్లో శుక్రవారం 15 మంది జడ్జిలను, సోమవారం ఇద్దరిని విధుల నుంచి తొలగించారని జడ్జిలు, ఇతర నిపుణులు ప్రాతినిధ్యం వహించే అంతర్జాతీయ ప్రొఫెషనల్ అండ్ టెక్నికల్ ఇంజనీర్స్ సమాఖ్య ఓ ప్రకటనలో తెలిపింది.

సిరియాపై ఇజ్రాయెల్

వైమానిక దాడులు

▸ ముగ్గురు మృతి, 34 మందికి గాయాలు

టెల్ అవీవ్, డమాస్కస్, జూలై 16: పశ్చిమాసియా మరోసారి భగ్గుమంది. సిరియా రాజధాని డమాస్కస్‌లోని రక్షణ మంత్రిత్వ శాఖ కార్యాలయం, సైనిక ప్రధాన కార్యాలయంపై ఇజ్రాయెల్ వైమానిక దాడులు జరిపింది. ఈ దాడుల్లో ముగ్గురు మృతిచెందగా 34 మంది గాయపడ్డారు. సిరియా అధ్యక్ష భవనానికి అత్యంత సమీపంలోనే ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ బలగాలు ఈ దాడులు జరపడంతో ఒక్కసారిగా కలకలం రేగింది. సిరియా సువేదా ప్రాంతంలోని మైనారిటీ షియా తెగకు చెందిన డ్రూజ్ జాతీయులకు మద్దతుగా ఈ దాడులు జరిపినట్లు ఐడీఎఫ్ ప్రకటించింది. వాస్తవానికి 4 రోజుల క్రితం డ్రూజ్ జాతీయులకు, సున్నీ బెడ్విన్ తెగ మధ్య సాయుధ ఘర్షణ ప్రారంభమైంది. ఈ ఘర్షణలో వంద మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. ఈ తరుణంలో డ్రూజ్ జాతీయులను కాపాడేందుకు ఈ దాడులు జరిపినట్లు ఇజ్రాయెల్ చెబుతోంది. ప్రపంచ వ్యాప్తంగా 10 లక్షల మంది డ్రూజ్ జాతీయులు ఉండగా సిరియాలో సగం మంది ఉన్నారు.

భారత్‌పై వంద శాతం సుంకాలు విధిస్తాం

▸ రష్యా చమురు కొనుగోలుపై నాటో హెచ్చరిక



వాషింగ్టన్, జూలై 16: రష్యా నుంచి చమురు, గ్యాస్ కొనుగోలు చేస్తే వంద శాతం టారిఫ్‌లు విధిస్తామని నాటో.. భారత్, చైనా, బ్రెజిల్ దేశాలను గట్టిగా హెచ్చరించింది. వాషింగ్టన్‌లో అమెరికా సెనేటర్లతో సమావేశం తర్వాత నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రుట్టె మాట్లాడారు. చైనా అధ్యక్షుడు, భారత ప్రధాని, బ్రెజిల్ అధ్యక్షుడు ఎవరైనా సరే రష్యా నుంచి చమురు, గ్యాస్ కొనుగోలు చేస్తే తీవ్రంగా పరిగణిస్తామన్నారు. వంద శాతం సుంకాలు విధిస్తామని హెచ్చరించారు. మాస్కోలోని వ్యక్తి (రష్యా అధ్యక్షుడు పుతిన్) శాంతి చర్చలకు రాకపోతే పరిస్థితి తీవ్రంగా ఉంటుందన్నారు. తాము తీసుకునే చర్యలతో ఏర్పడే పరిణామాలు భారత్, చైనా, బ్రెజిల్‌ను తీవ్రంగా దెబ్బతీస్తాయన్నారు. వెంటనే పుతిన్‌కు ఫోన్ చేసి శాంతి చర్చలను గట్టిగా పరిశీలించాలని ఒత్తిడి తీసుకురావాలని, లేకుంటే ఈ మూడు దేశాలకు భారీ ఎదురుదెబ్బలు తగులుతాయని రుట్టె హెచ్చరించారు. ఉక్రెయిన్-రష్యా యుద్ధం ముగియాలంటే రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న దేశాలపై సుంకాలు విధించడమే అంతిమ మార్గమంటోన్న అమెరికాకు నాటో వత్తాసు పలుకుతోంది. సుంకాలపై ట్రంప్ హెచ్చరించిన గంటల్లోనే మార్క్ రుట్టె వార్నింగ్ రావడం ప్రాధాన్యత సంతరించుకుంది. 50 రోజుల్లోగా ఉక్రెయిన్-రష్యా మధ్య శాంతి ఒప్పందం కుదరకపోతే రష్యాపై వంద శాతం సుంకాలు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇప్పటికే హెచ్చరించారు. అలాగే రష్యాతో వ్యాపారం కొనసాగించే దేశాలపై 500% సుంకాలు విధిస్తామని కూడా అమెరికా హెచ్చరించింది. రష్యా నుంచి భారీగా చమురు కొనుగోలు చేస్తున్న దేశాల్లో భారత్, చైనా, బ్రెజిల్ ఉన్నాయి. మరోవైపు అమెరికా హెచ్చరికలను రష్యా కొట్టిపారేసింది. ఇప్పటికే తాము అనేక ఆంక్షలు ఎదుర్కొని నిలిచామని, ముందుందూ ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపింది.



సాంబశివరావును సత్కరిస్తున్న మంత్రి పార్థసారథి, ఎంపీ కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే కొండయ్య

టీడీపీ ఖాతాలో చీరాల మున్సిపాలిటీ

▸▸ చైర్మన్‌గా సాంబశివరావు ఏకగ్రీవ ఎన్నిక

▸▸ ప్రజాప్రతినిధుల సమక్షంలో ప్రమాణ స్వీకారం

చీరాల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లా చీరాల మున్సిపాలిటీని టీడీపీ కైవసం చేసుకుంది. నూతన చైర్మన్‌గా మించాల సాంబశివరావు ప్రమాణం చేశారు. గత మే 14న మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబుపై కౌన్సిలర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాసం తీర్మానం గెలుపొందింది. అయితే అప్పటికే జంజనం వైసీపీకి రాజీనామా చేసి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఆనాటి నుంచి కొత్త చైర్మన్ ఎంపికపై రకరకాల ఊహాగానాలు వచ్చాయి. అయితే పార్టీ అధిష్ఠానం సీల్డ్ కవర్‌లో కొత్త చైర్మన్ పేరును బాపట్ల జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి, ఎంపీ కృష్ణప్రసాద్ ద్వారా కౌన్సిల్‌కు అందజేసింది. బుధవారం మున్సిపల్ సమావేశం ప్రారంభం కాగానే చైర్మన్ అభ్యర్థిగా 19వ వార్డు టీడీపీ కౌన్సిలర్ మించాల సాంబశివరావు పేరును అధికారులు ప్రకటించారు. టీడీపీ నుంచి 20 మంది కౌన్సిలర్లు, మాజీ ఎమ్మెల్యే ఆమంచి వర్గీయులు ఐదుగురు, అలాగే ఎక్స్‌అఫిషియో సభ్యులైన ఎంపీ, ఎమ్మెల్యే మద్దతు తెలపడంతో 27 ఓట్లు మెజారిటీతో ఆయన చైర్మన్‌గా గెలిచారు. ప్రిసైడింగ్ అధికారులు డీఆర్వో గంగాధర్, ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు మించాలకు నియామకపత్రం అందజేయడంతో పాటు ప్రమాణ స్వీకారం చేయించారు.

విద్యార్థిని హత్యలో యువకుని పాత్ర లేదు

▸▸ ఆమెపై లైంగిక దాడి జరగలేదు: కర్నూలు రేంజ్ డీఐజీ

జమ్మలమడుగు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): గండికోటలో ఇంటర్ విద్యార్థిని హత్య ఘటనలో ఆమె ప్రియుడిగా భావిస్తున్న లోకేశ్ పాత్ర లేదని కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ తెలిపారు. కడప జిల్లా జమ్మలమడుగు మండలంలోని గండికోటలో రంగనాథస్వామి దేవాలయం వెనుకభాగాన ఇంటర్ విద్యార్థిని వైష్ణవి (17) సోమవారం హత్యకు గురైన సంగతి తెలిసిందే. ఈ ప్రదేశాన్ని ఎస్పీ అశోక్‌కుమార్‌తో కలిసి ఆయన బుధవారం సందర్శించారు. అనంతరం మీడియా సమావేశంలో డీఐజీ మాట్లాడారు. సోమవారం ఉదయం బాలిక వైష్ణవి, లోకేశ్ ద్విచక్ర వాహనంలో గండికోటకు వచ్చారన్నారు. దాదాపు రెండు గంటలపాటు ఓ ప్రైవేటు లాడ్జిలో ఉన్న తర్వాత ఇద్దరూ కోట గుమ్మం వద్దకు చేరుకున్నారని తెలిపారు. అనంతరం బాలికను అక్కడే వదిలి లోకేశ్ వెళ్లిపోయాడన్నారు. ఆ తర్వాత బాలిక కోట ప్రాంగణంలో బ్యాగుతో తిరిగిందన్నారు. ఈ హత్యలో లోకేశ్ ప్రమేయం లేదన్నారు. అలాగే పోస్టుమార్టం రిపోర్టు ప్రకారం బాలికపై లైంగిక దాడి జరగలేదన్నారు. హత్యకేసులో కీలక ఆధారాలు లభించాయని త్వరలోనే ఎస్పీ వివరాలు వెల్లడిస్తారని అన్నారు.

ఎంబీఏ, ఎంసీఏ అడ్మిషన్లకు అనుమతులు

అమరావతి : ఎంబీఏ, ఎంసీఏ కోర్సులలో సీట్ల భర్తీకి అనుమతిస్తూ ఉన్నత విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. దీంతో ఐసెట్ కౌన్సెలింగ్ చేపట్టేందుకు అవకాశం ఏర్పడింది. బుధవారం వెబ్ ఆప్షన్ల ఎంపిక ప్రక్రియ ప్రారంభమైంది. 25న సీట్లు కేటాయింపు ఉంటుంది. ఈనెల 28 నుంచి తరగతులు ప్రారంభమవుతాయి.

రోగులకు ప్రాణాధారమైన మందుల కొనుగోలు విషయంలో ప్రభుత్వ ఆసుపత్రుల అధికారులు చేస్తున్న అక్రమాలు భారీగా వెలుగు చూస్తున్నాయి. ఒప్పంద కంపెనీతో లాలూచీపడి ముడుపులు దండుకుని.. పీఎంబీజేకే-జన ఔషధి కేంద్రాల నుంచి కొనాల్సిన ఔషధాలను జనరిక్, స్థానిక మందుల దుకాణాల ద్వారా కొనుగోలు చేస్తున్నారు. వాటినే రోగులకు ఇస్తున్నారు. ఈ క్రమంలో రూ.కోట్ల మేరకు అధికారులు కమీషన్ల రూపంలో తమ జేబుల్లో వేసుకుంటున్నారు.

గుంటూరు, కడపలో ఇష్టారాజ్యం

స్థానికంగా మందులు కొనుగోలు చేసుకునే వెసులుబాటును బోధనాసుపత్రుల సూపరింటెండెంట్లు ఇష్టారాజ్యంగా ఉపయోగించుకుంటున్నారు. కమీషన్లకు కక్కుర్తి పడుతున్న సూపరింటెండెంట్లు.. తమకు నచ్చిన చోట మందులు కొంటున్నారు. ముఖ్యంగా గుంటూరు, కడపలో మరీ దారుణంగా ఆస్పత్రి ఎదురుగా ఉన్న మందుల షాపుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. రూ.లక్షల విలువైన మందులను కూడా నిబంధనలకు విరుద్ధంగా కొంటున్నారు. స్థానికంగా మందులు కొనుగోలుకు సంబంధించి టెండర్ పిలవాలి. ఎల్-1 కంపెనీని ఎంపిక చేసుకుని మందులు కొనుగోలుకు ఆర్డర్ ఇవ్వాలి. కానీ, ఆస్పత్రుల సూపరింటెండెంట్లు టెండర్ ప్రక్రియతో సంబంధం లేకుండా వారికి నచ్చిన షాపుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. తద్వారా ప్రభుత్వ నిధులు దారిమళ్లడంతోపాటు.. నాణ్యత లేని ఔషధాలు ఆసుపత్రులకు చేరుతున్నాయి.

మందులే మార్చేశారు!

▸▸ జన ఔషధి మందులకు బదులు రోగులకు జనరిక్ ఔషధాలు పంపిణీ

▸▸ 'పీఎంబీజేకే-జన ఔషధి కేంద్రాల' పేరిట దోపిడీ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



రాష్ట్రంలోని బోధనాసుపత్రుల్లో రోగులకు పంపిణీ చేసే మందుల విషయంలో భారీ దోపిడీ జరుగుతోంది. పేదలకు నాణ్యమైన వైద్యం అందించాలని ప్రభుత్వం భావిస్తుంటే.. అధికారులు మాత్రం సర్కారు సంకల్పాన్ని నీరుగారుస్తున్నారు. ప్రధాన మంత్రి భారతీయ జన ఔషధ కేంద్రాల(పీఎంబీజేకే) నుంచి కొనుగోలు చేయాల్సిన ఔషధాలను జనరిక్, స్థానిక మందుల షాపుల నుంచి కొనుగోలు చేసి ప్రభుత్వ సొమ్మును రూ.కోట్లలో దండుకుంటున్నారు. మంగళవారం 'బోధనాసుపత్రులకు జన ఔషధి శాపం' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం ప్రచురించింది. తర్వాత పీఎంబీజేకే పేరుతో రాష్ట్రంలోని అన్ని బోధనాసుపత్రుల్లో జరిగిన అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. పీఎంబీజేకేతో బోధనాసుపత్రుల సూపరింటెండెంట్లు ఎంవోయులు చేసుకోవడం, ఎంవోయు చేసుకున్న కంపెనీ సరఫరా చేసిన మందులను పరిశీలిస్తే.. భారీ తేడాలు కనిపించాయి. ఆరోగ్యశాఖ అధికారులు ఏ ఉద్దేశంతో పీఎంబీజేకే నుంచి మందులు కొనుగోలు చేయాలని నిర్ణయించారో ఆ లక్ష్యం మాత్రం నెరవేరడం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని బోధనాసుపత్రుల సూపరింటెండెంట్లు జన ఔషధి మందుల కోసం ఓ కంపెనీతో ఒప్పందం చేసుకున్న దగ్గర నుంచి అనేక అవకతవకలు ఉన్నట్లు తెలుస్తోంది. పీఎంబీజేకే ద్వారా వచ్చే మందులకు ప్రాధాన్యత కల్పించాలనే ఉద్దేశంతో ఎంవోయులకు అనుమతిచ్చామని ఉన్నతాధికారులు చెబుతున్నారు. కానీ, వాస్తవంగా క్షేత్రస్థాయిలో జరుగుతోంది వేరు. పీఎంబీజేకే హబ్‌లలో కేవలం 1,965 రకాల మందులు మాత్రమే అందుబాటులో ఉంటున్నాయి. అవి కూడా పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండడం లేదు. పైగా పీఎంబీజేకే పనితీరు వేరుగా ఉంటుంది. జన ఔషధి షాపుల యజమానులు వారికి అవసరమైన మందులు ఇండెంట్ పెట్టినా అవి అందుబాటులో ఉండడం లేదు. ఇండెంట్ పెట్టిన నెల తర్వాత హబ్స్‌లోకి వస్తున్నాయి. పైగా హబ్స్‌లో ఏ మందైనా రూ.వేలల్లోనే అందుబాటులో ఉంటున్నాయి. రాష్ట్రంలోని బోధనాసుపత్రుల సిబ్బంది ఒకే రకమైన టాబ్లెట్స్ లక్షల్లో ఆర్డర్లు ఇస్తారు. ఇంత భారీ స్థాయిలో మందులు సరఫరా చేసే సామర్థ్యం పీఎంబీజేకే-జన ఔషధి కేంద్రాలకు లేదు. పైగా బోధనాసుపత్రులకు అవసరమైన మందులు జన ఔషధి కేంద్రాల వద్ద అందుబాటులో ఉండవు. రాష్ట్రంలో చాలా బోధనాసుపత్రుల్లో ఎంవోయుకు విరుద్ధంగా సాధారణ జనరిక్ మందులు సరఫర్యా అయ్యాయి.

నాణ్యత ప్రశ్నార్థకం!

పీఎంబీజేకే-జన ఔషధి కేంద్రాలలో మందులు నాణ్యంగా ఉంటాయి. ఇలా నాణ్యమైన మందులు కాకుండా సాధారణ జనరిక్ మందులను సదరు ఒప్పంద కంపెనీ సరఫరా చేసింది. రోగులకు బ్రాండెడ్, జనరిక్ మందుల పట్ల అవగాహన లేకపోవడంతో బోధనాసుపత్రుల ఫార్మసీలో ఏ మందు ఇస్తే ఆ మందులు వాడేస్తున్నారు.

స్టిక్కర్ అడిగేవారేరీ?

పీఎంబీజేకే-జన ఔషధి కేంద్రాల ద్వారా మందులు ఆర్డర్ పెట్టే ముందు ఖచ్చితంగా పీఎంబీజేకే-జన ఔషధి కేంద్రాలకు సంబంధించిన మందులు మాత్రమే సరఫరా చేయాలని ఆస్పత్రుల అధికారులు స్పష్టంచేయాలి. అనంతరం, సదరు కంపెనీ మందులు సరఫరా చేసిన తర్వాత అన్ని మందులపైన పీఎంబీజేకే-జన ఔషధి కేంద్రాల స్టిక్కర్లు ఉన్నాయో? లేవో? ఆసుపత్రుల్లో సిబ్బంది చూసుకోవాలి. బోధనాసుపత్రుల అధికారులు ఈ నిబంధనలు పాటించడం లేదు. జన ఔషధి మందులు సరఫరా చేస్తామని ఎంవోయు చేసుకున్న కంపెనీ వల్ల రోగులే కాకుండా బోధనాసుపత్రులకు కూడా తీవ్రనష్టం జరిగింది. ఆస్పత్రులకు ప్రభుత్వం కేటాయించిన నిధులు వృథా అవుతున్నాయి.



తిరుమల శ్రీవారి ఆలయంలో బుధవారం సాలకట్ల ఆణివార ఆస్థానం జరిగింది. ఈ సందర్భంగా శ్రీరంగం నుంచి శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. సాయంత్రం పుష్పపల్లకిలో శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి కొలువుదీరి నాలుగు మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు.

అంతరిక్ష రంగంలో ప్రగతి సాధించాం

▸▸ గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఇస్రో చైర్మన్ వి. నారాయణన్



ఇస్రో చైర్మన్ నారాయణన్‌కు జ్ఞాపికను అందజేస్తున్న గీతం వీసీ ప్రొఫెసర్ ఎరోల్ డిసౌజా

సాగర్‌నగర్(విశాఖపట్నం), జూలై 16(ఆంధ్రజ్యోతి): అంతరిక్ష రంగంలో గడిచిన 63 ఏళ్లలో గణనీయమైన ప్రగతి సాధించామని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) చైర్మన్ డాక్టర్ వి. నారాయణన్ తెలిపారు. ఇతర దేశాలకు సైతం ఉపగ్రహ సాంకేతికతను అందించే స్థాయికి ఇస్రో చేరుకుందన్నారు. ముఖ్యంగా అంతరిక్ష ప్రయోగాలకు సంబంధించి 9 అంశాల్లో ప్రపంచ రికార్డులు నెలకొల్పినట్టు తెలిపారు. విశాఖనగరంలోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో వి. నారాయణన్ పాల్గొన్నారు. ఇస్రో ఇప్పటి వరకు 101 అంతరిక్ష ప్రయోగాలను విజయవంతంగా పూర్తి చేసిందని, అలాగే 35 దేశాలకు సంబంధించి 434కు పైగా ఉపగ్రహాలను అంతరిక్షంలోకి ప్రయోగించిందని ఆయన తెలిపారు. జీ-20 దేశాల కోసం 70 శాతం స్వదేశీ పరిజ్ఞానంతో ప్రత్యేక ఉపగ్రహాన్ని రూపొందిస్తున్నామన్నారు. ఇస్రోకు అంతరిక్ష ప్రయోగాలు మంచినీళ్ల ప్రాయంగా మారాయని చెప్పారు. భారతీయ వ్యోమగామి శుభాన్షు శుక్లా అంతరిక్షంలోకి వెళ్లి సురక్షితంగా తిరిగి రావడానికి తీసుకున్న జాగ్రత్తలను ఆయన వివరించారు. అంతరిక్ష ప్రయోగాలు మానవాళి శ్రేయస్సు కోసం ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. దేశంలో వివిధ రంగాల ప్రజలకు ఉపయోగపడే దాదాపు 50పైగా సాంకేతిక అంశాలను అందించామని వాటి విలువ రూ.కోట్లలో ఉంటుందన్నారు. వాతావరణం, ఆహార భద్రత, దేశరక్షణ, మత్స్యసంపద ఉనికి, అడవుల పరిరక్షణ, టెలీ ఎడ్యుకేషన్, కమ్యూనికేషన్ వ్యవస్థ తదితర అంశాల్లో ఇస్రో సేవలు అందిస్తోందన్నారు. ఇటీవల ఆపరేషన్ సిందూర్‌కు సైతం ఇస్రో సహకారం అందించిందని తెలిపారు. ఇస్రో, నాసా సంయుక్తంగా పనిచేస్తున్నాయని, ఇతర దేశాలు కూడా అంతరిక్ష సాంకేతిక సహకారాన్ని ఆశిస్తున్నాయని చెప్పారు. విద్యా సంస్థలతో కలసి పనిచేయడానికి ఇస్రో సిద్ధంగా ఉందని, ఇంటర్న్‌షిప్‌లు, ప్రాజెక్టుల ద్వారా ఆసక్తి గల పరిశోధకులను ప్రోత్సహిస్తామన్నారు. గీతం వైస్ చాన్సలర్(వీసీ) ప్రొఫెసర్ ఎరోల్ డిసౌజా మాట్లాడుతూ.. ఇస్రో సాధిస్తున్న ప్రగతి దేశానికి గర్వకారణమని తెలిపారు. కార్యక్రమంలో గీతం కార్యదర్శి ఎం. భరద్వాజ, గీతం ప్రో వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ వై. గౌతమ్‌రావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి. గుణశేఖరన్ తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠం క్యూకాంప్లెక్స్ పైనుంచి పడిన భక్తుడు

తిరుమల, జూలై16(ఆంధ్రజ్యోతి): తిరుమలలో వైకుంఠం క్యూకాంప్లెక్స్ పైఅంతస్తు నుంచి జారి కిందపడి ఓ భక్తుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఒడిశాలోని గంజాం జిల్లా, బడాంపుర్‌కు చెందిన ఎల్లయ్య రెడ్డి(50) బుధవారం ఉదయం వైకుంఠం క్యూకాంప్లెక్స్-1 వద్ద కింద నుంచి పైఅంతస్తుకు గేట్లు పట్టుకుని ఎక్కే ప్రయత్నంలో జారి 25 అడుగుల కిందకు పడిపోయాడు. తీవ్ర గాయాలు కావడంతో తొలుత తిరుమలలోని అశ్విని ఆస్పత్రికి.. అక్కడి నుంచి తిరుపతిలోని స్విమ్స్‌కు తరలించారు. అతని మానసిక పరిస్థితి బాగాలేదని స్నేహితులు వివరించారు.

తల్లికి వందనం డబ్బు కోసం అత్తమామలపై అల్లుడు దాడి

▸▸ విచక్షణారహితంగా కత్తితో పొడిచి హత్యాయత్నం

ఘంటసాల (కృష్ణాజిల్లా), జూలై 16 (ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం డబ్బు కోసం ఓ వ్యక్తి అత్తమామలపై కత్తితో దాడి చేశాడు. ఘంటసాల మండలం కొడాలి గ్రామంలో మంగళవారం రాత్రి జరిగిందీ ఘటన. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన చిట్టూరి అజయ్-శ్రీలక్ష్మి భార్యాభర్తలు. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. అజయ్.. టైల్స్ పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. అదే గ్రామంలో ఉంటున్న శ్రీలక్ష్మి తల్లిదండ్రులు కర్రా సుబ్బారావు, వెంకటలక్ష్మి ఇంటికి పది రోజుల క్రితం అజయ్ కుటుంబం వెళ్లింది. అజయ్ పెద్ద కుమార్తెకు తల్లికి వందనం పథకం ద్వారా రూ.13 వేల నగదు రాగా, అందులో రూ.8 వేలు తీసుకుని మద్యం తాగాడు. మిగిలిన రూ.5 వేలు కావాలని భార్యతో తరచూ గొడవ పడుతున్నాడు. దీంతో ఆమె రూ.5 వేలు తన తల్లిదండ్రుల వద్ద దాచింది. మంగళవారం రాత్రి కూడా భార్యతో గొడవ పడిన అజయ్.. అడ్డొచ్చిన అత్త వెంకటలక్ష్మి, మామ సుబ్బారావులను విచక్షణ రహితంగా కత్తితో పొడిచాడు. బాధితులను విజయవాడలోని ఆస్పత్రికి తరలించారు.

చిన్నారి ప్రాణాలు నిలిపిన మంత్రి లోకేశ్

▸▸ లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు ఆర్థిక సాయం

▸▸ కోలుకున్న చిన్నారితో ప్రజాదర్బార్‌కు తల్లిదండ్రులు



చిన్నారిని ఎత్తుకుని ముద్దాడుతున్న మంత్రి లోకేశ్

తాడేపల్లి (ఉండవల్లి), జూలై 16 (ఆంధ్రజ్యోతి): కష్టాల్లో ఉన్న వారికి అండగా నిలుస్తూ మంత్రి లోకేశ్ చేస్తున్న సాయంతో ఓ చిన్నారి ప్రాణం నిలబడింది. చిత్తూరు జిల్లా పలమనేరుకు చెందిన గజ్జల దీపు నాయుడు అనే చిన్నారి పుట్టుకతోనే లివర్ సమస్యలతో ఇబ్బంది పడ్డాడు. దీంతో తల్లిదండ్రులు జగదీశ్, ఇంద్రావతి ఆ చిన్నారిని ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లగా లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు రూ.20 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాషాను కలవగా ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) కింద వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10 లక్షలకు లెటర్స్ ఆఫ్ క్రెడిట్ (ఎల్‌వోసీ) మంజూరు చేశారు. అయితే అధిక మొత్తం అవసరం కావడంతో చిన్నారి తల్లిదండ్రులు మంత్రి లోకేశ్‌ను కూడా కలిశారు. ఆయన వైద్యసాయంగా రూ.15 లక్షల వరకు పెంచి ఎల్ఓసీ మంజూరు చేశారు. లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆపరేషన్ అనంతరం ఆ బాలుడు పూర్తిగా కోలుకున్నాడు. దీంతో ఆ చిన్నారిని తల్లిదండ్రులు.. గుంటూరు జిల్లా ఉండవల్లిలో లోకేశ్ బుధవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌కు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆ బాలుడిని ఎత్తుకుని ముద్దాడిన లోకేశ్.. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చిన్నారిని జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. 'మీరు చేసిన సాయం మరువలేం' అంటూ తల్లిదండ్రులు లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కొత్తచెరువు విద్యార్థికి వైద్య సాయం

▸▸ అరుదైన వ్యాధితో ఇబ్బంది పడుతున్న విద్యార్థి

▸▸ 'మెగా పీటీఎం 2.0'లో సీఎం చంద్రబాబు పలకరింపు

▸▸ బాలుడి ఆరోగ్యం గురించి ఆరాతో సమస్య వెలుగులోకి

▸▸ 'ఆంధ్రజ్యోతి'లో కథనం.. స్పందించిన హైదరాబాద్ వైద్యులు

▸▸ ఉచిత వైద్యానికి ముందుకొచ్చిన డాక్టర్ శ్రీనివాసరావు



అరుదైన రుగ్మతతో బాధపడుతున్న బాలు

కొత్తచెరువు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): అరుదైన రుగ్మతతో బాధపడుతున్న శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి బాలుకు ఉచిత వైద్య సాయం అందించేందుకు హైదరాబాద్‌కు చెందిన చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ శ్రీనివాసరావు నామినేని ముందుకొచ్చారు. కొత్తచెరువులో ఈనెల 10న 'మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ 2.0' నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తచెరువు బీసీ కాలనీకి చెందిన మాధవి తన నలుగురు పిల్లలకు తల్లికి వందనం సొమ్ము అందడంతో.. సీఎం చంద్రబాబును కలిసే అవకాశం దక్కించుకున్నారు. ఆ సమయంలో ఆమె కుమారుడు బాలు.. జుట్టు, శరీరంలో మార్పులను గమనించిన సీఎం.. సమస్య ఏమిటని ఆరా తీశారు. పుట్టుకతోనే ఆరోగ్య సమస్య వచ్చిందని.. వైద్యం చేయించినా నయం కాలేదని మాధవి సీఎంకు వివరించారు. దీంతో బాలుకు వైద్య సాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామని సీఎం భరోసా ఇచ్చారు. ఈ విషయంపై 'ఆంధ్రజ్యోతి' దినపత్రిక, ఏబీఎన్ చానల్‌లో కథనాలు వచ్చాయి. స్పందించిన హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ శ్రీనివాసరావు.. బాలుడుకి వైద్య సాయం అందించేందుకు ముందుకొచ్చారు. రెయిన్‌బో చిన్నపిల్లల ఆస్పత్రి డెంటల్ విభాగం, ఇండియన్ ఆర్గనైజేషన్ ఫర్ రేర్ డీసీజెస్ ఇలాంటి అరుదైన వ్యాధులకు వైద్యం చేస్తాయని, బాలుకు ఇక్కడ ఉచిత వైద్యం అందిస్తామని శ్రీనివాసరావు తెలిపారు.

విదేశాలకు యువత అక్రమ రవాణా

▸▸ ఉద్యోగాల పేరిట నమ్మించి మోసం

▸▸ విశాఖ విమానాశ్రయంలో ఇద్దరి అరెస్టు

▸▸ ఐదుగురు బాధితులను రక్షించిన నగర పోలీసులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చీ

విశాఖపట్నం(మహారాణిపేట), జూలై 16 (ఆంధ్రజ్యోతి): విదేశాల్లో డేటా ఎంట్రీ ఉద్యోగాల పేరిట యువతను అక్రమంగా తరలిస్తున్న ఇద్దరిని విశాఖపట్నం సైబర్‌క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. వారి మాటలు నమ్మి విదేశాలకు వెళ్లేందుకు ఎయిర్‌పోర్టులో ఉన్న ఐదుగురిని కాపాడారు. బుధవారం విలేకరుల సమావేశంలో నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చి ఈ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ నెల 13వ తేదీ రాత్రి తనకు గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి గాజువాక ప్రాంతం నుంచి మానవ అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం చెప్పారన్నారు. సైబర్‌క్రైమ్ పోలీసులను అప్రమత్తం చేసి ఈ నెల 14న ఎయిర్‌పోర్టుకు పంపించి, గాజువాకకు చెందిన ఏలేటి సురేశ్, రాజాన ఆదిలక్ష్మి అలియాస్ అను అనే ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించామని చెప్పారు. కాంబోడియాలో ఉంటున్న విజయ్‌కుమార్ అలియాస్ సన్ని డేటా ఎంట్రీ ఆపరేటర్, సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలిప్పిస్తానని నమ్మించి ఏపీతో పాటు ఇతర రాష్ట్రాల్లో నిరుద్యోగులను కాంబోడియా, మయన్మార్, థాయ్‌లాండ్ వంటి దేశాలకు తరలించేందుకు వీలుగా 150 మంది ఏజెంట్లను నియమించుకున్నాడని వివరించారు. వారంతా నిరుద్యోగులను గుర్తించి విదేశాలకు పంపితే, వారితో నకిలీ పత్రాలు, వివరాల ఆధారంగా తప్పుడు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లో ఐడీలు సృష్టించి వాటి ద్వారా డిజిటల్ అరెస్టు, బ్యాంక్‌ఫ్రాడ్స్, లాటరీ ఫ్రాడ్స్, ఆన్‌లైన్ గేమ్ టాస్క్ పేరుతో అమాయకుల నుంచి డబ్బులు గుంజే పనులు చేయిస్తారన్నారు. ఇప్పటివరకూ కాంబోడియాకు మానవుల అక్రమ రవాణాకు సంబంధించి తొమ్మిది కేసుల్లో 24 మంది నిందితులను అరెస్టు చేసి, 87 మంది బాధితులను రక్షించామన్నారు. విదేశాలకు మనుషులను పంపించే ఏజెంట్లు, సంస్థలకు ఉండాల్సిన అనుమతులు, అర్హతలకు సంబంధించిన వివరాలు ప్రజలకు తెలిపేలా రూపొందించిన రెండు పోస్టర్లను సీపీ ఆవిష్కరించారు. ఎవరికైనా మానవ అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం గానీ, ఏజెంట్ల గురించి గానీ తెలిస్తే సైబర్‌క్రైమ్ హెల్ప్ లైన్ 1930 నంబర్‌కుగానీ లేదంటే తన వ్యక్తిగత ఫోన్ నంబర్ (7995095799)కు సమాచారం ఇవ్వాలని కోరారు.



దర్శి లిఖితను అభినందిస్తున్న అనంతపురం ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ ఆత్మారామ్, ఆర్ఎంవో డాక్టర్ హేమలత

9 లీటర్ల తల్లిపాలు దానం

▸▸ అనంత మాతృక్షీర నిధికి ఇచ్చిన మాతృమూర్తికి సత్కారం

అనంతపురం వైద్యం, జూలై 16(ఆంధ్రజ్యోతి): తల్లి పాలు అమృతం అని చెబుతుంటారు. ఇలాంటి తల్లిపాలను ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 9 లీటర్లు దానం చేసి ఎందరో చిన్నారుల ప్రాణాలు నిలబెట్టారు మాతృమూర్తి దర్శి లిఖిత. అనంతపురం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సర్వజన వైద్యశాల మాతృక్షీర నిధికి ఆమె 9 లీటర్ల తల్లిపాలను దానం చేశారు. ఈ సందర్భంగా ఆమెను ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ ఆత్మారామ్, ఆర్ఎంవో డాక్టర్ హేమలత బుధవారం సత్కరించారు. నవజాత శిశువులకు తల్లిపాలు అందించేందుకు సర్వజన వైద్యశాలలో 'అనంత మదర్స్ మిల్క్ బ్యాంక్' పేరుతో మాతృక్షీర నిధిని ఏర్పాటు చేశామని ఆత్మారామ్ తెలిపారు. బెంగళూరు ఎయిర్‌పోర్ట్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్న లిఖితకు రెండు నెలల బాబు ఉన్నాడు. ఆమె బిడ్డకు పాలు ఇవ్వగా మిగిలినవి సేకరించి, మొత్తం 9 లీటర్లు దానం చేసి మాతృత్వాన్ని చాటుకున్నారని కొనియాడారు. అనంత మదర్స్ మిల్క్ బ్యాంక్‌కు తల్లిపాలను దానం చేయాలనుకునే వారు 8977768275 నంబరులో సంప్రదించాలని కోరారు.

ఆరుబయట నిద్రిస్తున్న

దంపతులపై పెట్రోల్ పోసి నిప్పు

▸▸ భార్య మృతి.. భర్త పరిస్థితి విషమం

▸▸ పల్నాడు జిల్లా ఐనవోలులో దారుణం



మంగమ్మ, పెద శ్రీను

నూజెండ్ల, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఆరుబయట నిద్రిస్తున్న దంపతులపై గుర్తు తెలియని దుండగుడు పెట్రోల్ పోసి నిప్పంటించాడు. మంటల్లో కాలిపోయి భార్య ప్రాణాలు కోల్పోగా, భర్త తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పల్నాడు జిల్లా నూజెండ్ల మండలం ఐనవోలు గ్రామంలో బుధవారం వేకువజామున జరిగిందీ దారుణం. బాధితుల కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వ్యవసాయ పనులతో జీవనం సాగించే నీలబోయిన పెద శ్రీను, మంగమ్మ(50) దంపతులు ఇంటి మరమ్మతుల దృష్ట్యా గ్రామ సమీపంలో పాకలో నివసిస్తున్నారు. మరమ్మతులు పూర్తవడంతో బుధవారం సొంతింట్లోకి వెళ్లిపోయేందుకు సిద్ధమయ్యారు. మంగళవారం రాత్రి పాక వద్దే నిద్రించారు. వేకువజామున 2:30 గంటలకు మంటలు గమనించామని వారి కుమారుడు బ్రహ్మయ్య పోలీసులకు తెలిపారు. తండ్రి మంటల్లో కాలిపోతుండగా తానే ఆర్పివేశానని, తల్లి పక్కనే ఉన్న నీటి ట్యాంక్ వద్దకు వెళ్లి మంటల్ని ఆర్పి వేసుకుందని చెప్పారు. ఇద్దరినీ గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా మంగమ్మ మరణించారు. పెద శ్రీను పరిస్థితి విషమంగా ఉంది. బాధితులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఘటనా స్థలాన్ని ఎస్పీ కంచి శ్రీనివాసరావు పరిశీలించారు. క్లూస్ టీమ్ నమూనాలు సేకరించింది. సమీపంలోని ఎరువుల దుకాణంలో ఉన్న సీసీటీవీ ఫుటేజ్‌ను పోలీసులు పరిశీలిస్తున్నారు. కాగా.. రెండు రోజుల క్రితం ఇంటి మరమ్మతులు చేస్తుండగా మంగమ్మతో బంధువులు చిన్నమ్మాయి, సుబ్బులు, అన్నపూర్ణ ఘర్షణ పడ్డారని ఆమె కుమారుడు బ్రహ్మయ్య పోలీసులకు తెలిపారు.

నా చావుకి భార్యే కారణం

▸▸ ఉరి వేసుకుంటూ భర్త సెల్ఫీ వీడియో

తాడేపల్లి (ఉండవల్లి), జూలై 16(ఆంధ్రజ్యోతి): 'నా మరణానికి నా భార్యే కారణం' అంటూ ఓ యువకుడు సెల్ఫీ వీడియో తీసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం ఉండవల్లిలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసుల కథనం మేరకు.. నులకపేటకు చెందిన పోతురాజు బ్రహ్మయ్య(30) కు మంగళగిరికి చెందిన మోహన కౌసల్యతో గతేడాది ఆగస్టులో వివాహమైంది. ఉండవల్లి సాయిబాబా గుడి సమీపంలో ఇల్లు అద్దెకు తీసుకుని ఉంటున్నారు. ఆషాఢం కావడంతో కౌసల్య పుట్టింటికి వెళ్లింది. ఈ నేపథ్యంలో బ్రహ్మయ్య మంగళవారం రాత్రి ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దానికి ముందు తన మృతికి భార్యే కారణమని సెల్ఫీ వీడియో తీసుకున్నట్టు పోలీసులు తెలిపారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ట్రంప్ కొత్త ఎత్తు..!

మరో యాభైరోజుల్లోగా ఉక్రెయిన్‌మీద దాడులు ఆపని పక్షంలో భారీ సుంకాలతో ఊపిరాడనివ్వబోనని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ను అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మహా గట్టిగా హెచ్చరించారు. మరో నెలన్నరపాటు ఎంచక్కా ఉక్రెయిన్‌ను బాదేసుకోవచ్చునని పుతిన్‌కు ట్రంప్ అవకాశమిచ్చారంటూ కొందరు దీనిని నిర్వచిస్తున్నారు. గడువు తరువాత రష్యాకు ఏమి జరగబోతున్నదో అటుంచితే, ఈ వేసవి నెలలను చక్కగా వాడుకొని భయానక దాడులతో పుతిన్ కోరుకుంటున్న ఉక్రెయిన్ ప్రాంతాలను ఆక్రమించుకోవడానికే ట్రంప్ ఈ అవకాశం ఇచ్చారని వారి వాదన.

గడువులోగా రష్యా తన యుద్ధాన్ని ఆపనిపక్షంలో మహా అయితే ఐదువందలశాతం సుంకాలతో రష్యాను ట్రంప్ శిక్షిస్తారంతే. రష్యా నుంచి దిగుమతులు చేసుకొనే దేశాలు కూడా ట్రంప్ ఆగ్రహానికి అంతే స్థాయిలో బలికావాల్సి రావచ్చు. అంతవరకూ ఉక్రెయిన్ పౌరుల మీద యథేచ్ఛగా దాడులు చేసుకోవచ్చునని ట్రంప్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టుగా రష్యాకు అనిపిస్తున్నది. మాకే హెచ్చరికలు చేస్తావా అంటూ రష్యా పెద్దలు ఆగ్రహాన్ని నటిస్తున్నా, లోలోపల సంతోషిస్తున్నారట.

ట్రంప్ తలుచుకుంటే ఈ హెచ్చరికలు చేసిన క్షణం నుంచే ఆంక్షలు అమలుచేయవచ్చును, సుంకాలు వెయ్యిరెట్లు విధించవచ్చును. కానీ, ఉక్రెయిన్‌కు మూడుదిక్కుల్లో ఉన్న కీలకప్రాంతాలు కొన్నింటిని రష్యా గెలుచుకొనేందుకు ఈ గడువు ఉపకరిస్తుంది. ఇప్పటికే రష్యామీద అత్యధికస్థాయి ఆంక్షలున్నందున, ట్రంప్ కొత్తగా దాని పీకనొక్కేదేమీ ఉండదు. ఆంక్షలతో రష్యాను దారికితేవడం అసాధ్యమన్నది కూడా ఇప్పటికే రుజువైంది. ఎన్ని ఆంక్షలున్నా చక్కగా చమురు అమ్ముకొని బతుకుతోంది, యుద్ధం బలంగా సాగిస్తోంది. ఒకవేళ ఈ యాభై రోజుల గడువులోగా పుతిన్ అనుకున్నది చేయలేనిపక్షంలో, దానిని సడలించడానికీ, పెంచడానికీ ట్రంప్ సిద్ధంగా ఉంటారని గిట్టనివాళ్ళ వాదన.

గడువు సంగతి అటుంచితే, పేట్రియాటిక్ వ్యవస్థ సహా అధునాతన ఆయుధాలను ఉక్రెయిన్‌కు అందివ్వాలన్న ట్రంప్ నిర్ణయం మాస్కోను ఇబ్బందుల్లో పడవేసేదే. రోజూ రాజధాని సహా ఉక్రెయిన్ నగరాలను దాడులతో దడదడలాడిస్తున్న రష్యాకు ఇకపై అది సులభం కాబోదు. ట్రంప్ నిజంగా శాంతిని కోరుకోవడం లేదని, పైకి అలా మాట్లాడుతూ, యుద్ధాన్ని కొనసాగించదల్చుకున్నాడని రష్యా నాయకులు ఘాటుగా విమర్శలు చేస్తున్నది అందుకే. ఉక్రెయిన్‌కు నిరవధికంగా ఆయుధాలు అందిస్తే, ఎట్టకేలకు మాస్కో దిగివస్తుందన్న భ్రమతో మూడున్నరేళ్ళు బైడెన్ వ్యవహరించారని, ఇప్పుడు ట్రంప్ కూడా అదేబాటలో నడుస్తున్నాడని రష్యా నాయకుల విమర్శ. కానీ, రోజూ వందలాది మిసైల్, డ్రోన్‌దాడులను ఎదుర్కొంటున్న ఉక్రెయిన్‌కు క్షిపణి రక్షణవ్యవస్థలు అందినందువల్ల కాస్త ఊపిరితీసుకోగలుగుతుంది. మూడువందల కిలోమీటర్ల వరకూ ప్రయాణించగలిగే మిసైళ్ళ వాడకానికి కూడా ట్రంప్ అనుమతించినపక్షంలో రష్యా సైనిక స్థావరాలకు, ఆయుధాగారాలకు భారీ నష్టాలు జరగవచ్చు.

ఇప్పుడు దాదాపు పదిబిలియన్ డాలర్ల విలువైన ఆయుధాలను నాటో దేశాలకు విక్రయించి, ఉక్రెయిన్‌కు అందించడం ద్వారా ట్రంప్ తన చేతికి మట్టి అంటకుండా జాగ్రత్తపడ్డారు. నేరుగా ఆయుధాలు అమ్మకుండా, రాబోయే నోబెల్‌కు ఇలా అడ్డం లేకుండా చూసుకుంటున్నారన్న ఆక్షేపణలను అటుంచితే, ఒకపక్క రష్యాకు నెలన్నర గడువు ఇవ్వడం, మరోపక్క పాశ్చాత్య దేశాలతో ఆయుధ వ్యాపారం చేసి ఖజానాను నింపుకోవడం ద్వారా ట్రంప్ కొత్త వ్యూహానికి దారులు తెరిచారు. యుద్ధానికి కారకుడివి నువ్వేనంటూ గతంలో ఉక్రెయిన్ అధ్యక్షుడిని తీవ్రంగా తప్పుబట్టి, ఓవల్ ఆఫీసులో కూడా ఘోరంగా అవమానించిన ట్రంప్ పుతిన్ విషయంలో మాత్రం స్పష్టమైన సానుకూలతతో వ్యవహరిస్తూ వచ్చారు. తాను అధికారంలోకి వచ్చిన ఇరవైనాలుగుగంటల్లోనే ఈ యుద్ధాన్ని ఆపేయగలనని నమ్మిన ట్రంప్‌కు పుతిన్ ఎంతకూ లొంగిరావడం లేదు. కనీసం అరడజను సార్లు గట్టి ప్రయత్నాలు చేసినా ఫలితం లేకపోయింది. ఇది ట్రంప్‌కు అవమానాన్ని కలిగించివుండవచ్చు. ఇప్పుడు ఉద్రిక్తతలను పెంచి, ఉపశమనాన్ని సాధించగలనని ఆయన నమ్ముతున్నట్టు ఉంది. ఈ ఎత్తుగడ ఫలిస్తే నోబెల్ శాంతి దక్కవచ్చునన్న ఆశ ఆయనలో ఉన్నా కూడా తప్పులేదు.

'సర్' సంకటంలో భారత ప్రజాస్వామ్యం



భారత ప్రజాస్వామ్యానికి ఉపశమనం, సందేహం లేదు. బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ –సర్)కు వ్యతిరేకంగా దాఖలైన పిటీషన్లపై విచారణలో సుప్రీంకోర్టు జారీ చేసిన ఆదేశాల గురించి నేను ప్రస్తావిస్తున్నాను. సర్వోన్నత న్యాయస్థానం నిర్ణయాలను స్వాగతించవలసిందే. అయితే అసలు సమస్యపై నుంచి మన దృష్టిని మళ్లించే ఒక తీవ్రప్రమాదమూ వాటిలో అంతర్భాగంగా ఉంది. వయోజనులను ఓటర్‌గా నమోదు చేసేందుకు ఆధార్ కార్డును ప్రామాణికంగా తీసుకోవాలని సుప్రీంకోర్టు నిర్దేశించింది. అలాగే సర్ ప్రక్రియ కేవలం నెల రోజులలో పూర్తి చేయడం ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించింది. బిహార్‌లోని కొన్ని ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా సమగ్ర సవరణకు ఎదురయ్యే అవరోధాలనూ ప్రస్తావించింది. నిజమే, అవన్నీ నిజమైన సమస్యలు, జరూరుగా పరిష్కరించవలసినవి. కానీ, ప్రస్తావిత అంశాలపైనే మన దృష్టి కేంద్రీకృతమైతే ప్రాథమిక ప్రాధాన్యమున్న అంశం ఉపేక్షితమయ్యే అవకాశమున్నది. అది బిహార్‌కు మాత్రమే కాదు, సమస్త భారతదేశాన్నీ ప్రభావితం చేసే అంశమది. మరింత కచ్చితంగా చెప్పాలంటే భారత ప్రజాస్వామిక గణతంత్ర రాజ్య భవిష్యత్తును ప్రతికూలంగా ప్రభావితం చేసే సమస్య అది.

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణతో భారత ప్రజాస్వామ్యానికి దాపురించిన ప్రమాదమేమిటో మనం స్పష్టంగా గుర్తించాలి. అది కేవలం బిహార్‌కు మాత్రమే పరిమితమైనది కాదు. బిహార్ ఆరంభం మాత్రమే. ఆ రాష్ట్రంలో ఆ ప్రక్రియను పూర్తి చేసిన తరువాత అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న రాష్ట్రాలలోను, అనంతరం దేశ వ్యాప్తంగా ఆ ప్రక్రియను అమలుపరిచేందుకు భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) సమాయత్తమవుతోంది. ఇందులో భాగంగానే 'సర్' అమలుకు సన్నద్ధమవ్వాలని రాష్ట్ర ఎన్నికల సంఘాలను ఈసీఐ ఆదేశించింది. 'సర్' చట్టబద్ధతపై దేశ సర్వోన్నత న్యాయస్థానం విచారణ కొనసాగుతున్న సమయంలోనే ఈసీ ఆ ఆదేశం జారీ చేయడం గమనార్హం. 'సర్' కేవలం ఓటర్ల జాబితా సవరణ కాదు. అది ఓటర్ల జాబితాను సమూలంగా సరికొత్తగా రూపొందించడమే. మరింత స్పష్టంగా చెప్పాలంటే ఓటర్ల జాబితాను ఎలా సృష్టించాలనే విషయమై నియమాలు, విధానాలు, మార్గదర్శక సూత్రాలను తిరగ రాయడమే. ఈ ప్రక్రియ వల్ల సార్వత్రిక వయోజన ఓటుహక్కు పునాది సూత్రమే ప్రమాదంలో పడుతుంది. బిహార్ విషయంలో ఉపశమనం లభించినప్పటికీ ఆ ప్రక్రియను పూర్తిగా రద్దు చేసి తీరాలని మనం డిమాండ్ చేయవలసిన అవసరమున్నది.

> బిహార్‌లో ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ వాస్తవానికి ఓటర్ల జాబితాను ఎలా రూపొందించాలన్న విషయమై నియమాలు, విధానాలు, మార్గదర్శక సూత్రాలను తిరగరాయడమే. దీనివల్ల సమున్నత ప్రజాస్వామిక సూత్రమైన సార్వత్రిక వయోజన ఓటుహక్కు పునాదే ప్రమాదంలో పడింది.

సార్వత్రిక వయోజన ఓటు హక్కు మన స్వాతంత్ర్యోద్యమ ప్రధాన లక్ష్యాలలో ఒకటి. 1928లో మోతీలాల్ నెహ్రూ కమిటీ తొట్టతొలుత ఈ సమున్నత లక్ష్యాన్ని ప్రతిపాదించింది. 1929లో లాహోర్ కాంగ్రెస్‌లో ఆమోదించిన పూర్ణ స్వరాజ్ తీర్మానంలో ఆ లక్ష్యాన్ని పునరుద్ఘాటించారు. భారత రాజ్యాంగం 'వయోజన ఓటు హక్కు' సూత్రాన్ని అధికరణ 326 ద్వారా చేర్చుకున్నది : లోక్‌సభ, శాసనసభలకు వయోజన ఓటుహక్కు విధానంపై ఆధారపడి ఎన్నికలు జరుగుతాయి అనగా భారతీయులై ఉండి, నిర్దేశిత తేదీకి 18 సంవత్సరాలు నిండిన వారందరికీ ఓటుహక్కు ఉంటుంది'. భారతీయ పౌరసత్వానికి ప్రాతిపదిక భారతదేశంలో పుట్టుక, నివాసంపై ఆధారపడి ఉంటుందని అధికరణ 5 పేర్కొంది. ప్రతి పౌరుడి పౌరసత్వానికి అధికరణ 10 భద్రత కల్పించింది: 'భారత పౌరుడు అయిన వ్యక్తి, భారత పౌరుడుగా భావించబడే వ్యక్తి తన పౌరసత్వ హక్కును, పార్లమెంటు ఆమోదించే పౌరసత్వ హక్కు సంబంధిత చట్టాలకు లోబడి ఎన్నటికీ కోల్పోడు'. భారత పౌరసత్వానికి సంబంధించి ఈ రాజ్యాంగ బద్ధ హామీని వాస్తవం చేసేందుకు భారత గణతంత్ర రాజ్యం గత 75 ఏళ్లుగా పరిపూర్ణంగా నెరవేర్చింది. వయోజన ఓటుహక్కు ప్రతి ఒక్కరికీ లభించేందుకు, తద్వారా పౌర సత్వ హోదా ప్రతి ఒక్కరికీ కల్పించేందుకు భారత రాజ్య వ్యవస్థ కట్టుబడి ఉన్నదని అనుపమరాయ్ తన పుస్తకం 'మ్యాపింగ్ ఆఫ్ సిటిజెన్‌షిప్ ఇన్ ఇండియా'లో వివరించారు. 'అవశేష' పౌరులకు (వలస, పేదరికం లేదా సామాజిక విధానాలు ఇత్యాది కారణాల వల్ల సమాజంలో సంపూర్ణ భాగస్వామ్యం నుండి మినహాయింపబడిన వ్యక్తులు) సైతం ఓటింగ్ హక్కులు నిరాకరించడం జరగలేదు. కనుకనే స్వతంత్ర భారతదేశంలో ఓటు వేయడమనేది ఒక లౌకిక ఆచారంగా రూపొంది పవిత్ర హోదాను సంతరించుకున్నదని రాజకీయ మానవశాస్త్రవేత్త ముకూలికా బెనర్జీ వాదించారు. ఆమె వాదన విస్తృత ఆమోదం పొందింది.


■ యోగేంద్ర యాదవ్

ఈ శుభ పరిణామం యాదృచ్ఛికంగా సంభవించలేదు. ఏ ఒక్క వయోజనుడు మినహాయింపబడకుండా ఓటర్ల జాబితాలో స్థానం పొందేందుకు అవసరమైన చట్టాలు చేసి, వాటిని అమలుపరుస్తున్నారు. అమెరికా, ఇతర ప్రజాస్వామ్య దేశాలలో ఓటరుగా నమోదయేందుకు స్వయంగా ప్రతివ్యక్తి దరఖాస్తు చేసుకోవల్సి ఉంటుంది. అయితే భారత ప్రజాస్వామ్య వ్యవస్థ ఓటుహక్కుకు అర్హుడైన ప్రతి పౌరుడినీ ఓటరుగా నమోదు చేసే బాధ్యతను రాజ్య వ్యవస్థపై మోపింది. ఈ కారణంగా అమెరికాలో మొత్తం వయోజనులలో 74 శాతం మంది మాత్రమే ఓటర్ల జాబితాలో ఉండగా మన దేశంలో 96 శాతం మంది వయోజనులు ఓటర్ల జాబితాలో ఉంటున్నారు. ఓటర్ల జాబితాలో నమోదుకు వ్యక్తులు విడివిడిగా దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే భారత పౌరుడు అయిన ప్రతి వయోజనుడి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చూడాల్సిన బాధ్యత అంతిమంగా ఎన్నికల అధికారులపై ఉంచారు. ఓటు హక్కుకు అర్హుడైన ఏ వయోజనుడినీ ఓటర్ల జాబితాల చేర్చకుండా వదిలివేయకూడదు. నిర్దిష్ట ప్రాంతంలో నివాసముంటున్న ప్రతి వ్యక్తినీ పౌరుడుగా భావించి, అతని పేరు విధిగా ఓటర్ల జాబితాలో చేర్చాలి. అయితే నిర్దిష్ట ప్రదేశంలో నివాసం ఉండకపోవడం, మానసిక అస్వస్థత, నేరాలకు పాల్పడడం, అవినీతి, చట్ట వ్యతిరేక చర్యలు మొదలగు కారణాలపై రాజ్యాంగం క్రిందగానీ, మరేదైనా శాసనం క్రిందగానీ ఓటర్లుగా అనర్హులైనవారికి ఓటర్లుగా నమోదయ్యే అర్హత ఉండదు' అని రాజ్యాంగ అధికరణ 326 స్పష్టం చేసింది. ఒకసారి ఓటరుగా నమోదైన తరువాత సరైన ప్రక్రియను అనుసరించకుండా ఎవరి పేరునూ ఓటర్ల జాబితా నుంచి తొలగించకూడదు.

ఓటర్ల నమోదు ప్రక్రియలో వదిలివేయబడిన సంచార సామాజిక సమూహాలకు చెందినవారు, ఇల్లూ వాకిలి లేనివారు, సెక్స్ వర్కర్స్ ట్రాన్స్‌జెండర్ పర్సన్స్ అనాథలు, సరైన డాక్యుమెంట్లు లేనివారు, ప్రవాస భారతీయులను సైతం ఓటర్ల జాబితాలో చేర్చేందుకు ఈసీఐ కట్టుబడి, మార్గదర్శక సూత్రాలను రూపొందిస్తున్న నేపథ్యంలో, సర్ ప్రక్రియ ఆ సదాశయానికి పూర్తి వ్యతిరేకమైనది. పరిధిని విస్తరిస్తూ, విస్తృత చేర్పులతో సార్వత్రిక వయోజన ఓటుహక్కు పునాదిని బలోపేతం చేసే లక్ష్యం బలహీనపడుతుంది.

చెప్పవచ్చినదేమిటంటే 'సర్' ప్రక్రియ డాక్టర్ అంబేడ్కర్ పేర్కొన్న పౌరసత్వ క్రమానుగత అసమానత (Graded Inequality of Citizenship)లకు దారితీస్తుంది. ప్రతి పౌరుడినీ ఒక రాజకీయ సమూహంలో స్వేచ్ఛాయుత, సమాన భాగస్వామిగా చేయడంలో భారత రాజ్య వ్యవస్థ విఫలమయింది. రాజనీతి శాస్త్రవేత్త టిహెచ్ మార్షల్ మాటల్లో చెప్పాలంటే అధికారిక రాజకీయ రంగం నుండి ఒక ముఖ్యమైన సామాజిక రంగం వైపు పరివర్తన అనేది జరగలేదు. నీరజా గోపాల్ తన 'Citizenship Imperilled :Indias Fragile Democracy'లో రాజకీయ మార్పులు, సామాజిక ఉద్యమాల ప్రభావంతో పౌరసత్వ భావనను నిర్వచిస్తున్న, పౌరసత్వాన్ని పొందుతున్న పద్ధతులు, పౌరసత్వం రద్దు కావడమనే మార్పులను వివరంగా పేర్కొన్నారు. వీటి కారణంగా పౌరసత్వం పరిపూర్ణత పొందకపోగా అధికారిక పౌరసత్వం క్షీణించి పోతుందని ఆమె వ్యాఖ్యానించారు. ఈ తిరోగామి మార్పులు 'ప్రత్యేక సమగ్ర సవరణ' ప్రక్రియతో మరింత వేగవంతమవుతున్నాయి. ఫలితంగా పౌరసత్వ ప్రాతిపదిక జస్ సోలి (పుట్టుక నివాసం ఆధారంగా పౌరసత్వాన్ని పొందడం) అనే సూత్రం నుంచి జస్ సాంగులిస్ (తల్లిదండ్రుల వారసత్వం ఆధారంగా పౌరసత్వాన్ని ఇవ్వడం) అనే సూత్రానికి మారుతోందని నీరజా జయాల్ వ్యాఖ్యానించారు.


సార్వత్రిక వయోజన ఓటుహక్కు అమలయ్యేందుకు దోహదం చేస్తున్న ఆచరణలు అన్నిటినీ సర్ తలకిందులు చేస్తోంది. తొలుత ఓటర్ల జాబితాలో తమ పేరు ఉండేలా చేసుకునే బాధ్యతను ఓటుహక్కుకు అర్హులైనవారిపైనే మోపింది. ఎన్యూమరేషన్ ఫామ్‌లను సకల వివరాలతో నింపి, సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో సహా సమర్పించాలని ఎటువంటి మినహాయింపు లేకుండా సంభావ్య ఓటర్లు అందరినీ సర్ నిర్దేశించింది. ఓటర్లకు ఇటువంటి పరిస్థితి కల్పించడం ఇదే మొదటిసారి. నిర్దేశించిన రీతిలో ఎన్యూమరేషన్ ఫామ్‌లను ఇవ్వనిపక్షంలో ముసాయిదా ఓటర్ల జాబితాలో సైతం సంబంధితుల పేర్లు చోటు చేసుకోవని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. 2003 నాటి ఓటర్ల జాబితాలో పేరు లేని పక్షంలో ఓటర్ల జాబితాలో ఉన్నప్పటికీ ప్రయోజనముండదు (అసలు 2003ను కటాఫ్ పాయింట్‌గా తీసుకోవడమే అర్థరహితం. ఆనాడు ఆ జాబితా తయారీలో కూడా పౌరసత్వ ధ్రువీకరణ డాక్యుమెంట్ల ద్వారా జరగనే లేదు. మరో ముఖ్యమైన బాధ్యత మీరు చట్టవిరుద్ధంగా దేశంలో నివసించడం లేదనే విషయాన్ని మీరు నిరూపించుకోవల్సిన అవసరమున్నది. ఇప్పుడు ప్రతి ఒక్కరూ, తమ పేరు ఉన్నట్టు రుజువు చేస్తున్న 2003 ఓటర్ల జాబితా కాపీని, బర్త్ సర్టిఫికెట్, నివాసానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాన్ని కూడా సమర్పించవలసి ఉంటుంది. ఇలా జరగడం కూడా ఇదే మొదటిసారి. గమనార్హమైన విషయమేమిటంటే ప్రభుత్వం వీటిని ఎవరికీ సమకూర్చలేదు. వాటిని విధిగా సమకూర్చుకోవల్సిన అవసరం అత్యధికులకు లేదు. బిహార్‌లో సర్ గందరగోళ పరిస్థితులను సృష్టిస్తోంది. ఏక కాలంలో విషాదమూ, ప్రహసనమూ చోటు చేసుకుంటున్నాయి. సర్‌ను అమలుపరుస్తోన్న అధికారుల అసమర్థతే అందుకు కారణమా? అదే కావచ్చు. అయితే అధికారుల అసమర్థత అసలు సమస్య కాదనే వాస్తవాన్ని మనం విస్మరించకూడదు. ఎన్నికల సంఘం అమలుపరుస్తున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పథకమే దురుద్దేశపూరితమైనది, రాజ్యాంగ విరుద్ధమైనది, ప్రజాస్వామ్య వ్యతిరేకమైనది.

(వ్యాసకర్త 'స్వరాజ్ ఇండియా' అధ్యక్షుడు)

విశ్వ శాస్త్రవేత్త

ఆధునిక భారతీయ ఖగోళశాస్త్రవేత్తలలో ప్రథమగణ్యుడు జయంత్ విష్ణు నార్లికర్. ఆయన ఈ ఏడాది మే 20న తనువు చాలించారు. అదేం కాకతాళీయమో.. ఆయన తన చివరి బ్లాగ్‌లో తాను స్థాపించిన ఐయూసీఏఏ గురించి ప్రస్తావిస్తూ, 'కర్మయోగి భగవద్గీతలో చెప్పినట్టుగా.. వీడ్కోలు. ఇక్కడితో నా ప్రయాణం సమాప్తమైనట్టుగా భావిస్తున్నాను' అంటూ రాసుకొచ్చారు!

'శాంతంగానే మాట్లాడండి. అయినా ఓ దుడ్డుకర్రను వెంటే ఉంచుకోండి' (Speak softly and carry a big stick) అనే అమెరికన్ సామెతను నార్లికర్ అనుసరించారు. ఆల్బర్ట్ ఐన్‌స్టీన్, ఎర్నెస్ట్ మాక్ వంటి దిగ్గజాలు ప్రతిపాదించిన సిద్ధాంతాలను ఇరవై ఏళ్ల వయసులోనే తన 'హోయల్ నార్లికర్ గురుత్వాకర్షణ సిద్ధాంతం' ద్వారా సవాలు చేసే మేధో ధైర్యాన్ని ప్రదర్శించారు. ప్రఖ్యాత బిగ్ బ్యాంగ్ సిద్ధాంతాన్ని సవాలు చేస్తూ 'స్థిర స్థితి సిద్ధాంతం' (Steady State Theory) ప్రతిపాదించి సంచలనం సృష్టించారు. ఈ సిద్ధాంతం ప్రకారం ఈ విశ్వం ఆది, అంతాలు లేని ఒక నిరంతరాయ ప్రక్రియ. విశ్వం విస్తరిస్తున్న కొద్దీ, కొత్త పదార్థం నిరంతరం ఏర్పడుతుంది. తద్వారా విశ్వం సాంద్రత స్థిరంగా ఉంటుంది. కానీ స్థిర స్థితి సిద్ధాంతం క్రమేణా ప్రాబల్యం కోల్పోయింది. విశ్వ పురోగతికి సంబంధించిన సాక్ష్యాలు, ముఖ్యంగా కాస్మిక్ మైక్రోవేవ్ నేపథ్య వికిరణాన్ని కనుగొనడం బిగ్‌బ్యాంగ్ నమూనాకు బలమైన మద్దతునిచ్చాయి. దీనికి సమాధానంగా 1993లో ఫ్రెడ్ హోయిల్, జియోఫ్రీ బర్బిడ్జ్‌లతో కలిసి క్వాసీ–స్థిర స్థితి సిద్ధాంతాన్ని (QSS) కొన్ని సవరణలతో ప్రతిపాదించారు. ఈ సిద్ధాంతం ప్రకారం.. విశ్వంలో అక్కడక్కడా పదార్థం ఎప్పటికప్పుడు ఏర్పడుతూ ఉంటుంది. ఈ సృష్టిని మినీ–బ్యాంగ్స్ లేదా మినీ–క్రియేషన్ ఈవెంట్స్ అంటారు. మాక్ సూత్రం, క్వాంటం విశ్వోద్భవ శాస్త్రం, క్వాసార్‌లు, బ్లాక్ హోల్స్‌కు సంబంధించిన అంశాలపై కూడా నార్లికర్ పరిశోధనలు చేశారు. ఇస్రో శాస్త్రవేత్తతో కలిసి అనేక అంతరిక్ష పరిశోధనలు చేశారు. ఈ పరిశోధనల ఫలితంగా సేకరించిన నమూనాల్లో ప్రత్యక్ష కణాలు, బ్యాక్టీరియాను, గ్రహాంతరాలకు చెందిన సూక్ష్మ జీవులను కనుగొన్నారు. దీంతో గ్రహాంతరాల్లో జీవం ఉందనే వాదనకు ఈ ప్రయోగం బలం చేకూర్చింది. ఈ ప్రయోగంలో నార్లికర్ కనుగొన్న సూక్ష్మజీవుల్లో ఒక జాతికి తన గురువైన ఫ్రెడ్ హోయల్, ఇంకో జాతికి ఇస్రో, మరో జాతికి ఆర్యభట్ట పేర్లను పెట్టటం విశేషం.



> 'అన్నీ మన వేదాల్లో ఉన్నాయ్' అనే వాదనలను నార్లికర్ తిరస్కరించారు. 'విజ్ఞాన సంబంధమైన విషయాలన్నీ బలమైన ప్రమాణాలు, తర్కం మీదే ఆధారపడి ఉంటాయి తప్ప ఊహలు, ఊసుపోని కబుర్ల మీద కాద'ని ఆయన ప్రకటించారు. తన పుస్తకం 'సైంటిఫిక్ ఎడ్జ్'లో మూఢభక్తికి, శాస్త్రీయ విజ్ఞానానికి మధ్య ఉన్న తేడాను విపులంగా వివరించారు.

సైన్స్‌ను జనబాహుళ్యంలోకి తీసుకెళ్లడానికి నార్లికర్ విశేష కృషి చేశారు. బొమ్మలు, ఇతర బోధనా సాధనాల ద్వారా తన ఐయూసీఏఏ విద్యార్థుల సాయంతో సైన్స్‌ను ప్రతినెలా పాఠశాల విద్యార్థులకు బోధించారు. ఇది దాదాపు నాలుగు దశాబ్దాల పాటు కొనసాగింది. కష్టమైన సైన్స్ సిద్ధాంతాలను సులభమైన భాషలో ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు తమిళం, హిందీ, మరాఠీ, ఇంగ్లీష్ భాషల్లో పుస్తకాలు, కథలు, నవలలు, వ్యాసాలు రాశారు. టీవీ, రేడియో, బుక్స్, బ్లాగుల ద్వారా విస్తృతంగా విజ్ఞానాన్ని పంచారు. తన మాతృభాష మరాఠీలో ఆయన రాసిన సైన్స్ ఫిక్షన్ కథ అనంతర కాలంలో 'ధూమకేతు' సినిమాగా రూపొందింది. నార్లికర్ ఆత్మకథ 'చార్ నగరాంతలే మాజే విశ్వ' (మై టేల్ ఆఫ్ ఫోర్ సిటీస్)కు జాతీయ సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది. ఖగోళ శాస్త్రంలో ఆయన చేసిన విశేష కృషికి గాను 1965లో పద్మభూషణ్, 2004లో పద్మ విభూషణ్, ఫ్రెంచ్ ఖగోళ సంఘం అందజేసే 'ప్రిక్స్ జూల్స్ జన్సేన్' అవార్డు, 2011లో మహారాష్ట్ర భూషణ్ పురస్కార్ లభించాయి.

'అన్నీ మన వేదాల్లో ఉన్నాయ్' అనే వాదనలను ఆయన తిరస్కరించారు. 'విజ్ఞాన సంబంధమైన విషయాలన్నీ బలమైన ప్రమాణాలు, తర్కం మీదే ఆధారపడి ఉంటాయి తప్ప ఊహలు, ఊసుపోని కబుర్ల మీద కాద'ని ఆయన ప్రకటించారు. ఛాందసపు సిద్ధాంతాలను ఖండించేవారు. అదే సమయంలో మన పూర్వీకుల విజయాలైన 'సున్నా ఆవిష్కరణ' వంటి నిజంగా గుర్తింపు దక్కాల్సిన మన గత శాస్త్రీయ విజయాలకు ప్రోత్సాహం అందించాలని మన శాస్త్రవేత్తలకు నార్లికర్ పిలుపునిచ్చారు. తన పుస్తకం 'సైంటిఫిక్ ఎడ్జ్'లో మూఢభక్తికి, శాస్త్రీయ విజ్ఞానానికి మధ్య ఉన్న తేడాను విపులంగా వివరించారు. యువ శాస్త్రవేత్తలకు ఆయన 'పబ్లిష్ ఆర్ పెరిష్' (ప్రచురించు లేదా నశించు)' అనే పిలుపునిచ్చారు. ఆయన రచించిన 'ది కామెట్', 'ది అడ్వెంచర్ అధ్యాయాలను NCERT 8, 9 తరగతుల సైన్స్ పుస్తకాల్లో చేర్చారు. అత్యంత సాధారణ జీవితాన్ని ఇష్టపడి, ఆచరించిన నార్లికర్ తన 87వ ఏట పూణెలోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. మూఢత్వాన్ని వదిలి తర్కం, హేతువు ఆధారంగా మనమంతా వైజ్ఞానిక దృక్పథాన్ని అలవర్చుకోవాలి. అదే నార్లికర్‌కు మనం ఇచ్చే అసలైన నివాళి.

● డి. శాంతిప్రియ (డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఆస్ట్రానమి, ఓయూ)
● నెక్కంటి అంత్రివేది (సామాజిక శాస్త్రవేత్త)

(జూలై 19: నార్లికర్ జయంతి)

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

సంఘ విద్రోహులకు సంక్షేమ పథకాలు వద్దు

రాష్ట్రంలో నానాటికీ రౌడీయిజం పెరుగుతూ నేరగాళ్ళు పోలీసులపైనే తిరగబడే స్థితి వచ్చింది. రాష్ట్రంలో పెరిగిపోతున్న అనుచిత పథకాలతోనే సమాజంలో పని సంస్కృతి తగ్గి, బాధ్యతా రాహిత్యం, నేరాలు పెరిగిపోతున్నాయి. కాబట్టి సంఘ విద్రోహులకి సంక్షేమ పథకాలను నిలిపివేయాలనే ప్రభుత్వ నిర్ణయం మంచిదే. రాష్ట్రంలో సుపరిపాలన కోసం, గత వైసీపీ ప్రభుత్వం భారీగా పెంచిన విద్యుత్, బస్ చార్జీలను తగ్గిస్తుందని, ఖాళీగా వున్న లక్షలాది ప్రభుత్వోద్యోగాలను భర్తీ చేస్తుందని రాష్ట్రంలో కూటమిని గెలిపించారు ప్రజలు. శాంతిభద్రతల విషయంలో సంఘవిద్రోహుల పట్ల యూపీ ప్రభుత్వం వలె కాకపోయినా కొంత కఠినంగా వ్యవహరించాలి. దండం దశ గుణం భవేత్ అని కదా పెద్దల సామెత.

ఇక హామీల విషయానికి వస్తే పెద్దలకు ఇచ్చే పింఛన్లు తక్షణమే పెంచమని గాని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటివి ప్రజానీకం డిమాండ్ చేయలేదు. బిహార్‌లో నేటికీ వృద్ధాప్య ఫించన్ నెలకి నాలుగు వందలే. అసెంబ్లీ ఎన్నికల సమీపిస్తున్న వేళ దీనిని 1100 రూపాయలకు పెంచారు. ఇపుడు మన రాష్ట్రంలో నెలకు రూ.నాలుగు వేలు. అధిక పన్నుల భారం మోస్తున్నాం గనుక తప్పు లేదని పింఛను, రేషన్ వంటి సంక్షేమ పథకాలను కొందరు ధనికులు కూడా పొందుతున్నారు. సంక్షేమ పథకాలే పార్టీని గట్టెక్కిస్తాయనే భ్రమ నుంచి ప్రభుత్వం బయటపడాలి.

ఇప్పుడు ప్రభుత్వం భావిస్తున్నట్లు సంఘ విద్రోహులకు సంక్షేమ పథకాలను నిలిపివేసినా, అనర్హులకు వాటిని రద్దు చేసినా ఎంతో ప్రజాధనం ఆదా అవుతుంది. అవినీతి, అక్రమాలు తగ్గుతాయి. కొత్త పథకాల కంటే తక్షణమే చార్జీల భారం తగ్గిస్తే సంక్షేమ పథకాలను ఆశించని వారికి మేలు జరుగుతుంది. ఇక ముందు గతంలో వలె రిటైర్మెంట్ వయసు అరవై సంవత్సరాల నుంచి యాభై ఎనిమిది సంవత్సరాలకి తగ్గించి, ఆ ఖాళీలను కొంతకాలం తాత్కాలిక ప్రాతిపదికన భర్తీ చేస్తే పేద నిరుద్యోగులకి మేలు జరుగుతుంది. కొద్దిమంది ఉద్యోగులెవరైనా ఆర్థిక ఇబ్బందులతో పొడిగింపు కోరితే ప్రభుత్వం అంగీకరించవచ్చు. అప్పుడు ఉద్యోగులకీ ఇబ్బంది ఉండదు.

– తిరుమలశెట్టి సాంబశివరావు

విదేశీ వైద్యవిద్యార్థుల సమస్యలకు పరిష్కారమెప్పుడు?

విదేశాలలో వైద్య విద్యను పూర్తి చేసిన ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు జూలై ఒకటి నుంచి ఉద్యమ బాట పట్టారు. వీరి సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇంతవరకు జోక్యం చేసుకోలేదు. వైద్య విద్య పర్యవేక్షణ, నియంత్రణ సంస్థలైన నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్ఎంసీ), రాష్ట్రంలోని మెడికల్ కౌన్సిల్ (ఏపీఎంసీ) సమస్యను పరిష్కరిస్తామంటూనే జాప్యం చేస్తున్నాయి. ఇప్పటికే 13 నెలల విలువైన సమయం వృథా అయిందని, నీట్ పీజీ పరీక్ష అర్హత కోల్పోతున్నామంటూ ఈ విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మన దేశంలో ఏటా 14 లక్షల మందికి పైగా విద్యార్థులు కేంద్ర ప్రభుత్వం నిర్వహించే 'నీట్' పరీక్ష రాస్తున్నారు. అయితే దేశంలో 1,18,000 సీట్లు మాత్రమే ఉన్నందువల్ల కొంతమంది సీటు సంపాదించలేకపోతున్నారు. ప్రైవేట్ మెడికల్ కళాశాలలో 'బి' కేటగిరీ సీట్లు తక్కువగా ఉండి, ఫీజులు చాలా ఎక్కువగా ఉండటంతో అనేక మంది విద్యార్థులు వైద్యవిద్య అభ్యసించేందుకు రష్యా, ఉక్రెయిన్, చైనా, ఫిలిప్పీన్స్, జమైకా, కజికిస్థాన్ వంటి విదేశాలకు వెడుతున్నారు. ఇందుకు కూడా 'నీట్'లో తప్పక క్వాలిఫై అయి ఉండాలనే నిబంధనను కేంద్ర ప్రభుత్వం విధించింది. కొందరు బ్యాంకు రుణాలతో, మరికొందరు ఆస్తులు తాకట్టుపెట్టి ప్రైవేటు రుణాలు తీసుకొని విదేశాలకు వెడుతున్నారు.

విదేశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేసిన వారికి కేంద్ర ప్రభుత్వం, నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ద్వారా 'ఫారెన్ మెడికల్ గ్రాడ్యుయేట్' (ఎఫ్ఎంజీ) పరీక్షను నిర్వహిస్తుంది. ఈ పరీక్షలో 15 నుంచి 20 శాతం మించి విదేశీ వైద్యవిద్యార్థులు ఉత్తీర్ణులైన సందర్భాలు లేవు. కేంద్ర ప్రభుత్వం ఫైనల్ ఇయర్ పరీక్షకు బదులు స్వదేశీ, విదేశీ విద్యార్థులకు ఒకే పరీక్ష 'ఎగ్జిట్ ఎగ్జామ్' పెట్టాలని 'నేషనల్ మెడికల్ కమిషన్' సూచించినా, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) వంటి వైద్య వృత్తి సంస్థలు, దాఖలు అయిన కొన్ని వ్యాజ్యాల వల్ల ఆ నిర్ణయం ఇంతవరకు అమలు కాలేదు.

'కరోనా' మహమ్మారితో విదేశీ వైద్య విద్యార్థులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వదేశానికి రప్పించాయి. ఆ తర్వాత కరోనా తగ్గినా వారిని తిరిగి వెళ్ళమని మన దేశం ప్రకటించలేదు. అయితే కొందరు మళ్లీ ఆయా దేశాలకు వెళ్లి మరో సంవత్సరం అదనంగా ఫీజులు చెల్లించి ఫైనల్ ఇయర్, ఇంటర్న్‌షిప్ కూడా పూర్తి చేసి వచ్చారు. మరికొందరు ఆన్‌లైన్‌లో పూర్తి చేశారు. ఆఫ్‌లైన్ లేదా ఆన్‌లైన్‌లలో పూర్తి చేసిన వారు ఎఫ్ఎంజీ పరీక్ష రాసి, పాసైనా కూడా తిప్పలు తప్పడం లేదు.

2023లో రాష్ట్రాల కౌన్సిళ్లకు ఎన్ఎంసీ కొన్ని ఆదేశాలు జారీ చేసింది. ఆ తర్వాత కూడా మరికొన్ని ఆదేశాలను జారీ చేసింది. వీటిలో ఏ ఆదేశాలను అమలు చేయాలి? ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వాల మెడికల్ కౌన్సిళ్లు అమలు జరిపిన ఆదేశాల మాటేమిటి? ఏ ఆదేశాలు అయినా తూ.చా. తప్పక పాటించాలా? ఏమైనా మార్పులు చేసుకోవచ్చా? అన్నది స్పష్టం చేయలేదు. అందువల్ల రాష్ట్రాల మెడికల్ కౌన్సిళ్లలో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. కొన్ని రాష్ట్రాలు ఎఫ్ఎంజీ పరీక్ష పాస్ అయిన వారందరికీ ఒకే సంవత్సరం ఇంటర్న్‌షిప్ కేటాయించాయి. ఆంధ్రప్రదేశ్ మాత్రం ఎన్ఎంసీ రూల్స్ తూ.చా. తప్పక పాటించాల్సిందేనని స్పష్టం చేసింది. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం వచ్చిన ఎనిమిది నెలలకు ఆరుగురు నామినేటెడ్ సభ్యులతో మెడికల్ కౌన్సిల్ ఏర్పాటు అయి, ఎఫ్ఎంజీ విద్యార్థులపై దృష్టి సారించి, ప్రత్యేక కమిటీని కూడా వేశారు. కమిటీ కూడా ఎన్ఎంసీ నిబంధనలు అంటూ ఒక సంవత్సరం, రెండేళ్లు, మూడేళ్ల క్లర్క్‌షిప్, ఇంటర్న్‌షిప్ అంటూ ప్రతిపాదించింది. దీంతో తమకు అనుకూల నిర్ణయం వస్తుందని ఆశించిన విద్యార్థులకు తీవ్ర నిరాశ ఎదురయ్యింది.

> విదేశాలలో వైద్య విద్యను పూర్తి చేసిన విద్యార్థుల సమస్యలను నేషనల్ మెడికల్ కమిషన్, రాష్ట్రంలోని మెడికల్ కౌన్సిల్ పరిష్కరిస్తామంటూనే జాప్యం చేస్తున్నాయి. విదేశీ వైద్య విద్యార్థులు ఎఫ్ఎంజీ లాంటి కఠినమైన పరీక్ష పాస్ అయి వస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి వారి సేవల్ని సత్వరమే ఉపయోగించుకునేలా నిర్ణయాలు తీసుకోవాలి.



కరోనా సమయంలో విదేశీ విద్యార్థులకు లాగానే, మన దేశంలోని వైద్య విద్యార్థులకు కొన్ని నెలల పాటు ఆన్‌లైన్ విధానంలో క్లాసులు జరిగాయి. అయితే పరీక్షలు లేటుగా నిర్వహించినందున ఆ సమయం కాంపన్సేట్ చేశారని అంటున్నారు. విదేశీ వైద్యవిద్యార్థులు కొందరు ఆ దేశాల వైద్య కళాశాలల నుంచి కాంపన్సేట్ సర్టిఫికెట్లు తీసుకువచ్చినా, వాటిపై ఏపీ మెడికల్ కౌన్సిల్ వివిధ రకాల అభ్యంతరాలను వ్యక్తంచేస్తూ ఆమోదించడం లేదు. విదేశీ వైద్య విద్యార్థుల సమస్యను వెంటనే పరిష్కరించి విలువైన సమయాన్ని కాపాడాలని ఇప్పటికే ఐఎంఏ, ప్రైవేట్ నర్సింగ్ హోమ్ అసోసియేషన్ (అప్నా) రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి.

కరోనా కారణంగా విదేశీ వైద్య కళాశాలలో కొందరు ఆన్‌లైన్ విధానంలో ఫైనల్ ఇయర్, ఇంటర్న్‌షిప్ కూడా పూర్తి చేశారు. పాసైన వారికి ఆ కళాశాలలు డిగ్రీ సర్టిఫికెట్స్ ఇచ్చాయి. అలా ఆన్‌లైన్ విధానం ద్వారా చేసిన వారికి మన దేశంలో కరోనా సమయంలో రెండు సంవత్సరాలు మళ్లీ క్లర్క్‌షిప్, తర్వాత ఒక సంవత్సరం ఇంటర్న్‌షిప్ అంటే అప్పటికే ఆరున్నర ఏళ్లు చదివిన విద్యార్థులు మరో రెండు లేదా మూడేళ్లు చదవాల్సి వస్తే 8 నుంచి 9 ఏళ్ల టైం పడుతుందని వారిలో ఆందోళన వ్యక్తం అవుతోంది. క్లర్క్‌షిప్ చేసే విదేశీ వైద్య విద్యార్థుల నుంచి నెలకు 5 వేలు లేదా ఆ లోపు ఫీజులు కూడా కళాశాలలు తీసుకోవచ్చు అని ఎన్ఎంసీ ఆదేశాలలో పేర్కొంది. 'మూలిగే నక్క మీద తాటిపండు పడింది' అన్న చందంగా అసలే వారు ఆర్థిక సంక్షోభంలో ఉంటే మళ్లీ ఈ ఫీజులు ఏమిటని ఆవేదన వ్యక్తం అవుతోంది. వీరి పరిస్థితి ఇలా ఉంటే... ఇంకా ఎఫ్ఎంజీ పరీక్ష పాస్ కాని 80 నుంచి 85శాతం విద్యార్థుల పరిస్థితి ఏమిటని... అటు విద్యార్థులు, ఇటు తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇక బ్యాంకుల్లో విద్యా రుణాలు తీసుకున్న వారిని రీపేమెంట్ చేయమని బ్యాంకులు వేధిస్తున్నాయి. ప్రైవేట్‌గా అధిక వడ్డీకి తెచ్చి ఫీజులు కట్టిన వారి పరిస్థితి మరింత దయనీయంగా మారింది. ఈ నేపథ్యంలో ఎటూ పాలుపోని స్థితిలో ఆ విద్యార్థులు ధర్నాకు దిగారు. వారి ఆందోళనను, భవిష్యత్తును, ఆర్థిక, మానసిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించవలసిన అవసరం ఉంది. ఏపీఎంసీ కమిటీ తీసుకున్న నిర్ణయాలు ఎన్ఎంసీకి ఆమోదం కోసం పంపితే స్పందన కరువైంది. ఈ సమస్యకు పరిష్కారం ఎప్పుడో అర్థం కావడం లేదు.

అసంపూర్తి క్లినికల్ ట్రైనింగ్ పేరుతో ఒకటి, రెండు సంవత్సరాలు క్లర్క్‌షిప్ చేయమనడం ఎంత వరకు సమంజసమో ఆలోచించాలి. అంతేగాక విదేశీ వైద్య విద్యార్థులు ఎఫ్ఎంజీ లాంటి కఠినమైన పరీక్ష పాస్ అయి వస్తున్నారు. వారందరికీ మన దేశంలో ఒక సంవత్సరం తప్పనిసరిగా ఇంటర్న్‌షిప్ చేయమనడం సమంజసం. ఎందుకంటే అక్కడ ఉండే వ్యాధులు, విధానాలు, ఇక్కడ వాటికి కొంచెం భిన్నంగా ఉంటాయి. అదేవిధంగా మన దేశ విద్యార్థులతో పాటు వారికి కూడా అదే స్థాయిలో స్టైఫండ్ చెల్లించడం సమంజసం. కొన్ని రాష్ట్రాలు స్టైఫండ్ ఇస్తున్నాయి. ఏదేమైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సత్వరమే స్పందించి విదేశీ వైద్య విద్యార్థుల సేవల్ని సత్వరమే ఉపయోగించుకునే విధంగా నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది.

■ డాక్టర్ టి. సేవకుమార్
వ్యవస్థాపకులు, సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్





కూరగాయలు తరుగుతూ నిరసన తెలియజేస్తున్న కార్మికులు



అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి లోకేశ్

ఆగస్టులో 2 వేల మందికి ఇళ్ల పట్టాలు

- ఇల్లు లేని పేదలకు టిడ్కో ఇళ్లకు ప్రణాళిక
- మహానాడులో రిటైనింగ్ వాల్, పార్కు నిర్మాణం
- మంగళగిరి నియోజకవర్గ అభివృద్ధిపై మంత్రి లోకేశ్ సమీక్ష

మంగళగిరి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఎంతో కాలంగా ప్రభుత్వ భూముల్లో నివాసం ఉంటున్న మరో 2వేల మంది పేదలకు శాశ్వత ఇళ్ల పట్టాలను ఆగస్టులో అందించేందుకు ఏర్పాట్లు చేయాలని మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి పనులకు సంబంధించి మంత్రి లోకేశ్ బుధవారం ఉండవల్లిలోని తన నివాసంలో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో 3వేల మందికి సుమారు రూ.వెయ్యికోట్ల వి లువైన ఇళ్లపట్టాలు అందజేశామన్నా రు. సొంత ఇల్లులేని పేదలకోసం కొత్తగా టిడ్కో గృహ సముదాయాల నిర్మాణం కోసం స్థల సేకరణకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఎంటీఎంసీ పరిధిలో సమీకృత అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, వాటర్, గ్యాస్, పవర్ ప్రాజెక్టును వీలైనంత త్వరగా ప్రారంభించాలన్నారు. 31 కమ్యూనిటీ హాళ్లు, 26 పార్కులు, శ్మశానవాటికల నిర్మాణపనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వరద నివారణకు మహానాడుకాలనీ రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులతోపాటే సుందరమైన పార్కును కూడా అభివృద్ధి చేయాలన్నారు నిడమర్రు మోడల్ పునర్నిర్మాణ పనులను సెప్టెంబరులోగా పూర్తి చేయాలన్నారు. మంగళగిరి లక్ష్మీనృసింహస్వామి దేవాలయ బృహత్ ప్రణాళికలు వేగవంతంగా పూర్తిచేసి త్వరలో పనులను ప్రారంభించాలన్నారు. మంగళగిరిలో స్మార్ట్ స్ట్రీట్ బజార్, నిడమర్రు రోడ్డులో 350 షాపులతో అధునాతన కూరగాయలు, పూలు, పండ్ల మార్కెట్, తాడేపల్లి పోలకంపాడు వద్ద రూ.2 కోట్లతో చేపల మార్కెట్ నిర్మాణ పనులను త్వరగా ప్రారంభించాలన్నారు. ఎకో పార్కును ఎడ్వంచర్ పార్కుగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. జెమ్స్ అండ్ జ్యువెలరీ పార్కు, చెరువుల అభివృద్ధిపై అధికారులతో లోకేశ్ చర్చించారు. ఈ సమావేశంలో ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా, ఎస్ఈ శ్రీనివాసరావు, డిప్యూటీ సిటీ ప్లానర్ అశోక్, డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్, ఎండోమెంట్స్ కమిషనర్ రామచంద్ర మోహన్ తదితరులు పాల్గొన్నారు.



తాగునీటి కోసం క్యూలు

- బిందెలతో ట్యాంకర్ల వద్ద బారులు
- నాలుగో రోజుకు చేరిన కార్మికుల ఆందోళన



తాగునీటి కోసం బారులు తీరిన ప్రజలు



గుంటూరు కార్పొరేషన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు రాష్ట్ర వ్యాప్త నిరవధిక సమ్మెతో నగరంలో బుధవారం కూడా తాగునీటి ఎద్దడి నెలకొంది. వరుసగా నాలుగు రోజుల నుంచి నీటి సరఫరా జరగక ప్రజలు అల్లాడిపోయారు. ఆయా ప్రాంతాల్లోని ప్రజలు బిందెలు, క్యాన్లతో ట్యాంకర్ల వద్ద, రిజర్వాయర్ల వద్ద బారులు తీరారు. ఉండవల్లి, మంగళగిరి, తక్కెళ్ళపాడు హెడ్‌వాటర్ వర్క్స్ కార్మికుల సమ్మెతో నగరంలో తాగునీటి సరఫరా అందకుండా పోయింది. స్తంభాలగరువు, ఏటిఅగ్రహారం, హనుమయ్యనగర్, కోర్టు కాంపౌండ్, హెచ్ఎల్ఆర్, ఎల్ఎల్ఆర్, శారదాకాలనీ, నెహ్రూనగర్ రిజర్వాయర్లకు నీటి సరఫరా కాలేదు. దీంతో నగరంలోని 80శాతం ప్రజలకు తాగునీటి సరఫరా నిలిచిపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మేయర్ కోవెలముడి రవీంద్ర మంగళవారం స్వయంగా కార్మిక నాయకులతో చర్చించినా పదిమంది మాత్రమే విధులకు హాజరయ్యారు. మిగిలిన 65మంది కార్మికులు సమ్మెలో ఉండటంతో బుధవారం నీటిసరఫరాలో జరగలేదు.

నేటి నుంచి యథావిధిగా సరఫరా

నగరంలో గురువారం ఉదయం నుంచి యథావిధిగా తాగునీటి సరఫరా జరుగుతుందని ఇన్‌చార్జి కమిషనర్ చల్లా ఓబులేసు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉండవల్లి నుంచి నీటి సరఫరా మార్గంలో నులకపేట దగ్గర గండి పడిందని, అదేవిధంగా పంపింగ్ కేంద్రాల్లోని కార్మికుల సమ్మెతో నీటి సరఫరాలో సమస్యలు ఏర్పడ్డాయన్నారు. నగరపాలక సంస్థ కాల్ సెంటర్, రిజర్వాయర్ల పరిధిలో ప్రజల అవసరాల మేరకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేశామని తెలిపారు. నులకపేట వద్ద గండిని పూర్తిస్థాయిలో పూడ్చి వేశామని, అలాగే సమ్మెలో ఉన్న వారిలో 27 మంది బుధవారం నుంచి విధుల్లో చేరారన్నారు. ఈ పరిస్థితుల్లో బుధవారం మధ్యాహ్నం నుంచి ఉండవల్లి, సంగం జాగర్లమూడి నుంచి నీటి పంపింగ్ జరిగిందన్నారు. దీంతో గురువారం ఉదయం నుంచి సరఫరా జరుగుతుందన్నారు. ప్రకాశం బ్యారేజ్‌కి గోదావరి నీరు పట్టిసీమ నుంచి వస్తున్న నీటిలో టర్బిటి శాతం(బురద) ఉన్నందున ప్రజలు నీటిని కొన్ని రోజులు కాచి చల్లార్చుకొని తాగాలని కోరారు.



ట్యాంకర్ వద్ద నీళ్లు పట్టుకుంటున్న మహిళలు

కార్మికుల వంటావార్పు

నిరవధిక సమ్మెలో భాగంగా మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు బుధవారం 4వ రోజు వినూత్నంగా వంటావార్పు నిర్వహించి ప్రభుత్వానికి నిరసనను తెలియజేశారు. తక్కెళ్ళపాడు హెడ్ వాటర్ వర్క్స్ వద్ద సమ్మె చేస్తున్న కార్మికులకు వివిధ ప్రజా సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ, అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) జిల్లా కార్యదర్శి ఎల్.అరుణ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్‌కుమార్, బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర నాయకులు ఎం.సాంబశివరావు, ఓబీసీ బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు రాము, ఏపీ మెడికల్,సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు షేక్ అబ్దుల్ సలీం, ఫణీంద్ర, జన్నత్ హుస్సేన్, 108 అంబులెన్స్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి బాబు, అపార్ట్మెంట్ వాచ్మెన్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఆది నికల్సన్ తదితరులు మద్దతు తెలిపిన వారిలో ఉన్నారు.

అధికారుల అసత్య ప్రకటనలు

ప్రజల తాగునీటి కష్టాల ఒత్తిడి నేపథ్యంలో అధికారులు తప్పుడు ప్రకటనలు ఇస్తున్నారని మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు తెలిపారు. హెడ్‌వాటర్ వర్క్స్ కార్మికులు నిరవధికసమ్మెలో ఉన్నారన్నారు. సమస్యలను పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదన్నారు.



మూతబడిలు

- ఉపాధ్యాయులు లేని పాఠశాలలు 120
- 25 పాఠశాలల్లో తలుపులు తీస్తున్న ఆయాలు
- క్లస్టర్లలో ఖాళీగా 200 మందికి పైగా ఉపాధ్యాయులు
- ఉపాధ్యాయుల కొరతపై విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆందోళన

గుంటూరు(విద్య), జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీలు జరిగాయి.. ఇక పాఠశాలల్లో కొరత ఉండదు.. విద్యార్థులకు ఇబ్బందులు తప్పినట్లే.. అని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయ సంఘాలు భావించాయి. అయితే ఇందుకు పూర్తి విరుద్ధంగా ప్రస్తుతం గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని పాఠశాలల్లో పరిస్థితి నెలకొంది. అనేక పాఠశాలలు ఉపాధ్యాయులు లేక మూతపడుతున్నాయి. మరికొన్ని పాఠశాలల్లో తలుపులు ఆయాలే తీయాల్సి వస్తోంది. విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు అవుతున్నా.. బదిలీలు పూర్తి అయి నెల గడిచినా ఇంకా అనేక పాఠశాలల్లో ఉపాధ్యాయ నియామకాల్లో గందరగోళ పరిస్థితులే ఉన్నాయి. ప్రధానంగా పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని మారుమూల గ్రామాల్లోని పాఠశాలల్లో అయితే పరిస్థితి దారుణంగా మారింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 120కి పైగా పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత నెలకొంది. కొంతమంది ఉపాధ్యాయులు బదిలీల్లో వ్యూహాత్మకంగా క్లస్టర్లను కోరుకుని దూర ప్రాంతాల్లోని పాఠశాలలకు బదిలీపై వెళ్లకుండా తప్పించుకున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయం తెలిసి కూడా విద్యాశాఖ అధికారులు పట్టీపట్టనట్లుగా ఉన్నారని అందువల్లే పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేక మూతపడే పరిస్థితి వచ్చిందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఇటీవల దాదాపు 5,000 మందికి పైగా ఉపాధ్యాయులకు బదిలీలు జరిగినా ఇంకా అనేక పాఠశాలల్లో పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులు లేరు. దీనినిబట్టి ఉపాధ్యాయ బదిలీలు ఏవిధంగా జరిగాయో తెలుసుకోవచ్చు. ప్రస్తుతం ఉపాధ్యాయులు లేక పాఠశాలలు నిర్వహించలేని పరిస్థితి నెలకొంది. ప్రధానంగా వెల్దుర్తి, బెల్లంకొండ, పిడుగురాళ్ల తదితర మండలాల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉన్నట్లు సమాచారం. బదిలీల సందర్భంగా ఇతర ప్రాంతంలోని పాఠశాలకు వెళ్లిన వారు అక్కడ విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు ఉంటే మిగిలిన వారు పాత స్థానాలకు రావాలి. అయితే అనేకమంది ఉపాధ్యాయులు పాత స్థానాలకు (మిగతా 6వ పేజీలో...)



ప్రజాదర్బార్‌లో దివ్యాంగుల నుంచి వినతిపత్రం స్వీకరిస్తున్న మంత్రి లోకేశ్

వినతుల స్వీకరణ.. పరిష్కానికి హామీ

- 67వ రోజు మంత్రి లోకేశ్ ప్రజాదర్బార్

8

బాలల భవిష్యత్తుకు.. బంగారు బాట

- అంగన్ వాడీలకు ఆధార్ శిల పుస్తకాలు పంపిణీ



వసతి.. వారెవ్వా

- కుక్కల కోసం ఏసీ హాస్టళ్లు

6


కృష్ణానదిలో 1.14 కోట్ల క్యూబిక్ మీటర్ల ఇసుక దిబ్బలు

మిర్చియార్డు పాలకవర్గం.. ఎప్పుడో?

- కొలిక్కిరాని కూర్పు.. నేతల్లో నిరుత్సాహం
- కమిటీ నియామకంలో 13 నెలలుగా జాప్యం

గుంటూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఆసియా ఖండంలోనే అతి పెద్దది.. రాష్ట్రంలోనే పెద్దమొత్తంలో స్థిరాస్తులు, వార్షిక ఆదాయం.. గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ(మిర్చియార్డు) కలిగి ఉన్నది. అయితే ఇంతటి ప్రాధాన్యం ఉన్న మిర్చియార్డుకు పాలకవర్గాన్ని నియమించడంలో ప్రభుత్వం జాప్యం చేస్తున్నది. ఇప్పటికే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 13 నెలలు గడిచిపోయింది. అయినా మిర్చియార్డు విషయంలో ఒక నిర్ణయానికి రాలేకపోతున్నది. సాధారణంగా మార్కెట్ కమిటీ పదవీకాలం ఏడాదిగా నిర్ణయించారు. కమి.టీలో ఛైర్మన్, వైస్‌ఛైర్మన్‌తో పాటు పది మంది సభ్యులకు చోటు కల్పించొచ్చు. ఐదేళ్ల పాటు పాలకవర్గాలను నియమిస్తే 50 మంది పార్టీ కార్యకర్తలకు పదవులు ఇవ్వొచ్చు. అలాంటిది ఇప్పటికే ఏడాది ముగిసిపోయిన దృష్ట్యా ఇప్పటి నుంచి వరుసగా నియమిస్తే 40 మందికే పదవులు ఇచ్చి గౌరవించొచ్చు. ఇంకాస్త ఆలస్యం చేస్తే ఈ సంఖ్య కూడా తగ్గిపోయే అవకాశం ఉన్నది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో నామినేటెడ్ పదవుల్లో గుంటూరు మిర్చియార్డు ఛైర్మన్ పదవికి ఎంతో డిమాండ్ ఉన్నది. ఇందుకు కారణం ఈ మార్కెట్ కమిటీకి దేశ, విదేశాల్లో పేరు, ప్రఖ్యాతలు గడించడమే. ఏటా రాష్ట్రంలోని మిర్చి పండించే జిల్లాల నుంచే కాకుండా తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి కూడా రైతులు ఇక్కడ మిర్చిని విక్రయించడానికి వస్తుంటారు. అలానే పత్తి సీజన్‌లోనూ సీసీఐ ద్వారా కొనుగోళ్లు జరుగుతుంటాయి. ఈ విధంగా యార్డుకు మార్కెట్ ఫీజు రూపంలో రూ.100 కోట్లకు పైగా ఆదాయం ఏటా సమకూరుతుంది. ఆ నిధులతో పలు (మిగతా 6వ పేజీలో...)





పదే పదే.. అంతరాయాలు

- ఎండ తీవ్రతతో గణనీయంగా పెరిగిన విద్యుత్ వినియోగం
- పగలూ, రాత్రి తేడా లేకుండా కరెంటు కట్
- మరి కొన్ని ప్రాంతాల్లో వోల్టేజ్ సమస్యలు
- నీటి ఎద్దడితో పెరిగిన మోటార్ల వినియోగం

గుంటూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): గుంటూరు పట్టణంలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు నానాటికి పెరుగుతోన్నాయి. పగలూ, రాత్రి తేడా లేకుండా విద్యుత్ సరఫరాలో వస్తోన్న అంతరాయాలతో ప్రజలకు ప్రత్యక్ష నరకాన్ని చవిచూస్తున్నారు. మరో వైపు అనేక ప్రాంతల్లో విద్యుత్ సరఫరాలో లో ఓల్టేజ్ సమస్య కూడా ఉత్పన్నమవుతోంది. సెక్షన్ స్థాయిలో అధికారుల అలసత్వం..సిబ్బంది నిర్లక్ష్యం వెరసి విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తగ్గటం ఏమో కానీ మరింత పెరుగుతోన్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. జూలై వచ్చినా ఎండ తీవ్రత రోజురోజుకు పెరుగుతుండటంతో అదే స్థాయిలో నగరంలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతోంది. మరో వైపు ఐదు రోజులుగా నగరంలో దాదాపు అనేక ప్రాంతాల్లో మంచినీటి ఎద్దడి నెలకొన్నది. దాంతో తాగునీరు ఎప్పుడు వస్తుందో తెలియక ప్రజలు వాటర్ మోటార్‌లను గంటకో సారి ఆన్ చేస్తుండటం కూడా విద్యుత్ వినియోగం పెరిగింది. ఫలితంగా నగరంలో బొంగరాలబీడు, కాకుమానువారితోట, పాతగుంటూరు, (మిగతా 6వ పేజీలో...)

సాయంత్రంలోపే.. సర్దేస్తున్నారు

- నాలుగు గంటలకే ఖాళీ అవుతున్న అర్బన్ హెల్త్ సెంటర్లు
- పర్యవేక్షణ లేక సిబ్బంది ఇష్టారాజ్యం..

గుంటూరు పట్టణంలో అర్బన్ హెల్త్ సెంటర్లలో సాయంత్రం వైద్యసేవలకు సిబ్బంది డుమ్మా కొడుతున్నారు... నగరంలోని అనేక అర్బన్ హెల్త్ సెంటర్లలో గత కొన్ని రోజులుగా సాయంత్రం వైద్యం అందడం లేదని నగర ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు సిబ్బంది కూడా సాయంత్రం నాలుగు గంటలకే దుకాణాలు బంద్ చేసి వెళ్ళిపోతున్నారు.



కేవీపీ కాలనీలోని అర్బన్ హెల్త్ సెంటర్

గుంటూరు (విద్య) జూలై 16 (ఆంధ్రజ్యోతి): నగరంలో పేద ప్రజలు ఉండే కాలనీలకు సమీపంలో ఆయుష్మాన్ భారత్, రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో అర్బన్ హెల్త్ సెంటర్లను ఏర్పాటు చేశారు. కెవిపి కాలనీ ,ఎన్జీవో కాలనీ, శ్రీనివాసరావుపేట, నగరంలో లాంచెస్టర్ రోడ్, శారద కాలనీ, కృష్ణ నగర్, భారత్ పేట ఇలా నగరంలో శివారు ప్రాంతాల్లో అర్బన్ హెల్త్ సెంటర్స్ ఉన్నాయి. ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు వైద్య సేవలు అందించాలి. ప్రతి అర్బన్ హెల్త్ సెంటర్లో నిష్ణాతులైన వైద్యుడు, ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్ట్, నర్సులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఏఎన్ఎం తదితర సిబ్బంది విధులు నిర్వహిస్తారు. అత్యవసర పరిస్థితుల్లో పెద్ద ఆసుపత్రులకు సిఫార్సు చేయాలి. అయితే ఈ ఆస్పత్రులపై పర్యవేక్షణ లోపం కారణంగా కొన్నిచోట్ల సిబ్బంది సక్రమంగా పనిచేయడం లేదు. ప్రధానంగా ఉదయం పూట ఓపీలు చూసి సాయంత్రం విధులకు డుమ్మా కొడుతున్నారు. అదేమని ప్రశ్నిస్తే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సమావేశాలు ఉన్నాయని ,ఆడిట్ పనులు సర్వేలు ఉన్నాయంటూ సిబ్బంది చెబుతున్నారు. వైద్యం అందించాల్సిన సమయంలో ఇతర పనులు ఏమిటి అని ప్రశ్నిస్తే వారి వద్ద సమాధానం ఉండటం లేదు. కూలినాలీ చేసుకుని సాయంత్రం వైద్యం కోసం వచ్చిన పేదలు ఉసూరుమంటూ వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది .

స్థానిక కేవీపీ కాలనీలో బుధవారం మధ్యాహ్నం నుంచి ఓపి సేవలు నిలిచిపోయాయి. ఇక్కడ పనిచేసే వైద్యులు సమావేశం ఉందంటూ సాయంత్రం విధులకు రాలేదు. మరోవైపు ల్యాబ్ టెక్నీషియన్ కూడా ఆడిట్ పనుల పేరుతో మధ్యాహ్నం వెళ్ళిపోయి సాయంత్రం నాలుగు గంటల తర్వాత వచ్చారు .దీంతో రిపోర్టుల కోసం రోగులు ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. మరోవైపు సాయంత్రం ఏవైనా సమస్యలతో వచ్చిన వారికి ఇక్కడ సిబ్బంది తూతూ మంత్రంగా బిళ్ళలు ఇచ్చి పంపేస్తున్నారు. ఓపి నమోదు చేయాల్సిన సిబ్బంది కూడా నాలుగు గంటలకు తర్వాత సెంటర్లో కనిపించడం లేదు. ఎన్జీవో కాలనీలోని అర్బన్ హెల్త్ సెంటర్లో సాయంత్రం నాలుగు గంటలకే సిబ్బంది వెళ్ళి పోతున్నారని ఆరోపణలు ఉన్నాయి. కొన్నిసార్లు వైద్యులు లేరంటూ మధ్యాహ్నం తర్వాత ఓపీలు చూడటం లేదు. ఇక లాంచెస్ రోడ్, శారదా కాలనీ, కృష్ణ నగర్, శ్రీనివాసరావుపేట తదితర ప్రాంతాల్లో కూడా వైద్య సేవలో జాప్యం జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

వైద్యసేవలకు పరిధులా..

అర్బన్ హెల్త్ సెంటర్లలో వైద్య సేవలకు పరిధులు విధిస్తున్నారు. కొన్ని సచివాలయాల పరిధిలో ఉన్న ప్రజలకు మాత్రమే వైద్యం అందిస్తామని సిబ్బంది గిరి గీసుకొని కూర్చుంటున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వైద్యం పరీక్షల కోసం వచ్చేవారికి మీరు మా సచివాలయ పరిధిలో లేరంటూ వెనక్కి తిప్పిపంపుతున్నారు. శ్రీనివాసరావుపేటలోని అర్బన్ హెల్త్ సెంటర్లో తరచు ఇటువంటి సమస్యలు తలెత్తుతున్నాయి .ఎన్జీవో కాలనీ కెవిపి కాలనీలో వైద్యులు, సిబ్బందిలేని సమయంలో కొంత మంది ప్రజలు ఇక్కడికి వస్తున్నారు. అయితే ఇక్కడ సిబ్బంది సచివాలయాల పరిధిలో చెప్పి ఓపీలు రాయకుండా ప్రజలని ఇబ్బంది పెడుతున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి. ఇప్పటికైనా అర్బన్ హెల్త్ సెంటర్స్ పై పరిరక్షణ లేకపోతే పేద ప్రజలకు వైద్యం గగనమవుతుంది.



మధ్యాహ్నం మూడు గంటలకు ఖాళీగా ఉన్న డాక్టర్ గది



ఖాళీగా ఉన్న ల్యాబ్ టెక్నీషియన్ గది



ఓపీలు నమోదు వద్ద కనిపించని సిబ్బంది

రూ.1.19 కోట్ల పురుగు మందుల.. అమ్మకాలు నిలిపివేత

- మూడో రోజూ కొనసాగిన విజిలెన్స్ తనిఖీలు

గుంటూరు సిటీ, జూలై 16(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరం తో పాటు, జిల్లా లోని తాడేపల్లి, తాడికొండ, మంగళగిరి మండలాల్లో విజిలెన్స్ ఎన్ఫోర్సుమెంట్ అధికారులు మూడో రోజూ విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల తయారీ సంస్థ లు, షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. బుధవారం జరిగిన తనిఖీలలో 17 షాపులకు చెందిన రూ.1.19 కోట్ల విలువ చేసే 13121 లీటర్ల పురుగు మందుల అమ్మకాలు నిలిపి వేయాలని ఆదేశాలు ఇచ్చినట్లు జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు వెల్లడించారు. 5 ఎరువుల దుకాణాలలో రూ. 42.93 లక్షల విలువైన ఎనిమిది టన్నుల ఎరువులను, రూ.3.31 లక్షల విలువైన 77 మెట్రిక్ టన్నుల విత్తనాల అమ్మకాలను సరైన పత్రములు చూపని కారణంగా నిలుపుదల చేయడమైనదని తెలిపారు. ఈ తనిఖీ లలో పశ్చిమ గోదావరి జిల్లా ఏడీఏపీ మురళీ కృష్ణ, క్రిష్ణా జిల్లా ఏడీఏఎం సునీల్, విజిలెన్స్ఎన్ఫోర్స్మెంట్ సీఐలు కె. వెంకటేశ్వర్లు, సిహెచ్. రవిబాబు, ఏఓ సునీల్ కుమార్, గుంటూరు రూరల్ వ్యవసాయ అధికారి బుల్లా కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.



విత్తనాల దుకాణంలో తనిఖీ నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

బదిలీ ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించేదెప్పుడు

● యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు ఆందోళన



మాట్లాడుతున్న ఎన్ వెంకటేశ్వర్లు

గుంటూరు(విద్య), 16 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ బదిలీలు పూర్తై 45 రోజులు అయినా ఇంకా అనేకమంది ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించలేదని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బుధవారం యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ప్రసంగించారు. బదిలీలు చేసే ముందు ఆర్థికశాఖ అనుమతి తీసుకోవటం, క్యాడర్ స్ట్రెంత్ అప్‌డేట్ బాధ్యత తీసుకోవాల్సిన విద్యాశాఖ పట్టించుకోలేదన్నారు. ఫలితంగా ఉపాధ్యాయులకు జీతాలు అందలేదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రచురణ కమిటీ చైర్మన్ ఎం హనుమంతరావు, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రాజశేఖర్‌రావు, ఎం. కళాధర్, సహాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కోశాధికారి దౌలా, జిల్లా కార్యదర్శులు ఆదినారాయణ, సాంబశివరావు, షకీలా బేగం, టీ ఆంజనేయులు, కే కేదార్‌నాథ్, కే ప్రేమకుమార్ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటేషన్లను ఆన్ డ్యూటీగా పరిగణించాలి

● పంచాయతీరాజ్ అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి


సమావేశంలో మాట్లాడుతున్న కూచిపూడి మోహనరావు

గుంటూరు సిటీ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్‌శాఖ పరిధిలోని లైన్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగుల డిప్యూటేషన్లను ఆన్ డ్యూటీగా పరిగణించాలని ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కూచిపూడి మోహన్‌రావు తెలిపారు. బుధవారం గుంటూరులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు పూర్ణచంద్ర రెడ్డి, గుంటుపల్లి శ్రీనివాస్, శామ్యూల్ పాల్, నిర్మలభారతి, సీహెచ్ శ్రీనివాస్, మల్లేశ్వరరావు, రామకోటయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులను వంచించిన జగన్ : ప్రత్తిపాటి విమర్శ

చిలకలూరిపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఎన్నో హామీలు ఇచ్చి అధికారం పొందిన జగన్ ఒక్కటీ నెరవేర్చకుండా వంచించారని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఒక ప్రకటనలో తెలిపారు. జగన్ తన తప్పు ఒప్పుకుని తక్షణమే రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పోలవరం, వెలిగొండ, గుండ్లకమ్మ, రాళ్లపాడు, సోమశిల, ఎత్తిపోతల పథకాలు ఎందుకు పూర్తిచేయలేదో సమాధానం చెప్పాలన్నారు. నియోజకవర్గంలో కోల్డ్ స్టోరేజ్ నిర్మిస్తానని, రైతులకు పగటిపూట నాణ్యమైన 9 గంటల విద్యుత్ ఇస్తానని చెప్పి, ట్రూఅప్ ఛార్జీల పేరుతో బిల్లుల భారం మోపాడని విమర్శించారు. రూ.4 వేల కోట్లతో ప్రకృతి విపత్తుల సహాయ నిధి, రూ.3 వేల కోట్ల ధరల స్థిరీకరణ నిధి ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. ఏడాదిలో 80 శాతం హామీలు అమలు చేసిన చంద్రబాబును ఏ ముఖం పెట్టుకొని ప్రశ్నిస్తున్నారో సమాధానం చెప్పాలన్నారు.

కృష్ణానదిలో 1.14 కోట్ల క్యూబిక్ మీటర్ల ఇసుక దిబ్బలు

● గుంటూరు వైపున 74.78 లక్షల సీఎంలు
● ఎన్‌టీఆర్ జిల్లా పరిధిలో 39.48 క్యూబిక్ మీటర్లు
● హైడ్రోగ్రాఫిక్ సర్వే ద్వారా గుర్తించిన కేసీ డివిజన్

గుంటూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కృష్ణానదిలో ఇసుక దిబ్బలను గుర్తించేందుకు కృష్ణా రివర్ కన్జర్వేట్ డివిజన్ నిర్వహించిన హైడ్రోగ్రాఫిక్ సర్వేలో ఆశాజనక నివేదిక వచ్చింది. ప్రకాశం బ్యారేజ్ ఎగువన నిర్వహించిన ఈ సర్వే ద్వారా కోటికి పైగా క్యూబిక్ మీటర్ల ఇసుక దిబ్బలున్నట్లు తేలింది. ఈ నివేదికని ఇటీవలే ఆ శాఖ జిల్లా యంత్రాంగానికి నివేదించింది. అందులోనూ గుంటూరు జిల్లా వైపున ఎక్కువ మోతాదులో ఇసుక దిబ్బలు ఉండటం విశేషం. ఆ ఇసుకని బయటకు తీయడం ద్వారా భవిష్యత్తులో ఎలాంటి కొరత లేకుండా చూడొచ్చని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే ఈ విషయాన్ని ప్రభుత్వానికి నివేదించారు. సాధ్యమైనంత త్వరగా ఒక ఏజెన్సీని ఎంపిక చేసి బ్యారేజ్‌లో పేరుకుపోయిన ఇసుక నిల్వలను బయటకు తీయాలని మైనింగ్ అధికారులు కోరారు.

ప్రకాశం బ్యారేజ్‌లో పేరుకుపోయిన ఇసుక, మట్టి దిబ్బలను తొలగించాలన్న ప్రతిపాదన గత కొన్నేళ్లుగా ఉన్నది. అయితే ఇందుకు తగిన అనుమతులు లభించలేదు. దీని వలన నది అడుగు భాగం నుంచి దిబ్బలు పెరుగుతూ పైకి వచ్చి వరదనీటి ప్రవాహ వేగాన్ని మందగించేలా చేస్తున్నాయి. అలానే ప్రవాహ దిశను మారుస్తున్నాయి. గత ఏడాది ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో భారీ వర్షాలు కురిసి కృష్ణానదికి 15 రోజులకు పైగా వరద ప్రవాహం పోటెత్తింది. అప్పట్లో గరిష్ట నీటి ప్రవాహం నమోదైంది. దాంతో కరకట్టకు ఎక్కడ ప్రమాదం వాటిల్లుతుందోనని అంతా ఆందోళన చెందారు. దీనిని పరిగణనలోకి తీసుకొన్న కేసీ డివిజన్ హైడ్రోగ్రాఫిక్ సర్వే నిర్వహణ చేపడతామని, అందుకు అయ్యే ఖర్చులు భరించాలని గుంటూరు, ఎన్‌టీఆర్ జిల్లాలను కోరింది. అందుకు రెండు జిల్లాలు సమ్మతించడంతో హైడ్రోగ్రాఫిక్ సర్వేని నిర్వహించింది. ఇందుకోసం రూ. 48 లక్షలు ఖర్చు కాగా రూ. 24 లక్షల చొప్పున రెండు జిల్లాలు చెల్లించాయి.

సర్వే నిర్వహించిన బీఎస్‌పీ హైడ్రో డ్రెడ్జింగ్ వర్క్స్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ కోటి 14 లక్షల 26 వేల 836.10 క్యూబిక్ మీటర్ల ఇసుక, మట్టి దిబ్బలు ఉన్నట్లు గుర్తించింది. ఇందులో గుంటూరు జిల్లా వైపున 74 లక్షల 78 వేల 627.30 క్యూబిక్‌మీటర్లు, ఎన్‌టీఆర్ జిల్లా వైపున 39 లక్షల 48 వేల 208.80 క్యూబిక్ మీటర్ల ఇసుక నిల్వలున్నట్లు నివేదించింది. ఈ సర్వేని అత్యంత శాస్త్రీయంగా నిర్వహించారు. పడవలను ఉపయోగించి ఎకో సౌండింగ్ ద్వారా నిర్వహించి ఇసుక నిల్వలను అంచనా వేశారు. అమరావతి రాజధాని అవసరాలకు ఇసుక భారీ మోతాదులో అవసరం ఉన్న దృష్ట్యా నదిలో ఉన్న ఇసుకని తీసేందుకు ప్రభుత్వం ఒక ఏజెన్సీని ఎంపిక చేసేందుకు చర్యలు చేపట్టింది.


హైడ్రోగ్రాఫిక్ సర్వే నిర్వహించే విధానం

ఎంఎస్ఎంఈల సమస్యలు పరిష్కరించాలి

కార్పొరేషన్ చైర్మన్‌కు రాష్ట్ర లఘు ఉద్యోగ భారతి కమిటీ విజ్ఞప్తి

గుంటూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి) రాష్ట్రంలో ఎంఎస్ఎంఈలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకరరావును మంగళగిరిలోని కార్యాలయంలో బుధవారం లఘు ఉద్యోగ భారతి రాష్ట్ర అధ్యక్షుడు తులసి యోగీష్ చంద్ర ఆధ్వర్యంలోని రాష్ట్ర కమిటీ కలిసింది. పారిశ్రామికులకు అధిక విద్యుత్ చార్జీలు, నైపుణ్యం కలిగిన మానవ వనరుల కొరత, ఆర్థిక సహాయం పొందటంలో ఇబ్బందులు, మెమొరాండం ఆఫ్ టైటిల్ డీడ్ (ఎంఓడీటీ) పై అధికంగా చార్జీలు ఉన్నాయని తెలిపారు. ఈ మేరకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ కోశాధికారి ధరణీష్, ఉపాధ్యక్షులు కమల్ నయన్ భాంగ్, సంయుక్త ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యేశ్వరరావు, కార్యదర్శి తోట రామకృష్ణ, ఈసీ సభ్యులు విఠల్ ప్రసాద్ ఉన్నారు.

ఈ సమావేశంలో రాష్ట్రంలోని ఎంఎస్ఎంఈలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను వివరిస్తూ కమిటీ ఒక వినతిపత్రాన్ని సమర్పించింది. ఈ సందర్భంగా చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకరరావు నూతన రాష్ట్ర కమిటీకి అభినందనలు తెలుపుతూ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన తులసి యోగీష్ చంద్రకు శుభాకాంక్షలు తెలిపారు.


ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ శివశంకరరావుకు వినతిపత్రం అందజేస్తున్న లఘు ఉద్యోగ భారతీ నాయకులు

మూతబడిలు

(5వ పేజీ తరువాయి)

రాకపోవడంతో కొరత నెలకొందని సంఘాల నాయకులు తెలిపారు. పల్నాడు జిల్లాలోని 25 పాఠశాలల్లో ఆయాలే తలుపులు తీస్తూ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. ఇటీవల ఉపాధ్యాయుల కొరతపై పల్నాడు జిల్లాలోని ఓ ఎంఈవో విద్యాశాఖ అధికారుల దృష్టికి సమస్య తీసుకెళ్లారు. వెల్దుర్తి, బొల్లాపల్లి తదితర ప్రాంతాల్లో ఉపాధ్యాయులు లేక పాఠశాలలు మూతపడే పరిస్థితి ఉందని అధికారులకు తెలియజేశారు. దీంతో వెంటనే కొంతమంది ఉపాధ్యాయులను కొన్ని పాఠశాలల్లో అధికారులు సర్దుబాటు చేశారు.

వలంటీర్లను నియమించినా..

మూడు జిల్లాల పరిధిలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేక మూతపడే పరిస్థితులు నెలకొనడంతో కొన్ని ప్రాంతాల్లో వలంటీర్లతో సరిపెడుతున్నారు. ఇందుకు స్థానికంగా ఉన్న స్వచ్ఛంద సంస్థలు సహకరిస్తున్నాయి. స్వచ్ఛంద సంస్థలు సహకారంతో విద్యా వలంటీర్లను నియమించిన అత్యధిక పాఠశాలల్లో ఇంకా ఉపాధ్యాయుల కొరత నెలకొని ఉంది. వెల్దుర్తి మండల పరిధిలోని పాఠశాలల్లో అసిస్ట్ అనే సంస్థ 16 మంది విద్యా వలంటీర్లను నియమించిందని వెల్దుర్తి ఇన్చార్జి ఎంఈవో ఖాసిం తెలిపారు. వారికి నెలకు రూ.8000 చెల్లించేందుకు ఆ సంస్థ సుముఖత వ్యక్తం చేసినట్లు చెప్పారు.

క్లస్టర్లలో ఖాళీగా ఉపాధ్యాయులు

బదిలీల సందర్భంగా కొంతమంది ఉపాధ్యాయులు సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందని క్లస్టర్ పరిధిలో ఖాళీలను కోరుకుని అతి తెలివి ప్రదర్శించినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేక ఇబ్బందులు పడాల్సి ఉండగా క్లస్టర్ పరిధిలో ఉన్న ఉపాధ్యాయులు ఖాళీగా ఉంటూ కాలక్షేపం చేస్తున్న పరిస్థితి నెలకొంది. ఉదాహరణకు ఒక క్లస్టర్ పరిధిలో పదిమంది ఉపాధ్యాయులు ఉంటే ఆ క్లస్టర్లో పరిధిలోని పాఠశాలల్లో ఎవరైనా సెలవు పెడితే అక్కడికి వెళ్లి పాఠాలు బోధించాలి. అయితే దాదాపు 200 మందికి పైగా ఉపాధ్యాయులు క్లస్టర్లలో ఖాళీగా ఉంటూ కాలం వెళ్లదీస్తున్నట్లు రికార్డులు వెల్లడిస్తున్నాయి. గుంటూరు నగరం నుంచి మంగళగిరి మున్సిపల్ కార్పొరేషన్‌కు దాదాపు 30 మంది ఉపాధ్యాయులు బదిలీ అయ్యారు. ఇందులో పదిమంది క్లస్టర్ ఉపాధ్యాయులు ఉన్నారు. బదిలీ అయిన క్లస్టర్ ఉపాధ్యాయుల్లో ఇద్దరు మాత్రమే విధుల్లో చేరగా ఎనిమిది మంది విధుల్లో చేరలేదు. సాక్షాత్తు విద్యా మంత్రి లోకేశ్ ప్రాతినిధ్యం వహించే మంగళగిరి మున్సిపల్ కార్పొరేషన్‌లోనే ఇలా ఉందంటే మిగిలిన చోట్ల పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

పదే పదే.. అంతరాయాలు

(5వ పేజీ తరువాయి)

గుంటూరువారితోట, శ్రీనివాసరావుపేట, నల్లపాడు రోడ్డులోని శ్రీ లక్ష్మీనగర్, బుచ్చయ్యతోట, నెహ్రూనగర్, అమరావతి రోడ్డు, సంపత్‌నగర్ పక్కనున్న పార్వతీపురం వంటి ప్రాంతాల్లో తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయాలు నెలకొంటున్నాయన్న ఫిర్యాదులు వస్తున్నాయి. కాకుమానువారితోటలో ప్రాంతంలో మంగళవారం రాత్రి విద్యుత్ సరఫరా అంతరాయం కలిగి అర్ధరాత్రి దాటాక మూడు గంటలకు సరఫరా పునరుద్ధరించారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. నల్లపాడు రోడ్డులోని శ్రీ లక్ష్మీనగర్‌లోనూ మంగళవారం అర్ధరాత్రి గంట పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం నెలకొన్నది. మూడు వారాల కిందట బుచ్చయ్యతోట ఒకటో లైనులో ట్రాన్స్‌ఫార్మర్ పేలి విద్యుత్ సరఫరా నిలిచి రెండు గంటల పాటు ప్రజలు అల్లాడిపోయారు. ఆ తరువాత కూడా ఆ ప్రాంతంలో లో వోల్టేజ్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఫలితంగా ఎలక్ట్రానిక్ గృహోపకరణాలు దెబ్బతింటాయని కాలనీ వాసులు వాపోతున్నారు.

కాలి పోతున్న ఫ్యూజ్‌లు...పేలుతోన్న ట్రాన్స్‌ఫార్మర్‌లు...

రోజురోజుకు మండుతోన్న ఎండలతో నగరంలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతోంది. ఫలితంగా అనేక ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఫ్యూజ్‌లు కాలిపోతున్నాయి. ముఖ్యంగా రాత్రులు వినియోగం పెరగటంతో అత్యధికంగా ఫ్యూజ్‌లు కాలిపోవటం, ట్రాన్స్‌ఫార్మర్లు పేలటం వంటి సంఘటనలు జరుగుతోన్నాయి.సెక్షన్ స్థాయిలో అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవటంతోనే సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వినియోగానికి అనుగుణంగా ఆయా ప్రాంతాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాల్సిన అధికారులు విఫలమవుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. మరో వైపు ట్రాన్స్‌ఫార్మర్స్ మరమ్మతులకు అవసరమయ్యే సామాగ్రి అందుబాటులో ఉండటం లేదు.

మిర్చియార్డు పాలకవర్గం.. ఎప్పుడో?

(5వ పేజీ తరువాయి)

అభివృద్ధి పనులు, రైతులకు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసేందుకు అవకాశం ఉన్నది. ఇక మిర్చి టర్నోవర్ అయితే ఏకంగా రూ.15 వేల కోట్లకు పైగా జరుగుతుంది.

గతంలోనూ ఇలానే నాన్చుడు

2014-19 మధ్య టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు కూడా మిర్చియార్డు పాలకవర్గాన్ని వెంటనే నియమించలేదు. పార్టీ అధికారంలోకి వచ్చిన ఇంచుమించు రెండేళ్ల తర్వాత కమిటీని ఏర్పాటు చేసింది. ఆ విధంగా రెండో విడత కమిటీని నియమించే సరికి 2019 ఎన్నికల వాతావరణం వచ్చేసింది. దాంతో రెండో విడతలో పదవులు పొందిన నాయకులు పట్టుమని పది నెలలైనా పాలకవర్గంలో లేకపోవడంతో తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. కమిటీని నియమించడానికి ఎలాంటి కోర్టు అడ్డంకులు లేవు. పార్టీలో ఏకాభిప్రాయం మాత్రమే కుదరాలి. ప్రభుత్వంలో టీడీపీతో జనసేన, బీజేపీ కూడా భాగస్వామ్యమై ఉన్నందున దామాషా ప్రకారం ఆ పార్టీలకు చెందిన నాయకులకు కూడా ఒకటి రెండు పదవులు కమిటీలో ఇస్తే సరిపోతుంది. పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి కావడంతో ఆశావహులు తీవ్ర నిరాశ, నిస్పృహలకు లోనౌతున్నారు. ఈ విషయాన్ని పార్టీ జిల్లా నాయకత్వం రాష్ట్ర నేతల దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత త్వరగా పాలకవర్గం నియమిస్తే కొంతమందికి పదవులు ఇచ్చి న్యాయం చేసినట్లు అవుతుంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.15 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	101, 109, 120
చికెన్ విత్ స్కిన్(కిలో)	194.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	204.00

పోలీస్ విచారణకు హాజరైన

గుంటూరు మాజీ మేయర్ కావటి

యడ్లపాడు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదానికి సంబంధించి బుధవారం యడ్లపాడు పోలీస్ స్టేషన్‌లో విచారణకు గుంటూరు మాజీ మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు హాజరయ్యారు. మే 9న గుంటూరుకు చెందిన తన్నీరు రాజేష్, కారసాని వెంకటరత్నం(32) ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తూ చెంగిజ్‌ఖాన్‌పేట వద్ద రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన వెంకటరత్నం, గుంటూరులోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. ఈ ఘటనపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తూ మృతుడి తల్లి పద్మావతి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన కుమారుడి మృతిపై ఆమె సీఎం, డిప్యూటీ సీఎం, హోం మంత్రి, డీజీపీలకు కూడా ఫిర్యాదు చేశారు. మరణించిన తన కుమారుడు బతికి ఉన్నప్పుడు కావటి శివనాగ మనోహర్ నాయుడు వద్ద పని చేశాడని, మరణించిన తర్వాత పట్టించుకోవడం లేదని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు, చిలకలూరిపేట రూరల్ సీఐ సుబ్బనాయుడు, యడ్లపాడు పోలీస్‌స్టేషన్‌లో కావటి శివనాగమనోహర్‌నాయుడు, రాజేష్‌లను విచారించారు. మృతుడితో వారికి ఉన్న సంబంధాలు, ఘటన జరిగిన రోజున వారు ఎక్కడ ఉన్నారనే వివరాలతో పాటు ఇతర సంబంధిత సమాచారాన్ని సేకరించారు. నిందితుల నుంచి సేకరించిన వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని రూరల్ సీఐ సుబ్బనాయుడు తెలిపారు

టిడ్కోపై నుంచి పడి వ్యక్తి మృతి



తెనాలి రూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక జగ్గడిగుంటపాలెం టిడ్కో భవనంపై నుంచి తెనాలి సుల్తానాబాద్‌కు చెందిన దాసరిబాలస్వామి(20) అనే వ్యక్తి పడి మృతి చెందిన ఘటన మంగళవారం అర్ధరాత్రి తర్వాత చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ గ్యాస్ కంపెనీలో డెలివ రీ బాయ్‌గా పనిచేసే బాలస్వామి మంగళవారం రాత్రి స్నేహితులను కలిసేందుకు టిడ్కో గృహాల వద్దకు వ చ్చాడు. ఈ క్రమంలోనే టిడ్కో భవనంపై ఉన్న ట్యాం క్‌పై కూర్చుని ప్రమాదవశాత్తు కిందకు పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి వివాహం కాలేదు. మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ వైద్యశాల మార్చురీకి తరలించి, తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఆనంద్ తెలిపారు.

రెండు కార్లు ఢీ.. వ్యక్తి మృతి

తాడికొండ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా వస్తున్న రెండు కార్లు ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన నిడుముక్కలలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మ్యారేజ్‌బ్యూరోలో పనిచేసే నలుగురు మహిళలు కారులో గుంటూరు నుంచి అమరావతి వైపు వెళ్తున్నారు. అదే సమయంలో అమరావతి నుంచి గుంటూరు వైపు వెళ్తున్న కారు నిడుముక్కల దాటిన తర్వాత ఢీకొన్నాయి. గుంటూరు నుంచి వస్తున్న కారు డ్రైవర్ విజయవాడ యనమదలకుదురు గ్రామానికి చెందిన తాడంకి నాగేంద్రబాబు(36) అక్కడికక్కడే మృతి చెందాడు. రెండు కార్లు స్పీడ్ మీద ఉండటంతో మృతుడు నాగేంద్రబాబు కారులో ఇరుక్కుపోయాడు. కారులో నుంచి మృతదేహాన్ని బయటకు తీయటానికి గంటకుపైగా సమయం పట్టింది. అదే కారులో ప్రయాణిస్తున్న సీహెచ్.నవ్య, బీ.లక్ష్మీత్రివేణి, ఎల్.యశోధకృష్ణ, పీ.రజితలకు గాయాలయ్యాయి. 108లో వారిని గుంటూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అమరావతి నుంచి వస్తున్న కారు డ్రైవర్ వివరాలు తెలియరాలేదు.

విధుల నుంచి వార్డెన్ తొలగింపు

కారంపూడి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కారంపూడి మోడల్ స్కూల్ వార్డెన్ సౌరీబాయిని విధుల నుంచి తొలగించినట్లు ఎంఈవో-2 రవికుమార్ తెలిపారు.విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించారని వారి తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు డీఈవో చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

53,535 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 55,232 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 53,535 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 9,175 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9600	10800
334	9500	13000	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	13300	334	9500	12600
273	----	-----	నెంబరు. 5	10000	13500
341	10000	13400	273	---	----
4884	---	----	341	10000	13500
సూపర్ 10	10000	13000	4884	10000	12500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	13800	తేజ	10000	13600
షార్క్-1	10000	12200	బ్యాడిగి	10000	12600
బ్యాడిగి	10000	12300	దేవనూరు డీలక్స్	10000	12500
దేవనూరు డీలక్స్	10000	12400	తాలుకాయలు	4600	7000

ఇచ్చిన ప్రతి హామీ నిలబెట్టుకున్నాం

• తూర్పు ఎమ్మెల్యే నసీర్
• 17వ డివిజన్లో 'సుపరిపాలనలో తొలిఅడుగు'

గుంటూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ప్రతి మాట నిలబెట్టుకుంటున్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆయన నగరంలోని 17వ డివిజన్ చాకలికుంట ప్రాంతంలో పర్యటించారు. గతంలో విద్యుత్, మంచినీటి కనీస సదుపాయాల కోసం ఇబ్బందిపడే ఈ డివిజన్లో ఏడాది కాలంలో మంచినీటి సరఫరా, విద్యుత్, రోడ్ల వంటి సమ స్యలను పరిష్కరించడంతో ఎమ్మెల్యేకు మంచి ఆదరణ లభించింది. పలువురు స్థానికులు ఆయనతోపాటు అడుగులు వేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలను పలకరిస్తూ, వారి సమస్యలను సావధా నంగా ఆలకిస్తూ ముందుకు కదిలారు. ప్రభుత్వ పథకాలు అందని వారి వివరాలు నమోదు చేసుకున్నారు. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్క రిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ రాష్ట్రంలో సువర్ణ పాలన సాగుతోందని, తూర్పు నియోజకవర్గం రూపురేఖలు మార్చేస్తున్నామని తెలిపారు.



'సుపరిపాలనలో తొలిఅడుగు' కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే నసీర్

17వ డివిజన్లో పార్టీ కార్యాలయం ప్రారంభం

17వ డివిజన్ సంబంధించి చాకలికుంట కీర్తి కాటా వద్ద తెలుగుదేశం పార్టీ కార్యా లయాన్ని ఎమ్మెల్యే నసీర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు నిత్యం ప్రభుత్వ సేవలు అందేందుకు పార్టీ నాయకులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఈస్ట్ అబ్జర్వర్ గంజం రాఘవేంద్ర, దాసరి రాజా మాస్టర్, మల్లెంపుడి శ్రీనివాస్, బ్రహ్మ స్వామి శ్రీనివాసరావు, ఈర్ల గురవయ్య, గోల్డ్ రఫీ, శ్రీను, చల్ల ఆంజనేయ ప్రసాద్, వాకా వీరారెడ్డి, కలాం, మురళీకృష్ణ, పోతిబండ్ల శ్రీనివాసరావు, నాగరాజు, గోపి, మాల్యాద్రి, రహమతునిస్సా, లక్ష్మి, జగదీష్, జానీ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

బంగారు కుటుంబాలకు వెన్నుదన్నుగా నిలుద్దాం

తూర్పు నియోజకవర్గంలో పీ-4 కార్యక్రమం ద్వారా బంగారు కుటుం బాలు ఆర్థిక ప్రగతి సాధించేందుకు ప్రతిఒక్కరూ సహకారం అందించా లని ఎమ్మెల్యే నసీర్ పిలుపునిచ్చారు. గుంటూరులోని తన కార్యాలయం లో బుధవారం పీ-4 అధికారుల బృందంతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మార్గదర్శకులను మనసుతో ఎన్నుకోవాలని, సామాజిక బాధ్యతను వివరించాలని సూచించారు.

కిమ్స్ శిఖరలో సెంట్రిఫ్యూగల్ ప్లాస్మా ఎక్స్ఛేంజ్ థెరపీ

గుంటూరు మెడికల్, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఎలుకల మందు తిని కాలేయ వైఫల్యంతో ప్రాణాపాయ స్థితిలో వచ్చిన యువతికి అత్యాధునిక 'సెంట్రిఫ్యూగల్ ప్లాస్మా ఎక్స్ఛేంజ్ థెరపీ'తో సంరక్షించినట్లు కిమ్స్ శిఖర హాస్పిటల్ వైద్యులు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. జీవిత పాలకొల్లు యువతి ఎలుకల మందు (రాటల్ పేస్ట్) తినడంతో చికిత్స నిమిత్తం కుటుంబీకులు కిమ్స్‌శిఖరలో చేర్చారు. 72 గంటల తర్వాత యువతిలో తీవ్రమైన లివర్ డ్యామేజ్ లక్షణాలు కనిపించాయి. బైలిరూబిన్, ఐఎన్ఆర్, లివర్ ఎంజైమ్‌లు బాగా పెరగ డంతో ఇది కాలేయ వైఫల్యానికి దారి తీస్తుందని వైద్యులు గుర్తించారు. కాలేయ మార్పిడి చేయాల్సిన పరిస్థితి తలెత్తకుండా నివారించేందుకు సెంట్రిఫ్యూగల్ ప్లాస్మా ఎక్స్ఛేంజ్ చికిత్సను ప్రారంభించారు. నాలుగైదు సెషన్ల తర్వాత యువతి ఆరోగ్య పరిస్థితి మెరుగు పడటంతో డిశ్చార్జ్ చేశారు.

దేశాభివృద్ధిలో పరిశోధనల భాగస్వామ్యం పెరగాలి

• డాక్టర్ ఎం ఆదినారాయణ

గుంటూరు(విద్య), జూలై 16 (ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధిలో పరి శోధనల భాగస్వామ్యం పెరగాలని మా అల్ట్రా స్కాన్ సెంటర్ అధి నేత డాక్టర్ ఎం ఆదినారాయణరావు అన్నారు. బుధవారం ఎన్టీఆర్ కాలనీలోని సుమేధ స్కూల్లో జరిగిన పీజర్ అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించాలని అప్పుడే దేశాభివృద్ధి సాధ్యమన్నారు. సందర్భంగా సిటీ స్కాన్, ఎమ్మారై తదితర వైద్య పరికరాల పనితీరు గురించి ఆయన విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ఎం చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

శాకంబరి అలంకరణలో కనకదుర్గమ్మ

గుంటూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): శారదాకాలనీ 29వ లైనులోని దేవాలయంలో ఆషాఢ మాసం పురస్క రించుకొని కనకదుర్గమ్మ శాకంబరీ అలంకరణలో భక్తులకు దర్శనమి చ్చారు. ఈ సందర్భంగా మహిళలు అమ్మవారికి సారె సమర్పించి కుంకుమపూజలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



టైఫాయిడ్ వాక్సిన్‌పై అవగాహనా సదస్సు

గుంటూరు(విద్య), జూలై 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆచార్య హిందూ ఫార్మసీ కళాశాలలో ఫార్మాస్యూటికల్ రెగ్యులేటరీ అఫైర్స్ డిపా ర్టుమెంటు ఆధ్వర్యంలో టైఫాయిడ్ వాక్సిన్‌పై బుధవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన భారత్ బయోటెక్ ఏరి యా సేల్స్ మేనేజర్ రామకృష్ణ మాట్లాడుతూ ప్రపంచంలో ప్రతి సంవ త్సరం 4.5 మిలియన్ టైఫాయిడ్ కేసులు వస్తున్నట్లు వారిలో లక్షా పదివేల మంది చనిపోతున్నట్లు వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ రికార్డుల్లో ఉన్నాయన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న వాక్సిన్ తీసుకొన డం వల్ల టైఫాయిడ్‌ను నివారించవచ్చని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగభూషణం, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.భరత్, ఫార్మాడి డైరెక్టర్ డాక్టర్ పి.శేఖరయ్య, బయోటెక్నాలజీ డిపార్టుమెంటు హెచ్‌వోడీ డాక్టర్ జె.శివజ్యోతి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ విజయకుమార్ బాబు, రెగ్యులేటరీ అఫైర్స్ డిపార్టుమెంటు అధ్యాపకులు ఎస్ బీనాదేవి, జి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న రామకృష్ణ

మంగళగిరి పేదలకు.. ఇళ్ళ పట్టాలు : కలెక్టర్

గుంటూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): మంగళగిరి నియోజకవర్గంలో ఇల్లు లేని పేదలకు త్వరలో శాశ్వత ఇళ్ల పట్టాలు, టిడ్కో ఇళ్ల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లో నియోజకవర్గ అభివృద్ధిపై కలెక్టర్ నాగలక్ష్మి సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ్ తేజ, తెనాలి సబ్ కలెక్టర్ సంజ నా సింహతో కలిసి వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వ హించారు. కలెక్టర్ మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గ పరిధిలో దీర్ఘకాలంగా వివిధ ప్రభుత్వ స్థలాల్లో నివాసం ఉంటున్న పేదలకు రాష్ట్ర మంత్రి లోకేశ్ శాశ్వత ఇళ్ల పట్టాలు అందించేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారన్నారు. ఈ నేపథ్యంలో దేవదాయ, ఆర్అండ్‌బీ, జలవనరుల, మున్సిపల్, రైల్వే శాఖల అధికారుల సమన్వయంతో ఆగస్టు నాటికి ఇళ్ల పట్టాల పంపిణీకి చర్యలు తీసుకోవాలన్నారు. టిడ్కో గృహ సముదాయాల నిర్మాణం నిమిత్తం స్థలం సేకరణ చేయాలని కోరారు. సమావేశంలో డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీకుమారి, డీఆర్‌వో ఎన్ఎస్‌కే ఖాజావలి, జడ్పీ సీఈవో జ్యోతి బసు, పీడీ హౌసింగ్ ప్రసాద్, ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషా తదితరులు పాల్గొన్నారు.

బంగారు కుటుంబాల ప్రాథమిక సర్వే నిర్వహించాలి

• కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గుంటూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): బంగారు కుటుంబాల అవస రాల ఆధారిత ప్రాథమిక సర్వే ఈ నెల 15వ తేదీ నుంచి 25వ తేదీ మధ్యన జిల్లా వ్యాప్తంగా నిర్వహించాలని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. బుధవారం కలక్టరేట్‌లో పబ్లిక్, ప్రైవేట్, పీపుల్ భాగస్వామ్యంతో చేపడుతున్న పీ4 కార్యక్రమం అమలుపై రెవెన్యూ డివిజన్‌ల్, నియోజకవర్గం ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, తహసీ ల్దార్లు, మున్సిపల్ అధికారులతో కలెక్టర్ వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆగస్టు 7వ తేదీ నుంచి 10వ తేదీ వరకు బంగారు కుటుంబాల అదనపు చేర్పులకు అవకాశం కల్పిస్తామన్నారు. సమాజంలో అత్యంత వెనుకబడిన బంగారు కుటుంబాలను పేదరికం నుంచి బయటకు తీసుకురావాలన్నారు. బంగారు కుటుంబాల ఆర్థిక అభివృద్ధికి మార్గదర్శులు బాటలు వేసేలా అవగా హన కల్పించాలన్నారు. బంగారు కుటుంబాలు ఆర్థికంగా ఎదిగినట్లు నిర్ధా రించడానికి 523 అంశాలను పరిగణనలోకి తీసుకుంటామన్నారు. నాణ్యమైన సేవలు అందించలేని మార్గదర్శులను తొలగించాలన్నారు. సమాజంలో అత్యా ధిక ధనికులుగా ఉన్నవారు అందించే ఆర్థిక సాయం పరిమితి అధికంగా ఉండేలా అవగాహన కల్పించాలన్నారు. బంగారు కుటుంబాల దత్తత ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. పీ4 విధానం రాష్ట్ర కమిటీ సభ్యుడు సంతోష్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరిస్తూ బంగారు కుటుంబాల అవసరాలను గుర్తించడం, వనరులను సమకూర్చే ప్రక్రియ వేగంగా చేయాలన్నారు. నీడ్ బేస్డ్ ప్రాథమిక సర్వే పక్కాగా నిర్వహించాలన్నారు. సమావేశంలో జీయంసీ కమిషనర్(ఇన్‌చార్జీ) ఓబులేశు, జడ్పీ సీఈవో జ్యోతిబసు, సీపీవో శేషశ్రీ, డీపీవో నాగసాయికుమార్ పాల్గొన్నారు.



పీ4 సర్వే నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్

రోటరీ క్లబ్ సేవలను విస్తృత పరచాలి

గుంటూరు(తూర్పు), జూలై 16(ఆంధ్రజ్యోతి): సామాజిక సేవకు మారుపేరుగా ఉన్న రోటరీ క్లబ్ సేవా కార్యక్రమాలను మరింత విస్తృ త పరచాలని జిల్లా రోటరీ క్లబ్ గవర్నర్ డాక్టర్ ఎస్వీ రామ్ ప్రసాదు పేర్కొన్నారు. స్థానిక లక్ష్మీపురం, ఓ కల్యాణ మండపంలో బుధవారం రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు ఆదర్శ్, రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు ప్రేర ణ సంస్థలకు ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ గ్రామీణ స్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు సామాజిక అవసరాలను గుర్తించి రోటరీ క్లబ్ ద్వారా సహాయ సహకారాలు అందించేందుకు నూతన కార్యవర్గ సభ్యులు సమష్టిగా కృషి చేయాలని కోరారు. అనం తరం రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు ఆదర్శ్ అధ్యక్షురాలు మన్నె అనూరాధ, కార్యదర్శిగా నందిపాటి వాణికుమారి, కోశాధికారిగా జవ్వా ది జయశ్రీ, రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు ప్రేరణ అధ్యక్షుడిగా పోలిశెట్టి రిష్విక, కార్య దర్శిగా పాములపాటి అమృత, కోశాధికారిగా కనమర్ల పూడి అనూరూప 2025-26 సంవత్సర పదవి కాలానికి బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో రోటరీ గుంటూరు జిల్లా అసిస్టెంట్ గవ ర్నర్ భాస్కర్ తదితరులు నూతన కమిటీ సభ్యులను అభినందించారు.



నూతనంగా ఎన్నికైన సభ్యులతో రోటరీ క్లబ్ గవర్నర్ డాక్టర్ ఎస్వీ రామ్‌ప్రసాదు

గుంటూరు ఇన్‌ఛార్జ్ డీపీటీవోగా సామ్రాజ్యం

గుంటూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జ్ ప్రజా రవాణా ధికారిగా సామ్రాజ్యం బుధవారం ఎన్‌టీఆర్ బస్టాండ్‌లోని కార్యాల యంలో బాధ్యతలు స్వీకరించారు. డీపీటీవో సీహెచ్ విమల విదేశీ పర్యటనకు వెళ్లడంతో ఆమె స్థానంలో బాపట్ల డీపీటీవోగా వ్యవహరి స్తున్న సామ్రాజ్యంను ఇన్‌చార్జ్‌గా నియమిస్తూ ఉన్నతాధికారులు ఆదే శాలు జారీ చేశారు. ఈ మేరకు ఆమె బుధవారం గుంటూరు ఎన్‌టీ ఆర్ బస్టాండ్‌కు చేరుకొని అధికారులతో సమావేశమయ్యారు.

విద్యార్థులలో గణిత సామర్థ్యాలు పెంపొందించాలి

గుంటూరు(తూర్పు), జూలై 16(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో గణిత సామర్థ్యాలను మెరుగుపరిచి, వారిలో మేధో వికాసాన్ని పెంపొందించా లని ప్రముఖ వైద్యుడు నారు శ్రీనివాసరెడ్డి సూచించారు. బుధవారం అమరావతి రోడ్డు, ఏ కన్వెన్షన్ హాల్లో నిర్వహించిన తొమ్మిదో రాష్ట్ర స్థాయి యూనివర్సల్ కాన్సెప్ట్ ఆఫ్ మెంటల్ ఆర్థమెటిక్ సిస్టమ్ (యూ సీమాస్) పోటీల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. విద్యా ర్థులకు గణితంలో ఉత్తమ శిక్షణ ఇవ్వాలన్నారు. డాక్టర్ బాలకృష్ణారెడ్డి, డాక్టర్ సాహితీ, వైవా స్కూల్ ప్రిన్సిపాల్ సరళాదేవి ప్రసంగించారు. అనంతరం మూడు విభాగాల్లో జరిగిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి రెయిన్ టెక్నాల జీ బిజినెస్ హెడ్ ఎం శ్రీకాంత్ అధ్యక్షత వహించగా కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు పొందిన విద్యార్థులతో నిర్వాహకులు, ఉపాధ్యాయులు

పాత గుంటూరులో బాలుడి అదృశ్యంపై కేసు

గుంటూరు కార్పొరేషన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): బాలుడు అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు బుధవారం పాత గుంటూరు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరా లు ఇలా ఉన్నాయి.. పాత గుంటూరులోని సోమవారి వీధికి చెందిన నూకతోటి నాగరాజు, జ్యోతి కుమారుడు రెస్వంత్ సాగర్(12) సిటీ పబ్లిక్ స్కూల్లో ఏడో తరగతి చదువుతున్నాడు. తన కుమారుడిని హోమ్‌వర్క్ చేయలేదని మంగళ వారం మందలించగా, అదే రోజు రాత్రి ఇంట్లో పడుకొని తెల్లవారు జామున నిద్ర లేచి స్కేటింగ్‌కు వెళ్లి వస్తాను అని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లిపోయి ఇంతవరకు తిరిగి రాలేదు. దీంతో పాత గుంటూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



రెస్వంత్ సాగర్

19 నుంచి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు

గుంటూరు(తూర్పు), జూలై 16(ఆంధ్రజ్యోతి): జిల్లా బ్యాడ్మింటన్ అసో సియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 19, 20 తేదీల్లో స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో 52వ జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి దామచర్ల శ్రీనివాస్ తెలిపారు. ఎన్టీఆర్ స్టేడియంలో బుధవారం పోటీలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించి వివరాలను వెల్లడించారు. అండర్-11 నుంచి సీనియర్స్ వరకు అన్ని విభాగాలతో పాటు, మాస్టర్స్ విభాగంలో అండర్-35+ నుంచి 70+ వరకు ఈ పోటీలు నిర్వహిస్తునట్టు పేర్కొ న్నారు. గెలుపొందిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు స్టేడియంలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేశ్వరావు, సతీష్ చంద్ర, కార్యదర్శి రాము, రమేష్, భాషా తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న దామచర్ల శ్రీనివాస్ తదితరులు



పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నసీర్, ఆర్యవైశ్య సంఘం నాయకులు


పొట్టి శ్రీరాములు స్మృతి వనంకు స్థలం కేటాయింపుపై హర్షం

గుంటూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలోని శాఖమూరులో 6.8 ఎకరాల్లో పొట్టి శ్రీరాములు స్మృతివనం, 58 అడుగుల పొట్టిశ్రీరాములు విగ్రహం ఏర్పాటుకు సీఆర్‌డీఏ అనుమతులు మంజూరు చేయటంపై టీడీపీ నేత కొనకళ్ళ సత్యం, అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకుడు గుడివాడ రవికుమార్ నేతృత్వంలో నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే నసీర్‌తో కలిసి ఆర్యవైశ్య సంఘం నాయకులు నాజ్ సెంటర్‌లో బుధవారం సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో అరవపల్లి శీను, అంకారావు, అన్నవరపు చక్రి, కోటా శేషగిరి, బొలిశెట్టి పాపారావు, రాయవరపు అశోక్, శేషప్రభాకర్‌రావు, నిరంజన్ తదితరులున్నారు.

ఆర్యవైశ్యులకు టీడీపీతోనే గౌరవం, హోదా

• డిప్యూటీ మేయర్ షేక్ సజీల

గుంటూరు కార్పొరేషన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆర్యవైశ్యులకు టీడీపీతోనే తగిన గౌరవం, హోదా లభించిందని నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ షేక్ సజీల తెలి పారు. బుధవారం గుంటూరు నగరంలోని ఆర్య వైశ్యుల ఆధ్వర్యంలో నాజ్ సెంటర్ వద్ద ఉన్న అమరజీవి పొట్టిశ్రీరాములు విగ్రహానికి ఏర్పాటు చేసిన పాలాభిషేకం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. రాజధాని ప్రాంతంలో శ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్‌కు స్థలం కేటాయించటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు ఉండి రాకేష్, ఈ కార్పొరేటర్ సమత, సత్యం, వెంకట్, ఆర్యవైశ్య నాయకులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న డిప్యూటీ మేయర్ షేక్ సజీల

విద్యుత్ భారాలపై దశలవారీ ఆందోళనలు

గుంటూరు(తూర్పు), జూలై 16(ఆంధ్రజ్యోతి): విద్యుత్ భారాలు, స్మార్ట్ మీటర్లు ఏర్పాటు, అదానీతో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేయాలనే డిమాండ్లతో ప్రభుత్వంపై దశలవారీ ఆందోళనలు చేపడు తున్నట్టు వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు స్పష్టం చేశాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్యుత్ ఒప్పందాలకు వ్యతిరేకంగా బుధవారం, మల్ల య్య లింగం భవన్లో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిం చారు. సమావేశానికి ఏఐటీయూసీ, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అకిటి అరుణ్ కుమార్, లక్ష్మణరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు జంగాల అజయ్‌కుమార్, వై నేతాజీలు మాట్లాడుతూ ఆందోళనల్లో భాగంగా గురువారం నుంచి 22వ తేదీ వరకు సదస్సులు, 22 నుంచి 29 వరకు ఇంటింటి ప్రచారం, సంతకాల సేకరణ, 30 నుంచి ఆగస్టు 4వ తేదీ వరకు కాలనీ సమావే శాలు, 5వ తేదీన విద్యుత్ కార్యాలయాల వద్ద ధర్నాలు, 7న ప్రత్యేక నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తునట్టు పేర్కొన్నారు. ఆందోళనల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సీపీఐ(ఎంఎల్) జిల్లా నాయకుడు ఉల్లిగడ్డల నాగేశ్వరరావు, ఏఐటీ యూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి, ఏరువాక కార్మిక సంఘ నాయకులు పాటిబండ్ల కోటేశ్వరరావు పాల్గొని ప్రసంగించారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న జంగాల అజయ్‌కుమార్

కాకాని శివాలయంలో పవిత్రోత్సవాలు ప్రారంభం

పెదకాకాని, జులై 16 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని శ్రీ మల్లేశ్వరస్వామి వారి సన్నిధిలో పవిత్రోత్సవాలు, శైవాగమ ఆగమనాన్ని అనుసరించి ఆలయ స్థానాచార్యులు, ప్రధాన అర్చక, అర్చకస్వాములు, వేదపండితుల పర్యవేక్షణలో శాస్త్రోక్తకంగా బుధవారం ప్రారంభించినట్లు ఆలయ ఉప కమిషనరు గోగినేని లీలాకుమార్ తెలిపారు. పవిత్రోత్సవాల్లో భాగంగా మొదటి రోజు బుధవారం యాగశాల ప్రవేశం, విఘ్నేశ్వరపూజ, పుణ్యా హవచనం, పంచగవ్య పూజ, ప్రాశన, రక్షాసూత్రపూజ, ధారణ, దీక్షాధా రణ, అఖండ దీపస్థాపన, యాగేశ్వర కుంభస్థాపన, పూజ, వాస్తు కుంభ స్థాపన, పూజ, వాస్తు శాంతిహోమం, బలిహరణ జరిగిందన్నారు. సాయంత్రం గం.5.30 నుంచి మంగళవాయిద్యం, చతుర్వేదపారాయణం, గోపూజ అనుజ్ఞ, విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచనం, పంచగవ్యం, అంకు రార్పణం, రక్షాబంధనం, మంత్రపుష్పం, హారతి విభూతి, కుంకుమ ప్రసాద వితరణ జరిగినట్లు ఆలయ ఉపకమిషనరు గోగినేని లీలాకు మార్ తెలిపారు. పవిత్రోత్సవాల కార్యక్రమంలో స్థానాచార్యులు పొత్తూరి సాంబశివరావు, ప్రధాన అర్చక పొత్తూరి లక్ష్మీనారాయణ వరప్రసాదు, ఉపప్రధాన అర్చకులు, అర్చకస్వాములు, వేదపండితులు, దాతలు తెనా లికి చెందిన నేలవెల్లి కోటేశ్వరి, కర్నే శివసందీప్, నాగశిరీష, రెడ్డినవీన్‌కు మార్, విజయలక్ష్మి, నేలివెల్లి నాగప్రత్యూష, భక్తులు పాల్గొన్నారు.

నిరుద్యోగ సమస్య పరిష్కరించడమే ధ్యేయం

• ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో నిరుద్యోగ సమస్యను పరిష్కరించడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే గళ్లా మాధవి చెప్పా రు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ సహకారంతో ఆమె ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీన నిర్వ హించనున్న మెగా జాబ్‌మేళా పోస్టర్‌ను స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి సంజీవరావుతో కలిసి ఆమె బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లా డుతూ యువనేత నారా లోకేశ్ యువగళంలో ఇచ్చిన హామీ మేరకు మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చారని, అధినేత చంద్రబాబు ఇచ్చిన 20 లక్షల ఉద్యోగాల కల్పనలో భాగంగా ఏపీ స్కిల్ డెవెలప్‌మెంట్ ఆధ్వర్యంలో ఈ నెల 22వ బ్రాడీపేట మూడోలైన్ మాస్టర్ మైండ్స్ క్యాంపస్‌లో మెగా జాబ్ మేళా నిర్వహించబోతున్నామని చెప్పారు. ఆరోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ జరిగే జాబ్ మేళాకు సుమారు 24 కంపెనీలు రాబో తున్నాయన్నారు. పదో తరగతి నుంచి పీజీ వరకూ చదువుకున్నయువత ఈ జాబ్ మేళా ను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి సంజీవరావు

సీఎం గురించి తప్పుగా మాట్లాడితే సహించేది లేదు

• ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ

గుంటూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): ముఖ్య మంత్రి చంద్రబాబు గురించి తప్పుగా మాట్లా డితే సహించేదిలేదని ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ హెచ్చరించారు. గుంటూరులోని తన కార్యాలయంలో బుధవారం ఆయన విలేక రులతో మాట్లాడారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేసిన ఆ పార్టీ అధినేత జగన్ ఇప్పుడు చట్టాలు, న్యాయం, ప్రజా స్వామ్యం గురించి మాట్లాడటం అత్యంత హాస్యాస్పదంగా ఉందని అన్నారు. రప్పా.. రప్పా నరుకుతాం అనే సినిమా డైలాగ్‌లు ప్రదర్శిస్తే తప్పేంటీ అని సమర్థించుకుంటున్న జగన్‌రెడ్డి, బోసడీకే అనే డైలాగు కూడా సినిమాలోనిదే అనే విషయం మర్చిపోవడం విడ్డూరంగా ఉందన్నారు. బోసడీకే అనే డైలాగ్‌కు విపరీతార్థాలు తీసి టీడీపీ కార్యాలయాలు, నాయకుల ఇళ్లపై దాడులు చేయించిన జగన్, నేడు తమ కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతున్నారని గింజుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. వైసీపీ నాయకులు ఇంకా 'నరకండి, చంపండి' అనే భాషతో రాజకీయాలను కలుషితం చేస్తున్నారని, ఈ విధమైన ప్రవర్తనను ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లి, ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న మన్నవ మోహనకృష్ణ

ఉగ్రవాదుల పార్టీగా వైసీపీ

• రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా చేయాలనే కుట్రలు
• ఏపీఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్

గుంటూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఉగ్రవాదుల పార్టీగా మారిందని ఆంధ్రప్ర దేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డేగల ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గుంటూరు నగర కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లా డారు. ఒక మహిళా ఎమ్మెల్యేపై ప్రసన్నకు మార్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఉన్నత న్యాయస్థానాలు సైతం తప్పుపట్టాయి కానీ జగన్‌రెడ్డి వెనకేసుకురావడం దేనికి సంకేతమని నిలదీశారు. రప్పా రప్పా నరికే యమని పిలుపునిచ్చిన నేతలను, నరికితే తప్పేంటి అని చెప్పిన నేతలను, మహిళల వ్యక్తిత్వాన్ని కించపరిచేలా మాట్లాడిన నేతలను జగన్‌రెడ్డి సమర్థించ డం సిగ్గుచేటన్నారు. రాష్టంలో ప్రశాంత వాతావరణానికి ఆటంకం కలిగిస్తూ, అలజడి సృష్టిస్తూ రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా చేయాలనే కుట్రలో భాగం గానే వైసీపీ నేతలు ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. రక్తం పంచుకుని పుట్టిన సొంత చెల్లి గురించే తప్పుడు ప్రచారం చేసిన నీచ చరిత్ర జగన్‌రెడ్డిదని ఆరోపించారు. జగన్‌రెడ్డి మద్దతుతోనే వైసీపీ నేతలు మహిళలపై పేట్రేగిపోతున్నారన్నారు. వెంటనే జగన్‌రెడ్డి యావత్ మహిళా లోకానికి బేషరతుగా క్షమాపణలు చెప్పాలన్నారు. రాజకీయంగా ఎదుర్కో లేక వ్యక్తిగత జీవితంలోకి తొంగి చూస్తూ, వ్యక్తిగత విమర్శలు చేస్తూ, వ్యక్తిత్వ హననానికి పాల్పడడం అత్యంత హేయమైన చర్య అని, వైసీపీ స్థాపించిన నాటి నుంచి అదే నీచ రాజకీయం కొనసాగిస్తోందని డేగల ప్రభాకర్ విమర్శించారు.



మాట్లాడుతున్న డేగల ప్రభాకర్

విద్యుత్ విజిలెన్స్ బృందాల తనిఖీ

• రూ.16.25 లక్షల అపరాధ రుసుం విధింపు

గుంటూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): విద్యుత్ విజిలెన్స్, గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఎస్ఈ చల్లా రమేష్ ఆధ్వర్యంలో నగరంలోని డీ12 సెక్షన్ పరిధిలో చౌడవరం, దాసరిపాలెం, చల్లావారిపాలెం, అంకిరెడ్డిపాలెం, పొత్తూరు, లాలు పురం ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు చేశారు. విజిలెన్స్ ఈఈ సీహెచ్ వెంకటేశ్వరరావు, గుంటూరు టౌన్-1 ఆపరేషన్ ఈఈ టి.శ్రీనివాసబాబు నేతృ త్వంలో 51 మంది అధికారులు, 162 మంది సిబ్బంది 51 బృందాలుగా ఏర్పడి 3768 సర్వీసులు తనిఖీ చేసినట్లు తెలిపారు. ఇందులో మీటర్ ఉన్నప్పటికి అక్రమంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడిన నలుగురికి రూ.1.50 లక్షలు, అను మతించిన లోడ్ కంటే అదనంగా విద్యుత్ వినియోగిస్తున్న 333 మందికి రూ.14.75 లక్షలు అపరాధ రుసుం విధించారు. మొత్తం రూ.16.25 లక్షలు అపరా ధ రుసుం విధించినట్లు పేర్కొన్నారు. విద్యుత్ చట్టానికి లోబడే సర్వీసుల తనిఖీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ మీటర్‌లకు తప్పని సరిగా సీలు ఉండేలా చూసుకోవాలని, ఒకవేళ లేకపోతే విద్యుత్ సిబ్బందికి రాతపూర్వక ఫిర్యాదు చేయాలని కోరారు. విద్యుత్ చౌర్యంపై 9440812263, 9440812360 నెంబర్లకు ఫిర్యాదు చేయాలని కోరారు. ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతా మన్నారు. తనిఖీల్లో డిప్యూటీ ఈఈలు కే.రవికుమార్, ఎన్.మల్లికార్జున ప్రసాద్, బీ.రాజమోహన్‌రావు, ఏఈలు కోటేశ్వరరావు, ఎం.సతీష్‌కుమార్, యు.శివశంకర్, ఆపరేషన్ ఏఈ ఎం.ఉదయ్‌కిరణ్ తదితరులున్నారు.

ప్రతి పేషెంట్ హెల్త్ డేటా ఇక ఆన్‌లైన్‌లో


• డీసీహెచ్ఎస్ డాక్టర్ బీవీ రంగారావు

ప్రత్తిపాడు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): వైద్య రంగంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి విప్లవాత్మక తీర్పులు తీసుకొస్తుందని అందులో భాగంగానే ఈ హా స్పిటల్ విధానం అందుబాటులోకి తీసుకువచ్చిందని డీసీహెచ్ఎస్ డాక్టర్ బీ వీ రంగారావు తెలిపారు. ప్రత్తిపాడులోని సెకండరీ హెల్త్ కేర్ సెంటర్‌లో జరి గిన హాస్పిటల్ అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ముందు గా వైద్యశాలను పరిశీలించి వైద్యశాలలో అందిస్తున్న సౌకర్యాలతో పాటు వై ద్యుల పనితీరుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యశాలలో జరిగి న సిజేరియన్ డెలివరీలు కూడా ఇక్కడ జరుగుతున్నాయని, అందుబాటులో నిపుణులైన వైద్య బృందం ఉన్నారన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ఇక నుంచి వైద్యశాలకు వచ్చే ప్రతి పేషెంట్ డేటా ఆన్‌లైన్‌లో పొందు పరుస్తారన్నారు. ప్రతి పేషెంట్‌కు ఒక నెంబరు ఇస్తారని, అందులో పేషెంట్ ప్రతి రిపోర్టు నిక్షిప్తపై ఉంటుందన్నారు. ఎప్పుడు ఏ వైద్యుడు పరీక్షించాడు.. ఎవరు జవాబుదారీ తనం అనేది కూడా ఉంటుందన్నారు. అంతే కాకుండా వై ద్యులు నిరంతరం వైద్యశాలలో అందుబాటులో ఉండాలన్నారు. విధుల్లో నిర్ల క్ష్యం వహించే వారిపై చర్యలు కూడా తీసు కుంటారన్నారు. ఇక నుంచి వైద్యు లు కాని, సిబ్బంది కాని హాస్పిటల్‌కు లేట్‌గా రావడానికి వీలుండదన్నారు. అంతే కాకుండా ఇక్కడి నుంచి గుంటూరు జీజీహెచ్‌కు రిఫర్ చేయాలన్నా కూడా సరైన కారణం చూపించాలన్నారు. ఎనస్తీషియాకు సంబంధించి లేటెస్ట్ ఎక్యూప్‌మెంట్ అందుబాటులో ఉందన్నారు. అంతే గాకుండా ఎక్సరే కూడా మ రి కొన్ని రోజుల్లో అందుబాటులోకి వస్తుందన్నారు. నిర్మాణంలో ఉన్న బిల్డింగ్ ను ఒకటి, రెండు నెలల్లో పూర్తి చేసి అప్పగిస్తామని ఆయన తెలిపారు. ఆరో గ్యశ్రీ ద్వారా వైద్యసేవలు అందించడంతో పాటు అవసరమైన మెడిసిన్ కొను గోలుకు కూడా అనుమతి ఉందన్నారు.

బాలల భవిష్యత్తుకు.. బంగారు బాట

పిల్లల జీవితంలో మొదటి ఐదు సంవత్సరాలు కీలకం. ఈ దశలో వేసే పునాది వారి భవిష్యత్‌కు బంగారు బాట అవుతుంది. దీనిని గురించిన ప్రభు త్వం జాతీయ విద్యా విధానం 2020 బాల్యా రంభ సంరక్షణ విద్యకు అత్యంత ప్రాధాన్యం ఇస్తుంది. మహిళా శిశు సంక్షేమ శాఖ సహకారంతో నవ చేతన బాల్యా రంభ ప్రేరణ జాతీయ చట్టాన్ని రూపొందించింది. దీనిలో భాగంగా అంగన్ వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ఒక క్రమ పద్ధతి లో బోధన, అభ్య సన కు దృష్టి సారిం చింది. నవ చేతన, ఆధార శిల పుస్తకాలు రూ పొందించి ఉమ్మడి జిల్లాలోని అన్ని అంగన్ వాడీ కేంద్రాలకు సరఫరా చేసింది.





అంగన్ వాడీలకు ఆధార్ శిల పుస్తకాలు పంపిణీ

నవ చేతనలో..

నవ చేతన పుస్తకంలో గర్భాధారణ దశ నుంచే మానసిక, శారీరక ప్రేరణ అవసరాన్ని తెలియజేస్తుంది. చిన్నారుల మెదడు, శరీర అభివృద్ధిని గుణాత్మకంగా పెంచేందుకు తల్లిదండ్రులు, సంరక్షకులు, అంగన్ వాడీ కార్యకర్తలకు ఈ పుస్తకం దోహద పడుతుంది. నేను, నా కుటుంబం, శరీర భాగాలు, ఆహారం, రుచులు వంటి అంశాలను పాఠ్యాంశాలుగా ఇచ్చారు. కార్యకర్తలు మూడు సంవత్సరాల లోపు వారికి వీటిని బోధించటంతో పాటు వారి తల్లిదండ్రులకు వివరించాలి. వారు ఇంటి వద్ద అనుసరించాలి. చిన్నారుల్లో విష పరిజ్ఞానం పెంపొందించేలా కబుర్లు, కథలు ఎలా చెప్పాలనేది వీటిని చిత్రాల సహా ఇచ్చారు.

- సత్తెనపలి

● ఆధార్ శిలలో కేంద్రాలకు వచ్చే చిన్నారుల్లో ఎక్కువగా మూడు నుంచి ఆరు సంవ త్సరాల లోపు వయస్సు వారు ఉంటారు. వారికి పాఠ్యాంశా లు వినోదాత్మకంగా ఎలా బోధించాలనే అంశాల ను ఆధార్ శిల పుస్త కంలో రూ పొందించారు. ఆడుతూ, పాడుతూ అభ్యాసన జరిగేలా నీతి పద్యాలు వీటిలో పొందు పరిచారు. ఇందులోని ఇతి వృత్తాలు అంగన్ వాడీ కార్యకర్తలకు సహాయ పడేలా రూపు దిద్దారు. నా గ్రామం, నా కుటుంబం, రుతువులు, పండుగలు, పండ్లు, కూరగాయలు ఇతి వృత్తాల ద్వారా పిల్లలు స్థానిక పరిసరాలు, సంస్కృతిని అర్థం చేసుకోవటానికి దోహద పడతాయి.



పుస్తకాలు సరఫరా చేశాం
: ఎం ఉమాదేవి, పీడీ, ఐసీడీఎస్, పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు నవ చేతన, ఆధార శివ పుస్తకాలను సరఫరా చేశాం. ఇందులోని అంశాలను చిన్నారులు తల్లిదండ్రులకు ఎలా తెలియ జేయాలో ప్రాజెక్టుల స్థాయిలో కార్యకర్తలకు అవగాహన కల్పించాం. వీటి ద్వారా పిల్లల భవిష్యత్ సమగ్ర అభివృద్ధి చెందుతుంది.



● కుక్కల కోసం ఏర్పాటు చేసిన ఏసీ హాస్టల్



వసతి.. వారెవ్వా

- కుక్కల కోసం ఏసీ హాస్టళ్లు
- ఆహ్లాదకరంగా డాగీస్ జోన్ల ఏర్పాటు
- నిద్రకు బెడ్లు.. ఆడుకునేందుకు బొమ్మలు

సమాజంలో జంతు ప్రేమికుల సంఖ్య నానాటికీ పెరిగిపోతుంది. ముఖ్యంగా కుక్కలను ప్రాణ ప్రదంగా పెంచుకునే వాళ్లు ఎక్కువయ్యారు. ఏదైనా అత్యవసరమై బయటకు వెళ్లాల్సి వచ్చినప్పుడు తాము పెంచుకునే కుక్కలను అక్కడా ఇక్కడ వదిలి వెళ్లడానికి కుదరని పరిస్థితి. అటువంటప్పుడు ఎవరో ఒకరు వాటి కోసం ఇంట్లోనే ఉండాల్సి వస్తుంది. ఈ ఇబ్బందిని నివారించేందుకు కుక్కలకు కూడా ప్రత్యేకమైన హాస్టళ్లు(వసతి గృహం) ఏర్పాటవుతున్నాయి. ఆయా హాస్టళ్లు కూడా ఎలాగంటే అలాకాకుండా అత్యాధునిక వసతులు, ప్రత్యేక సౌకర్యాలతో నెలకొల్పుతున్నారు.

- గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి

ఆహ్లాదం.. ఆనందం

ప్రాణపదంగా, అపురూపంగా పెంచుకుంటున్న కుక్కలకు ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా డాగీస్ జోన్లు ఏర్పాటవుతున్నాయి. ఇక్కడ 24 గంటలు ఏసీ ఉండేలా జాగ్రత్త తీసుకుంటారు. ప్రతీ కుక్కకు విశాలంగా ప్రత్యేక గదిని ఏర్పాటు చేస్తున్నారు. అందులోనే పడుకునేందుకు బెడ్, ఆడుకునేందుకు బొమ్మలు ఉంటున్నాయి. వసతిలో ఉండే కుక్కలకు రోజుకు మూడు పూట్ల భోజనం పెడతారు. అది కూడా చాలా విలువైన మెనూ అనే చెప్పవచ్చు. భోజనం పెడుతున్నప్పుడు వీడియో తీసి యజమానికి పంపుతారు. ఉదయం, సాయంత్రం వాకింగ్.. జాగింగ్‌కు కూడా ఏర్పాట్లు చేశారు.

శిక్షణ పొందిన కేర్ టేకర్లు..

డాగీస్ జోన్లలోకి వచ్చే కుక్కల సంరక్షణ కోసం శిక్షణ పొందిన కేర్ టేకర్లను నిర్వాహకులు నియమించుకుం టున్నారు. యజమాని లేకున్నా కుక్క దిగులు పడకుండా కేర్‌టేకర్లు వాటిని మచ్చిక చేసుకుంటున్నారు. ఇక్కడ గంట, రోజు, నెల ఇలా ఎంత సేపు అయినా కుక్కలను ఉంచవచ్చు. చివరికి విదేశాలకు వెళ్లే వాళ్లు మూడు, నా లుగు నెలలు కూడా హాస్టల్‌లో ఉంచి వెళ్ళ వచ్చు. ఆ సమయంలో కుక్కల వసతి తో పా టు, ఆరోగ్య సంరక్షణ, టీకాలు ఇచ్చే విషయం అన్నీ హాస్టల్ యజమానులే చూసుకుంటారు.



కుక్కకు హెయిర్ కటింగ్

ఆంధ్రప్రదేశ్‌లో మొదటగా..



2014లో కుక్కను పెంచుకున్నాను. దానికి ఏదైనా జబ్బు చేస్తే అవసరమైన మందులు అందుబాటులో ఉండేవి కావు. ప్రతి దానికి హైదరాబాద్, చెన్నై వెళ్లాల్సి వచ్చేది. ఆ సమయంలో వచ్చిన ఆలోచనతోనే గుంటూరు అరండల్‌పేటలో డాగిస్ జోన్ ఏర్పాటు చేశాను. ఆంధ్రప్రదేశ్‌లో కుక్కలకు ఏసీ హాస్టల్ ఏర్పాటు చేయటం ఇదే మొదటిది. ఇక్కడ కుక్కలకు అవసరమైన మందులు, ఆహారం, వసతి, టీకాలు ఏర్పాటు చేశాను. దానికి ఎక్కువ మంది మద్దతు లభించింది. దీంతో కుక్కల కోసం పార్లర్ కూడా నిర్వహిస్తున్నాను.

- షేక్ మగ్బుల్



గోరంట్లలో కుక్కల కోసం డాగిస్ జోన్ పేరు తో ఏర్పాటు చేసిన ఏసీ హాస్టల్

● **వ్యాపారంలో వాటా అంటూ మాజీ ఎమ్మెల్యే అనుచరుడి మోసం**

వ్యాపారంలో వాటా ఇస్తానంటూ కాకినాడకు చెందిన వైసీపీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి అనుచరుడు కె రాజభాస్కర్‌రెడ్డి, రూ.1.77కోట్ల మేర మోసం చేశాడని ఆరోపిస్తూ బాపట్లకు చెందిన దొప్పలపూడి విష్ణు ప్రజాదర్బార్‌లో మంత్రి లోకేశ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. వైసీపీ హయంలో తనపై అక్రమ కేసులు నమోదు చేయడంతోపాటు చంపుతామని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశీలించి తగు చర్యలు తీసుకుంటానని మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారు.



వినతిపత్రాలు స్వీకరిస్తున్న మంత్రి నారా లోకేశ్

వినతుల స్వీకరణ.. పరిష్కారానికి హామీ

- 67వ రోజూ మంత్రి లోకేశ్ ప్రజాదర్బార్
- స్వయంగా కలిసి సమస్యలు విన్నవించిన ప్రజలు

తాడేపల్లి (ఉండవల్లి), జూలై 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఉండవల్లి నివాసంలో బుధవారం 67వ రోజు ప్రజాదర్బార్ నిర్వహించారు. మంత్రి లోకేశ్‌ను కలిసి తమ సమస్యలు విన్నవించేందుకు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు తరలివచ్చారు. ప్రతి ఒక్కరిని స్వయంగా కలిసిన మంత్రి వివిధ సమస్యలపై వారినుండి అర్జీలు స్వీకరించారు. సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

☛ కృష్ణా జిల్లా బాపులపాడు మండలం మల్లవల్లిలో ఏపీ ఐఐసీ ఇండస్ట్రియల్ కారిడార్ కోసం 2016లో ప్రభుత్వం భూ ములు సేకరించిందని, ఐతే కొంతమంది రైతులకు ఇప్పటికీ నష్టపరిహారం అందలేదని గ్రామానికి చెందిన డీ వెంకటరావు మంత్రి లోకేశ్‌ను కలిసి ఆవేదన వ్యక్తం చేశారు. గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అక్రమాల కారణంగా పరిహారం అందక తాము తీవ్రంగా నష్టపోయామని విచారించి తమకు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పరి శీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారు.

☛ వైసీపీ ప్రభుత్వంలో తొలగించిన వితంతు పెన్షన్‌ను పునరుద్దరించాలని గుండిమెడకు చెందిన పులపా మంగమ్మ మంత్రి లోకేశ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థలో గత 19ఏళ్లగా అవుట్ సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న 2400 మందికి హెచ్‌ఆర్ పాలసీ లేదా మినిమమ్ టైమ్ స్కేల్ ద్వారా ఉద్యోగ భద్రత కల్పించాలని ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రతినిధులు మంత్రి నారా లోకేశ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. అదే విధంగా కార్పొరేషన్‌లో సీనియర్ అసిస్టెంట్ జూనియర్ అసిస్టెంట్ పోస్టుల నియామనాకిని సంబంధించి అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.



వృద్ధురాలి సమస్య వింటూ..

తిరుపతి నుండి తిరుమలకు పూలు తీసుకెళ్లేందుకు టోల్ గేట్ పర్మిషన్ ఇవ్వాలని శ్రీ బాలాజీ ఫ్లవర్ మర్చంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు మంత్రి లోకేశ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. గత 30 ఏళ్లుగా పూల వ్యాపారం చేస్తున్నామని 2023 ఏడాది నుండి తమకు అనుమతి నిలిపివేశారని మంత్రి దృష్టికి తీసుకురాగా తగు చర్యలు తీసుకుంటామని లోకేశ్ హామీ ఇచ్చారు.

☛ శ్రీకాకుళం జిల్లాలో మజ్జిగూడెం ఎత్తిపోతల నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు తగిన నిధులు మంజూరు చేయాలని హీర మండలానికి చెందిన గోళ్ల సింహాచలం మంత్రి లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. 2018లో ఎత్తిపోతల నిర్మాణ పనులు ప్రారంభించగా వైసీపీ హయాంలో బిల్లులు చెల్లించకపోవడంతో నిలిచిపోయాయని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. పరిశీలించి చర్యలు తీసుకుంటానని మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారు.

☛ డీఆర్‌డీఏ వెలుగు, చంద్రన్న బీమా కాల్ సెంటర్ సిబ్బందికి గత రెండు నెలలుగా జీవీడబ్ల్యూవీ, వీఎస్‌డబ్ల్యూఎస్ విభాగం జీతాలు నిలిపి వేసిందని తమకు పెండింగ్ జీతం చెల్లించడంతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆంధ్రప్రదేశ్ సోషల్ సెక్యూరిటి ఉద్యోగుల సంఘం ప్రతినిధులు మంత్రి లోకేశ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పలువురు ప్రజలు దివ్యాంగుల నుండి మంత్రి లోకేశ్ స్వయంగా అర్జీలు స్వీకరించి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.


బాపట్ల టౌన్‌హాలుకు 120 వసంతాలు

● **1913లో ప్రథమాంధ్ర మహాసభకు ఇదే వేదిక**

బాపట్ల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): చారిత్రకమైన బాపట్ల టౌన్‌హాలు నిర్మించి 119 సంవత్సరాలు పూర్తిఅయ్యింది. రాజకీయ, సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలకు పట్టుగొమ్మగా టౌన్‌హాలు నిలిచింది. జాతిపిత మహాత్మా గాంధీతోపాటు జవహర్‌లాల్‌నెహ్రూ, డాక్టర్ బాబురాజేంద్రప్రసాద్ వంటి ఎందరో జాతీయనాయకులు ఇక్కడ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. 1913 మే నెలలో జరిగిన ప్రథమాంధ్ర మహాసభకు టౌన్‌హాలు వేదికగా నిలిచింది. బాపట్లలో టౌన్‌హాలు నిర్మించాలని 1902 డిసెంబరు 5న జరిగిన ఓ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. అప్పటి తహసీల్దార్ కె.శేషాచలపతిపంతులు ఆధ్వర్యంలో అధికారులు, న్యాయవాదులతో కమిటీ ఏర్పాటైంది. 1903 సెప్టెంబరులో ఎడ్వర్డ్ చక్రవరి పట్టాభిషేకం రోజునే బాపట్ల కోర్టులో జిల్లా మున్సిఫ్‌గా తిరువెంకటాచారి బాధ్యతలు స్వీకరించారు. ఆయన టౌన్‌హాలు నిర్మాణంలో ప్రత్యేక ఆసక్తి చూపారు. అప్పట్లో బాపట్ల తాలూకా మిరాశిదారుగా ఉన్న జాగర్ల మూడినాయుడు ఆధ్వర్యంలో గ్రామ గ్రామం తిరిగి టౌన్‌హాలు నిర్మాణానికి విరాళాలు సేకరించారు. 7,253 రూపాయల 15అణాల 3పైసలు విరాళలుగా వసూలయ్యాయి. జమ్ములపాలెం మిరాశిదారు కుర్రా ముత్తయ్య చౌదరి, న్యాయవాదులు దేశిరాజు కృష్ణయ్యపంతులు, చోరగుడి వెంకటాద్రిపంతులు టౌన్‌హాలు నిర్మాణానికి స్థలం ఇచ్చారు. 1905 జనవరి 24న టౌన్‌హాలు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అప్పటి బాపట్లతాలూకా సబ్ మేజిస్ట్రేట్ బి.రాజగోపాలరావు, బ్రహ్మండం బాపయ్యపంతులు వంటి ప్రముఖులెందరో టౌన్‌హాలు నిర్మాణానికి కృషి చేశారు. 1905 జూలై 17న టౌన్‌హాలు ప్రారంభమైన తర్వాత అప్పటికే బాపట్లలో ఉన్న డైమండ్ జూబ్లీక్లబ్, న్యూస్ పేపర్ క్లబ్‌లను ఇందులో విలీనం చేశారు. 1908లో బాపట్లకు జిల్లా మున్సిప్‌గా వచ్చిన న్యాపతిబల రాందాసు పంతులు చొరవతో టౌన్‌హాలులో టెన్నీస్ కోర్టు కూడా ప్రారంభమైంది. నిత్యం సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలతో టౌన్‌హాలు అలరారుతుండేది. ఎన్నోనాటిక ప్రదర్శనలు కూడా ఇక్కడ ఏర్పాటు చేసేవారు. ఈ వా తావరణమే పద్మశ్రీ స్థానం నరసింహారావు, అద్దంకి శ్రీరా మమూర్తి వంటి మ హానటుల కు ప్రేరణ ఇచ్చింది.



టౌన్‌హాలు



కార్మెల్ కొండ.. అద్భుతాల నిలయం

● **కార్మెల్‌మాత మహోత్సవాల్లో గోవిందుజోజి**

ఫిరంగిపురం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): అనేక అద్భుతాలకు నిలయంగా కార్మెల్ కొండ భాసిల్లుతుందని నల్గొండ విశ్రాంత పీఠాధిపతి గోవిందుజోజి తెలిపారు. ఫిరంగిపురంలో కార్మెల్ మహోత్సవాలు బుధవారం మూడో రోజులుగా వైభవంగా జరుగుతున్నాయి. తెలుగు రాష్ట్రాల భక్తులు లక్షలాదిగా తరలివచ్చి మహోత్సవాల్లో పాల్గొని తరించారు. భక్తులు కొబ్బరి కాయలు కొట్టి కొవ్వొత్తులు వెలిగించి తలనీలాలు తీయించు కున్నారు. కార్మెల్ మాత స్వరూపానికి ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ కొబ్బరికాయ కొట్టి ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను గోవిందు జోజి ఆశీర్వదించారు. అనంతరం సమిష్టి దివ్య పూజాబలిలో గోవిందు జోజి భక్తులకు సందేశ మిచ్చారు. సకల మానవాళి మాతగా మరి యతల్లి వెలుగొందు తుందన్నారు. జపమాల, ఉత్తరీయంతో మాత ను ప్రార్థిస్తే కోరిన కోర్కెలు తీరుతాయన్నారు. కార్మెల్ కొండ కు ఘాట్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని ఎమ్మెల్యేను బాల ఏసు కథెడ్రల్ దేవాల య ఫాదర్ మాల పాటి ఫాతి మామరెడ్డి కోరారు.



దివ్య పూజాబలిలో ప్రసంగిస్తున్న నల్గొండ విశ్రాంత పీఠాధిపతి గోవిందుజోజి

జడ్పీలో ముదురుతున్న.. అవుట్ సోర్సింగ్ వివాదం

● **సీఈఓ ప్రకటనతో అంతా గందరగోళం**

గుంటూరు సిటీ, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ లోని ఆరుగురు అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాల చెల్లింపులు వ్యవహారం చినికి చినికి గాలి వానలా మారుతుంది. 22 నెలలుగా తమకు జీతాలు చెల్లించటం లేదంటూ జడ్పీ లోని అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ధర్నా నిర్వ హించిన విషయం విదితమే. ఆ ధర్నా వ్యవహారం పై స్పందించిన సీఈఓ జ్యోతి బసు అసలు వాళ్లు జడ్పీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులే కాదంటూ సంచలన ప్రకటన చేశారు. ఈ ప్రకటనతో బుధవారం వ్యవహారం మరింత వేడెక్కింది. జీతాలు ఇవ్వటం లేదంటూ ధర్నా నిర్వహించిన ఉద్యోగులు జిల్లా పరిషత్‌లోని కీలకమైన ఛాంబర్‌లలో విధుల్లో ఉన్న వీడియోలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేశాయి. వాళ్లు జడ్పీ ఉద్యోగులు కాకుంటే అక్కడ ఎందుకు ఉన్నారంటూ పలువురు అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించారు.



జడ్పీలో విధుల్లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు



● **జిల్లా పరిషత్‌కు తాళాలు తీసేది వాళ్లే...**

ఆరుగురు అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వ్యవహారంలో అధికారులు చెబుతున్న మాటలు అవాస్తవాలు అని బాధితులు చెబుతున్నారు. ప్రతి రోజూ జిల్లా పరిషత్ తాళాలు వేసేది.. తీసేది అవుట్ సోర్సింగ్ ఉద్యోగి హరీష్ అని చెబుతున్నారు. అతను కొంతకాలం ప్రస్తుత జడ్పీ సీఈఓ ఇంట్లో కూడా వాచ్‌మెన్ గా పని చేసినట్లు తెలుస్తున్నది. గ్రామ,వార్డు సచివాలయ ఉద్యోగుల కమాండ్ కంట్రోల్ రూమ్, పీ ఎఫ్ సెక్షన్, ఇతర కీలకమైన సెక్షన్‌లలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు పని చేస్తున్నారు. జిల్లా పరిషత్ ప్రాంగణం, ఛైర్మన్ క్యాంపు కార్యాలయం శుభ్ర పరచటం వంటి పనులు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు చేస్తున్నారు. 365 రోజులు విధులకు హాజరై పనులు చేస్తున్నా వాళ్లు ఉద్యోగాల్లో లేరని సీఈఓ ప్రకటన చేయటం వివాదాస్పద మయ్యింది.

● **2022 లోనే తీర్మానం...**

అవుట్ సోర్సింగ్ విధానంలో 10 మందిని నియమించేందుకు అప్పటి కలెక్టర్ అనుమతితో జిల్లా పరిషత్ లో 2022 జనవరి 28న తీర్మానం ప్రవేశపెట్టి ఆమోదింప జేశారు. నియమించిన ఉద్యోగులకు జడ్పీ నిధుల నుంచి చెల్లింపులు చేసేలా తీర్మానంలో పేర్కొన్నారు. ఆ తీర్మానం ఆధారంగానే ఈ ఆరుగురుని విధుల్లో నియమించారు. 2023 వరకు జీతాలు కూడా సీఎఫ్ఎంఎస్ ద్వారానే చెల్లించారు. మోహన్‌రావు డిప్యూటీ సీఈఓ గా పనిచేసిన కాలం లో 2023 జూలై 21 వ తేదీన అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు విభాగాలను కేటాయిస్తూ ఉత్తర్వులు వెలువరించారు. 2023 లో వారిని అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగా గుర్తించి, జీతాల చెల్లింపులకు సంబంధించిన ఉత్తర్వులు జారీ చేశారు. కొందరిని రోజు వారీ వేతనం కింద విధుల్లోకి తీసుకుంటున్నట్లు మోహన్ రావు ఇంచార్జి సీఈఓ గా ఉన్నప్పుడు ఆదేశాలు జారీ చేశారు. ఆ లెక్క న ప్రస్తుతం జిల్లా పరిషత్‌లో ఉన్న ఆరుగురు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు చట్ట ప్రకారం విధుల్లో ఉన్నట్లుగానే స్పష్టం అవుతున్నది.



నాణ్యమైన విద్య, ఆంగ్ల భాషా పరిజ్ఞానం... ఇవి లేకుండా ఆధునిక ప్రపంచంలో నెగ్గుకురావడం ఎంత కష్టమో అనుభవ పూర్వకంగా తెలుసుకున్నారు **జనావఫా బెహ్బోట్**. తను పడిన కష్టాలు కొత్త తరానికి ఎదురుకాకూడదనే లక్ష్యంతో ఆమె చేపట్టిన ప్రయత్నం... వందలాది గ్రామీణ బాలల్లో నైపుణ్యాన్ని పెంచి, ఆత్మవిశ్వాసాన్ని నింపుతోంది.

నైపుణ్యం పెంచి... ఆత్మవిశ్వాసం నింపుతూ..

"ఇది పాతికేళ్ళ క్రితం సంగతి. షిల్లాంగ్‌లోని ఒక ఆసుపత్రిలో ఉద్యోగం కోసం ఇంటర్వ్యూకు వెళ్ళాను. ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్ నన్ను కొన్ని ప్రశ్నలు అడిగారు. వాటికి నాకు సాధ్యమైనంతమేరకు సమాధానాలు చెబుతున్నాను. "మీరు బీయే చదివారు. ఇంగ్లీష్ అర్థం కాదు, మాట్లాడలేరు. నన్ను ఉద్యోగం ఎలా ఇవ్వమంటారు?" అని అన్నారాయన గట్టిగా. ఏం చెప్పాలో నాకు అర్థం కాలేదు. అయితే... ఇంటర్వ్యూకు వచ్చిన అందరికన్నా విద్యాపరమైన అర్హతలు నాకే ఎక్కువగా ఉన్నాయి. నా ఇంగ్లీష్‌ను మెరుగుపరుచుకుంటాననే హామీ తీసుకొని... వార్డ్ అటెండెంట్‌గా ఉద్యోగం ఇచ్చారు. బయటికి వస్తూ అనుకున్నాను... ఎంత కష్టమైనా సరే... ఇంగ్లీష్‌లో పట్టు సాధించాలని.

సవాల్‌గా తీసుకున్నా...

మేఘాలయ రాష్ట్రంలోని నోంగ్‌ష్కెన్ అనే మారుమూల గ్రామం మాది. బంగ్లాదేశ్ సరిహద్దుల్లో ఉండే మా ఊరులో విద్యాసదుపాయాలు అంతంతమాత్రం. అక్కడ హైస్కూల్ చదువు పూర్తి చేశాక... షిల్లాంగ్ నగరంలోని ఒక కాలేజీలో చేరాను. అప్పటివరకూ ఇంగ్లీష్ పాఠాలను బట్టీ పట్టి రాయడమే తప్ప కనీస పరిజ్ఞానం కూడా నాకు లేదు. కాలేజీలో బోధన అంతా ఆంగ్లంలోనే ఉండేది. ఎలాగో కష్టపడి డిగ్రీ పూర్తి చేశాను. ఆ తరువాత... ఇంటర్వ్యూ సమయంలో నాకు ఎదురైన అనుభవం తరువాత... ఇంగ్లీష్ నేర్చుకోవడాన్ని ఒక సవాలుగా తీసుకున్నాను. రీడింగ్ మెటీరియల్ తెప్పించుకొని చదివేదాన్ని. ఎవరైనా మాట్లాడుతూ ఉంటే వినేదాన్ని. తోటి సిబ్బందితో తప్పో ఒప్పో నాకు వచ్చింది మాట్లాడేదాన్ని. దీనికి నేను ఏనాడూ సిగ్గు పడలేదు. ఈ క్రమంలో ఎన్నో అవమానాలు, వెక్కిరింపులు... నా వెనకాలే కాదు, నా ముందు కూడా ఎగతాళి చేసేవారు. కానీ అన్నీ భరించాను. నా తపనను ఆసుపత్రి యాజమాన్యం గమనించింది. రెండేళ్ళ తరువాత రిసెప్షనిస్ట్‌గా ప్రమోట్ చేసింది. అయితే నేను ఇంగ్లీష్ చక్కగా మాట్లాడుతున్నాననే ఆత్మవిశ్వాసం రావడానికి అయిదేళ్ళు పట్టింది. ఆ తరువాత ఒక ఇంగ్లీష్ మీడియం స్కూల్లో టీచర్‌గా చేరాను. నేను పాఠాలు బాగా చెబుతున్నానని, ఇంగ్లీష్ బాగా మాట్లాడుతున్నానని ప్రిన్సిపాల్ మెచ్చుకొనేవారు. అదే సమయంలో... గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధి కోసం కృషి చేస్తున్న కొన్ని సంస్థలతో కలిసి పలు ప్రాంతాల్లో తిరిగాను. శిక్షణ తరగతులను నిర్వహించాను. ఒక వ్యక్తి జీవితంలో సరైన విద్య ఎంత ప్రభావం చూపిస్తుందో నాకు పూర్తిగా అర్థమయింది. 'హైస్కూల్‌లో చదువుతున్నప్పుడే ఇలాంటి అవకాశం ఉంటే ఎంతో బాగుండేది కదా!' అనిపించేది. మా ఊర్లోనే సొంతంగా ఒక సంస్థను ఏర్పాటు చేయాలనుకున్నాను. 2013లో 'ఫౌండేషన్ ఫర్ ఎంపవర్‌మెంట్ అండ్ ఇంక్లూజివ్ డెవలప్‌మెంట్' అనే పేరుతో ఒక సంస్థను రిజిస్టర్ చేశాను. మా గ్రామంలో, ఆ చుట్టుపక్కల ఉన్న పిల్లలకు ఇంగ్లీష్ బోధించి, వారు నగరాలకు వెళ్ళినప్పుడు ఇబ్బంది పడకుండా చూడాలనే ధ్యేయంతో తరగతులు మొదలుపెట్టాను.

వ్యతిరేకత రావడంతో...

ప్రతివారం చివర్లో మా ఊరు వచ్చి... ఎనిమిది నుంచి పదోతరగతి పిల్లలకు ఇంగ్లీషు పాఠాలు చెప్పేదాన్ని. విద్యార్థుల నుంచి, వారి తల్లితండ్రుల నుంచి మంచి ప్రోత్సాహం లభించింది. అప్పుడే వివిధ ప్రభుత్వ సంస్థలు యువత కోసం నిర్వహిస్తున్న కార్యక్రమాల గురించి తెలిసింది. నేను చేస్తున్న పనుల్ని వివరిస్తే... ఒక కమ్యూనిటీ లైబ్రరీ ఏర్పాటుకు అధికారులు నిధులు మంజూరు చేశారు. నాకు పరిచయం ఉన్న సంస్థల ద్వారా పుస్తకాలు విరాళంగా వచ్చాయి. దాంతో... రీడింగ్ సెషన్స్ కూడా ప్రవేశపెట్టాను. అయితే... స్థానిక పాఠశాలల ఉపాధ్యాయుల నుంచి వ్యతిరేకత వచ్చింది. వారు బోధించే తీరును అవమానిస్తున్నానని ఆరోపించారు. దాంతో నేనే ఒక స్కూల్ ఏర్పాటు చేయాలని నిర్ణయించాను. కల్లోలంగా ఉండే ప్రాంతాల్లో పాఠశాలల సర్వతోముఖాభివృద్ధికి దోహదం చేస్తున్న 'ఎస్‌టిపి' అనే సంస్థ సహకారంతో 'డ్యూ డ్రాప్ అకాడమీ' పేరుతో 2019లో ఒక స్కూల్‌ను... 15 మంది పిల్లలతో ప్రారంభించాను. 2020 నాటికి వారి సంఖ్య 80కి చేరింది. మా అమ్మ విరాళంగా ఇచ్చిన స్థలంలో... 'ఎస్‌టిపి సంస్థ సాయంతో పూర్తి స్థాయి పాఠశాల ఏర్పాటైంది. ప్రస్తుతం 250 మంది విద్యార్థులు చదువుతున్నారు. నా సోదరి, మరో బంధువు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకొని... మా బడిలో టీచర్లుగా చేరారు. ముంబయికి చెందిన ఒక ఎన్జీవో ఒక బస్సును సమకూర్చింది. విద్యార్థుల నుంచి నామమాత్రపు రుసుముతో... స్వచ్ఛంద సంస్థల సహకారంతో మా స్కూల్ నడుస్తోంది..





ఆ నమ్మకం ఉంది...

మా స్కూల్ నుంచి నేను ఎలాంటి వేతనం తీసుకోవడం లేదు. ఒక స్వచ్ఛంద సంస్థకు నోడల్ అధికారిగా నాకు వస్తున్న జీతంతోనే గడుపుతున్నాను. వివిధ వక్తృత్వ, వ్యాసరచన పోటీల్లో మా విద్యార్థులు బహుమతులు గెలుచుకుంటున్నారు. వారిలో కనిపిస్తున్న ఆత్మవిశ్వాసం చూస్తున్నప్పుడు... నా లక్ష్యం నెరవేరుతోందన్న సంతృప్తి కలుగుతోంది. వారు ఎలాంటి జంకు లేకుండా... భాష, నైపుణ్యాల పరంగా నగర విద్యార్థులను మించి రాణిస్తారనే నమ్మకం నాకుంది."

కౌన్సెలింగ్

మోకీళ్లు అరిగితే?

డాక్టర్! నా వయసు 60. మోకీళ్ల అరుగుదల మొదలైనట్టు వైద్యులు చెప్పారు. కీళ్లు మరింత అరగకుండా ఉండాలంటే ఎలాంటి జాగ్రత్తలు పాటించాలో వివరిస్తారా?

Q A

\- ఓ సోదరి, హైదరాబాద్.

కీళ్ల అరగడం మొదలైన వెంటనే, అవి మరింత అరిగిపోకుండా కొన్ని జాగ్రత్తలు పాటించాలి. అందుకోసం...

- మెత్తని సోఫాల్లో కూర్చోకూడదు. సోఫాలో కూర్చున్నప్పుడు మోకాలు 90 డిగ్రీల కోణంలో ముడుచుకుంటుంది. ఈ కోణంలో, మోకాళ్ల మీద భారం మోపుతూ లేచే ప్రయత్నం చేస్తే కీళ్ల అరుగుదల పెరుగుతుంది. కాబట్టి సోఫా బదులు, వెన్నుకు ఆసరాను అందించే కుర్చీలు వాడుకోవాలి.
- ట్రెడ్‌మిల్, జుంబా, ఏరోబిక్స్‌కు బదులు మెత్తని పచ్చిక మీద నడక, సైకిల్ తొక్కడం, క్రాస్ ట్రైనర్ మొదలైన వ్యాయామాలు చేయాలి.
- మెత్తని బూట్లు వాడాలి.
- నేల మీద కూర్చోకూడదు, పడుకోకూడదు.
- బరువును అదుపులో ఉంచుకోవాలి.
- వైద్యులు సూచించిన ఫిజియోథెరపీ చేయాలి.
- వైద్యులు సూచించే సప్లిమెంట్లు వాడుకోవాలి.
- మెట్లు ఎక్కడం తగ్గించాలి.
- క్యాల్షియం కలిగి ఉండే ఆహారం తినాలి.
- కండరాలను దృఢపరిచే నడకతో కీళ్ల అరుగుదల అదుపులోకొస్తుంది. కాబట్టి రోజుకు కనీసం 20 నిమిషాల పాటు నడవాలి.



లిగమెంట్లు ఎంతో కీలకం!

కారు సాఫీగా నడవడానికి నాలుగు చక్రాలు ఎంత అవసరమో, కీళ్ల సాఫీగా కదలడానికి లిగమెంట్లు అంత అవసరం. ఎముకలను సరైన కోణంలో కదిలే ఆసరాను లిగమెంట్లు అందిస్తాయి. వీటిలో చీరికలు ఏర్పడితే ప్రమాదం జరిగిన కొద్ది రోజుల వరకూ నొప్పి వేధించి తగ్గిపోయినా, ఆ నష్టం దీర్ఘకాలంలో ఆర్థ్రయిటిస్‌కు దారి తీస్తుంది. కాబట్టి లిగమెంట్ గాయం కారణంగా మోకీళ్లలో సమస్యలు తలెత్తే వీల్లేకుండా వెంటనే సర్జరీతో సరి చేయించుకోవాలి.

\- డాక్టర్ దశరథరామ రెడ్డి
ఆర్థోపెడిక్ సర్జన్, హైదరాబాద్.

వినూత్నం



కొన్ని సంఘటనలు జీవితాన్ని అనుకోని మలుపులు తిప్పుతాయి. ఆ పరిస్థితులకు కొందరు కుంగిపోతే.. మరికొందరు ధైర్యంగా ఎదుర్కొని ఇతరులకు మార్గదర్శులుగా మారతారు. అలాంటి వ్యక్తే మహారాష్ట్రకు చెందిన ఫిజియోథెరపిస్ట్, **అనుజా లునియా**. ఒత్తిడి కారణంగా జీర్ణసంబంధ వ్యాధి, ఐబిడికి గురైన అనుజా.. స్ట్రెస్ స్ట్రాటజిస్ట్‌గా మారి ఎంతో మందికి ఒత్తిడిని దూరం చేస్తున్నారు. ఆ ప్రయాణం ఆమె మాటల్లోనే...

ఒత్తిడిని చిత్తు చేసేలా...

"మాది మహారాష్ట్రలోని థానే! అమ్మానాన్న ఇద్దరూ డాక్టర్లు. వాళ్లను చూస్తూ పెరగడం వలన నేనూ డాక్టర్‌ను అవ్వాలనుకున్నా! అనుకున్నట్లే ఫిజియోథెరపిస్ట్‌ను అయ్యాను. సంతోషంగా వృత్తి జీవితం ప్రారంభించాను. అంతా ఆనందంగా సాగిపోతున్న సమయంలో జీవితం అనుకోని మలుపు తిరిగింది. ఇన్‌ఫ్లమేటరీ బోవెల్ డిసీజ్(ఐబిడి) బారిన పడ్డాను. ఎన్నో మందులు వాడాను. కానీ వాటి ఫలితం తాత్కాలికమే! జీవనశైలి మారితేనే ఆరోగ్య పరిస్థితి మెరుగుపడుతుందని అనిపించింది. ఈ ఆలోచనకు కార్యరూపం ఇవ్వడంతో పరిస్థితిలో మార్పు కనిపించింది. దాంతో ఓవైపు ఆరోగ్యాన్ని కాపాడుకుంటూనే మరో పక్క కెరీర్ మీద దృష్టి సారించా. మళ్లీ జీవితం సాధారణ స్థితికి వచ్చింది. కొత్త జీవితం మొదలైనట్టు అనిపించింది. కానీ ఆ సంతోషం ఎన్నో రోజులు నిలవలేదు. కొన్నాళ్లకే ఐబీడీ తిరబెట్టింది. ఏమీ తినక లేక పోయేదాన్ని. తీవ్రమైన కడుపు నొప్పి, నీరసంతో బాధపడ్డాను. దాదాపు 16 కిలోల బరువు కోల్పోయాను. యోగా, ధ్యానం ప్రయత్నించినా కోలుకోలేకపోయా! అప్పుడే ఈ సమస్యకు ప్రధాన కారణం ఒత్తిడేనని గుర్తించాను. ఎంతో పరిశోధన చేసి ఒత్తిడిని తగ్గించుకునేందుకు ఓ ప్రణాళికను సిద్ధం చేసుకుని పాటించాను. ఆ సమయంలో మా అమ్మానాన్నలు కొండంత అండగా నిలిచారు. దాంతో ఒత్తిడిని, నా అనారోగ్యాన్ని కూడా జయించగలిగాను.



ఒత్తిడితో చాలా ప్రమాదం

ఈ రోజుల్లో ఒత్తిడి ఓ సాధారణ సమస్యగా మారిపోయింది. కానీ ఒత్తిడి.. మధుమేహం, హైపర్ టెన్షన్, పీసీఓఎస్ వంటి అనేక అనేక రోగాలకు మూలం. నాడీ వ్యవస్థను ఒత్తిడి తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. మా అమ్మానాన్నలు వైద్య వృత్తిలో ఉండడం వలన ఒత్తిడి నియంత్రణలో ఎంతో సహకారం అందించారు. కానీ అందరికీ అలాంటి పరిస్థితులు ఉండవు.

> ఒత్తిడి వ్యక్తిగత సమస్య మాత్రమే కాదు సామాజిక సమస్య. మన దేశంలో 77 శాతం జనాభా ఒత్తిడితో బాధపడుతోంది. అందుకే ఒత్తిడి నియంత్రణపై అనేక వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నా! ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా 125 పైగా వర్క్‌షాప్‌లు నిర్వహించాను. భారత దేశాన్ని ప్రపంచంలోనే ఒత్తిడి తక్కువ ఉన్న దేశంగా మార్చాలన్నదే నా లక్ష్యం."

అందుకే నాలా ఒత్తిడి వల్ల ఎవరూ ఇబ్బంది పడకూడదని 'రిలాక్స్... ప్లే... థ్రైవ్' అనే పుస్తకం రాశాను. ఇందులో ఒత్తిడిని నియంత్రించడానికి యాక్టివిటీస్, పజిల్స్ వంటివి ఉంటాయి. అలాగే ఇందులోని క్యూఆర్ కోడ్‌ల ద్వారా గైడెడ్ ఆడియో, వీడియో కంటెంట్ అందుబాటులో ఉంటుంది. ఒత్తిడి వ్యక్తిగత సమస్య మాత్రమే కాదు సామాజిక సమస్య. మన దేశంలో 77 శాతం జనాభా ఒత్తిడితో బాధపడుతోంది. అందుకే ఒత్తిడి నియంత్రణపై అనేక వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నా! కొవిడ్ సమయంలో కార్పొరేట్ కంపెనీల్లో వర్క్‌షాప్‌లు నిర్వహించా! ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా 125 పైగా వర్క్‌షాప్‌లు నిర్వహించాను. భారత దేశాన్ని ప్రపంచంలోనే ఒత్తిడి తక్కువ ఉన్న దేశంగా మార్చాలన్నదే నా లక్ష్యం."

స్ఫూర్తి

అభిరుచి ఎప్పుడెలా ఉన్నత శిఖరాలకు చేరుస్తుందో ఎవరూ ఊహించలేరు. సూరత్‌కు చెందిన 27 ఏళ్ల **అనుజ వైద్య** కథ ఇలాంటిదే! పర్వతారోహణతో మొదలైన ఆమె క్రీడాసక్తి, జలక్రీడల మీదకు మళ్లి, అంతర్జాతీయ జలక్రీడా పోటీల్లో పాల్గొనే స్థాయికి ఎదిగేలా చేసింది. 2025 ఆసియా వాటర్ స్కీ అండ్ వేక్‌బోర్డ్ ఛాంపియన్‌షిప్‌కు భారత్ తరఫున ప్రాతినిధ్యం వహించిన తొలి యువతిగా పేరు పొందిన 27 ఏళ్ల అనుజ ప్రస్థానమిది.



పర్వతారోహణ నుంచి జలక్రీడల్లోకి...

వజ్రాల నగరం సూరత్‌కు చెందిన అనుజ, సాహసోపేతమైన క్రీడా ఔత్సాహికురాలు. తన చెల్లెలితో కలిసి 2019లో ఎవరెస్టు పర్వతాన్ని అధిరోహించిందామె. తాజాగా జూన్ 24 నుంచి 29 వరకూ థాయిల్యాండ్‌లో జరిగిన ఆసియా వాటర్‌స్కీ అండ్ వేక్‌బోర్డ్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొని ఫైనల్స్‌కు చేరుకుంది. ఈ అనుభవం గురించి వివరిస్తూ.. 'దాదాపు ఏడేళ్లుగా నాన్నతో కలిసి తాపి నదిలో వాటర్‌స్కీయింగ్ సాధన చేస్తున్నాను. ఈ ఏడేళ్ల కాలంలో నాకున్న సామర్థ్యాన్ని అంచనా వేయగలిగాను. అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనే స్థాయికి ఎదిగిన విషయాన్ని కూడా గ్రహించాను. కాబట్టి అంతర్జాతీయ క్రీడాకారులతో పోటీ పడి, స్వీయ సామర్థ్యాన్ని పరీక్షించుకోవడంలో తప్పేముందని అనిపించింది. కాబట్టే ఈ పోటీలో పాల్గొన్నాను. నిజానికి నాకు ఇదొక అద్భుతమైన అనుభవం. అంతకు ముందు వరకూ స్థానిక జలాల్లో, పరిమిత వనరులతో సాధన చేశాను కాబట్టి అంతర్జాతీయ ప్రమాణాలను అందుకోవడం కోసం, ముందుగానే థాయిల్యాండ్ చేరుకుని, వేర్వేరు పరికరాలతో, వేర్వేరు క్రీడాకారులతో కలిసి సాధన చేశాను' అంటూ చెప్పుకొచ్చింది అనుజ.

> అంతర్జాతీయ క్రీడాకారులతో పోటీ పడి, స్వీయ సామర్థ్యాన్ని పరీక్షించుకోవడంలో తప్పేముందని అనిపించింది. కాబట్టే ఈ పోటీలో పాల్గొన్నాను. నిజానికి నాకు ఇదొక అద్భుతమైన అనుభవం. అంతకు ముందు వరకూ స్థానిక జలాల్లో, పరిమిత వనరులతోనే సాధన చేశాను.
> \- అనుజ వైద్య

తాపి నదిలో సాధన చేసే సమయంలో సాదాసీదా దుస్తులు, పరికరాలను ఉపయోగించినప్పటికీ, అంతర్జాతీయ వేదిక మీద, తన కూతురు ప్రతిభ కనబరచడం గర్వంగా ఉందని అనుజ తండ్రి ఆనంద్ కూడా చెప్పుకొచ్చారు. ఆసియా వాటర్‌స్కీయింగ్ అండ్ వేక్‌బోర్డింగ్ ఛాంపియన్‌షిప్స్ 2025ను, థాయిల్యాండ్ ఎక్స్‌ట్రీమ్ స్పోర్ట్స్ అసోసియేషన్ నిర్వహించింది. ఈ పోటీల్లో అనుజతో పాటు భారతీయ అథ్లెట్లు, విలాస్ థాకరే, అరవింద్ రతూరిలు కూడా పాల్గొన్నారు. అయితే ఈ అంతర్జాతీయ పోటీలో ఒక భారతీయ మహిళ పాల్గొనడం ఇదే మొదటిసారి కావడం విశేషం.

పర్వతారోహణతో మొదలై...

చిన్నప్పటి నుంచి అనుజ వైద్య ఎన్నో క్రీడల్లో పాల్గొంది. ట్రెక్కింగ్, ఈత ఆమెకిష్టమైన క్రీడలు. ఉత్తరాఖండ్‌కు చెందిన తన తల్లి నుంచి క్రీడా స్ఫూర్తిని పొందిన అనుజ, చెల్లెలు అదితితో కలిసి, చిన్న వయసులోనే పర్వతారోహణ కూడా మొదలుపెట్టింది. ఆ క్రమంలో ఏడు పర్వత శిఖరాలను అధిరోహించింది. గుజరాత్‌లోని మౌంట్ విన్సన్ మాసిఫ్, కార్స్‌టెన్స్ పిరమిడ్‌లను అధిరోహించిన తొలి యువతిగా కూడా అనుజ చరిత్ర సృష్టించింది. అనుజ, ఆమె చెల్లెలు అదితి, ఎవరెస్టు పర్వతాన్ని అధిరోహించి, గుజరాత్‌కు చెందిన ఎవరెస్టు సిస్టర్స్‌గా పేరు పొందారు. ప్రపంచంలోని అత్యంత ఎత్తైన శిఖరాన్ని అధిరోహించిన రెండవ అక్కాచెల్లెళ్ల జంట కూడా తమదేనని అనుజ ఇన్‌స్టాలో కూడా ప్రకటించుకుంది. ఈ అక్కాచెల్లెళ్లు, గెట్ సెట్ అడ్వెంచర్స్ అనే అడ్వెంచర్ స్పోర్ట్స్ కంపెనీని స్థాపించి క్రీడల పట్ల తమకున్న మక్కువను కూడా చాటుకున్నారు. అలాగే తమ లాంటి సాహసికులకు ఆశ్రయం కల్పించడం కోసం ఉత్తరాఖండ్‌లో యాయవర్స్ అనే హోమ్‌స్టేను కూడా నెలకొల్పారు.

తొలి ప్రయత్నంలోనే ఫైనల్స్‌కు చేరుకుని...

తొలి అంతర్జాతీయ వాటర్‌స్కీయింగ్ పోటీల్లో అనుజ క్వాలిఫైయింగ్ రౌండ్‌ను విజయవంతంగా పూర్తి చేసుకుని, ఫైనల్స్‌కు చేరుకోగలిగింది. పూర్వానుభవం కలిగిన మలేషియా, జపాన్‌కు చెందిన అభ్యర్థులు అంతిమంగా ఈ పోటీల్లో విజయం సాధించారు. అయితే అత్యంత శారీరక దారుఢ్యంతో పాటు మెరుపు వేగంతో కదిలే నైపుణ్యం ఉండవలసిన ఈ జలక్రీడల్లో ప్రతిభ కనబరచడం ఆషామాషీ వ్యవహారం కాదు. మోటార్‌బోటు వేగంగా లాక్కెళ్లే స్కీ మీద కదులుతూ విన్యాసాలు ప్రదర్శించడానికి, బలంతో పాటు సంతులనం, టైమింగ్ కూడా అవసరమే! సవాలుతో కూడిన ఈ క్రీడలో అంతర్జాతీయ వేదిక మీద భారతదేశానికి ప్రాతినిధ్యం వహించే స్థాయికి ఎదగడం కచ్చితంగా గర్వించదగిన విషయమే! అనుజ, ముస్ముందు మరిన్ని విజయాలను సొంతం చేసుకోవాలని కోరుకుందాం!

ఆత్మవిశ్వాసాన్ని ఇలా పెంచుకోవాలి..!

వ్యక్తిగత విషయాలతోపాటు ఉద్యోగం, వ్యాపారాలకు సంబంధించి... ఆత్మవిశ్వాసంతో తీసుకున్న నిర్ణయాలు మంచి ఫలితాలనిస్తాయి. దీంతో ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కోగలమన్న ధీమా వస్తుంది. అలా ఆత్మవిశ్వాసంతో మెలగాలంటే కొన్ని అలవాట్లు పాటించాల్సిందే... అవి...

- రోజూ ఓ కొత్త అంశం గురించి తెలుసుకోవాలి. వ్యక్తిగత సామర్థ్యం, నైపుణ్యాలపై నమ్మకంతో ఉండాలి. సానుకూల దృక్పథాన్ని అలవాటు చేసుకోవాలి.
- ప్రతి ఒక్కరికీ ఏదో ఒక రంగంలో ప్రావీణ్యం ఉంటుంది. దానికి తగ్గట్టు లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి. ఆ లక్ష్యాన్ని చిన్న చిన్న భాగాలుగా విభజించుకుని ఒక్కోదాన్ని సాధిస్తూ ఉంటే క్రమంగా ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.
- సుఖంగా, సౌకర్యవంతంగా ఉండే భద్రతా వలయం నుంచి బయటికి రావాలి. కొత్త నిర్ణయాలు, ఆలోచనల పట్ల దృష్టి సారించాలి. స్వీయ ప్రేరణ అలవాటు చేసుకోవాలి. 'ఇది నా వల్ల కాదు' అనుకోకుండా 'ఒకసారి ప్రయత్నించి చూద్దాం' అనే ధోరణి పెంచుకోవాలి.
- మానసికంగా, శారీరకంగా కష్టపడడానికి సిద్ధంగా ఉండాలి. లక్ష్య సాధనలో ఎన్ని సమస్యలు ఎదురైనప్పటికీ వెనుకడుగు వేయకూడదు.
- భవిష్యత్తులో ఎలా ఉండాలి? ఏం సాధించాలి? అనే అంశాలను నిత్యం గుర్తుచేసుకుంటూ ఉండాలి. వాటి కోసం తగిన ప్రయత్నాలు చేస్తూ ముందుకు సాగాలి.
- అనవసరమైన ఆలోచనలు చేస్తూ భయాందోళనలకు గురికాకూడదు. ఒకసారి చేసిన తప్పులు పునరావృతం కాకుండా చూసుకోవాలి. ఎప్పటికప్పుడు లోపాలను సరిదిద్దుకుంటూ సవాళ్లను ఎదుర్కొనే నేర్పరితనాన్ని పెంచుకోవాలి.
- పోషకాహారం తీసుకోవడంతో పాటు సమయానుసారం నిద్రిస్తూ ఒత్తిడిని జయించాలి. రోజూ వ్యాయామం, ధ్యానం, యోగ చేస్తూ శరీర దారుఢ్యాన్ని పెంచుకోవాలి. నచ్చిన పనులు చేయడానికి కొంత సమయాన్ని వినియోగించాలి.
- హుందాగా కనిపించే దుస్తులు ధరించడం, తేలికపాటి మేకప్, వ్యక్తిగత శ్రద్ధ, మంచి స్నేహం అనేవి ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయి.



రోజూ శంఖుపువ్వు టీ తాగితే..



శంఖు పువ్వుల(అపరాజిత పూలు)ను దేవుడి పూజకు వాడుతుంటాం. అయితే ఈ పువ్వులతో చేసిన టీని రోజూ తాగడం వలన అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. వాటి గురించి తెలుసుకుందాం..

- శంఖు పువ్వులతో చేసిన టీలో కెఫిన్ ఉండదు. వీటిలో ఉండే ఫ్లేవనాయిడ్లు శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తాయి. ఒత్తిడికి కారణమయ్యే కారిస్టాల్ హార్మోన్ ఉత్పత్తిని తగ్గిస్తాయి.
- ఈ టీ శరీరాన్ని నిర్విషీకరణ చేయడంలో సహాయపడుతుంది.
- ఇందులోని యాంటీఆక్సిడెంట్లు జ్ఞాపక శక్తిని మెరుగుపరచడంతో ఉపకరిస్తాయి.. ఏకాగ్రతను పెంచుతాయి.
- ఈ టీలోని ఫ్లేవనాయిడ్లు, పాలిఫినాయిల్స్ మంట, వాపులను తగ్గిస్తాయి.
- ఈ టీ ఇన్సులిన్ ఉత్పత్తిని ప్రోత్సహించి చక్కెర స్థాయులను నియంత్రిస్తుంది.
- శంఖుపువ్వు టీలో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి ఫ్రీరాడికల్స్‌తో పోరాడతాయి. అలాగే వృద్ధాప్య ఛాయలను కలిగించే హానికర అణువులతో పోరాడి చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి.

ఎలా తయారు చేయాలి?:

స్టవ్ మీద గిన్నె పెట్టి రెండు కప్పుల నీరు పోసి మరిగించాలి. తరువాత 5-7 శంఖుపువ్వులను ఆ నీటిలో వేసి అయిదు నిమిషాలు మరగనివ్వాలి. స్టవ్ ఆపేసి ఆ నీటిని వడకట్టి అందులో తేనె, నిమ్మరసం కలుపుకుని తాగాలి. ఈ టీతో ఆరోగ్య ప్రయోజనాలు పొందాలంటే ఇందులో పంచదార వేయకూడదు.

టెక్ మహీంద్రా లాభం రూ.1,140 కోట్లు

క్యూ1లో 34 శాతం వృద్ధి నమోదు

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికం (క్యూ1)లో టెక్ మహీంద్రా ఏకీకృత నికర లాభం రూ.1,140.60 కోట్లుగా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో ఇదే కాలానికి ఆర్జించిన రూ.851.5 కోట్ల లాభంతో పోలిస్తే దాదాపు 34 శాతం వృద్ధి కనబరిచింది. కమ్యూనికేషన్స్, రిటైల్, బీఎఫ్ఎస్ఐ విభాగాలు మెరుగైన వృద్ధి సాధించడం ఇందుకు దోహదపడింది. ఈ క్యూ1లో కంపెనీ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 2.7 శాతం వృద్ధి చెంది రూ.13,351.2 కోట్లకు పెరిగింది. మార్చితో ముగిసిన త్రైమాసికంతో పోలిస్తే మాత్రం కంపెనీ లాభం 2.2 శాతం, ఆదాయం 0.2 శాతం తగ్గింది. ప్రస్తుతం ఐటీ రంగంలో నెలకొన్న అస్థిర వాతావరణంలో కంపెనీ ప్రణాళికలకు అనుగుణమైన పురోగతిని జూన్ త్రైమాసిక పనితీరు ప్రతిబింబిస్తోందని టెక్ మహీంద్రా సీఈఓ, ఎండీ మోహిత్ జోషి అన్నారు. మరిన్ని ముఖ్యాంశాలు..

- గడిచిన మూడు నెలల్లో 80.9 కోట్ల డాలర్ల విలువైన కొత్త కాంట్రాక్టులను కంపెనీ దక్కించుకుంది.
- ఈ క్యూ1లో బీఎఫ్ఎస్ఐ విభాగం నుంచి ఆదాయంలో వార్షిక ప్రాతిపదికన 4.7 శాతం వృద్ధి నమోదైంది. రిటైల్, లాజిస్టిక్స్ ట్రాన్స్‌పోర్ట్ 3.8 శాతం, కమ్యూనికేషన్స్ 2.5 శాతం వృద్ధి చెందాయి. మాన్యుఫాక్చరింగ్ విభాగ రెవెన్యూ మాత్రం 4 శాతం తగ్గగా.. టెక్నాలజీ, మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ రెవెన్యూ 3.3 శాతం తగ్గింది.



- ప్రాంతాల వారీగా చూస్తే, యూరప్ మార్కెట్ నుంచి ఆదాయం 11.7 శాతం పెరగగా.. అమెరికా నుంచి రెవెన్యూ 5.9 శాతం తగ్గింది.
- ఈ జూన్ 30 నాటికి టెక్ మహీంద్రాలో మొత్తం 1,48,517 మంది పనిచేస్తున్నారు. ఏడాది క్రితంతో పోలిస్తే ఉద్యోగులు నికరంగా 897 మంది పెరిగారు. ఐటీ విభాగ సిబ్బంది సంఖ్య మాత్రం 622 తగ్గదలతో 79,987గా నమోదైంది. ఐటీ విభాగంలో ఉద్యోగుల వలసల (అట్రిషన్) రేటు 12.6 శాతానికి పెరిగింది.
- బుధవారం బీఎస్ఈలో కంపెనీ షేరు 1.94 శాతం పెరిగి రూ.1,609 వద్ద ముగిసింది. కంపెనీ త్రైమాసిక ఫలితాలను మార్కెట్ ట్రేడింగ్ ముగిసిన తర్వాత ప్రకటించింది.

ఈక్విటీ, బాండ్ల జారీ ద్వారా రూ.45,000 కోట్ల సమీకరణ

ఎస్‌బీఐ

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ.. ఈక్విటీ, బాండ్ల జారీ ద్వారా మొత్తం రూ.45,000 కోట్ల వరకు నిధులు సమీకరించనుంది. అందులో రూ.25,000 కోట్ల వరకు ఈక్విటీ షేర్ల విక్రయం ద్వారా సేకరించనున్నట్లు బ్యాంక్ బుధవారం ప్రకటించింది. క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ ప్లేస్‌మెంట్ (క్యూఐపీ) పద్ధతిలో సంస్థాగత ఇన్వెస్టర్లకు షేర్ల కేటాయింపు ద్వారా ఈ నిధులు సమీకరించనున్నట్లు తెలిపింది. షేరు కనీస ధరను రూ.811.05గా నిర్ణయించింది. బుధవారం బీఎస్ఈలో బ్యాంక్ షేరు ముగింపు ధర రూ.831.55తో పోలిస్తే 2.46 శాతం తక్కువ ఇది. క్యూఐపీ ద్వారా నిధుల సమీకరణకు బ్యాంక్ బోర్డు మే నెలలోనే ఆమోదం తెలపగా..షేర్‌హోల్డర్లూ గత నెలలోనే గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. కాగా, దేశీయ ఇన్వెస్టర్లకు బాండ్ల జారీ ద్వారా మరో రూ.20,000 కోట్లు సమీకరించనున్నట్లు, ఇందుకు బోర్డు కూడా అంగీకారం లభించిందని తెలిపింది. ఎస్‌బీఐ చివరిసారి 2017-18లో క్యూఐపీ ద్వారా రూ.15,000 కోట్లు పోగేసింది.

ఎన్ఐఆర్ఎంతో సిబీ మైనింగ్ జట్టు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌కు చెందిన సిబీ మైనింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్.. కేంద్ర ప్రభుత్వ నిర్వహణలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రాక్ మెకానిక్స్ (ఎన్ఐఆర్ఎం)తో ఒక అవగాహనా ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ద్వారా రెండు సంస్థలు గనులు, మౌలిక ప్రాజెక్టుల నిర్మాణంలో అవసరమయ్యే అధునాతన నియంత్రిత పేలుళ్ల టెక్నాలజీలో సహకరించుకుంటాయి. సిబీ మైనింగ్.. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీ సత్యసాయి జిల్లా పెద్దకోట వద్ద అదానీ గ్రీన్ ఎనర్జీ ఏర్పాటు చేసే చిత్రావతి పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు నిర్మాణంలో ఈ టెక్నాలజీని ఉపయోగించనుంది.

ఎర్టిగా, బాలెనో ధరల పెంపు

మారుతి సుజుకీ

న్యూఢిల్లీ:మారుతీ సుజుకీ ఇండియా (ఎంఎస్ఐ).. ఎర్టిగా, బాలెనో కార్ల ధరలను స్వల్పంగా పెంచింది. ఎర్టిగా మోడల్ ధర 1.4 శాతం, ప్రీమియం హ్యాచ్‌బ్యాక్ బాలెనో ధర 0.5 శాతం పెంచినట్లు వెల్లడించింది. ఈ మోడళ్లలో ఆరు ఎయిర్‌బ్యాగ్‌లను స్టాండర్డ్ ఫీచర్‌గా చేర్చడం ఈ పెంపునకు ప్రధాన కారణమని తెలిపింది. పెంచిన ధరలు తక్షణమే అమల్లోకి వస్తాయని పేర్కొంది. కాగా ప్రస్తుతం బాలెనో ధర రూ.6.7 లక్షల నుంచి రూ. 9.92 లక్షల మధ్య ఉండగా ఎర్టిగా ధర రూ. 8.97 లక్షల నుంచి రూ.13.25 లక్షల మధ్యన ఉంది.

ఇక గోల్డ్, సిల్వర్ ఈటీఎఫ్‌లకు దేశీయ కమోడిటీ ఎక్స్ఛేంజ్ రేట్లే ప్రామాణికం

- ఈ విలువైన లోహాల విలువ లెక్కింపు విధానాన్ని మార్చే యోచనలో సెబీ

న్యూఢిల్లీ: బంగారం, వెండి ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్ల (ఈటీఎఫ్) ద్వారా మ్యూచువల్ ఫండ్స్ కలిగి ఉన్న భౌతిక బంగారం, వెండి విలువ లెక్కింపు విధానాన్ని పునఃసమీక్షించాలని మార్కెట్ నియంత్రణ మండలి సెబీ యోచిస్తోంది. ఇందుకోసం మ్యూచువల్ ఫండ్ కంపెనీలు దేశీయ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లు ప్రకటించే స్పాట్ ధరలను ప్రామాణికంగా తీసుకోవాలని సెబీ ప్రతిపాదించింది. ప్రస్తుతం మ్యూచువల్ ఫండ్స్.. లండన్ బులియన్ మార్కెట్ అసోసియేషన్ (ఎల్ఎంబీఏ) ధరలను ప్రామాణికంగా తీసుకుంటున్నాయని బుధవారం విడుదల చేసిన చర్చాపత్రంలో నియంత్రణ సంస్థ పేర్కొంది. గోల్డ్, సిల్వర్ ఈటీఎఫ్‌ల్లో మరింత స్థిరత్వంతో పాటు దేశీయ మార్కెట్ ధరలతో వీటిని అనుసంధానించేందుకు సెబీ తాజా ప్రతిపాదన దోహదపడనుంది. అంతేకాదు, దేశీయంగా ఒకే ప్రామాణిక ధరను ఏర్పాటు చేయడంతో పాటు ప్రజలకు అందుబాటులో ఉంచే స్పాట్ ధరను నిర్ణయించేందుకు సమగ్ర పోలింగ్ విధానాన్ని కూడా రూపొందించాలని ఆలోచిస్తోంది. తాజా ప్రతిపాదనలపై ఆగస్టు 9లోగా అభిప్రాయాలు తెలపాలని సెబీ ప్రజలను కోరింది.

జియోబ్లాక్‌రాక్ నుంచి 5 కొత్త ఫండ్స్

న్యూఢిల్లీ: కొత్తగా ఐదు మ్యూచువల్ ఫండ్ పథకాలు ప్రారంభించేందుకు క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ ఆమోదం లభించిందని జియోబ్లాక్‌రాక్ అసెట్ మేనేజ్‌మెంట్ బుధవారం వెల్లడించింది. జియోబ్లాక్‌రాక్ నిఫ్టీ 50 ఇండెక్స్ ఫండ్, జియోబ్లాక్‌రాక్ నిఫ్టీ 8-13 ఇయర్ జీ-సెక్ ఇండెక్స్ ఫండ్, జియోబ్లాక్‌రాక్ నిఫ్టీ స్మాల్‌క్యాప్ 250 ఇండెక్స్ ఫండ్, జియోబ్లాక్‌రాక్ నిఫ్టీ నెక్ట్స్ 50 ఇండెక్స్ ఫండ్, జియోబ్లాక్‌రాక్ నిఫ్టీ మిడ్‌క్యాప్ 150 ఇండెక్స్ ఫండ్ ఈ జాబితాలో ఉన్నాయి. ఇందులో నాలుగు ఈక్విటీ ఫండ్లు కాగా.. ఒకటి డెట్ ఫండ్. ఈ నెల 7న సంస్థ 3 న్యూ ఫండ్ ఆఫర్ల (ఎన్ఎఫ్ఓ) ద్వారా మొత్తం రూ.17,800 కోట్లు సమీకరించింది. ముకేశ్ అంబానీకి చెందిన జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ (జేఎఫ్ఎస్ఎల్), అమెరికా చెందిన బ్లాక్‌రాక్‌తో కలిసి సమ భాగస్వామ్యంలో ఏర్పాటు చేసిన కంపెనీయే జియోబ్లాక్‌రాక్ అసెట్ మేనేజ్‌మెంట్.

కాకినాడ ఎల్ఎన్‌జీ టెర్మినల్ ప్రాజెక్టులో కదలిక

పైప్‌లైన్ కోసం క్రౌన్ ఎల్ఎన్‌జీ-పీఐఎల్ మధ్య ఎంఓయూ

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ వద్ద క్రౌన్ ఎల్ఎన్‌జీ హోల్డింగ్స్ లిమిటెడ్ కంపెనీ ఏర్పాటు చేసే ఎల్ఎన్‌జీ టెర్మినల్ ప్రాజెక్టుకు సంబంధించి మరో అడుగు ముందుకు పడింది. ఈ టెర్మినల్‌ను అనుసంధానం చేస్తూ పైప్‌లైన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (పీఐఎల్) పైప్‌లైన్ ఏర్పాటు చేయనుంది. దీనికి సంబంధించిన అవగాహనా ఒప్పందం (ఎంఓయూ)పై ఇటీవల క్రౌన్ ఎల్ఎన్‌జీ హోల్డింగ్స్ సీఈఓ స్వపన్ కటారియా, పీఐఎల్ ఎండీ అఖిల్ మెహరోత్రా సంతకాలు చేశారు. క్రౌన్ ఎల్ఎన్‌జీ.. విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న ఎల్ఎన్‌జీని రీగ్యాసిఫికేషన్ చేసి దేశ ఉత్తర, పశ్చిమ ప్రాంతాల్లోని వినియోగదారులకు ఈ పైప్‌లైన్ ద్వారా సరఫరా చేస్తుంది.

రూ.9,000 కోట్ల ప్రాజెక్టు: కాకినాడ ఎల్ఎన్‌జీ ప్లాంట్ కోసం క్రౌన్ ఎల్ఎన్‌జీ హోల్డింగ్స్ రూ.9,000 కోట్ల వరకు ఖర్చు చేయనుంది. వచ్చే ఏడాది నిర్మాణం ప్రారంభించి నాలుగేళ్లలో ప్రాజెక్టు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఏటా 72 లక్షల టన్నుల ఎల్ఎన్‌జీ దిగుమతి సామర్థ్యంతో ఏర్పాటు చేసే కాకినాడ ఎల్ఎన్‌జీ టెర్మినల్ కోసం కృష్ణ గోదావరి ఎల్ఎన్‌జీ టెర్మినల్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో ప్రత్యేక అనుబంధ కంపెనీని కూడా ఏర్పాటు చేసింది. కాగా ఎనర్జీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ట్రస్ట్ (ఇన్విట్).. స్పెషల్ పర్పస్ వెహికల్‌గా పీఐఎల్ ఉంది. ఈ సంస్థ గుజరాత్‌లోని బరూచ్ నుంచి కాకినాడ వరకు దాదాపు 1,400 కిలోమీటర్ల పైప్‌లైన్‌ను నిర్వహిస్తోంది. రిలయన్స్ ఇండస్ట్రీస్ సహా మరికొన్ని సంస్థలు ఇక్కడ క్షేత్రాల నుంచి సహజ వాయువును రవాణా చేసేందుకు ఈ పైప్‌లైన్‌ను ఉపయోగిస్తున్నాయి.

హెచ్‌పీసీఎల్ విశాఖ రిఫైనరీలో గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్

కాంట్రాక్ట్ దక్కించుకున్న ఓసియర్ ఎనర్జీ

ముంబై:ప్రభుత్వ రంగంలోని హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) కూడా హరిత బాట పట్టింది. ఇందులో భాగంగా విశాఖపట్నంలోని తన రిఫైనరీ వద్ద ఏటా 5,000 టన్నుల ఉత్పత్తి సామర్థ్యం ఉన్న హరిత ఉదజని (హైడ్రోజన్) ప్లాంటు ఏర్పాటు చేస్తోంది. అబుదాబీ కేంద్రంగా పనిచేసే ఓసియర్ ఎనర్జీ ఈ ప్లాంటు ఏర్పాటు చేయనుంది. ఈ ప్లాంటు ఏర్పాటు కోసం ఎనిమిది కంటే ఎక్కువ కంపెనీలు ముందుకు వచ్చాయి. అయితే ఓసియర్ ఎనర్జీ కంపెనీ కిలో హరిత ఉదజనికి తక్కువలో తక్కువగా రూ.328 కోట్ చేయడం ద్వారా ఈ కాంట్రాక్టును దక్కించుకుంది. విశాఖ హెచ్‌పీసీఎల్ వద్ద ఏర్పాటు చేసే హరిత ఉదజని ప్లాంటును ఓసియర్ ఎనర్జీయే ఏర్పాటు చేసి పాతికేళ్ల పాటు నిర్వహిస్తుంది. కాగా ఓసియర్ ఇప్పటికే గుజరాత్, ఒడిశాల్లో హరిత ఉదజని, అమ్మోనియా ప్లాంటు దక్కించుకుంది.

వడ్డీ రేట్ల తగ్గింపుపై ఆచితూచి నిర్ణయం

ఆర్‌బీఐ గవర్నర్ మల్హోత్రా

న్యూఢిల్లీ: వడ్డీ రేట్లు మరింత తగ్గించడంపై తొందర లేదని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) గవర్నర్ సంజయ్ మల్హోత్రా స్పష్టం చేశారు. మారుతున్న ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా దీనిపై నిర్ణయం తీసుకుంటామన్నారు. జూన్ నెల రిటైల్ ద్రవ్యోల్బణం ఆరేళ్ల కనిష్ఠ స్థాయికి తగ్గడంతో ఆర్‌బీఐ తదుపరి ఎంపీసీ సమావేశంలోనూ రెపో రేటు మరో పావు శాతం తగ్గిస్తుందని అంచనాలు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో మల్హోత్రా వడ్డీ రేట్ల కోతలపై తొందరపడటం లేదని చెప్పడం విశేషం. ధరల స్థిరత్వంతో పాటు జీడీపీ వృద్ధి రేటు కూడా తమకు అత్యంత ముఖ్యమని మల్హోత్రా చెప్పారు. జీడీపీ వృద్ధి రేటు కంటే ద్రవ్యోల్బణ కట్టడే ఆర్‌బీఐ ముఖ్య కర్తవ్యమని చెప్పడం సరికాదన్నారు.

స్వల్ప లాభాలతో సరి

సెన్సెక్స్ 64 పాయింట్లు అప్

ముంబై: ట్రంప్ సుంకాల అనిశ్చితి ఇంకా వీడకపోవడంతో పాటు అంతర్జాతీయ మార్కెట్లో ట్రేడింగ్ ట్రెండ్ బలహీనంగా ఉండటంతో దేశీయ ఈక్విటీ ఇన్వెస్టర్లు వేచి చూసే ధోరణిని ప్రదర్శించారు. దాంతో పరిమిత శ్రేణిలోనే కదలాడిన ప్రామాణిక సూచీలు చివరికి స్వల్ప లాభంతో సరిపెట్టుకున్నాయి. బుధవారం ట్రేడింగ్ నిలిచేసరికి సెన్సెక్స్ 63.57 పాయింట్ల వృద్ధితో 82,634.48 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో సూచీ 82,784 వద్ద గరిష్ఠాన్ని, 82,342 వద్ద కనిష్ఠాన్ని నమోదు చేసింది. కాగా, నిఫ్టీ 16.25 పాయింట్ల పెరుగుదలతో 25,212.05 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో సగమే రాణించాయి.

ఆటోమొబైల్స్ కోసం ప్రత్యేక స్టీల్

ఏఎంఎన్ఎస్

న్యూఢిల్లీ: ఆటోమొబైల్ రంగం కోసం ప్రత్యేక స్టీల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఆర్సెలార్‌మిట్టల్ నిప్పన్ స్టీల్ (ఏఎంఎన్ఎస్) ప్రకటించింది. ఇందుకోసం గుజరాత్‌లోని హజీరా ప్లాంట్‌లో కొత్తగా కంటిన్యూయస్ గాల్వనైజింగ్ లైన్ (సీజీఎల్)ను ప్రారంభించినట్లు కంపెనీ తెలిపింది. రూ.60,000 కోట్ల పెట్టుబడి ప్రణాళికలో భాగంగా ఆటోమొబైల్ రంగానికి అవసరమైన అడ్వాన్స్‌డ్ హై-స్ట్రెంత్ స్టీల్ (ఏహెచ్ఎస్ఎస్) తయారీ కోసం ఈ లైన్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)




17వ తేదీ			
హైదరాబాద్	510	విజయవాడ	515
వరంగల్	512	గోదావరి	496
చిత్తూరు	583	విశాఖపట్నం	540
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	93	విజయవాడ	97
వరంగల్	93	గుంటూరు	102
కరీంనగర్	93	ఒంగోలు	105
మహబూబ్‌నగర్	93	చిత్తూరు	100
కర్నూలు	93	నెల్లూరు	105
విశాఖపట్నం	83	అనంతపురం	105
గోదావరి	97		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	99,280 ▼	91,000 ▼	1,24,000 ▼
విజయవాడ	1,00,530 ▼	94,500 ▼	1,14,500 ▼
విశాఖపట్నం	1,00,460 ▼	91,000 ▼	1,24,000 ▼
రాజమండ్రి	99,270 ▼	91,000 ▼	1,15,600 ▲
ప్రొద్దుటూరు	97,800 ▼	89,980 ▼	1,12,800 ▲
ముంబై	97,500 ▼	89,310 ▼	1,11,200 ▼

పేస్ పిచ్‌లపై స్పిన్ మాయ!

ఇంగ్లండ్‌లో తెలుగమ్మాయి శ్రీచరణి జోరు



ఇంగ్లండ్ పిచ్‌లు పేసర్లకు స్వర్గధామం. అలాంటి వికెట్‌పై ఓ స్పిన్నర్ ఏకంగా నాలుగు వికెట్లు పడగొట్టిందంటే అది ఆమెలోని అసాధారణ ప్రతిభకు నిదర్శనమే. ఆ అద్భుత నైపుణ్యంతోనే అందరి దృష్టినీ ఆకర్షించింది ఆంధ్రప్రదేశ్‌కు చెందిన యువ లెఫ్టామ్ స్పిన్నర్ శ్రీచరణి. క్లిష్టమైన ఇంగ్లండ్ పర్యటనకు జట్టులో చోటు కల్పిస్తూ సెలెక్టర్లు తనపై ఉంచిన నమ్మకానికి ఆమె పూర్తిగా న్యాయం చేసింది. ఇంగ్లండ్‌తో తొలి టీ20లో 210 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో శ్రీచరణి స్పిన్ మాయాజాలానికి ఇంగ్లండ్ కుదేలైంది. కెప్టెన్ నాట్ సివర్ బ్రంట్, ఎకెల్‌స్టోన్ వంటి సత్తా కలిగిన బ్యాటర్లు సైతం శ్రీచరణి స్పిన్ బంతులను ఎదుర్కోలేకపోయారు.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

కడప జిల్లాకు చెందిన నల్లపురెడ్డి శ్రీచరణి క్రికెట్ అరంగేట్రం ఎంతో ఆసక్తికరం. క్రికెట్‌కు ముందు ఆమె ఎన్నో ఆటలాడింది. ఖోఖో, కబడ్డీ, అథ్లెటిక్స్‌లో రాణించింది. కానీ క్రికెట్‌లోకి అడుగుపెట్టేందుకు మాత్రం ఆమె మామయ్య కిశోర్‌కుమార్ రెడ్డే కారణం. అయితే ఈ ఆటలో ప్రొఫెషనల్ అవుతానని మాత్రం శ్రీచరణి అస్సలు అనుకోలేదు. మొదట పేస్ బౌలింగ్‌లో ప్రయత్నించింది. కానీ వికెట్లు సాధించలేకపోయింది. దాంతో స్పిన్ బౌలింగ్‌ను ఎంచుకుంది. వాస్తవంగా..శ్రీచరణిని బ్యాడ్మింటన్ ప్లేయర్‌గా చూడాలనేది తండ్రి చంద్రశేఖర్‌రెడ్డి కోరిక. క్రికెట్‌కు మారతానంటే ఆయన ఓ పట్టాన అంగీకరించలేదు. శ్రీచరణి మాత్రం తాను క్రికెట్ మాత్రమే ఆడతానని భీష్మించింది. కుమార్తె పట్టుదలను చూసిన ఆయన సంవత్సరం తర్వాత తన అంగీకారాన్ని తెలిపారు. క్రికెట్ ఆటంటే మాటలా! బాగా ఖర్చుతో కూడుకున్నది. శ్రీచరణి తండ్రి అప్పటికే ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాడు.. కుమార్తెను క్రికెటర్‌గా తీర్చిదిద్దేందుకు ఆయన మరిన్ని ఆర్థిక ఇబ్బందులకూ వెరవలేదు. అలా తండ్రితోపాటు తల్లి ఇచ్చిన ప్రోత్సాహంతో కొద్దికాలంలోనే ఆమె రాష్ట్రస్థాయిలో సత్తా చాటడంతో జాతీయ సెలెక్టర్ల దృష్టిలో పడింది.

ఐపీఎల్‌లో..: గత ఏడాది డిసెంబరులో జరిగిన మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) వేలంలో ముంబై ఇండియన్స్‌తో పోటీపడిన ఢిల్లీ క్యాపిటల్స్ శ్రీచరణిని రూ. 55 లక్షలకు సొంతం చేసుకుంది. వేలానికి ముందు శ్రీచరణితో పాటు ఆమె తల్లిదండ్రులు బాగా టెన్షన్‌కు లోనయ్యారు. మొదటిసారి వేలంలో నిలిచిన తనను అసలు ఏ జట్టయినా కొనుగోలు చేస్తుందా..అనే అనుమానం ఆమెను బాగా పీడించింది. కానీ ఏకంగా అరకోటిపైగా మొత్తంతో ఢిల్లీ క్యాపిటల్ దక్కించుకోవడంతో శ్రీచరణి కుటుంబం అవధుల్లేని ఆనందానికి లోనైంది. ఆర్‌సీబీ ప్లేయర్ రాఘవి బిస్త్‌ను అవుట్ చేసి సాధించిన తొలి ఐపీఎల్ వికెట్‌ను ఎప్పటికీ మరిచిపోలేనని శ్రీచరణి అంటుంది. అది తాను వేసిన అత్యుత్తమ బంతిగా తెలిపింది.

అరంగేట్రంలోనే అదరగొట్టి..

గత ఏప్రిల్‌లో శ్రీచరణి మొదటిసారి జాతీయ జట్టుకు ఎంపికైంది. శ్రీలంకలో..దక్షిణాఫ్రికా, శ్రీలంక జట్లతో జరిగిన ముక్కోణపు వన్డే టోర్నీకి టీమిండియాలో ఆమెకు చోటు లభించింది. శ్రీలంకతో టోర్నీ ఆరంభ మ్యాచ్ ద్వారా వన్డే అరంగేట్రం చేసింది. సీనియర్ స్పిన్నర్ స్నేహ్ రాణా ద్వారా 'క్యాప్' అందుకోవడం జీవితంలో మరిచిపోలేని అనుభూతిగా శ్రీచరణి పేర్కొంది. మొదటి మ్యాచ్‌లో రెండు వికెట్లతో ఆమె సత్తా చాటింది. మొత్తంగా ఆ టోర్నీలో ఆరు వికెట్లు పడగొట్టిన శ్రీచరణి భారత జట్టు టైటిల్ గెలవడంలో కీలక భూమిక పోషించింది. శ్రీచరణి బౌలింగ్‌కు ఫిదా అయిన సెలెక్టర్లు ప్రస్తుతం ఇంగ్లండ్‌తో సిరీస్‌కూ ఆమెను ఎంపిక చేశారు. వారి నమ్మకాన్ని మరోసారి నిలబెడుతూ నాలుగు టీ20 మ్యాచ్‌ల్లో ఆమె పది వికెట్లు తీసి భళా అనిపించింది. ఇదే ఉత్సాహంతో వన్డే సిరీస్‌లోనూ శ్రీచరణి రాణించి..భారత జట్టులో విడదీయరాని భాగమవ్వాలని ఆశిద్దాం.

ఇంగ్లండ్‌కు రెండు పాయింట్ల కోత


- **స్లో ఓవర్ రేట్ జరిమానా కూడా..**

లండన్: లార్డ్స్‌లో భారత్‌తో జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో స్లో ఓవర్ రేట్‌కు పాల్పడిన ఇంగ్లండ్‌పై ఐసీసీ చర్యలు తీసుకుంది. రెండు వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) పాయింట్లు కోత విధించడంతోపాటు ఇంగ్లండ్ జట్టు మ్యాచ్ ఫీజులో 10 శాతం జరిమానాగా విధించింది. నిర్ణీత సమయంలో బౌల్ చేయాల్సిన ఓవర్ల కంటే రెండు ఓవర్లు తక్కువగా వేయడంతో మ్యాచ్ రెఫరీ చర్యలు తీసుకొన్నాడు. దీంతో డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో ఇంగ్లండ్ మూడో స్థానానికి పడిపోయింది. మూడో టెస్ట్‌లో టీమిండియాపై ఇంగ్లండ్ 22 పరుగుల తేడాతో గెలిచింది. కాగా, ఐసీసీ పక్షపాత ధోరణితో వ్యవహరిస్తోందని ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ మైకెల్ వాన్ అసంతృప్తి వ్యక్తం చేశాడు. 'ఇరుజట్లూ ఈ తప్పిదం చేశాయి. కానీ, ఒక్క టీమ్‌పైనే చర్యలు తీసుకోవడమేంటో నాకు అర్థం కావడం లేదు' అని వాన్ ఎక్స్‌లో పోస్టు చేశాడు.

హంపి, హారిక గేమ్‌లు డ్రా

బటూమి (జార్జియా): చెస్ వరల్డ్ కప్ ప్రీక్వార్టర్ ఫైనల్ తొలి గేమ్‌ను గ్రాండ్‌మాస్టర్లు హంపి, హారిక డ్రా చేశారు. కోస్టెన్యూక్‌తో హంపి, లగ్నోతో హారిక పాయింటు పంచుకున్నారు. అలాగే గ్రాండ్‌మాస్టర్ వైశాలి కూడా కమలిదెనోవాతో గేమ్‌ను డ్రాగా ముగించింది. మరో గేమ్‌లో దివ్యా దేశ్‌ముఖ్.. చైనాకు చెందిన ఝు జినెర్‌పై విజయంతో పూర్తి పాయింటు సాధించింది.

'లార్డ్స్' ఓటమికి గిల్ తీరే కారణం



న్యూఢిల్లీ: లార్డ్స్ టెస్ట్‌లో భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ వ్యవహార శైలిని మాజీ ఆటగాడు మహ్మద్ కైఫ్ తీవ్రంగా తప్పుబట్టాడు. మూడో రోజు ఆట చివర్లో ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు రాగా.. సమయం వృథా చేస్తున్నావంటూ ఓపెనర్ క్రాలేతో గిల్ గొడవకు దిగడం ఆ జట్టును రెచ్చగొట్టిందన్నాడు. అది మనసులో పెట్టుకొని స్టోక్స్ కసిగా బౌలింగ్ చేసి టీమిండియాను దెబ్బతీశాడని కైఫ్ విశ్లేషించాడు. తన తత్వానికి తగిన విధంగా గిల్ నడుచుకోవాలని హితవు పలికాడు. కాగా, కోహ్లీని గిల్ అనుకరించే ప్రయత్నం చేస్తున్నాడని మాజీ ఆటగాడు సంజయ్ మంజ్రేకర్ విమర్శించాడు. అందరి దృష్టిని ఆకర్షించడం కోసమే ఇలా చేస్తున్నాడన్నాడు.

బరిలో అర్జున్, ప్రజ్ఞానంద

ఫ్రీస్టయిల్ చెస్ గ్రాండ్‌స్లామ్ నేటినుంచి

లాస్ వెగాస్ (యూఎస్ఏ): తెలుగు గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేసి, తమిళ స్టార్ ప్రజ్ఞానంద, విదిత్ గుజరాతి.. బుధవారం నుంచి జరిగే లాస్ వెగాస్ ఫ్రీస్టయిల్ చెస్ గ్రాండ్ స్లామ్ టోర్నమెంట్‌లో పోటీపడుతున్నారు. ఈ మెగా టోర్నీలో ప్రపంచ చాంపియన్ గుకేశ్ ఆడడం లేదు. టోర్నీలో మొత్తం 16 మంది క్రీడాకారులు రెండు గ్రూపులుగా విడిపోయి తలపడనున్నారు. వైట్ గ్రూప్‌లో కార్ల్‌సన్, ప్రజ్ఞానంద ఉండగా, బ్లాక్ గ్రూప్ నుంచి అర్జున్, విదిత్ బరిలో ఉన్నారు. ప్రతి గ్రూప్‌లో తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన ఆటగాళ్లు క్వార్టర్స్‌కు చేరతారు. ఈనెల 21న ఫైనల్ జరగనుంది. టోర్నీ విజేతకు రూ. 1.71 కోట్లు ప్రైజ్‌మనీగా దక్కనుంది.

సింధు తొలి రౌండ్లోనే..

- జపాన్ ఓపెన్‌లో భారత స్టార్ పరాజయం
- సాత్విక్ జోడీ, లక్ష్య, అనుపమ ముందంజ



టోక్యో: భారత స్టార్ పీవీ సింధు జపాన్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ ఆరంభ రౌండ్లోనే పరాజయం పాలైంది. కొరియా షట్లర్ సిమ్ యు జిన్‌తో బుధవారం జరిగిన పోరులో మాజీ ప్రపంచ చాంపియన్ సింధు 15-21, 14-21తో చిత్తయింది. ఇలా.. తొలి రౌండ్లోనే ఓడడం ఈ ఏడాదిలో సింధుకిది ఐదోసారి కావడం గమనార్హం. మిగతా భారత అమ్మాయిల్లో అనుపమ ఉపాధ్యాయ 21-15, 18-21, 21-18తో సహచర షట్లర్ రక్షితపై నెగ్గగా, ఉన్నతి హుడా 8-21, 12-21తో పోర్న్ చోచువాంగ్ (థాయ్‌లాండ్) చేతిలో ఓటమి పాలైంది. పురుషుల సింగిల్స్‌లో లక్ష్య సేన్ 21-11, 21-18తో వాంగ్ జెంగ్ (చైనా)ను ఓడించి రెండో రౌండ్ చేరాడు. డబుల్స్‌లో ప్రపంచ 15వ ర్యాంక్ జోడీ సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ శెట్టి 21-18, 21-10తో కొరియా జంట కాంగ్ మిన్/కిమ్ డోంగ్‌ను చిత్తుచేసి టోర్నీలో శుభారంభం చేసింది. డబుల్స్‌లో హరిహరణ్/రూబన్ కుమార్ జోడీ, మహిళల డబుల్స్‌లో కవిప్రియ/సిమ్రన్ ద్వయం ప్రత్యర్థుల చేతిలో ఓడి ఆదిలోనే ఇంటిబాట పట్టారు.

దీపికదే మ్యాజిక్ స్కిల్ అవార్డు



న్యూఢిల్లీ: భారత మహిళల హాకీ జట్టు స్ట్రయికర్ దీపిక అంతర్జాతీయ వేదికపై మెరిసింది. అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) పాలిగ్రాస్ మ్యాజిక్ స్కిల్ అవార్డును 21 ఏళ్ల దీపిక గెలుచుకుంది. ఎఫ్ఐహెచ్ ప్రో లీగ్‌లో అత్యంత సృజనాత్మకత, నైపుణ్యవంతమైన ప్రదర్శన కనబరచిన ఆటగాళ్లకు మ్యాజిక్ స్కిల్ అవార్డును అందజేస్తారు. ప్రపంచవ్యాప్తంగా హాకీ అభిమానులు ఓటింగ్ ద్వారా అవార్డు విజేతను నిర్ణయిస్తారు. ఈ సీజన్ ప్రో లీగ్‌లో భాగంగా భువనేశ్వర్‌లో నెదర్లాండ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ తరపున దీపిక కళ్లు చెదిరే ఫీల్డ్ గోల్ చేసింది. ఈ ప్రదర్శనే దీపికకు అవార్డు తీసుకొచ్చింది. ఈ అవార్డు నామినేషన్స్‌లో స్పెయిన్ క్రీడాకారిణి పాట్రిసియా, ఆస్ట్రేలియా మహిళల జట్టును అధిగమించి దీపిక విజేతగా నిలిచింది.

ఇంగ్లండ్ 258/6

భారత మహిళలతో తొలి వన్డే

సౌతాంప్టన్: సోఫియా డంక్లే (83), అలిస్ డేవిడ్‌సన్ రిచర్డ్స్ (53) అర్ధ శతకాలతో ఆదుకోవడంతో.. ఇంగ్లండ్ మహిళల జట్టు తడబడి నిలబడింది. భారత్‌తో బుధవారం జరిగిన తొలి వన్డేలో ఇంగ్లండ్ 50 ఓవర్లలో 6 వికెట్లకు 258 పరుగులు చేసింది. కెప్టెన్ నాట్ సివర్ బ్రంట్ (41) ఫర్వాలేదనిపించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్.. పేసర్ క్రాంతి దెబ్బకు ఓపెనర్లు అమీ జోన్స్ (1), టామీ బ్యూమాంట్ (5) వికెట్లను చేజార్చుకొంది. అయితే, ఎమ్మా ల్యాంబ్ (39), బ్రంట్ రెండో వికెట్‌కు 71 పరుగులు జోడించడంతో ఇంగ్లండ్ కోలుకొంది. నిలకడగా సాగుతున్న సమయంలో స్పిన్నర్ రాణా తన వరుస ఓవర్లలో వీరిద్దరినీ పెవిలియన్ చేర్చడంతో ఇంగ్లండ్ 97/4తో ఇబ్బందుల్లో పడినట్టుగా కనిపించింది. ఈ దశలో అలిస్ సహకారంతో డంక్లే స్కోరు బోర్డును నడిపించింది. అయితే, అలిస్‌ను అవుట్ చేసిన శ్రీచరణి.. ఐదో వికెట్‌కు 106 పరుగుల భాగస్వామ్యాన్ని బ్రేక్ చేసింది. డెత్ ఓవర్లలో డంక్లేకు ఎకెల్‌స్టోన్ (23 నాటౌట్) జత కలవడంతో.. స్కోరు సునాయాసంగా 250 మార్క్ దాటింది. ఇన్నింగ్స్ చివరి బంతికి డంక్లేను అమన్‌జోత్ బౌల్డ్ చేసింది.

బంగ్లాదే టీ20 సిరీస్

కొలంబో: ఆతిథ్య శ్రీలంకతో టీ20 సిరీస్‌ను బంగ్లాదేశ్ 2-1తో గెలుచుకుంది. బుధవారం జరిగిన ఆఖరిదైన మూడో టీ20లో బంగ్లా 8 వికెట్లతో లంకను ఓడించింది. మొదట శ్రీలంక 20 ఓవర్లలో 7 వికెట్లకు 132 పరుగులు చేసింది. ఓపెనర్ నిస్సాంక (46) టాప్ స్కోరర్. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' మెహిదీ హసన్ (4/11) నాలుగు వికెట్లతో లంక బ్యాటింగ్ పతనాన్ని శాసించాడు. ఛేదనలో బంగ్లా.. ఓపెనర్ తన్జిద్ హసన్ (73) అర్ధ సెంచరీకి తోడు కెప్టెన్ లిట్టన్ దాస్ (32) రాణించడంతో 16.3 ఓవర్లలోనే 133/2 స్కోరు చేసి గెలిచింది.

రూట్ 'నెం. 1' రికార్డు

- బౌలర్లలో టాప్‌లోనే బుమ్రా
- టెస్టు ర్యాంకింగ్స్



దుబాయ్: ఇంగ్లండ్ స్టార్ బ్యాటర్ జో రూట్ ర్యాంకింగ్స్‌లో మళ్లీ అగ్రస్థానానికి చేరుకున్నాడు. బ్యాటర్ల జాబితాలో గతవారం హ్యారీ బ్రూక్‌కు టాప్ ర్యాంక్‌ను కోల్పోయిన రూట్.. బుధవారం ప్రకటించిన తాజా టెస్టు ర్యాంకింగ్స్‌లో అగ్రపీఠాన నిలిచాడు. ఈ క్రమంలో 2014 డిసెంబరులో సంగక్కర (37 ఏళ్ల వయసులో) తర్వాత టెస్టుల్లో నెంబర్‌వన్‌గా నిలిచిన పెద్ద వయసు బ్యాటర్‌గా 34 ఏళ్ల రూట్ రికార్డుకెక్కాడు. ఇక, ఇప్పటిదాకా టాప్‌లో ఉన్న బ్రూక్ మూడో స్థానానికి పడిపోయాడు. కేన్ విలియమ్సన్ మూడు నుంచి రెండో ర్యాంక్‌కు ఎగబాకాడు. భారత బ్యాటర్లలో యశస్వీ జైస్వాల్ 5, పంత్ 8, గిల్ 9వ ర్యాంకుల్లో ఉన్నారు. కేఎల్ రాహుల్ ఐదు స్థానాలు మెరుగై 35వ ర్యాంక్‌కు చేరాడు. ఇక, లార్డ్స్ టెస్టులో ఇంగ్లండ్ బౌలర్లు ఆధిపత్యం చెలాయించినా, ర్యాంకింగ్స్‌లో మాత్రం టీమిండియా స్టార్ జస్‌ప్రీత్ బుమ్రా అగ్రస్థానం చెక్కు చెదరలేదు. బుమ్రా బౌలర్ల జాబితాలో నెంబర్‌వన్‌గా తన స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. రబాడ రెండో ర్యాంక్‌లో ఉన్నాడు.

కులగణన రాహుల్ విజయం

- సామాజిక న్యాయం సాకారానికి ఇదో ముందడుగు
- ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ అంశాలనూ పొందుపరచాలి
- వెనుకబడిన వర్గాలకు అండగా నిలిచిన యోధుడు రాహుల్
- ఏఐసీసీ ఓబీసీ సలహా మండలి తీర్మానాలు
- మీడియాకు వెల్లడించిన సిద్ధరామయ్య



బెంగళూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): 'సమాజంలో అట్టడుగు వర్గాలకు సామాజిక న్యాయం కల్పించేందుకు రాహుల్ గాంధీ ధైర్యంగా పోరాటం చేస్తున్నారు. వెనుకబడిన వర్గాలకు అండగా నిలబడిన న్యాయ యోధుడు రాహుల్ గాంధీకి ధన్యవాదాలు' అని ఏఐసీసీ ఓబీసీ సలహా మండలి ఏకగ్రీవ తీర్మానం చేసింది. బెంగళూరులో జరిగిన ఏఐసీసీ ఓబీసీ సలహా మండలి తొలి సమావేశంలో మూడు కీలక తీర్మానాలను ఆమోదించారు. ఆ వివరాలను కర్ణాటక సీఎం సిద్దరామయ్య బుధవారం మీడియాకు వెల్లడించారు. కుల గణన అంశంలో రాహుల్ దృఢసంకల్పం మనువాది ప్రధాని మోదీ ప్రభుత్వం దిగివచ్చేలా చేసిందన్నారు. రాహుల్ నాయకత్వంలో సమానత్వం, సమసమాజానికి అవసరమైన సామాజిక పరివర్తన, రాజ్యాంగ ఉద్దేశాలను సాధించుకోవాలని నిర్ణయించామని తెలిపారు. ప్రతి వ్యక్తికి సంబంధించిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ అంశాలను కులగణనలో పొందుపరచాలని, కులాలను ప్రముఖంగా పరిగణించాలని పేర్కొన్నారు. కులగణన అనేది వెనుకబడినవర్గాలలో సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ స్థితిగతులపై జరిపేదని, దీనికి తెలంగాణలో అమలు చేసిన విధానం ఒక మోడల్ అని చెప్పారు. రిజర్వేషన్‌ల పరిమితిని 50శాతం దాటి.. విద్య, ఉద్యోగ, రాజకీయ తదితర రంగాల్లో వెనుకబడిన వర్గాలకు సమగ్రంగా రిజర్వేషన్ కల్పించాలన్నారు. రాజ్యాంగంలోని 15(5) ఆర్టికల్ ప్రకారం ప్రైవేట్ విద్యా సంస్థల్లోనూ రిజర్వేషన్ అమలు చేయాలని తీర్మానం చేశామని చెప్పారు. 1931 తర్వాత కులగణన కర్ణాటకలోనే తొలిసారి జరిగిందని, అది కూడా ఆదర్శమేనన్నారు. తాజాగా మరో సర్వే నిర్వహించాలని నిర్ణయించామని తెలిపారు. సమావేశంలో సలహా మండలి సంచాలకులు అనిల్ జైహింద్, మాజీ సీఎం వీరప్పమొయిలీ, పుదుచ్చేరి మాజీ సీఎం నారాయణస్వామి, ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం భూపేశ్ భగేల్ తదితరులుపాల్గొన్నారు.

కర్ణాటక దాటి పరిశ్రమలను వెళ్లనివ్వం

- ఏరోస్పేస్ పారిశ్రామికవేత్తలకు భూమి కేటాయిస్తాం
- ఏపీ మంత్రి లోకేశ్ ట్వీట్ పరిశీలించాను: కర్ణాటక మంత్రి పాటిల్



బెంగళూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): తమ రాష్ట్రంలోని పారిశ్రామికవేత్తలను ఎక్కడకి వెళ్లనివ్వబోమని, వారికి తగిన భూమిని కేటాయిస్తామని కర్ణాటక భారీ పరిశ్రమలశాఖ మంత్రి ఎంబీ పాటిల్ అన్నారు. డిఫెన్స్, ఏరోస్పేస్ పార్క్ కోసం దేవనహళ్లిలో చేపట్టిన భూస్వాధీన ప్రక్రియను రైతులు వ్యతిరేకించడంతో దానిని వదులుకున్నామని, అంతమాత్రాన పారిశ్రామికవేత్తలకు రాష్ట్రంలో తగిన భూమి లేనట్లు కాదని ఆయన చెప్పారు. బెంగళూరులో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఏరోస్పేస్, డిఫెన్స్ పారిశ్రామికవేత్తలకు వారు కోరిన చోట అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్ ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్ ట్వీట్‌ను పరిశీలించానని, ఆ రాష్ట్రానికి ఎవరూ వెళ్లబోరని అన్నారు. రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో ఏరోస్పేస్, ఏఐ, డీప్‌టెక్, ఐటీ తరహా అన్ని రకాల పరిశ్రమలకు తగిన భూమి ఉందన్నారు. కర్ణాటక నుంచి బయటకు ఒక్క పారిశ్రామికవేత్తను కూడా పంపేది లేదని, అటువంటి సదుపాయాలు కల్పిస్తామని ధీమా వ్యక్తం చేశారు. కాగా, కర్ణాటక ఏరోస్పేస్ పారిశ్రామికవేత్తలను ఏపీ మంత్రి లోకేశ్ ఎక్స్ వేదికగా మంగళవారం స్వాగతం పలికిన విషయం తెలిసిందే.

హంద్రీ-నీవాకు కూటమి హారతి



హంద్రీ నీవా విస్తరణలో భాగంగా చేపట్టిన లైనింగ్ పనులు



- సీమలో పథకానికి నాడు ఎన్టీఆర్ రూపకల్పన
- కరువు పల్లెలకు కృష్ణాజలాల మళ్లింపే లక్ష్యం
- 1.70 కోట్లు క్యూబిక్ మీటర్ల మట్టి తవ్వకాలు
- 45 లక్షల చదరపు మీటర్ల లైనింగ్
- 120 రోజుల్లో రికార్డు స్థాయిలో విస్తరణ పనులు
- పిల్ల కాలువలు పూర్తయితేనే లక్ష్యం సాకారం
- నేడు కృష్ణాజలాలు విడుదల చేయనున్న సీఎం

సీమ జీవనాడి...
శ్రీశైలం ఎగువన 40 టీఎంసీల ఎత్తిపోత
ఉమ్మడి కర్నూలు, అనంత, చిత్తూరు,
కడప జిల్లాలకు కృష్ణా జలాలు
6.05 లక్షల ఎకరాలకు సాగునీరు
35 లక్షల జనాభాకు తాగునీరు

(కర్నూలు - ఆంధ్రజ్యోతి)

రాయలసీమ కల.. ఎన్టీఆర్ సంకల్పం హంద్రీ-నీవా! కృష్ణా జలాలు కరువుసీమకు మళ్లించాలని ఆయన రూపకల్పన చేసిన ప్రాజెక్టుల్లో ఒకటి హంద్రీ నీవా సుజల స్రవంతి ఎత్తిపోతల పథకం. ఉమ్మడి కర్నూలు, అనంతపురం, చిత్తూరు, కడప జిల్లాల్లో 6.05 లక్షల ఎకరాలకు సాగునీరు, 35 లక్షల జనాభాకు తాగునీరు అందించడం ఈ పథకం లక్ష్యం. పలు అవరోధాలను అధిగమించి 2012లో ట్రయల్ రన్ విజయవంతం చేశారు. అప్పటి నుంచి నీటిని ఎత్తిపోస్తున్నా.. పూర్తి సామర్థ్యం సంతరించుకోని పరిస్థితి ఉంది. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రతిష్ఠాత్మకంగా విస్తరణ పనులు చేపట్టి 120 రోజుల్లో రికార్డు స్థాయిలో మట్టి, లైనింగ్ పనులు పూర్తి చేశారు. గురువారం సీఎం చంద్రబాబు మాల్యాల వద్ద జల హారతి ఇచ్చి.. రాయలసీమ జీవనాడి హంద్రీ-నీవా కాలువకు నీటిని విడుదల చేయనున్నారు. ఇదే ఊపుతో పిల్ల కాలువల నిర్మాణం కూడా పూర్తయితే ఎన్టీఆర్ కల సంపూర్ణం అయినట్టే!

సీమకు జలకళ కోసం..

రాయలసీమ అంటే గుర్తుకొచ్చేది కరువు కాటకాలు.. దుర్భిక్షం....బతుకు పోరులో పల్లెజనం పడుతున్న వలస కష్టాలు....ఈ ప్రాంతంలో శ్రీశైలం జలాశయం నిర్మించినా ఒక్క ఎకరాకు సాగునీరు అందని దైన్య పరిస్థితి. ఏటేటా వేల టీఎంసీలు కృష్ణా జలాలు సముద్రం పాలవుతున్నా.. గుక్కెడు నీరు అందక పరితపిస్తున్న పల్లెసీమలెన్నో. ఆ సమయంలో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఎన్టీఆర్ తెలుగుగంగ, గాలేరు-నగరి ప్రాజెక్టు, హంద్రీ-నీవా సుజల స్రవంతి ఎత్తిపోతల పథకాలకు రూపకల్పన చేశారు. 1985-90 మధ్యలో హంద్రీ-నీవా ప్రాజెక్టు డిజైన్ ఖరారు చేశారు. అయితే వివిధ కారణాలు వల్ల పనుల్లో వేగం పుంజుకోలేదు. 2004-05లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిధులు కేటాయించి పనులు మొదలు పెట్టింది. 2012లో ట్రయల్ రన్ విజయవంతం చేశారు. 2013 నుంచి కృష్ణా జలాలు ఎత్తిపోస్తున్నారు.

కూటమి వచ్చాక పెరిగిన వేగం..

శ్రీశైలం ఎగువన 40 టీఎంసీల కృష్ణా వరద జలాలు ఎత్తిపోసి రాయలసీమలోని అన్ని జిల్లాల పరిధిలో 6.05 లక్షల ఎకరాలకు సాగునీరు, 35 లక్షల జనాభాకు తాగునీరు అందించడం లక్ష్యం. దీనికోసం 3,850 క్యూసెక్కుల సామర్థ్యంతో మాల్యాల లిఫ్ట్ సహా ఎనిమిది ఎత్తిపోతల పథకాల వద్ద 12 పంపులు ఏర్పాటుచేశారు. అయితే.. పూర్తిస్థాయి సామర్థ్యం మేర నీటిని ఎత్తిపోసుకోవడానికి వీలుగా మెయిన్ కెనాల్ లేకపోవడంతో 1,800 నుంచి 2 వేల క్యూసెక్కులకు మించి ఎత్తిపోయలేని పరిస్థితి. రాష్ట్ర విభజన తరువాత 2017-18లో అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ.1,030 కోట్లతో 3,850 క్యూసెక్కుల ప్రవాహానికి ప్రధాన కాలువ విస్తరణ పనులు చేపట్టింది. వైసీపీ ప్రభుత్వం వచ్చాక అటకెక్కించింది. మళ్లీ కూటమి ప్రభుత్వం రావడంతో విస్తరణ పనులకు శ్రీకారం చుట్టారు.

మట్టి, లైనింగ్ పనుల్లో రికార్డు

నంద్యాల జిల్లా మల్యాల లిఫ్ట్ నుంచి కుప్పం వరకు కాంట్రాక్ట్ సంస్థల ఒప్పందం విలువ రూ.1,970 కోట్లతో హంద్రీ నీవా విస్తరణ పనులను చేపట్టారు. ఫేజ్-1 పరిధిలో 0/0 నుంచి 216.300 కిలోమీటర్ల వరకు మట్టి, లైనింగ్, 216.300 కిలోమీటర్ల నుంచి 400.500 కిలోమీటర్ల వరకు ప్రధాన కాలువ, కుప్పం, పుంగనూరు బ్రాంచి కెనాల్స్ లైనింగ్, మట్టి పనులు 11 ప్యాకేజీలుగా విభజించి మార్చి 15న మొదలు పెట్టారు. సీఎం చంద్రబాబు, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు క్షేత్రస్థాయిలో, వారం వారం ఇంజనీర్లు, కాంట్రాక్ట్ సంస్థలతో వర్చువల్ ద్వారా సమీక్షలు నిర్వహిస్తూ పురోగతిపై లక్ష్యాలు నిర్దేశించారు. 1.89 కోట్ల క్యూబిక్ మీటర్ల మట్టి పనులు, 80.61 లక్షల చదరపు మీటర్ల సీసీ లైనింగ్, షాట్ క్రెటింగ్ చేయాలనేది లక్ష్యం. కేవలం 120 రోజుల్లో 1.73 కోట్లు క్యూబిక్ మీటర్ల మట్టి పనులు, 45 లక్షల చదరపు మీటర్ల లైనింగ్, షాట్ క్రెటింగ్ పనులు పూర్తి చేసి రికార్డు సృష్టించారు. చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించడం వల్లే ఇది సాధ్యమయిందని హంద్రీ-నీవా ప్రాజెక్టు ఎస్ఈ నాగరాజు, కర్నూలు సర్కిల్-1 ఎస్ఈ పాండురంగయ్య పేర్కొన్నారు. 2006-07లో పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ 44 వేల క్యూసెక్కులకు విస్తరణలో భాగంగా కేవలం మూడు నెలలో 1.30 కోట్ల క్యూబిక్ మీటర్ల మట్టి పనులు చేస్తే.. ఆ తర్వాత అంతకు మించి బ్లాస్టింగ్, మట్టి పనులు, లైనింగ్ పనులు చేయడం ఓ రికార్డే అంటున్నారు.

పిల్ల కాలువల పనుల్లో కదలికేది?

కడలిపాలు అవుతున్న కృష్ణా జలాలు మెట్ట పొలాలకు మళ్లించి కరువు నేలను సస్యశామలం చేయాలనే సంకల్పంతో ఎన్టీఆర్ హంద్రీ నీవాకు రూపకల్పన చేశారు. ప్రధాన కాలువ దాదాపుగా పూర్తి చేసినా పంట పొలాలకు సాగునీరు అందించే డిస్ట్రిబ్యూటరీలు, పంట కాలువల నిర్మాణం చేపట్టలేదు. కర్నూలు జిల్లాలో 80 వేలు, ఉమ్మడి అనంతపురం జిల్లాలో 3.45 లక్షలు, అన్నమయ్య జిల్లాలో 37,500, చిత్తూరు జిల్లాలో 1.40 లక్షల ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. కర్నూలు జిల్లాలో కేవలం 25-30 వేల ఎకరాలకు కూడా సాగునీరు ఇవ్వడం లేదు. ఎకరాకు రూ.20-25 వేల చొప్పున రూ.1,250 - 1,500 కోట్లు ఖర్చు చేసే 6.05 లక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వవచ్చని ఇంజనీర్లు అంటున్నారు.

ప్రతిభ, అవకాశాలకు కేంద్రంగా ఏపీ

- లింక్డ్‌ఇన్ నివేదికపై సీఎం చంద్రబాబు హర్షం

న్యూఢిల్లీ/అమరావతి, జూలై 16(ఆంధ్రజ్యోతి): ప్రతిభ, అవకాశాలకు కేంద్రంగా ఏపీ ఆవిర్భవిస్తోందని సీఎం చంద్రబాబు అన్నారు. లింక్డ్‌ఇన్ తొలిసారి 'సిటీస్ ఆన్ ది రైజ్-2025' పేరుతో రూపొందించిన నివేదికలో.. ఉద్యోగాల కల్పన అసాధారణ స్థాయిలో వృద్ధి చెందుతున్న నగరాల్లో విశాఖపట్నం, విజయవాడ మొదటి, మూడో స్థానాలను దక్కించుకోవడంపై ఆయన 'ఎక్స్' వేదికగా హర్షం వ్యక్తం చేశారు. ఈ ర్యాంకులు రాష్ట్ర ప్రభుత్వం దూరదృష్టితో కూడిన నూతన పారిశ్రామిక విధానాల ప్రభావాన్ని ప్రతిబింబిస్తున్నాయని పేర్కొన్నారు. టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి దిగ్గజ సంస్థలు రాష్ట్రంలో క్యాంపస్‌లు ఏర్పాటు చేయడం, క్వాంటమ్ వ్యాలీ, ఏఐ వర్సిటీ వంటివి ప్రారంభం కానుండటంతో దేశానికి ఐటీ హబ్‌గా ఏపీ నిలువనుందని చంద్రబాబు వెల్లడించారు.

18న టీడీపీపీ భేటీ

అమరావతి, జూలై 16(ఆంధ్రజ్యోతి): తెలుగు దేశం పార్లమెంటరీ పార్టీ సమావేశం 18వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు జరగనుంది. ఉండవల్లిలోని ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసంలో ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. 21వ తేదీ నుంచి పార్లమెంటు వర్షాకాల సమావేశాలు జరగనున్న నేపథ్యంలో టీడీపీపీ సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సమావేశానికి టీడీపీ ఎంపీలు 16 మందితోపాటు ఇద్దరు రాజ్యసభ సభ్యులు హాజరవుతారు. వర్షాకాల సమావేశాల్లో పార్లమెంటులో అనుసరించాల్సిన వ్యూహాలు, సమస్యలపై చర్చించేందుకు టీడీపీపీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు.

ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో డిగ్రీ దరఖాస్తులు

అమరావతి, జూలై 16(ఆంధ్రజ్యోతి): డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తుల విధానంలో ఉన్నత విద్యా శాఖ మార్పులు చేసింది. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తులు సమర్పించే విధానం అమల్లో ఉండగా.. ఈ విద్యా సంవత్సరం నుంచి ఆఫ్‌లైన్‌లోనూ దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది. డిగ్రీ అడ్మిషన్ల నిబంధనలు-2000కు ఈ మేరకు సవరణలు చేస్తూ ఉన్నత విద్యా శాఖ కార్యదర్శి కోన శశిధర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం...

- ఓఏఎండీసీ వెబ్‌సైట్ ద్వారా వేర్వేరు కాలేజీలకు, వేర్వేరు కోర్సులకు దరఖాస్తు చేసుకోవచ్చు.
- విద్యార్థి నేరుగా కాలేజీకి వెళ్లి కూడా దరఖాస్తు సమర్పించవచ్చు. ఆ కాలేజీ ప్రిన్సిపాల్ ఆ దరఖాస్తును ఓఏఎండీసీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసి, విద్యార్థికి ధ్రువీకరణ పత్రం ఇస్తారు.
- ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే సమయంలో ఆధార్ ధ్రువీకరణ తప్పనిసరి.
- ఒకవేళ ఒక విద్యార్థి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో రెండు రూపాల్లో దరఖాస్తు చేసుకుంటే ఆఫ్‌లైన్‌లో కాలేజీలో సమర్పించిన దరఖాస్తును మొదటి ప్రాధాన్యతగా తీసుకుంటారు. మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయిస్తారు.
- మొత్తం సీట్లలో 15 శాతం ఎస్సీ కేటగిరీ కింద ఉంటాయి. ఎస్సీ వర్గీకరణ వర్తిస్తుంది.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

మనసులో నిలిచిపోతుంది



'పల్లెటూరి నేపథ్యంలో వస్తున్న పూర్తి వినోదాత్మక చిత్రం 'కొత్తపల్లిలో ఒకప్పుడు'. ఈ సినిమాలోని పాత్రల తాలూకు భావోద్వేగాలకు ప్రేక్షకులు అనుభూతి చెందుతారు. విభిన్నమైన.. విలక్షణమైన సినిమాలతో టాలీవుడ్‌లో మంచి పేరు తెచ్చుకున్నారు ప్రవీణ. ఆమె గొప్ప విజన్‌తో ఈ సినిమాను తెరకెక్కించారు. ప్రతి సన్నివేశం మనసులో నిలిచిపోయేలా ఉంటుంది. ప్రేక్షకులు ఈ సినిమాను ఆదరించాలి' అని నటుడు రానా కోరారు. ఆయన సమర్పణలో ప్రవీణ పరుచూరి దర్శకత్వం వహించిన చిత్రమిది. ఈ శుక్రవారం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ప్రవీణ మాట్లాడుతూ 'ఇది నాకు నిర్మాతగా మూడో సినిమా. దర్శకురాలిగా తొలి సినిమా. మీకు నచ్చితే మరో నలుగురికి చెప్పి మమ్మల్ని ప్రోత్సహించండి' అని కోరారు. 'నా సినీ గమనాన్నే మార్చే పాత్రను ఈ సినిమాలో చేశాను. మా టీమ్ అంతా చాలా కష్టపడి మీ ముందుకు మంచి సినిమాతో వస్తున్నాం. అన్ని వర్గాల ప్రేక్షకుల్ని మెప్పించే చిత్రమిది' అని హీరో మనోజ్ చంద్ర చెప్పారు.

రజనీని కలసిన కమల్



తన స్నేహితుడు, తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్‌ను అగ్ర నటుడు కమల్ హాసన్ బుధవారం కలుసుకున్నారు. చెన్నై పోయెస్ గార్డెన్‌లో ఉన్న రజనీకాంత్ నివాసంలో వీరిద్దరి భేటీ జరిగింది. డీఎంకే కూటమి తరపున రాజ్యసభకు ఎంపికైన కమల్ హాసన్.. ఈ నెల 25వ తేదీన ప్రమాణం చేయనున్నారు. ఈ నేపథ్యంలో తన మిత్రుడు రజనీకాంత్‌ను కలిశారు. ఈ మేరకు కమల్ హాసన్ ఓ ట్వీట్ చేస్తూ, "నూతన ప్రయాణాన్ని ప్రారంభించే ముందు నా ఆనందాన్ని నాకెంతో ఇష్టమైన స్నేహితుడితో పంచుకున్నా. ఈ క్షణం నాకెంతో సంతోషంగా ఉంది' అంటూ పేర్కొన్నారు. కాగా, గత 2018లో మక్కల్ నీది మయ్యం పేరుతో రాజకీయ పార్టీని ప్రారంభించిన కమల్ హాసన్... డీఎంకే కూటమిలో ఉన్న అవగాహనా ఒప్పందం మేరకు తమిళనాడు నుంచి పెద్దల సభకు నామినేట్ చేసింది. ఆయనతో పాటు మరో ఇద్దరు డీఎంకే సభ్యులు రాజ్యసభ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

రవితేజకు పితృవియోగం



రవితేజ ఇంట్లో విషాదం నెలకొంది. ఆయన తండ్రి రాజ గోపాల్ రాజు(90) కన్నుమూశారు. ఆయనకు ముగ్గురు సంతానం. వారిలో రవితేజ పెద్ద కుమారుడు. రెండో కుమారుడు భరత్ కారు ప్రమాదంలో మరణించారు. మూడో కుమారుడు రఘు ఇండస్ట్రీలోనే ఉన్నారు. ఆయన ఫార్మసిస్టుగా ఉద్యోగం చేశారు. ఆయన మృతి పట్ల చిరంజీవి, పవన్‌కల్యాణ్ తో సహా పలువురు సినీ ప్రముఖులు సంతాపం తెలిపారు.




వారిద్దరూ చెబితే తిరుగుండదు

రాజమౌళి

వ్యాపారవేత్త గాలి జనార్ధన్ రెడ్డి తనయుడు కిరీటి రెడ్డి హీరోగా రాధాకృష్ణ తెరకెక్కించిన చిత్రం 'జూనియర్'. శ్రీలీల హీరోయిన్. జెనీలియా, రావు రమేశ్ కీలక పాత్రలు పోషించారు. సాయి శివానీ సమర్పణలో రజనీ కొర్రపాటి నిర్మించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతున్న సందర్భంగా ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన దర్శకుడు రాజమౌళి మాట్లాడుతూ "సాయి ఈ సినిమాను ప్రారంభించినప్పుడు మొదట చిన్న ప్రాజెక్ట్ అనుకున్నాను. కానీ ఇప్పుడు దీనిని ఇంత పెద్ద చిత్రంగా మార్చారు. 'ఈ అబ్బాయి బాగా చేశాడు' అని పీటర్ హెయిన్స్, కె.కె.సెంథిల్‌కుమార్ చెప్పేవారు. వారిద్దరూ అలా ఒకరి గురించి చెప్పారంటే ఆ వ్యక్తికి ఇండస్ట్రీలో తిరుగుండదు. దర్శకుడు రాధాకృష్ణ ఎంతో కష్టపడి ఈ సినిమా తెరకెక్కించారు. ఆయన గొప్ప విజయం అందుకుంటారని ఆశిస్తున్నాను. ఇది ఓ పైసా వసూల్ ఎంటర్టైనర్ అవుతుంది" అని అన్నారు. "ఈ సినిమాలో ఒక యాక్షన్ సన్నివేశం ఉంటుంది. అలాంటిది భారతీయ సినిమాల్లో ఇంతవరకూ చూసి ఉండరు" అని కిరీటి రెడ్డి తెలిపారు.

భక్తి ప్రతిఘటనగా మారితే..



మరాఠీ నటుడు సుబోధ్ భావే టైటిల్ రోల్ పోషించిన చిత్రం 'సంత్ తుకారామ్'. ఆదిత్య ఓం దర్శకత్వం వహించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ రిలీజ్ డేట్ పోస్టర్‌ని ఆవిష్కరించింది. తన భక్తిని ప్రతిఘటనగా మార్చిన 17వ శతాబ్దపు మరాఠీ సాధువు, కవి సంత్ తుకారామ్ జీవితం, వారసత్వం, సాహిత్య విప్లవం ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందించారు. శివ సూర్యవంశీ, షీనా చోహన్, సంజయ్ మిశ్రా, అరుణ్ గోవిల్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ప్రముఖ నటుడు ముకేశ్ ఖన్నా వాయిస్ ఓవర్ ఈ చిత్రానికి హైలెట్ కానుంది. నిఖిల్ కామత్, రవి త్రిపాఠి, వీరల్, లావన్ స్వరపరచిన పాటలు అందర్నీ ఆకట్టుకుంటాయని చిత్ర యూనిట్ తెలిపింది.

మనసుకు హత్తుకునే భావోద్వేగాలతో



నరసింహ నంది దర్శకత్వం వహిస్తున్న తాజా చిత్రం 'ప్రభుత్వ సారాయి దుకాణం'. విక్రమ్, అదితి జంటగా నటించారు. దైవ నరేశ్ గౌడ్, పరిగి స్రవంతి మల్లిక్ నిర్మించారు. ఇటీవలె నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా నరసింహ నంది మాట్లాడుతూ '1980ల నాటి ఓ తెలంగాణ గ్రామంలో జరిగిన అనూహ్య సంఘటనల సమాహారంగా ఈ చిత్రం తెరకెక్కుతోంది. మనసుకు హత్తుకునే భావోద్వేగాలున్న కథ ఇది' అని అన్నారు. 'పల్లెటూరి నేపథ్యంలో వస్తున్న పూర్తి వినోదాత్మక చిత్రమిది. వాణిజ్య, సామాజిక అంశాలను కలిపి నరసింహ నంది మంచి కథతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు' అని నిర్మాతలు తెలిపారు.

ఎన్‌సీసీ క్యాడెట్లకు అడ్మిషన్లలో గ్రేస్ మార్కులు

- 15 శాతం వరకు అమలు
- వైద్య, సాంకేతిక, ఇతర కోర్సులకు వర్తింపు

అమరావతి, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీ క్యాడెట్లకు పలు కోర్సుల్లో ప్రవేశాలకు 15శాతం వరకు గ్రేస్ మార్కులు ఇస్తూ ఉన్నత విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. వివిధ కోర్సుల్లో ఎన్‌సీసీ విభాగానికి 1శాతం సీట్లు ఉంటాయి. వాటిని పొందేందుకు ఆ క్యాడెట్లకు గరిష్ఠంగా 15శాతం గ్రేస్ మార్కులు ఇస్తారు. అర్హత పరీక్షలో అర్హత సాధించిన లేదా కటాఫ్ మార్కులు సాధించిన వారికి ఇది వర్తిస్తుంది. ఉన్నత విద్య, సాంకేతిక విద్య, వ్యవసాయ, పశు సంవర్థక, డెయిరీ విభాగాలకు సంబంధించిన డిప్లొమా, అండర్ గ్రాడ్యుయేట్, పీజీ కోర్సుల్లో ఈ గ్రేస్ మార్కుల విధానం అమలుకు ప్రభుత్వం జీవో 43ని జారీచేసింది. ఎ సర్టిఫికెట్‌కు 1శాతం, ఎ, బి సర్టిఫికెట్లకు 3శాతం, ఎ, బి, సి సర్టిఫికెట్లు ఉన్నవారికి 10శాతం గ్రేస్ మార్కులు ఇస్తారు. ఎ, బి సర్టిఫికెట్లు కలిగి ఉండి టీఎస్‌సీ, వీఎస్‌సీ, ఎన్ఎస్‌సీ ఈవెంట్లలో పాల్గొన్నవారికి 8శాతం గ్రేస్ మార్కులు లభిస్తాయి. ఎ, బి సర్టిఫికెట్లు కలిగి ఉండి టీఎస్‌సీ, వీఎస్‌సీ, ఎన్ఎస్‌సీ, ఆర్‌డీసీల్లో పాల్గొన్నవారికి 15శాతం మార్కులు వస్తాయి. మూడు సర్టిఫికెట్లు ఉండి టీఎస్‌సీ, వీఎస్‌సీ, ఎన్ఎస్‌సీ, ఆర్‌డీసీల్లో పాల్గొన్నవారికి కూడా 15శాతం మార్కులు ఇస్తారు. ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్ కోర్సుల్లో ప్రవేశాలకు ఎన్‌సీసీ కోటా గ్రేస్ మార్కుల అమలుపై ఉన్నత విద్యాశాఖ జీవో 44 విడుదల చేసింది.

గ్రూప్-1 స్పోర్ట్స్ కోటాలో 28 మంది తిరస్కరణ

అమరావతి, జూలై 16(ఆంధ్రజ్యోతి): స్పోర్ట్స్ కోటా గ్రూప్-1 అభ్యర్థులపై శాప్ రూపొందించిన తాత్కాలిక అర్హత జాబితాను ఏపీపీఎస్సీ విడుదల చేసింది. సర్టిఫికెట్ల పరిశీలనకు 37 మంది అభ్యర్థులు హాజరయ్యారు. పత్రాల పరిశీలన అనంతరం 28 మందిని శాప్ తిరస్కరించింది. అర్హులు, అనర్హుల జాబితాలను ఏపీపీఎస్సీ వెబ్‌సైట్‌లో ఉంచింది. దానిపై జూలై 21 ఉదయం 10గంటల వరకు అభ్యంతరాలు పంపొచ్చని కమిషన్ సూచించింది. వాటి ఆధారంగా శాప్ తుది జాబితాను విడుదల చేస్తుంది.

లారీలపై జగన్ గ్రీన్ బాదుడు భారీగా తగ్గింపు

- ఉత్తర్వులు జారీ చేసిన చంద్రబాబు ప్రభుత్వం

అమరావతి, విజయవాడ, జూలై 16(ఆంధ్రజ్యోతి): గ్రీన్ ట్యాక్స్ పేరుతో జగన్ ప్రభుత్వం లారీ యజమానులపై వేసిన భారాన్ని చంద్రబాబు ప్రభుత్వం తగ్గించింది. వైసీపీ ప్రభుత్వం పర్యావరణం పేరుతో 12 సంవత్సరాలు దాటిన రవాణా వాహనాలపై పన్ను భారాన్ని విధించింది. పది టన్నుల లారీలపై రూ.5,000, 30 టన్నుల లారీలపై 15 వేలు విధించడంతో లారీ యజమానులు గగ్గోలు పెట్టారు. తాము అధికారంలోకి వస్తే ఆ ట్యాక్స్‌ను భారీగా తగ్గిస్తామని ఎన్నికల ముందు చంద్రబాబు హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత లారీ యజమానుల సంఘం చంద్రబాబుకు సమస్యను విన్నవించింది. దీంతో రూ.5 వేల భారాన్ని రూ.1,500కు, రూ.15 వేల భారాన్ని రూ.మూడు వేలకు తగ్గిస్తూ బుధవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కాగా దీనిపై ఏపీ లారీ ఓనర్స్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది. బుధవారం సంఘం ప్రధాన కార్యదర్శి వైవీ ఈశ్వరరావు మీడియాతో మాట్లాడారు. సమస్యపై సానుకూలంగా స్పందించిన సీఎంకు, రవాణా మంత్రికి... రవాణా వాహనాల యాజమాన్యం రుణపడి ఉంటుందని అన్నారు.

నేడు ఢిల్లీకి మున్సిపల్ అధికారులు

- స్వచ్ఛ సర్వేక్షణ అవార్డులు అందుకునేందుకు అనుమతిస్తూ ఉత్తర్వులు

అమరావతి, జూలై 16(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సర్వేక్షణ్ 2024 అవార్డులు అందుకునేందుకు నేడు మున్సిపల్ మంత్రి నారాయణతో పాటు పలువురు అధికారులు ఢిల్లీకి వెళ్లనున్నారు. ఢిల్లీలో జరిగే ఈ బహుమతుల ప్రదానం కార్యక్రమానికి హాజరయ్యేందుకు అనుమతిస్తూ మున్సిపల్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల్లో సూపర్ స్వచ్ఛ లీగ్ సిటీస్ కింద విజయవాడ, గుంటూరు, తిరుపతి ఎంపికయ్యాయి. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ తరపున మంత్రి నారాయణ, గుంటూరు మేయర్ భాగ్యలక్ష్మి, కమిషనర్ ధ్యానచంద్ర అవార్డులు అందుకోనున్నారు. అలాగే గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ తరపున స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పి.శ్రీనివాసులు, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ తరపున మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి సురేశ్ కుమార్, మేయర్ డాక్టర్ ఆర్ శిరీష, కమిషనర్ ఎన్.మౌర్య ఈ అవార్డులు అందుకోనున్నారు.

బీసీ గురుకుల కాంట్రాక్టు టీచర్ల రెన్యువల్

అమరావతి, జూలై 16(ఆంధ్రజ్యోతి): జ్యోతిబాపూలే బీసీ గురుకులాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్లు 62 మందికి 2026 ఏప్రిల్ 30 వరకూ కాంట్రాక్టు రెన్యూవల్ చేశారు. ఈ మేరకు బీసీ సంక్షేమ శాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

ఎరువుల షాపులపై విజిలెన్స్ దాడులు

అమరావతి, జూలై16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో వ్యవసాయ శాఖతోపాటు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు రెండు రోజులుగా దాడులు నిర్వహించాయి. 624 రిటైల్, 104 హోల్‌సేల్, 30తయారీ కంపెనీల్లో తనిఖీలు జరిపారు. రూ.40.31కోట్ల విలువైన 159.42 క్వింటాళ్ల విత్తనాలు, 9,502 టన్నుల ఎరువులు, 1,79,636లీటర్ల పురుగు మందు స్వాధీనం చేసుకున్నారు. రూ.33.16లక్షల విలువైన 77.54టన్నుల ఎరువులు, 1,858లీటర్ల పురుగు మందు సీజ్ చేశారు. ఇద్దరు ఎరువుల డీలర్లు, ఇద్దరు పురుగు మందుల డీలర్ల లైసెన్సులు సస్పెండ్ చేశారు. నలుగురు విత్తన వ్యాపారులు, ఇద్దరు ఎరువుల డీలర్ల లైసెన్సులు రద్దు చేశారు. ఎరువుల డీలర్లపై ఐదు కేసులు నమోదు చేశారు.

కోకో మద్దతు ధరకు నిధుల విడుదల

అమరావతి, జూలై 16(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సీజన్‌లో అమ్ముడుపోని 2,976.76 టన్నుల కోకో గింజలను ప్రభుత్వం సేకరించింది. కోకో గింజలు కిలో రూ.500గా ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో రూ.450 వ్యాపారులు, రూ.50 ప్రభుత్వం ఇస్తోంది. రైతులకిచ్చిన బోనస్ కింద రూ.14,884కోట్లు ప్రభుత్వం మార్కెట్ స్థిరీకరణ నిధి నుంచి మంజూరు చేసింది. ఈమేరకు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వం విడుదల చేసిన సొమ్మును ఉద్యాన శాఖ వ్యాపారులకు చెల్లించనున్నది.

దేవదాయ శాఖలో 'ఎఫ్ఆర్ఎస్'

- దేవదాయ శాఖ కమిషనర్ ఆదేశాలు

అమరావతి, జూలై 16(ఆంధ్రజ్యోతి): దేవదాయ శాఖ పరిధిలో విధులు నిర్వహించే అధికారులు, ఉద్యోగులకు ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ (ఎఫ్ఆర్ఎస్) అమలు చేయనున్నారు. వారి జీతాలను దీనికి అనుసంధానం చేశారు. ఆలయాల్లో కైంకర్యాలు నిర్వర్తించే అర్చకులకు మాత్రం ఈ విధానం నుంచి మినహాయింపు ఇచ్చారు. అర్చకులకు కూడా ఎఫ్ఆర్ఎస్ అమలు చేయాలని 2017లో అప్పటి కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. దీనిపై అర్చక సంఘాలు హైకోర్టును ఆశ్రయించాయి. దీంతో కమిషనర్ ఇచ్చిన ఉత్తర్వులను హైకోర్టు తాత్కాలికంగా నిలుపుదల చేసింది. అయితే దేవదాయ శాఖ పరిధిలో విధులు నిర్వహించే వారంతా ఎఫ్ఎస్ఆర్ విధానంలో కచ్చితంగా హాజరు వేయాలని తిరుపతి రీజినల్ జాయింట్ కమిషనర్ (ఆర్జేసీ) ఇటీవల ఆదేశాలు జారీ చేశారు. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఆంధ్రప్రదేశ్ అర్చక ఐక్య వేదికకు చెందిన అర్చకులు దేవదాయ శాఖ కమిషనర్‌ను మంగళవారం కలిశారు. ఎఫ్ఆర్ఎస్ అంశంహైకోర్టు పరిధిలో ఉందని, తిరుపతి ఆర్జేసీ ఇచ్చిన ఉత్తర్వులు రద్దు చేయాలని వినతిపత్రం అందించారు. ఈ మేరకు అర్చకులందరికీ ఎఫ్ఆర్ఎస్ నుంచి మినహాయింపు ఇస్తూ కమిషనర్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు.

మసాల్చీల దినసరి వేతనం పెంపు

- నెలలో 26 రోజులకు వర్తింపు: మంత్రి ఫరూక్

అమరావతి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వివిధ కోర్టుల్లో పని చేస్తున్న మసాల్చీల దినసరి వేతనాన్ని రూ.300 నుంచి రూ.570కు పెంచినట్లు మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. కోర్టుల ప్రాంగణాన్ని శుభ్రంగా ఉంచడం, చిన్న చిన్న సహాయక పనులు చేసేవారు(మసాల్చీలుగా) దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న వేతన సమస్యను ప్రభుత్వం పరిష్కరించినట్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దినసరి వేతనాన్ని పెంచడమే కాకుండా వేతనాన్ని నెలలో 26 రోజుల వరకు వర్తింపజేస్తున్నట్లు తెలిపారు. మసాల్చీలు ఇక నుంచి నెలకు దాదాపు రూ.14,820 వరకు వేతనం పొందుతారని వెల్లడించారు. ప్రభుత్వ నిర్ణయంపై మసాల్చీలు హర్షం వ్యక్తం చేశారు.

భూ సేకరణపై అడుగు ముందుకే!



భూ సేకరణకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న జనం

మొత్తం 20వేల ఎకరాల సేకరణే లక్ష్యం

- రామాయపట్నం పోర్టు, బీపీసీఎల్, ఇండోసోల్‌కు కలిపి...
- స్పెషల్ కలెక్టర్‌తో ప్రత్యేక కార్యాలయం
- డిప్యూటీ కలెక్టర్ల ఆధ్వర్యంలో ఐదు బృందాలు
- జీవో జారీ చేసిన ప్రభుత్వం

కందుకూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఇండోసోల్ సోలార్ కంపెనీ కోసం నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలం కరేడులో భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని ప్రభుత్వం నిర్ణయించుకుంది. రామాయపట్నం పోర్టుకు అనుబంధంగా భూములు సేకరించడంతోపాటు... బీపీసీఎల్, ఇండోసోల్ సోలార్ ప్లాంటు కోసం కూడా భూములు సేకరించనుంది. మొత్తం 20వేల ఎకరాల భూసేకరణ లక్ష్యంగా స్పెషల్ కలెక్టర్ నేతృత్వంలో ప్రత్యేక కార్యాలయం ఏర్పాటు చేయనుంది. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ల సారథ్యంలో భూసేకరణ కోసం ఐదు బృందాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం అత్యవసర జీవో జారీ చేసింది. భూసేకరణ ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలని స్పష్టం చేసింది. అలాగే... కరేడులో రైతులను శాంతింపజేసి, వారు భూములు ఇచ్చేందుకు అంగీకరించేలా మంత్రులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు.

వైసీపీ రాజకీయం...

కరేడులో భూసేకరణకు వ్యతిరేకంగా పార్టీలు, కుల మతాలకు అతీతంగా ఉద్యమిస్తున్న తరుణంలో రాజకీయ పార్టీలు ఎవరికి వారు ఉద్యమ ఫలాలను తమ ఖాతాలో జమచేసుకోవాలని చేస్తున్న ప్రయత్నాలు తీవ్రమయ్యాయి. ఇండోసోల్ కంపెనీకి తెర వెనుక నుంచి మద్దతు ఇస్తున్న వైసీపీ... ఒకవైపు కరేడులో రైతుల సానుభూతి పొందేందుకు ప్రయత్నిస్తూనే, మరోవైపు ఉద్యమాన్ని నీరుగార్చేలా వ్యవహరిస్తోందని రైతులు ఆగ్రహిస్తున్నారు. వైసీపీ ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు, నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ నేతృత్వంలో 20 మంది రైతు ప్రతినిధులు వైసీపీ అధినేత జగన్‌ను కలిశారు. ఇండోసోల్‌కు మనం వ్యతిరేకం కాదని, వారికి ముందుగా కేటాయింపులు చేసిన చేవూరు, రావూరు పరిధిలోనే భూములు ఇవ్వాలన్న డిమాండ్‌తో ఉద్యమం కొనసాగించాలని జగన్ సూచించినట్లు సమాచారం. ఉద్యమానికి వైసీపీ రాజకీయ రంగు పులమడంతో... జగన్‌ను కలిసిన ప్రతినిధులతో కలిసి పనిచేసేందుకు టీడీపీ శ్రేణులు వెనుకాడుతున్నారు. మరోవైపు సీపీఎం, సీపీఐ, ఆమ్ ఆద్మీ పార్టీలు ఎవరికి వారే ఉద్యమాన్ని తమ ఖాతాలో వేసుకోవాలన్న ధోరణిలో వెళ్తున్నాయని... ఇది తమ ఐక్యతను దెబ్బతీస్తుందని కరేడు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



కరేడు గ్రామం వ్యూ



గ్రామంలోని పంటలు

'కరేడు'పై అపోహలొద్దు..

చర్చలకు సిద్ధం



నెల్లూరు కలెక్టర్ ఆనంద్

4,800 ఎకరాలే సేకరణ.. ఆ మేరకే ప్రాథమిక నోటిఫికేషన్

- 3 గ్రామాలే ఖాళీ అవుతాయి
- మిగిలిన గ్రామాలు, భూముల జోలికెళ్లం
- 'ఆంధ్రజ్యోతి'తో నెల్లూరు కలెక్టర్ ఆనంద్

(నెల్లూరు-ఆంధ్రజ్యోతి)

నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలం కరేడు గ్రామంలో ఇండోసోల్ సోలార్ పరిశ్రమకు భూసేకరణపై రైతులకు ఎటువంటి అపోహలు వద్దని జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ అన్నారు. 4,800 ఎకరాలకు మాత్రమే ప్రాథమిక నోటిఫికేషన్ ఇచ్చామని, ఇప్పటికైతే అంతకుమించి భూములను తీసుకోబోమని స్పష్టం చేశారు. అది కూడా మూడు పంటలు పండే భూములను తీసుకోవడం లేదన్నారు. మూడు హ్యాబిటేషన్లు మాత్రమే ఖాళీ అవుతాయని, మిగిలిన హ్యాబిటేషన్ల జోలికి వెళ్లబోమని తెలిపారు. రైతులకు ఎటువంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావచ్చని అన్నారు. రామాయపట్నం పోర్టు ఫలితంగా ఆ చుట్టుపక్కల ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయన్నారు. ఈ ప్రాంతాల్లో పరిశ్రమలు ఏర్పాటైతే మరింత వృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. కరేడులో భూసేకరణపై అక్కడి రైతులు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో కలెక్టర్ ప్రత్యేకంగా 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. రైతులు, స్థానిక ప్రజలు ఎవరూ అపోహలు, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. "కరేడు గ్రామ పరిధిలో 19 హ్యాబిటేషన్లు ఉండగా, సుమారు 12వేల ఎకరాల భూములున్నాయి. వీటిలో 4,800 ఎకరాలే సోలార్ పరిశ్రమకు భూసేకరణ చేస్తున్నాం. మిగిలిన భూములను తీసుకోవడం లేదు. భూసేకరణలో మూడు హ్యాబిటేషన్లు మాత్రమే ఖాళీ అవుతాయి. మిగిలిన 16 హ్యాబిటేషన్ల జోలికి వెళ్లడం లేదు. పశ్చిమ ప్రాంతంలోని భూములనే సేకరిస్తున్నాం. ఈ ప్రాంతంలో 14 వేల మంది వరకూ జనాభా ఉండగా వారిలో ఐదు వేల మందికి పైగా మత్స్యకారులే ఉన్నారు. మత్స్యకారుల వేటకు ఎటువంటి ఇబ్బందులు ఉండవు" అన్నారు.

కోరుకున్న చోట ఆర్అండ్ఆర్

"భూసేకరణలో భాగంగా మూడు హ్యాబిటేషన్ల పరిధిలోని సుమారు 300 కుటుంబాలను అక్కడి నుంచి తరలించాల్సి ఉంటుంది. ఈ కుటుంబాలన్నింటికీ భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం, ఇతర ప్రయోజనాలు అందిస్తాం. వీరు కోరుకున్న చోట ఆర్అండ్ఆర్ కాలనీ ఏర్పాటు చేస్తాం. వీరందరికీ సోలార్ పరిశ్రమలో ఉద్యోగావకాశాలు కల్పిస్తాం. స్థానికంగా ఏర్పాటయ్యే పరిశ్రమల్లో ఉద్యోగాలను స్థానికులకిచ్చేలా కృషి చేస్తాం" అని తెలిపారు.

ఎవరికీ అన్యాయం జరగదు

'భూసేకరణ విషయంలో రైతులకు ఎటువంటి అనుమానాలున్నా నివృత్తి చేసేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. భూసేకరణ చట్టం ప్రకారం భూములకు పరిహారం నిర్ణయించాం. పంట భూములకు ఎకరాకు రూ.12.5 లక్షలు, కొబ్బరి చెట్లున్న భూములకు ఎకరాకు రూ.17.5లక్షలుగా నిర్ణయించాం. జాతీయ రహదారి ఆనుకొని ఉన్న భూములకు రూ.62.5 లక్షల వరకూ ఉంది. ఈ పరిహారం విషయంలో ఎలాంటి అభ్యంతరాలున్నా మాకు చెప్పొచ్చు. వారితో చర్చించేందుకు సిద్ధంగా ఉన్నాం' అని కలెక్టర్ పేర్కొన్నారు.

సోషల్ ఆడిట్‌కు సర్టిఫికెట్ కోర్సు

సెప్టెంబరు నుంచి ఇంజనీరింగ్ విద్యార్థులకు శిక్షణ

అమరావతి, జూలై 16(ఆంధ్రజ్యోతి): సోషల్ ఆడిట్ నిర్వహణలో ఎన్ని ఆడిట్‌లు పూర్తి చేశామనేది కాకుండా ఎంతమేర మార్పులు తీసుకొచ్చామన్నదే ముఖ్యమని డిప్యూటీ సీఎం ఓఎస్‌డీ వెంకటకృష్ణ అన్నారు. బుధవారం మంగళగిరిలోని హ్యాపీ రిసార్ట్స్‌లో జాతీయ సోషల్ ఆడిట్ వర్క్‌షాపును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సోషల్ ఆడిట్‌ను అన్ని శాఖలకు విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. సోషల్ ఆడిట్‌కు సంబంధించి సర్టిఫికెట్ కోర్సును ఏపీలో ప్రారంభించాలని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ భావిస్తున్నారని తెలిపారు. ఈ కోర్సులో భాగంగా ఇంజనీరింగ్ విద్యార్థులకు సెప్టెంబరు నుంచి శిక్షణ ప్రారంభిస్తామని చెప్పారు. జాతీయ స్థాయిలో ఈ శిక్షణ అందించే సంస్థలకు ఏపీ వేదిక కానుందన్నారు. దేశంలో మొదటగా సోషల్ ఆడిట్ ప్రారంభించి ఇతర రాష్ట్రాలకు ఏపీ ఆదర్శంగా నిలిచిందని ఏపీ సోషల్ ఆడిట్ డైరెక్టర్ శ్రీకాంత్ అన్నారు. సోషల్ ఆడిట్ సిబ్బందిని ఉపాధి హామీ కార్మికుల కుటుంబాల నుంచి ఎంపిక చేశామని, గ్రామాల్లో ప్రజా ఆడిట్ నిర్వహించడంలో సఫలీకృతమయ్యామని వివరించారు. సోషల్ ఆడిట్‌కు కేంద్రం ఇచ్చే నిధులను పొదుపుగా వాడుకుంటున్నామని తెలిపారు. ప్రతి గ్రామసభను డాక్యుమెంటేషన్ చేస్తున్నామని, మండల సభలను లైవ్ ఇచ్చి సోషల్ ఆడిట్‌ను పారదర్శకంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ కన్సల్టెంట్ జి.సుస్మిత, ఎన్ఐఆర్‌డీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

దయనీయ స్థితిలో సంక్షేమ హాస్టళ్లు

అక్కడ పరిస్థితులు ఆందోళనకరం

- వాటిల్లో కంటే పిల్లలు ఇంటి వద్ద ఉండటమే మేలు
- పరిస్థితి చక్కదిద్దేందుకు ఏమి చర్యలు తీసుకుంటున్నారు?
- నిర్దిష్ట ప్రతిపాదనలతో మా ముందుకు రండి
- సీఎస్, సాంఘిక సంక్షేమశాఖ డైరెక్టర్‌కు హైకోర్టు ఆదేశం



అమరావతి, జూలై 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ, బీసీ, గురుకుల హాస్టళ్లు, అక్కడ చదివే విద్యార్థుల పరిస్థితి దయనీయంగా ఉందని హైకోర్టు ధర్మాసనం పేర్కొంది. రాష్ట్రంలోని ఉమ్మడి 13 జిల్లాల్లో ప్రభుత్వం నిర్వహించే 65 హాస్టళ్లను పరిశీలించి డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ అధికారులు సమర్పించిన నివేదికను చూసి విస్మయం వ్యక్తం చేసింది. హాస్టళ్లలో విద్యార్థులకు శుభ్రమైన తాగునీరు, పౌష్టికాహారం అందడం లేదని, బెడ్లు, బెడ్ షీట్లు, దిండ్లు కూడా లేవని తెలిపింది. తగినన్ని మరుగుదొడ్లు, బాత్‌రూమ్‌లు లేవని తెలిపింది. చాలాచోట్ల హాస్టల్ భవనాలు కూలిపోయే దశలో ఉన్నాయని ఆందోళన వ్యక్తంచేసింది. నర్సీపట్నంలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో 228 మంది విద్యార్థినులుంటే అక్కడ ఒక మరుగుదొడ్డి, ఒక బాత్‌రూమ్ మాత్రమే వినియోగించే స్థితిలో ఉన్నాయంది. అలాగే విజయనగరంలోని ప్రభుత్వ అంధుల పాఠశాలలో 33 మంది విద్యార్థుల ఉండగా సహాయకుల పోస్టులు అన్నీ ఖాళీగా ఉన్నాయని పేర్కొంది. విజయనగరంలోని ఓ ప్రభుత్వ హాస్టల్‌లో 168 మంది విద్యార్థినులకు 10 గదులే అందుబాటులో ఉన్నాయని తెలిపింది. ప్రభుత్వ వసతి గృహాల్లో కంటే పిల్లలు తల్లిదండ్రులు వద్ద ఉండడమే మేలని వ్యాఖ్యానించింది. ఏ ఉద్దేశంతో ఈ వసతి గృహాలు ఏర్పాటు చేశారో అది నెరవేరడం లేదని పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సాంఘిక సంక్షేమ, బీసీ, గురుకుల హాస్టళ్ల, పాఠశాలల్లో మౌలికవసతుల కల్పనకు రూ.633 కోట్లు కేటాయించామని ప్రభుత్వం చెబుతోందని ధర్మాసనం తెలిపింది. ఈ నేపథ్యంలో నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ మార్గదర్శకాల ప్రకారం వసతుల కల్పన కోసం ఎంత సొమ్ము అవసరం అవుతుంది? పరిస్థితిని చక్కదిద్దేందుకు ఏమి చర్యలు తీసుకుంటున్నారు? నిర్దిష్ట ప్రతిపాదనలతో తమముందు హాజరుకావాలని రాష్ట్ర సీఎస్, సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్‌ను ఆదేశించింది. ఈనెల 21న ఆన్‌లైన్ ద్వారా విచారణకు హాజరుకావాలంది. తదుపరి విచారణను 21కి వాయిదా వేస్తూ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది.

2019-24 మధ్య నామమాత్రపు నిధులు: ఎస్‌జీపీ

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే సంక్షేమ హాస్టళ్లలో నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ మార్గదర్శకాల మేరకు కల్పించాల్సిన మౌలికసదుపాయాలు కూడా కల్పించకపోవడాన్ని సవాల్ చేస్తూ కాకినాడకు చెందిన కీతినీడి అఖిల్ శ్రీగురు తేజ 2023లో హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ పిల్ ఇటీవల విచారణకు రాగా... ప్రతీ జిల్లాలో కనీసం 5 సంక్షేమ హాస్టళ్లను పరిశీలించి నివేదిక సమర్పించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థలను ధర్మాసనం ఆదేశించింది. కోర్టు ఆదేశాలకు అనుగుణంగా అధికారులు సంక్షేమ హాస్టళ్లను సందర్శించి హైకోర్టుకు నివేదిక సమర్పించారు. ఈ పిల్ బుధవారం మరోసారి విచారణకురాగా పిటిషనర్ తరపున న్యాయవాది జి.అరుణ్‌శౌరి వాదనలు వినిపించారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) ఎస్.ప్రణతి వాదనలు వినిపిస్తూ.. గురుకుల హాస్టళ్లలో 2019-24 మధ్య మౌలికవసతుల కల్పనకు నామమాత్రం సొమ్ము కేటాయించారన్నారు. రూ.20 కోట్లు కూడా ఖర్చు చేయలేదన్నారు. ప్రస్తుత ఆర్థికసంవత్సరంలో మౌలికవసతులకు రూ.633 కోట్లు కేటాయించిందన్నారు.

అనధికార వీధి వ్యాపారులకు షాక్

- లైసెన్స్ లేనివారిని అనుమతించొద్దు
- కొత్తగా లైసెన్స్‌లు జారీ చేయొద్దు
- ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

అమరావతి, జూలై 16(ఆంధ్రజ్యోతి): అనధికారిక వీధి వ్యాపారులకు హైకోర్టు గట్టి షాకిచ్చింది. లైసెన్స్ లేనివారిని ఆయా ప్రాంతాల్లో వ్యాపారం చేసేందుకు అనుమతించవద్దని అధికారులకు తేల్చిచెప్పింది. వీధి వ్యాపారుల జీవనోపాధి రక్షణ, విక్రయాల నియంత్రణ చట్టం-2014లోని నిబంధనల అమలుకు ప్రణాళిక సిద్ధం చేసేవరకు కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో వీధి వ్యాపారులకు కొత్తగా లైసెన్స్‌లు జారీ చేయొద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. నియంత్రణ లేకుండా వీధి వ్యాపారాలకు అనుమతిస్తూ పోతే నగరాలు మురికివాడలుగా మారతాయని వ్యాఖ్యానించింది. వీధి వ్యాపారుల జీవనోపాధి ముఖ్యమే అయినప్పటికీ అది ఆయా ప్రాంతాల్లో నివసించేవారికి ఇబ్బంది కలిగించేలా ఉండకూడదని పేర్కొంది. కొన్ని ప్రాంతాల్లో అత్యవసర సర్వీసులైన అంబులెన్స్, ఫైర్ సర్వీసులు వెళ్లలేని పరిస్థితి ఉందని తెలిపింది. వీధి వ్యాపారం చేసేవారికి వెనుక వ్యవస్థీకృత దళారుల పాత్రను కొట్టిపారేయలేమని, అలాంటి వారిని అధికారులు ఎందుకు నియంత్రించలేకపోతున్నారని ప్రశ్నించింది. వీధి వ్యాపారుల చట్టం అమలుకు తీసుకున్న చర్యలపై అఫిడవిట్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. విచారణను ఆగస్టు 13కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు ఇచ్చింది. విజయవాడ బీసెంట్ రోడ్డు మధ్యలో, ఇరువైపులా ఆక్రమించి చట్టవిరుద్ధంగా వ్యాపారాలు నిర్వహిస్తున్న వీధి వ్యాపారులు, హాకర్లపై చర్యలు తీసుకొనేలా మున్సిపల్ కార్పొరేషన్ అధికారులను ఆదేశించాలని కోరుతూ బీసెంట్ రోడ్ బిల్డింగ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎం.వెంకట విజయప్రసాద్ పిల్ దాఖలు చేశారు. విశాఖపట్నం పాత జైలు రోడ్డులో జీవీఎంసీ అనుమతులు లేకుండా అనధికారికంగా నైట్ ఫుడ్ కోర్టును నిర్వహిస్తున్నా, జీవీఎంసీ కమిషనర్ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదంటూ జనసేన కార్పొరేటర్ పీవీఎల్ఎన్ మూర్తి యాదవ్ పిల్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలు బుధవారం విచారణకు రాగా పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాది కె.ఎస్. మూర్తి, న్యాయవాది డి. హర్షవర్ధన్ వాదనలు వినిపించారు. విజయవాడ కార్పొరేషన్ తరపున స్టాండింగ్ కౌన్సిల్ శివరామ్ వాదనలు వినిపించారు.



ఆపరేషన్ కగార్‌తో.. భారీ నష్టమే జరిగింది

అంగీకరించిన మావోయిస్టులు

- ఫ్లెక్సిబుల్ యుద్ధానికి పిలుపు.. గత ఏడాది 357 మంది మృతి
- ఈ నెలాఖరు నుంచి అమర వీరుల వారోత్సవాలు
- మావోయిస్టుల నివేదికలో వెల్లడి.. పోలీసు లెక్కల్లో 217 మరణాలే?

హైదరాబాద్, జూలై 16: వచ్చే ఏడాది మార్చికల్లా మావోయిజాన్ని నిర్మూలించాలని కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. ఈ క్రమంలో ప్రారంభించిన 'ఆపరేషన్ కగార్'తో తమకు భారీ నష్టమే జరిగినట్లు మావోయిస్టు పార్టీ అంగీకరించింది. ఈ మేరకు సీపీఐ(మావోయిస్టు) పార్టీ కేంద్ర కమిటీ జూన్ 23వ తేదీన 22 పేజీల నివేదికను విడుదల చేసింది. ఈ నివేదిక ప్రకారం.. గతేడాది మొత్తం 357 మంది మావోయిస్టులు అమరులయ్యారు. మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బస్వరాజ్ మే 20న ఛత్తీస్‌గఢ్ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన నేపథ్యంలో.. ఇకపై అనుసరించాల్సిన కొత్త వ్యూహాలను ఈ నివేదికలో మావోయిస్టు నేతలు వివరించారు. 1967లో పశ్చిమ బెంగాల్‌లోని నక్సల్బరీలో మొదలైన నక్సలిజం ఉద్యమం.. ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్, బిహార్, ఒడిసా, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రలకు విస్తరించిన విషయం తెలిసిందే..! ఇది దేశానికి అతిపెద్ద అంతర్గత భద్రత సమస్యగా కేంద్రం భావించింది. ఈ క్రమంలో చేపట్టిన ఆపరేషన్లతో గతేడాది 357 మంది నక్సలైట్లు మరణించినట్లు, వీరిలో 136 మంది మహిళలు ఉన్నట్లు మావోయిస్టు పార్టీ తాజా నివేదిక స్పష్టం చేసింది. నలుగురు మావోయిస్టులు ఆరోగ్య సమస్యలతో, ఒకరు ప్రమాదంలో చనిపోయారని పేర్కొంది. అయితే.. పోలీసుల రికార్డులు మాత్రం గత ఏడాది 217 మంది మావోయిస్టులు చనిపోయినట్లు చెబుతున్నాయి. ఈ ఏడాది ప్రథమార్థానికి ఆ సంఖ్య 460కి చేరినట్లు వివరిస్తున్నాయి. కాగా, తమ వైఫల్యాలకు కారణాలను సైతం మావోయిస్టు పార్టీ తన నివేదికలో విశ్లేషించింది. ప్రభుత్వాలు నక్సల్స్ ఆపరేషన్లకు 20 వేల మంది జవాన్లను మోహరించగా.. మావోయిస్టుల వైపు గెరిల్లా యుద్ధ నియమాలు, రహస్య విధానాలు సరిగ్గా అమలవ్వకపోవడంతో దెబ్బతిన్నట్లు పేర్కొంది.

● ఫ్లెక్సిబుల్ యుద్ధమే మార్గం?

తమ పోరు కొనసాగుతుందని మావోయిస్టు పార్టీ తన తాజా నివేదికలో స్పష్టం చేయగా.. ఇకపై ఫ్లెక్సిబుల్ యుద్ధ పద్ధతులను అవలంబించాలని నిర్ణయించినట్లు తెలిపింది. అంటే.. బలగాలతో నేరుగా తలపడకుండా.. వీలు చిక్కినప్పుడు గెరిల్లా పోరాటాలు, లేదంటే.. మందుపాతరలతో నష్టం కలిగించడం వంటి చర్యలు ఉత్తమమని భావిస్తున్నట్లు తెలుస్తోంది. కాగా, అమరులను స్మరించుకుంటూ.. ఈ నెల 28 నుంచి ఆగస్టు 3 వరకు 'అమరవీరుల వారోత్సవాల'ను నిర్వహించాలని మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ పిలుపునిచ్చింది.

● పోలీసులేమంటున్నారు?

ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులకు భారీ నష్టం జరిగినట్లు ఆ రాష్ట్ర అదనపు డీజీ(యాంటీ నక్సలిజం) వివేకానంద సిన్హా తెలిపారు. మావోయిస్టుల కదలికలపై పటిష్ఠ నిఘాతో వారిని కట్టడి చేయగలిగామన్నారు. "ప్రస్తుతం మావోయిస్టు బలగాలు ప్రజలతో కలిసిపోయాయి. అయితే.. ప్రజలను అనుమానంతో చూస్తుండడం వల్ల.. అమాయకుల హత్యలు పెరిగాయి" అని ఆయన వివరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో తిరుగుబాటు సరికాదని మావోయిస్టు పొలిట్‌బ్యూరో భావిస్తోందని పేర్కొన్నారు.

దుష్ట శక్తి జగన్

- రాష్ట్రాభివృద్ధికి అడ్డుపడుతున్నాడు
- 'రాజనాల'ను గుర్తుకు తెచ్చారు: నక్కా ఆనంద్ బాబు
- జగన్ మారడు.. మారలేడు: సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి
- బోసడికే కూడా సినిమా డైలాగే కదా జగన్: కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి
- మద్యం విచారణ నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే జగన్ తాపత్రయం: వర్ల రామయ్య




అమరావతి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధికి దుష్ట శక్తిలా జగన్ అడ్డుపడుతున్నారని ఎమ్మెల్యే నక్కా ఆనంద్ బాబు విమర్శించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'జగన్ విలేకరుల సమావేశం చూస్తుంటే పాత సినిమాల్లో రాజనాల క్యారెక్టర్ గుర్తుకు వచ్చింది. అధికారంలో ఉన్న ఐదేళ్లు హత్యలు, దౌర్జన్యాలు చేసి ఇప్పుడు ఏం తెలియనట్లు ప్రెస్‌మీట్‌లో కూర్చున్నాడు. వైసీపీ సైకో పాలన తట్టుకోలేక ప్రజలు ఆ పార్టీకి 11 సీట్లు ఇచ్చారు. కనీసం వారితోనైనా ప్రతిపక్ష పాత్ర పోషించడం జగన్‌కు చేతకావడం లేదు. వైసీపీ పాలనలో కక్షసాధింపు చర్యలకు పోలీసులను వాడుకుని, ఆ వ్యవస్థను నిర్వీర్యం చేసి, ఇప్పుడు నీతిమాలిన కబుర్లు చెబుతున్నాడు' అని ఆనంద్‌బాబు దుయ్యబట్టారు. ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ... 'ఏడాది కాలంగా జగన్‌రెడ్డి పోకడలు, ఆలోచనలు చూసిన తర్వాత ఈ రోజు అతని ప్రెస్‌మీట్‌తో రెండు విషయాల్లో అందరికీ పూర్తి క్లారిటీ వచ్చింది. జగన్‌రెడ్డికి 2024లో వచ్చిన ఓటమి ఇంకా అర్థం కాలేదనేది ఒకటి అయితే... జగన్ మారలేదు, మారలేడు, 2029లో కూడా గెలవలేడు అనేది మరోటి. వైసీపీ నేతలూ వేరే దారి చూసుకోండి. కార్యకర్తలు ఆశలు వదులుకోండి' అని అన్నారు. 'వైసీపీ అధినేత జగన్ విలేకరుల సమావేశం పెడుతున్నారంటే... ప్రజాసమస్యలు ప్రస్తావిస్తారని, రాష్ట్రానికి మేలు చేసే సూచనలు ఇస్తారని భావించా. కానీ అబద్ధాలతో కాలక్షేపం చేసి విలేకరుల సమావేశం ముగించడం తీవ్ర నిరాశకు గురి చేసింది' అని టీడీపీ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అన్నారు. 'జగన్ అబద్ధాలకు పరాకాష్ఠ... ఐఏఎస్ ధనుంజయ్‌రెడ్డిని మచ్చలేని అధికారిగా ప్రశంసించడం. ఈ మాటలు వినడానికే కంపరగా ఉన్నాయి. జగన్‌కు ధనుంజయ్‌రెడ్డిపై ప్రేమ ఉంటే ఆయన ఏ తప్పు చేయలేదని సీబీఐకి లేఖ రాయగలరా?' అని జగన్‌ని కోటంరెడ్డి ప్రశ్నించారు. 'సినిమా డైలాగులు వాడితే తప్పేంటని అమాయకంగా ప్రశ్నిస్తున్న జగన్‌కు బోసడికే అనేది కూడా సినిమా డైలాగేనని తెలియదా? అలాంటి దానికే ఏదో తల్లిని తిట్టినట్లు వ్యాఖ్యానం చెప్పి టీడీపీ కార్యాలయంపై దాడి చేపిస్తివి ఎందుకు?' అని కోటంరెడ్డి వ్యంగ్యంగా ప్రశ్నించారు. మద్యం కుంభకోణంలో సిట్ దెబ్బకు జగన్ అవినీతి ముఠా అబ్బా అంటోందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య అన్నారు. సిట్ విచారణ ముమ్మరం చేయడంతో జగన్ డైవర్షన్ పాలిటిక్స్‌కు దిగాడన్నారు. చంద్రబాబు హయాంలో పోలీసులు మెడల్స్ తీసుకుంటే జగన్‌కు సహకరించిన పోలీసులు కటకటాల్లో మగ్గుతున్నారని అన్నారు.

జగన్‌కు పాలన సాధ్యంకాలేదు: మంత్రి నారాయణ

కాకినాడ, జూలై 16(ఆంధ్రజ్యోతి): 'రూ.పది లక్షల కోట్లు అప్పు చేసిన వ్యక్తి జగన్. ఆయనకు పరిపాలన సాధ్యం కాలేదు' అని మంత్రి పొంగూరు నారాయణ వ్యాఖ్యానించారు. గత వైసీపీ సర్కారు చేసిన అప్పులను ఇప్పుడు ప్రజలందరూ కడుతున్నారని వెల్లడించారు. బుధవారం ఆయన కాకినాడలో మీడియాతో మాట్లాడారు. ఇళ్ల పేరుతో గత వైసీపీ ప్రభుత్వం ప్రజలను అనేక రకాలుగా మోసగించిందని విమర్శించారు. దొంగ పట్టాలు ఇవ్వడంతో పాటు, ఇళ్ల నిర్మాణం చేపట్టకుండానే బ్యాంకు లోన్ల పేరుతో లబ్ధిదారులను అప్పుల ఊబిలోకి నెట్టిందని ఆరోపించారు.

జగన్‌రెడ్డిది నీచ చరిత్ర: అనిత

పాయకరావుపేట, జూలై 16(ఆంధ్రజ్యోతి): 'రక్తం పంచుకుని పుట్టిన సొంత చెల్లి గురించే తప్పుడు ప్రచారం చేసిన నీచ చరిత్ర జగన్‌రెడ్డిది. రప్పా రప్పా అంటున్న నేతలను సమర్థిస్తున్న ఆయన మానవత్వం ఉన్న మనిషిలా వ్యవహరించడం లేదు' అని మంత్రి వంగలపూడి అనిత మండిపడ్డారు. బుధవారం అనకాపల్లి జిల్లా పాయకరావుపేటలో విలేకరులతో ఆమె మాట్లాడుతూ... 'సీఎం చంద్రబాబును రీకాల్ చేస్తామని జగన్ అనడం రాష్ట్ర ప్రజలను, ప్రజలు ఇచ్చిన తీర్పును రీకాల్ చేయడమే. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై ప్రసన్నకుమార్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను న్యాయస్థానాలు తప్పుబట్టాయి.కానీ జగన్‌కు తప్పులా కనిపించడంలేదు.' అని అన్నారు.

జగన్ నోరు తెరిస్తే అబద్ధాలా?: అచ్చెన్న

బాపట్ల, జూలై 16(ఆంధ్రజ్యోతి): 'జగన్... అన్నీ అబద్ధాలు మాట్లాడుతున్నావు. అసలు సిగ్గుందా నీకు?' అని మంత్రి అచ్చెన్నాయుడు మండిపడ్డారు. జగన్ మీడియాతో మాట్లాడుతూ, 'పోలీసులు గడచిన ఐదేళ్లలో బాగా పని చేశారు. ఈ ఏడాదిలో పోలీసు వ్యవస్థ ప్రతిష్ఠ మంటగలిసింది' అని అనడంపై మంత్రి అచ్చెన్న తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బాపట్ల జిల్లా సంతమాగులూరులోని ఏఎంసీ చైర్మన్ ప్రమాణస్వీకార మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఐదేళ్ల పాటు కనీసం తమ అభిప్రాయం చెప్పే స్వేచ్ఛనివ్వకుండా అణచివేసిన వ్యక్తి ఈ రోజు పోలీసు వ్యవస్థ గురించి మాట్లాడడం హాస్యాస్పదమన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో అనేక కష్టనష్టాల కోర్చి ప్రజల పక్షాన పోరాడామని మరో మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు.

యువతలో ఉగ్ర తత్వాన్ని రెచ్చగొడుతున్న జగన్

- సీఎం చంద్రబాబు రాజనీతిజ్ఞుడు: మంత్రి అనగాని

హిందూపురం, జూలై 16(ఆంధ్రజ్యోతి): 'యువతలో ఉగ్రవాద తత్వాన్ని వైఎస్ జగన్ రెచ్చగొడుతున్నారు. వైసీపీ పాలనతో రాష్ట్రం అధోగతి పాలైంది. అభివృద్ధి 40 ఏళ్ల వెనక్కు వెళ్లింది. వైసీపీ నాయకుల దెబ్బకు పరిశ్రమలు పక్క రాష్ట్రాలకు పరుగులు తీశాయి' అని మంత్రి అనగాని సత్యప్రసాద్ విమర్శించారు. శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం నియోజకవర్గంలో బుధవారం జరిగిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. లేపాక్షి మండలం బిసలమానేపల్లిలో రచ్చబండ వద్ద ప్రసంగించారు. 'సీఎం చంద్రబాబుపై ఉన్న నమ్మకంతో ఏడాదిలోపే పరిశ్రమలు రాష్ట్రానికి వస్తున్నాయి. మనం సీఎం భావి తరాల గురించి ఆలోచించే రాజనీతిజ్ఞుడు.' అని మంత్రి అన్నారు. కార్యక్రమంలో హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

జగన్ బాధ్యత లేని వ్యక్తి: నాదెండ్ల

అమరావతి, జూలై 16(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి బాధ్యత లేని వ్యక్తి అని మంత్రి నాదెండ్ల మనోహర్ మండిపడ్డారు. పరిపాలనపై అవగాహన లేకుండా పచ్చి అబద్ధాలు చెబుతూ, రెచ్చగొట్టే వ్యాఖ్యలతో సమాజంలో చీలికలు తీసుకువచ్చి రాజకీయంగా లబ్ధి పొందడానికి జగన్ ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు. గత ఐదేళ్లు ముఖ్యమంత్రిగా ఉండి కనీసం గుంతలు కూడా పూడ్చలేకపోయిన జగన్ ఈ రోజు పాలన గురించి మాట్లాడుతుండటం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. విజయవాడలో మీడియాతో నాదెండ్ల మాట్లాడారు. 'గత ఐదేళ్లలో సృష్టించిన ఆర్థిక విధ్వంసం నుంచి ప్రజలను కాపాడి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకుపోతామన్న నమ్మకంతోనే ప్రజలు కూటమికి పట్టం కట్టిన విషయాన్ని జగన్ మర్చిపోయారా?" అని మంత్రి ప్రశ్నించారు.

హింసాత్మక చర్యలకు జగన్ మద్దతు: సత్యకుమార్

అమరావతి, జూలై 16(ఆంధ్రజ్యోతి): రాజకీయాల్లో హింసాత్మక చర్యలకు పాలుపడటంలో తప్పేమీలేదని జగన్‌చేసిన వ్యాఖ్యల్ని ఆరోగ్య మంత్రి సత్యకుమార్ తీవ్రంగా ఖండించారు. జగన్ మీడియా సమావేశంలో చేసిన వ్యాఖ్యలపై మంత్రి స్పందించారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతీకారం తీర్చుకుంటామని బహిరంగంగా చేసిన వ్యాఖ్యల పట్ల మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ తన సైకో నైజాన్ని వెల్లడించుకుని తనను రప్పా, రప్పా రెడ్డిగా ఆవిష్కరించుకున్నారని అన్నారు.

రాష్ట్ర క్రీడారంగ అభివృద్ధికి సహకరించండి

- కేంద్రమంత్రికి చంద్రబాబు విజ్ఞప్తి

న్యూఢిల్లీ, జూలై 16(ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్ర రాజధాని అమరావతిలో అంతర్జాతీయ ప్రమాణాలతో బ్యాడ్మింటన్ శిక్షణ కేంద్రం ఏర్పాటుకు సహకారం అందించాలని కేంద్ర మంత్రి మన్సుఖ్ మాండవీయకు సీఎం చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. సీఎం ఢిల్లీ పర్యటనలో భాగంగా రెండోరోజు కేంద్రమంత్రితో భేటీ అయ్యారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో క్రీడల అభివృద్ధికి రూ.341 కోట్లు, విజయవాడ ఇందిరా గాంధీ స్టేడియం అభివృద్ధికి రూ.27కోట్లు, గుంటూరు బీఆర్ స్టేడియంలో మల్టీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటుకు రూ.170 కోట్లు మంజూరు చేయాలని కోరారు. ఖేలో ఇండియా మార్షల్ ఆర్ట్స్ గేమ్స్-2025ను ఏపీలో నిర్వహించేందుకు అవకాశం ఇవ్వడంపై కేంద్రమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. వీటి నిర్వహణకు రూ.25 కోట్లు విడుదల చేయాలని కోరారు. తిరుపతి, రాజమహేంద్రవరం, కాకినాడ, నరసరావుపేటలలో ఖేలో ఇండియా కింద మౌలిక సదుపాయాల కల్పన ప్రాజెక్టులను పూర్తి చేయాలని విన్నవించారు. రాష్ట్రంలో క్రీడరంగ అభివృద్ధికి సహకరించాలని కోరారు. అమరావతిలో జాతీయ జల క్రీడల శిక్షణ హబ్ ఏర్పాటు చేసే అవకాశం ఉందని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. తిరుపతిలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(సాయ్) శిక్షణ కేంద్రం ఏర్పాటును పరిశీలించాలని కోరారు. 2024-29 స్పోర్ట్స్ పాలసీలో భాగంగా ఏపీలో స్పోర్ట్స్ ఎకో సిస్టం అభివృద్ధికి చర్యలు చేపట్టామని, ఇందుకు సహకరించాలని సీఎం కోరారు.

రాష్ట్రానికి 10 వేల కోట్లు ఇవ్వండి

- నిర్మలా సీతారామన్‌కు చంద్రబాబు వినతి

న్యూఢిల్లీ, జూలై 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాల మూలధన పెట్టుబడులకు ఆర్థికసాయం అందించే పథకమైన 'సాస్కి' కింద 2025-26 ఆర్థిక సంవత్సరానికి అదనంగా రూ.10వేల కోట్లు కేటాయించాలని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌ను సీఎం చంద్రబాబు కోరారు. కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ అధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశానంతరం నిర్మలా సీతారామన్‌ను నార్త్‌బ్లాక్‌లోని ఆమె కార్యాలయంలో చంద్రబాబు కలుసుకున్నారు. వివిధ ప్రాజెక్టులకు సంబంధించి రాష్ట్రానికి ఆర్థిక సహాయం కోరుతూ వినతిపత్రం అందించారు. రెవెన్యూ లోటును భర్తీ చేయాలంటూ 16వ ఆర్థిక సంఘానికి ఏపీ ప్రభుత్వం ఇచ్చిన వినతిని ఆమె దృష్టికి తీసుకెళ్లి, అందుకు అంగీకరించాలని విన్నవించారు. అమరావతి నిర్మాణానికి మొత్తం రూ.79,280 కోట్ల నిధులు అవసరం కాగా, ప్రస్తుతం రూ.44,351 కోట్ల విలువైన పనులు ప్రారంభించామని చంద్రబాబు తెలిపారు. రూ.26 వేల కోట్ల నిధులు దీనికోసం సమీకరించనున్నట్లు తెలిపారు. రాజధాని నిర్మాణానికి ఇంకా నిధుల అవసరం ఉందని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అమరావతికి రెండో విడతగా ఇచ్చే నిధులను గ్రాంటు రూపంలో ఇవ్వాలని కోరారు. రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి సహకరిస్తున్న కేంద్రానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



ఢిల్లీలో జరిగిన సమావేశంలో టీ-సీఎం రేవంత్, ఏపీ సీఎం చంద్రబాబు కరచాలనం



కేంద్ర మంత్రి మన్సుఖ్ మాండవీయకు పుష్పగుచ్ఛం ఇస్తున్న సీఎం చంద్రబాబు



కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు జ్ఞాపిక అందజేస్తున్న సీఎం చంద్రబాబు, చిత్రంలో రామ్మోహన్, కేశవ్

తెలుగు రాష్ట్రాలే నాకు ముఖ్యం

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వాల్లో రెండు రాష్ట్రాల మంత్రులు, అధికారుల బృందాలు పాల్గొన్నాయి. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. తెలంగాణ నిర్మించుకునే ప్రాజెక్టులకు తాను ఎప్పటికీ అడ్డుచెప్పబోనని చంద్రబాబు పునరుద్ఘాటించారు. ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగానూ.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా ఆల్మట్టి, బాబ్లీ ప్రాజెక్టులకు వ్యతిరేకంగా పోరాడానని.. అరెస్టు కూడా అయ్యానని గుర్తుచేశారు. బాబ్లీ ప్రాజెక్టు ఆందోళనలో రేవంత్‌రెడ్డి కూడా ఉన్న విషయాన్ని ప్రస్తావించారు. ప్రాజెక్టుల విషయంలో సామరస్యంగా చర్చించుకుని సమస్యలు పరిష్కరించుకుందామన్నారు. కేంద్రం ఆధ్వర్యంలోని సాంకేతిక, నిపుణుల కమిటీలో చర్చించాక కూడా సమస్యలు తేలకపోతే.. అపెక్స్ కౌన్సిల్‌లో చర్చిద్దామని సూచించారు. పోలవరం-బనకచర్ల పథకం గురించి చర్చ తీసుకురావడంపై టీ-మంత్రి ఉత్తమకుమార్‌రెడ్డి అభ్యంతరం తెలిపారు. ఈ సమయంలో చంద్రబాబు జోక్యం చేసుకున్నారు. గోదావరి ట్రిబ్యునల్ ఇచ్చిన ఆదేశాలు, కేటాయింపుల మేరకే.. సముద్రంలో వృధాగా పోయే వరద జలాలను మాత్రమే వాడుకునేలా ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేశామని చెప్పారు. బనకచర్ల ప్రాజెక్టు రాయలసీమ కోసం నిర్మిస్తున్నదని.. ఈ ప్రాజెక్టుపై ఎక్కడైనా చర్చించేందుకు సిద్ధమేనని, తనకు భేషజాలు లేవని చెప్పారు. ఈ ప్రాజెక్టుతో ఎగువ రాష్ట్రాలకు ఎలాంటి నష్టమూ లేదన్నారు. పథకంపై ఉన్న సందేహాలు నివృత్తి చేస్తూ రూపొందించిన సమాచారం ప్రతులను రేవంత్‌రెడ్డికి, ఉత్తమకుమార్‌రెడ్డికి పంపారు.

బనకచర్ల, కృష్ణా, గోదావరి సమస్యలపై నిపుణులతో కమిటీ

కేంద్రం ఆధ్వర్యంలో 21లోగా ఏర్పాటు: నిమ్మల

న్యూఢిల్లీ, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కృష్ణా, గోదావరి నదీ జలాలకు సంబంధించిన వివాదాల పరిష్కారానికి ముందడుగు పడింది. కృష్ణా, గోదావరి ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్ సమస్యల సమగ్ర పరిష్కారానికి కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల నుంచి అధికారులు, సాంకేతిక నిపుణులతో కూడిన కమిటీ నియామకానికి రెండు రాష్ట్రప్రభుత్వాలూ అంగీకారం తెలిపాయి. పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు.. కృష్ణా, గోదావరి జలాలకు సంబంధించి 13 అంశాలు ఎజెండాగా బుధవారం ఢిల్లీలోని శ్రమశక్తి భవన్‌లో కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ అధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఇద్దరు సీఎంలు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి.. రెండు రాష్ట్రాల మంత్రులు నిమ్మల రామానాయుడు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి.. కేంద్ర, రెండు రాష్ట్ర ప్రభుత్వాల సీనియర్ అధికారులు హాజరయ్యారు. దాదాపు గంటన్నర పాటు జరిగిన ఈ భేటీలో పలు కీలకాంశాలపై చర్చించారు. అనంతరం మంత్రి నిమ్మల విలేకరులకు వివరాలు వెల్లడించారు. పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు, కృష్ణా, గోదావరి జలాలకు సంబంధించి తెలంగాణ ఇచ్చిన ప్రతిపాదనల్లో సాంకేతిక అంశాలు ఇమిడి ఉన్నందున.. వీటి పరిష్కారం కోసం కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. సాంకేతిక నిపుణులు, అధికారులతో సోమవారం(21వ తేదీ) లోపు కమిటీ ఏర్పాటు చేసుకుని రోడ్‌మ్యాప్‌ను రూపొందించుకోవాలని నిశ్చయించినట్లుచెప్పారు. ఈ కమిటీ కేంద్రం ఆధ్వర్యంలో ఉంటుందన్నారు. గోదావరిలో ఏటా 3 వేల టీఎంసీల నీళ్లు వృథాగా పోతున్నాయని, వీటికి సంబంధించి రికార్డులను కమిటీ పరిశీలిస్తుందని.. కృష్ణా, గోదావరి జలాల అంశాలపై రోడ్‌మ్యాప్ రూపొందించుకున్నాక.. మళ్లీ కేంద్ర జలశక్తి శాఖ ఆధ్వర్యంలో సమావేశం జరుగుతుందన్నారు. అపెక్స్ కౌన్సిల్ భేటీ మూడోసారి నిర్వహించడంపై ఆ తర్వాత నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. స్నేహపూర్వక వాతావరణంలో, ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో చర్చలు జరిగాయని.. మూడు కీలక అంశాలపై నిర్ణయాలు తీసుకున్నట్లు చెప్పారు. రిజర్వాయర్ల నుంచి కాలువలకు వెళ్లే అవుట్‌ఫ్లోల వద్ద టెలిమెట్రీ యంత్రాల ఏర్పాటుకు ఇరు రాష్ట్రాలూ అంగీకరించాయన్నారు. రెండు రాష్ట్రాలకు అత్యంత కీలకమైన శ్రీశైలం ప్రాజెక్టును కాపాడుకోవాలని, ఆ ప్రాజెక్టు మరమ్మతులు, రక్షణ చర్యలు వెనువెంటనే తీసుకోవాలని, ఈ విషయంలో కేంద్ర జల సంఘం మార్గదర్శకాల ప్రకారం నడచుకోవాలని నిర్ణయించినట్లు తెలిపారు. కృష్ణానదీ యాజమాన్య బోర్డు (కేఆర్‌ఎంబీ) ప్రధాన కార్యాలయాన్ని అమరావతికి తరలించేందుకు, గోదావరి యాజమాన్య బోర్డు (జీఆర్‌ఎంబీ) ప్రధాన కార్యాలయం హైదరాబాద్‌లోనే ఉండేందుకు రెండు రాష్ట్రాలూ అంగీకరించినట్లు నిమ్మల చెప్పారు.

టెలిమెట్రీలకు మేం వ్యతిరేకం కాదు

- నీరు విడుదల చేసే చోట్ల కాకుండా ఇతర ప్రాంతాల్లో ఎలా పెడతారు?
- సలహాదారు వెంకటేశ్వరరావు ఆక్షేపణ
- దీనిపై మాట్లాడుకుందామన్న రేవంత్

కృష్ణా నదిపై నిర్మిస్తున్న పలు ప్రాజెక్టులు ఉమ్మడి ఏపీలో పరిపాలనా ఆమోదం పొందినవేనని రేవంత్ రెడ్డి అన్నారు. దీనిపై చంద్రబాబు స్పందిస్తూ.. ప్రాజెక్టుల ప్రతిపాదనలకు అప్పట్లో ఆమోదం పొందినప్పటికీ.. డిజైన్లు, అలైన్‌మెంట్లు మారిస్తే వాటిని కొత్తవిగానే పరిగణించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. వీటిపైనా సమన్వయంతో.. సంప్రదింపులతోనూ.. సామరస్యంగా పరిష్కరించుకుందామన్నారు. కృష్ణా జలాలపై టెలిమెట్రీల ఏర్పాటుకు ఏపీ వ్యతిరేకిస్తోందని ఉత్తమకుమార్‌రెడ్డి అనగా.. ఏపీ జల వనరుల శాఖ సలహాదారు వెంకటేశ్వరరావు జవాబిచ్చారు. టెలిమెట్రీల ఏర్పాటును తాము వ్యతిరేకించడం లేదన్నారు. కానీ ప్రాజెక్టుల వద్ద నీరు విడుదల చేసేచోట కాకుండా.. ఇతర ప్రాంతాల్లో కూడా అమర్చాలని తెలంగాణ డిమాండ్ చేయడాన్ని అంగీకరించబోమన్నారు. దీనిపైనా మాట్లాడుకుందామని రేవంత్ అన్నారు. ప్రాధాన్య క్రమంలో టెలిమెట్రీలను ఏర్పాటు చేద్దామని తెలిపారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ, ఎన్‌డబ్ల్యూపీఆర్‌ఎస్ డిజైన్లు ఇవ్వగానే శ్రీశైలం జలాశయం ప్లంజ్ పూల్ మరమ్మతులు ప్రారంభిస్తామని చంద్రబాబు వెల్లడించారు.

రప్పా రప్పా.. తప్పేందప్పా?

- మరోసారి సమర్థించిన వైఎస్ జగన్
- డీఐజీలు మాఫియా డాన్‌లుగా మారారు
- డీఎస్పీలు, సీఐలతో డబ్బు వసూళ్లు
- ఎమ్మెల్యేలు, పెద్దబాబు, చినబాబుకు వాటాలు
- పోలీసు వ్యవస్థపై జగన్ తీవ్ర ఆరోపణలు
- టీడీపీ సైకోలు, శాడిస్టులు అని వ్యాఖ్యలు

అమరావతి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): 'సినిమాల్లో చూపించినవి బయటా చేయొచ్చు. సినిమాలో అన్న మాటలు బయటా అనొచ్చు. సినిమాలకూ, నిజ జీవితానికీ తేడా లేదు!'... ఇది వైసీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అభిప్రాయం! 'రప్పా రప్పా నరుకుతాం' అనేది సినిమా డైలాగ్ కాబట్టి... దానిని బయట పోస్టర్లుగా వేసినా తప్పులేదని ఆయన నొక్కి వక్కాణించారు. 'మేం అధికారంలోకి రాగానే రప్పా రప్పా నరుకుతాం' అని వైసీపీ శ్రేణులు ప్లకార్డులు ప్రదర్శించడాన్ని ఆయన మరోసారి సమర్థించారు. అందుకు... అర్థంలేని పోలికలు తెచ్చారు. బుధవారం తాడేపల్లిలో ఎప్పట్లాగానే ఎంపిక చేసుకున్న మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. "సినిమా డైలాగును పోస్టరుగా పెట్టినందుకు ఇద్దరిని రిమాండుకు పంపారు. అంత కష్టంగా ఉంటే ఆ డైలాగులను సెన్సార్ వాళ్లు ఎందుకు పెట్టాలి? బాలకృష్ణ, పవన్ సినిమాల్లో ఇంకా దారుణమైన డైలాగులున్నాయట. డైలాగులు నచ్చకపోతే వాటిని సెన్సార్‌లో తీసేయండి. సెన్సార్ బోర్డు ఉండేది ఎందుకు? సినిమా రిలీజ్ అయ్యాక వాటి డైలాగులు, మంచి పాటలు సహజంగానే ప్రసిద్ధి చెందుతాయి. మంచి పాట పాడినా తప్పేనట. నచ్చిన డైలాగులు పోస్టరుగా పెట్టినా, మాట్లాడినా తప్పే! మరి... సినిమాలు ఎందుకు తీస్తున్నారు? ఆపేసేయండి" అని జగన్ తనదైన శైలిలో సూచించారు. ఇక... డీఐజీలు మాఫియా డాన్‌లలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఆయన కింద డీఎస్పీ, సీఐలే ఆర్మీగా పేర్కొన్నారు. వారి జోన్‌లో లిక్కర్ అమ్మాలన్నా, బెల్టు షాపులు నిర్వహించాలన్నా, ఇసుక తవ్వాలన్నా, మట్టి ఎత్తుకెళ్లాలన్నా డబ్బులు వసూలు చేసి అధికార పార్టీ ఎమ్మెల్యేలకు ముట్ట జెప్పుతున్నారన్నారు. సగం వీళ్లకు... సగం పెద్దబాబుకు, చిన్నబాబుకు వాటాలుగా వెళ్తున్నాయని ఆరోపించారు. ఇవన్నీ చూసి భరించలేక సిద్ధార్థ కౌశల్ వంటి కొందరు ఐపీఎస్ అధికారులు రాజీనామా చేసి వెళ్లిపోతున్నారని పేర్కొన్నారు. బడా కార్పొరేట్ సంస్థలో మెరుగైన



జీతంతో ఉద్యోగంలో చేరేందుకు, కుటుంబ సభ్యులకు దగ్గరగా ఉండేందుకే తాను రాజీనామా చేసినట్లు సిద్ధార్థ కౌశల్ ఇదివరకే స్పష్టం చేసినా సరే... జగన్ దీనిని వక్రీకరించారు. తాను సీఎంగా ఉండగా పోలీసు వ్యవస్థ తలెత్తుకు తిరిగేలా ఉండేదని... ఇప్పుడు సిగ్గుతో తలదించుకునేలా వ్యవహరిస్తోందని జగన్ వ్యాఖ్యానించారు. చంద్రబాబు మాట వినలేదని డీజీ స్థాయిలో పీఎస్ఆర్ ఆంజనేయులును తప్పుడు కేసులు పెట్టి అరెస్టు చేశారన్నారు. మరో డీజీ స్థాయి అధికారి సునీల్‌కుమార్‌ను, మరో అడిషనల్ డీజీ సంజయ్‌ను, ఐజీ కాంతిరాణా తాతాను, డీఐజీ విశాల్ గున్నీలపై తప్పుడు కేసులు పెట్టారని జగన్ ఆరోపించారు. ఆయన హయాంలో అడ్డగోలు పనులు చేసినందుకే వీరంతా కేసుల్లో ఇరుక్కున్నారన్నది అసలు నిజం. కానీ... ఆ విషయాన్ని దాచేసి, మాట వినని ఐపీఎస్‌లపై ప్రభుత్వం కక్ష సాధిస్తోందనేలా జగన్ మాట్లాడటం గమనార్హం. గుడివాడలో కృష్ణా జడ్పీ చైర్‌పర్సన్ హారికపై టీడీపీ సైకోలు, శాడిస్టులు కర్రలతో, రాళ్లతో దాడి చేయడం ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందనేందుకు ఉదాహరణగా పేర్కొన్నారు. చంద్రబాబు లైవ్ యాక్షన్ ముందు ఎన్టీఆర్ ఎక్కడికో వెళ్లిపోవాలన్నారు.

ఉభయ రాష్ట్రాల మధ్య గొడవల కోసం కొందరి ఎదురుచూపు

- జాలిపడడం తప్ప ఏమీ చేయలేం
- వివాద రహిత పరిష్కారమే మా ఎజెండా
- బనకచర్లపై చర్చ జరగలేదు: రేవంత్‌రెడ్డి



న్యూఢిల్లీ, జూలై 16(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల మధ్య సుహృద్భావ వాతావరణంలో చర్చలు జరిగాయని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. అయితే రెండు రాష్ట్రాల మధ్య గొడవల కోసం కొందరు ఎదురుచూస్తున్నారని మండిపడ్డారు. ఇరు రాష్ట్రాలూ కొట్టుకుంటే తమకు బాగుంటుందని వాళ్లు(బీఆర్ఎస్) అనుకుంటున్నారని, వారిని చూసి జాలిపడడం తప్ప ఏమీ చేయలేమని వ్యాఖ్యానించారు. వివాదాలకు తావులేకుండా సమస్యలను పరిష్కరించుకోవడమే తమ ఎజెండాగా పేర్కొన్నారు. కేంద్ర జలశక్తి మంత్రి సమక్షంలో సీఎంల భేటీ తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు. ఇరు రాష్ట్రాలు, జలశక్తి శాఖ అధికారులు, ఇంజనీర్లు, సాంకేతిక నిపుణులతో కమిటీ.. కృష్ణా ప్రాజెక్టుల అవుట్‌ఫ్లోల వద్ద టెలిమెట్రీ యంత్రాల ఏర్పాటుకు ఏపీ సమ్మతి.. శ్రీశైలం ప్రాజెక్టు మరమ్మతులకు అంగీకారం.. ఈ నిర్ణయాలను తెలంగాణ సాధించిన విజయంగా పేర్కొన్నారు. 'గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు కడతామని ఏపీ అడిగితేనే కదా.. మేం అభ్యంతరం తెలపడానికి! ఎజెండాలో బనకచర్ల ప్రతిపాదనే లేదు. అలాంటప్పుడు ఆ ప్రాజెక్టు ఆపాలనే చర్చ ఎందుకు వస్తుంది? ఈ ప్రాజెక్టుపై ఇప్పటికే ఫిర్యాదు చేశాం. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని సంస్థలు కూడా ప్రాజెక్టుపై అభ్యంతరాలను లేవనెత్తాయి' అని గుర్తు చేశారు. ఇది అపెక్స్ కమిటీ సమావేశం కాదని, కేంద్రం ఏర్పాటు చేసిన భేటీ అని అన్నారు. తెలంగాణలో పదేళ్లు అధికారంలో ఉన్న కేసీఆర్ రాష్ట్రానికి తీరని అన్యాయం చేశారని, ఏ జల వివాదానికీ పరిష్కారం చూపలేదని.., తెలంగాణ హక్కులను ఆంధ్రాకు ధారాదత్తం చేశారని విమర్శించారు. వాటిని పరిష్కరించడానికే విధివిధానాలను రూపొందిస్తున్నామని చెప్పారు. తెలుగు రాష్ట్రాల సీఎంల భేటీ జల వివాదాల పరిష్కారం కోసమే తప్ప.. సమస్యలను పెద్దవి చేసుకోవడానికి కాదన్నారు.

మిగులు జలాలు అంచనా వేయకుండా బనకచర్ల సరికాదు

- కేంద్రం మద్దతుతో ఇంద్రావతి నీటిని ఛత్తీస్‌గఢ్ అడ్డుకుంటోంది: జగన్

అమరావతి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): గోదావరిలో మిగులు జలాలు అంచనా వేయకుండా పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు చేపట్టడం సరికాదని మాజీ సీఎం, వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ అన్నారు. ఈ ప్రాజెక్టుపై బుధవారం జాతీయ మీడియా అడిగిన ప్రశ్నకు సూటిగా సమాధానం ఇవ్వకుండా ఆయన మాట్లాడారు. ఇంద్రావతి నుంచి గోదావరిలోకి నీరు రాకుండా కేంద్రం మద్దతుతో ఛత్తీస్‌గఢ్ అడ్డుకుంటోందని ఆరోపించారు. కేంద్ర ప్రతిపాదన ప్రకారం పోలవరం ఎత్తు తగ్గించేందుకు చంద్రబాబు ఒప్పుకొన్నారని విమర్శించారు. దీనివల్ల ప్రాజెక్టు ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. పోలవరాన్ని 45.72 మీటర్ల ఎత్తులో నిర్మించినప్పుడే మిగులు జలాలు కృష్ణాకు తరలించేందుకు వీలు కలుగుతుందన్నారు. కేంద్రం ఒప్పుకోకపోతే రాష్ట్రమే రూ.15,000 కోట్లు సమీకరించి ఎత్తు పెంచాలని చెప్పారు. 45.72 మీటర్ల కాంటూరు బదులు 41.72 కాంటూరులో నిర్మించేందుకు కేంద్రంతో చంద్రబాబు రాజీపడ్డారని ఆరోపించారు. ప్రాణహిత, ఇంద్రావతి నీటిపై అంచనాకు వచ్చాకే బనకచర్లపై ముందుకు వెళ్లాలన్నారు. గోదావరిలోకి ఉపనదుల నుంచి నీరు వచ్చే విషయాన్ని ప్రస్తావిస్తూ తెలంగాణలోని నాసిక్ అంటూ విచిత్రంగా చెప్పారు. ప్రాణహిత నుంచి గోదావరి జలాలు రాకుండా ఛత్తీస్‌గఢ్ అడ్డుకుంటోందని చెప్పారు. ప్రాణహిత నుంచి గోదావరి జలాలు రావడం ప్రశ్నార్థకంగా మారిందన్నారు. పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు కోసం మిగులు జలాలపై లెక్కలు తేల్చాల్సి ఉందన్నారు. జలాలులేకుండా రూ. 80,000 కోట్లతో పోలవరం-బనకచర్లను నిర్మించడం ప్రజాధనాన్ని వృథా చేయడమేనని అభిప్రాయపడ్డారు.


కేతిరెడ్డి విషయంలో జోక్యం వద్దు జగన్

- తాడిపత్రికి రానిచ్చే సమస్యే లేదు: జేసీ

తాడిపత్రి, జూలై 16(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని తాడిపత్రికి రానిచ్చే సమస్యే లేదని టీడీపీ నేత, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఇందులో జోక్యం చేసుకోవద్దని జగన్‌కు బుధవారం సూచించారు. 'ప్రసన్నకుమార్ రెడ్డి ఇంటిపై జరిగిన ఘటన గురించి మాట్లాడుతున్నావ్. ఆరోజు ఆయన అక్కపై (జేసీ ప్రభాకర్‌రెడ్డి భార్య) 12 కేసులు పెట్టారు. అన్నెం పున్నెం ఎరుగని ఆమె కోడలిపై 3 కేసులు పెట్టారు. నన్ను, నా కుమారుడిని జైలుకు పంపించారు. ఈరోజు పెద్దారెడ్డి ఊళ్లోకి వస్తానంటే ఎందుకు రానిస్తాం..? అప్పట్లో పెద్దారెడ్డి మా ఇంట్లోకి వచ్చి దుర్భాషలాడితే నువ్వెందుకు మాట్లాడలేదు..? మా నాన్న ఫ్రీడం ఫైటర్. మా అన్న దివాకర్‌రెడ్డి 6సార్లు ఎమ్మెల్యే, మినిష్టర్, ఒకసారి ఎంపీ. నేను 5 సార్లు మున్సిపల్ చైర్మన్, ఒకసారి ఎమ్మెల్యే. నా కుమారుడు ప్రస్తుత ఎమ్మెల్యే. నా భార్య ఉమారెడ్డి తమ్ముడు ప్రసన్నకుమార్‌రెడ్డి గురించి మాట్లాడడం మంచిదే. కానీ వాళ్ల అక్కకు జరిగిన అన్యాయం గురించి మాట్లాడలేదే..? మీ తాత చనిపోయినపుడు మధ్యాహ్నం వరకు పులివెందుల ప్రశాంతంగా ఉంది. ఘర్షణలొద్దని మీ నాన్న సముదాయించారు. కానీ సాయంత్రం పెద్దారెడ్డి వెళ్లి డీఎన్‌రెడ్డి ఇంటిని దహనం చేసిన విషయం మీ అమ్మనడిగి తెలుసుకో..! పెద్దారెడ్డి అరాచకాలు అన్నీ ఇన్నీ కావు' అని చెప్పారు.

జాతీయ వాదంతో జనంలోకి..

- కూటమిగానే స్థానిక ఎన్నికల్లో పోటీ
- రాష్ట్ర ప్రయోజనాల కోసం ఢిల్లీలో లాబీ: పీవీఎన్ మాధవ్



అమరావతి, జూలై 16(ఆంధ్రజ్యోతి): 'జాతీయవాదం లేని గ్రామం లేదు. బీజేపీ వాసన లేని వీధి లేదు. సబ్ కా సాథ్... సబ్ కా వికాస్.. అంటూ ప్రతి ఇంటికీ వెళతాం. రాష్ట్రంలో కాషాయ జెండా రెపరెపల్ని చూడటమే లక్ష్యం' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. అధ్యక్ష బాధ్యతలు స్వీకరించాక మొదటి సారి ఆయన కొందరు పాత్రికేయులతో బుధవారం విజయవాడలో తన ఆలోచనలు పంచుకున్నారు. 'దేశంలో ఏ పార్టీకైనా బలోపేతం అవ్వాలన్నదే లక్ష్యంగా ఉంటుంది. మేం అందుకు అతీతం కాదు. అయితే దేశ ప్రయోజనాలే బీజేపీకి ముఖ్యం. అందులో భాగంగానే రాష్ట్ర ప్రయోజనాల కోసం ఢిల్లీ పెద్దలతో లాబీయింగ్ చేసి రాష్ట్ర అభివృద్ధి కోసం ఏపీ బీజేపీ కృషి చేస్తుంది. అదే సమయంలో ప్రజా సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వంతో కలసి కృషి చేస్తాం. కూటమి పార్టీలు ఉమ్మడిగానే స్థానిక సంస్థల్లో అభ్యర్థుల్ని పోటీకి దించుతాయి. బీజేపీ శ్రేణులకు సముచిత ప్రాధాన్యం ఉంటుంది. మరో మూడేళ్లలో అమరావతి, పోలవరం పూర్తి చేసి ప్రజల మెప్పు పొందుతాం' అని అన్నారు.

ఏడేళ్లుగా తీరని వ్యథ

- ట్రాక్టర్ మోడల్ మార్చి... అధిక ధర వసూలు చేసిన కంపెనీ
- 'రైతు రథం' లబ్ధిదారులకు టోకరా

అమరావతి, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఇవ్వాల్సిన మోడల్ ఇవ్వకపోగా, అధిక ధర వసూలు చేసిన కంపెనీ నుంచి తమ డబ్బులు ఇప్పించాలని రైతు రథం లబ్ధిదారులు ఏడేళ్లుగా ఏపీ ఆగ్రోస్ చుట్టూ తిరుగుతున్నారు. 2017-18లో అప్పటి టీడీపీ ప్రభుత్వం రైతు రథం కింద వేలాది మంది రైతులకు రాయితీపై ట్రాక్టర్లు పంపిణీ చేసింది. అప్పట్లో ఓ కంపెనీ 81మంది రైతులకు ఎల్4508 ఆల్ రౌండర్ మోడల్ ట్రాక్టర్లు సరఫరా చేయడానికి ఆగ్రోస్‌తో ఒప్పందం చేసుకుంది. కానీ 14508 మోడల్ ట్రాక్టర్లను సరఫరా చేసింది. ఒక్కో ట్రాక్టర్‌కు రూ.83,137 అధికంగా వసూలు చేసిందని అప్పట్లోనే రైతులు ఫిర్యాదు చేశారు. దీనిపై ఆగ్రోస్ కమిటీ వేసి, రైతుల ఆరోపణలు నిజమని తేల్చింది. సదరు కంపెనీకి నోటీసు జారీ చేసింది. అయితే ఓ అధికారి వత్తాసు పలకడంతో సదరు కంపెనీ రైతులకు అదనపు సొమ్ము తిరిగి చెల్లించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించింది. గత ప్రభుత్వం దీనిపై ఎలాంటి చర్య తీసుకోలేదు. ఒప్పందాన్ని ఉల్లంఘించి, మోడల్ మార్చి, అధిక ధర వసూలు చేసినందుకు గత ఫిబ్రవరిలో సదరు కంపెనీని ఆగ్రోస్ బ్లాక్ లిస్టులో పెట్టింది. అయినా తమకు న్యాయం జరగలేదని రైతులు వాపోతున్నారు. తమకు న్యాయం చేయాలని వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులకు కొందరు రైతులు వినతిపత్రాన్ని అందజేశారు.

మండిన కోస్తా

నెల్లూరులో 40.2 డిగ్రీలు.. దేశంలోనే అత్యధికం



విశాఖపట్నం, జూలై 16(ఆంధ్రజ్యోతి): కొద్ది రోజులుగా ఎండలతో మండిపోతున్న కోస్తాలో బుధవారం పలుచోట్ల వడగాడ్పులు వీచాయి. పశ్చిమ గోదావరి నుంచి నెల్లూరు వరకూ వేడి గాలులు వీయడంతో ప్రజలు ఠారెత్తిపోయారు. పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 4నుంచి 8డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. దేశంలోనే అత్యధికంగా నెల్లూరులో 40.2 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. గన్నవరంలో 39.6, నరసాపురంలో 39.4, జంగమహేశ్వరపురంలో 39.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వర్షాలతో ముసురు వాతావరణం నెలకొనాల్సిన సమయంలో వడగాడ్పులు వీయడం అసాధారణమేనని వాతావరణ నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. జూలైలో 40 డిగ్రీలు నమోదుకావడం అరుదుగా జరుగుతుందన్నారు. ఎండలతో వ్యవసాయరంగంపై తీవ్ర ప్రభావం పడింది. ఖరీఫ్‌లో విత్తిన పంటలు ఎండుతున్నాయి. ఆరుబయట పనిచేసే వ్యవసాయ కూలీలు సొమ్మసిల్లిపోతున్నారు. రుతుపవన ద్రోణి ఎక్కువ రోజులు మధ్య, తూర్పు, వాయువ్య భారతంలో ఉండిపోయింది. దీనిని రుతుపవనాల విరామం అని విశ్లేషించలేం గానీ..దక్షిణ భారతంలో అనేక ప్రాంతాలు దుర్భిక్షంలో చిక్కుకున్నాయని చెప్పవచ్చునని వాతావరణ నిపుణుడొకరు వ్యాఖ్యానించారు. జూలై నెలాఖరు వరకూ కృష్ణానదీ పరీవాహక ప్రాంతంలో కురిసిన వర్షాలతో డ్యామ్‌లకు వచ్చిన వరదను వచ్చింది వచ్చినట్టుగానే కిందకు వదలాలి. శ్రీశైలం డ్యామ్ నిండిపోవడంతో నాగార్జునసాగర్‌కు వరద వచ్చింది. ప్రస్తుతం ప్రాజెక్టుల కింద పంటలకు ఫర్వాలేదు గానీ వర్షాధార ప్రాంతాల్లో మాత్రం ఇబ్బంది వచ్చిందని ఇస్రో వాతావరణ నిపుణుడు ఒకరు వ్యాఖ్యానించారు.


18 నుంచి కోస్తా, సీమలో వర్షాలు

ఉపరితల ఆవర్తనం ఈ నెల 18కల్లా ఉత్తర తమిళనాడు, దక్షిణ కోస్తాకు ఆనుకుని ఉన్న నైరుతి బంగాళాఖాతంలోకి ప్రవేశించనున్నదని ఇస్రో వాతావరణ నిపుణుడు తెలిపారు. దీంతో 18వ తేదీ నుంచి కోస్తా, రాయలసీమల్లో వర్షాలు పెరుగుతాయని అంచనా వేశారు. ఈ నెల 22 నాటికి ఉపరితల ఆవర్తనం వాయువ్య బంగాళాఖాతంలోకి వచ్చిన తరువాత అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ నెల 22 వరకూ కోస్తాలో వర్షాలు కురుస్తాయని ఆయన వెల్లడించారు.

కరువు గుప్పిట్లో కోస్తా, రాయలసీమ

రుతుపవనాల సీజన్‌లో 45 రోజులు ముగిసింది. జూన్‌లో తీవ్రంగా నిరాశపరిచిన రుతుపవనాలు జూలై ప్రథమార్థంలో కూడా ఆదుకోలేకపోయాయి. జూలై తొలిపక్షం ముగిసినా రాష్ట్రంలో చాలాకాలం తరువాత తీవ్రవర్షాభావం నెలకొంది. జూన్ 1నుంచి బుధవారం వరకు రాష్ట్రంలో 175.6 మిల్లీమీటర్లకుగాను 107.9 మి.మీ. (సాధారణం కంటే 38.6% తక్కువ) వర్షపాతం నమోదయింది. మొత్తం 26 జిల్లాల్లో విజయనగరం, ఏలూరు తప్ప మిగిలిన 24 జిల్లాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదుకావడం వర్షాభావం తీవ్రతకు అద్దం పడుతుంది. సాధారణం కంటే కడప జిల్లాలో 74.7 శాతం, అన్నమయ్యలో 72.6, పల్నాడులో 70, శ్రీసత్యసాయిలో 60 శాతం తక్కువగా నమోదైంది. దీంతో రాయలసీమ, కోస్తాల్లో ఎక్కువ ప్రాంతాలు తీవ్ర కరువును ఎదుర్కొంటున్నాయని వాతావరణ నిపుణుడొకరు ఆందోళన వ్యక్తంచేశారు.

ప్రాజెక్టు మీది.. భరోసా మాది!



(మొదటి పేజీ తరువాయి)

రూపొందించిన 'స్వర్ణాంధ్రప్రదేశ్-2047' నివేదికను సీఎం చంద్రబాబు ఆవిష్కరించారు. 2047 నాటికి ఏపీ రూపురేఖలు ఏ విధంగా మారుతాయో వివరిస్తూ సీఐఐ సహకారంతో ఉన్నత స్థాయి టాస్క్ ఫోర్స్ రూపొందించిన నివేదికలో ఈ బ్లూప్రింట్‌ను పొందుపరిచారు. అనంతరం సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. 2020లో తాను రూపొందించి విజన్-2020లో చెప్పిన విధంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తన లక్ష్యాలను విజయవంతంగా సాధించిన విషయాన్ని గుర్తుచేశారు. అయితే.. ఇప్పుడు అంతకంటే బృహత్తర లక్ష్యాలు నిర్దేశించుకుని ఈ బ్లూప్రింట్‌ను రూపొందించినట్టు వివరించారు. ఈ లక్ష్యాలను కూడా సాధిస్తామని తెలిపారు. పెద్ద సంఖ్యలో పారిశ్రామిక వేత్తలు హాజరైన ఈ సమావేశంలో చంద్రబాబు.. భవిష్యత్ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిని అచ్చెరువొందేలా వివరించారు.

> ప్రధాని మోదీ ప్రకటించిన 'వికసిత్ భారత్-2047'తో 'స్వర్ణాంధ్రప్రదేశ్-2047' లక్ష్యాలను సమ్మిళితం చేస్తూ ఈ నివేదిక రూపొందించాం. దీనిలోని ప్రతి అక్షరం అమలయ్యేలా చూసేందుకు పట్టుదలతో ఉన్నాం.
>
> పీ-4 నమూనా ద్వారా పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు 10 సూత్రాలను గుర్తించాం. సమాజంలో సంపన్నులైన వారు ప్రజలను పెట్టుబడిగా భావించి బలహీన వర్గాలకు మద్దతు ఇవ్వాలి. సమిష్టి సామాజిక బాధ్యత ద్వారా ఇది సాధ్యమవుతుంది.
>
> మూడు అంశాలు దేశానికి కీలక ప్రయోజనాలు అందిస్తున్నాయి. అవి.. 1) ఆర్థిక సంస్కరణలు. 2) జనాభా. 3) ఐటీ.
>
> - సీఎం చంద్రబాబు



ఢిల్లీలో జరిగిన సీఐఐ సమావేశంలో పాల్గొన్న పారిశ్రామికవేత్తలు, మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

మానవ వనరులే వరం!

రాష్ట్రానికి మానవ వనరులే వరమని సీఎం చంద్రబాబు తెలిపారు. పండ్లతోటలు, ఆక్వాకల్చర్, వాణిజ్య పంటలు ఏపీని సుసంపన్నంగా మార్చాయన్నారు. అత్యంత పొడవైన కోస్తా తీరంలో ప్రతి 50 కిలో మీటర్లకు ఒక రేవు ఉందని, పెద్ద ఎత్తున విమానాశ్రయాలను, ఉత్తమ ప్రమాణాలతో రహదారులను నిర్మిస్తున్నామని తెలిపారు. పరిశ్రమలకు అవసరమయ్యే అన్ని వనరులు, మౌలిక సదుపాయాలకు ఏపీ దేశంలో ఒక కీలక కేంద్రంగా మారుతుందన్నారు. అవకాశాలను అందిపుచ్చుకునేందుకు, అంతర్జాతీయ, జాతీయ సంస్థలు అమరావతికి వచ్చేందుకు నైపుణ్యంతో కూడిన మానవ వనరులను సిద్ధం చేస్తున్నామని వివరించారు. ఏపీకి అద్భుతమైన ఖనిజ సంపద ఉందని, ప్రధాన పరిశ్రమలన్నీ ఏపీకి తరలి వస్తున్నాయని చెప్పారు. 2047 నాటికి ఏపీ ఆర్థిక వ్యవస్థ 180 బిలియన్ల డాలర్ల నుంచి 2.4 ట్రిలియన్ డాలర్లకు చేరుతుందని తెలిపారు. తలసరి ఆదాయం రూ.2.91 లక్షల(3,400 డాలర్ల) నుంచి రూ.36.06 లక్షల(42 వేల డాలర్లు)కు చేరుతుందన్నారు. 2047 నాటికి ఏపీ జనాభా 5.8 కోట్లకు చేరుతుందని, 60 శాతం పట్టణీకరణ జరుగుతుందని వివరించారు.

విధాన సంస్కరణలతోనే సాధ్యం

90వ దశకంలో ఐటీ విప్లవం ఫలితాలను ఏపీలో అమలు చేసేందుకు తాను చేసిన కృషిని సీఎం చంద్రబాబు వివరించారు. వినూత్న ఆవిష్కరణలు, విధాన సంస్కరణలు ఉంటే ఎంతటి గొప్ప లక్ష్యాలనైనా సాధించవచ్చునని తెలిపారు. ఎన్ని విమర్శలెదురైనా బిల్ గేట్స్ వంటివారి తోడ్పాటుతో ఐటీ విప్లవాన్ని సాధించామన్నారు. ఈ రోజు ప్రపంచంలోని నలుగురు ఐటీ నిపుణుల్లో ఒకరు భారతీయుడు కాగా, నలుగురు భారతీయుల్లో ఒకరిద్దరు తెలుగువారున్నారని తెలిపారు. దేశంలో ఐటీ కొత్త పుంతలు తొక్కేందుకు పునాది వేసిన టెలీకమ్ విప్లవానికి తోడ్పాటు నిచ్చిన ఘనత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయికి దక్కిందన్నారు. ఆర్థిక సంస్కరణలు, జనాభా వల్ల వచ్చే లాభాలు, ఐటీ తొలి ఫలితాలను అందిపుచ్చుకోవడం అనే ఈ మూడు అంశాలు దేశానికి ప్రయోజనం చేకూర్చాయని వివరించారు. దాని వల్లే ఈ రోజు ప్రపంచంలో నాలుగవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా మారిందని చెప్పారు. 2047 నాటికి భారత దేశం మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుతుందన్నారు. ప్రధాని మోదీ దేశం వేగంగా అభివృద్ధి చెందేలా ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. అభివృద్ధిలో భాగస్వాములు కావాలనుకున్న ప్రతి ఒక్కరూ విశాల దృక్పథంలో ఆలోచించి నిర్ణయాత్మకంగా వ్యవహరిస్తే ఏ లక్ష్యమైనా సాధించగలమన్నారు.

టెక్నాలజీ గేమ్ చేంజర్

విశాఖ, విజయవాడ నగరాలు దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న 'నాన్ మెట్రో' నగరాలని 'లింక్డ్ ఇన్' నివేదిక వెల్లడించిందని సీఎం తెలిపారు. సుపరిపాలనలో సాంకేతికతే గేమ్ చేంజర్‌గా తోడ్పడుతుందన్నారు. ఐబీఎం, టీసీఎస్, ఎల్‌అండ్‌టీ తోడ్పాటుతో రాష్ట్రంలో క్వాంటమ్ కంప్యూటింగ్‌ను వచ్చే ఏడాది జనవరి నాటికి ప్రారంభించనున్నట్టు చెప్పారు. ఈ ఆగస్టు 15 కల్లా ఏపీలో అన్ని ప్రజాసేవలు వాస్తవ సమయం(రియల్ టైం)లో వాట్సాప్ ద్వారా లభ్యమవుతాయని, ప్రజలు ఏ కార్యాలయానికీ వెళ్లనవసరం లేదని తెలిపారు.

నాలుగో స్థానంలో ఏపీ

దేశంలో పెట్టుబడులకు కేంద్రాలుగా గుర్తింపు పొందిన రాష్ట్రాల్లో ఏపీ నాల్గవ స్థానంలో ఉందని సీఎం చంద్రబాబు తెలిపారు. ఇప్పటికే తాము రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించామన్నారు. దీనివల్ల 8.5 లక్షల మందికి ఉపాధి లభించిందని చెప్పారు. విశాఖ, అమరావతి, తిరుపతి నగరాలను అకడమిక్ హబ్ లుగా తీర్చిదిద్ది వినూత్న ఆవిష్కరణలను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. అమరావతి ప్రపంచంలోనే అత్యుత్తమ నగరంగా రూపొందుతోందన్నారు. ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామిక వేత్త తయారు కావాలన్నదే తమ లక్ష్యమని చెప్పారు. పర్యాటక రంగమే దేశ భవిష్యత్తు అని, ఏఐ సహాయంతో పర్యాటక రంగం అత్యధిక ఉద్యోగాలను కల్పించనుందని తెలిపారు. పర్యాటక రంగానికి తమ ప్రభుత్వం పరిశ్రమ హోదా కల్పించిందని చెప్పారు. టాస్క్ ఫోర్స్ కో చైర్మన్, టాటా గ్రూప్ చైర్మన్ ఎన్. చంద్రశేఖరన్, సీఐఐని చంద్రబాబు అభినందించారు. సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ, ఇతర టాస్క్ ఫోర్స్ సభ్యులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

చంద్రబాబు 'గుడ్‌విల్' వల్లే ఏపీలో పెట్టుబడుల వర్షం!

- సిలికాన్ వ్యాలీ మాదిరిగా అమరావతి క్వాంటమ్ వ్యాలీ
- టాటా సన్స్ చైర్మన్ చంద్రశేఖరన్



అమెరికాలోని సిలికాన్ వ్యాలీ మాదిరిగా.. దేశంలో అమరావతి క్వాంటమ్ వ్యాలీ మారేందుకు అన్ని అవకాశాలు ఉన్నాయని, ఈ క్వాంటమ్ వ్యాలీలో తాము కూడా భాగస్వామ్యమయ్యామని టాస్క్ ఫోర్స్ కో చైర్మన్, టాటా సన్స్ చైర్మన్ చంద్రశేఖరన్ చెప్పారు. రాష్ట్ర అభివృద్ధికి, విజన్-2047 సాధనకు తాము 120 సిఫారసులు చేశామని తెలిపారు. సీఐఐ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఏపీని అభివృద్ధి చేసేందుకు లక్ష్యాలు నిర్దేశించుకున్న సీఎం చంద్రబాబు విజనరీ నేత అని ప్రశంసించారు. ఏపీలో పుష్కలంగా ఉన్న అవకాశాలను వినియోగించుకునేందుకు ముందుకు రావాలని పారిశ్రామిక వేత్తలకు ఆయన పిలుపునిచ్చారు. చంద్రబాబు విజన్‌ను దృష్టిలో పెట్టుకుని ఏపీ ఆర్థిక, పారిశ్రామిక అభివృద్ధి నివేదికను సిద్ధం చేశామన్నారు. చంద్రబాబుకు ఉన్న గుడ్ విల్ ఏపీకి పెట్టుబడులు ప్రవాహం మాదిరిగా వచ్చేలా చేస్తోందన్నారు. అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ ఏర్పడితే దేశంలో ఒక ఏకో సిస్టమ్ ఏర్పడుతుందని, ఏపీకి ప్రముఖ డేటా సెంటర్లు వచ్చేందుకు అవకాశం ఉంటుందని చంద్రశేఖరన్ వివరించారు.

ప్రసన్నకుమార్‌రెడ్డికి నో బెయిల్

- 'అర్నేష్‌కుమార్' మార్గదర్శకాలు పాటించండి
- పోలీసులకు హైకోర్టు ఆదేశం



అమరావతి, జూలై 16(ఆంధ్రజ్యోతి): కోవూరు టీడీపీ ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై అనుచిత, అసభ్యకర వ్యాఖ్యలు చేసిన వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి హైకోర్టు షాక్ ఇచ్చింది. ఆయనకు ముందస్తు బెయిల్ మంజూరు చేసేందుకు నిరాకరించింది. అయితే ఆయనపై నమోదు చేసిన సెక్షన్లన్నీ ఏడేళ్లలోపు శిక్షకు వీలున్నవేనని గుర్తుచేసింది. అర్నేష్‌కుమార్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలు పాటించాలని దర్యాప్తు అధికారికి స్పష్టం చేసింది. ఈ మేరకు సింగిల్ జడ్జి బుధవారం ఉత్తర్వులిచ్చారు. ప్రసన్నకుమార్‌రెడ్డి తనను అసభ్య పదజాలంతో దూషించారని వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేయడం.. దీని ఆధారంగా కొవ్వూరు పోలీసులు ఆయనపై కేసు నమోదు చేయడం.. ముందస్తు బెయిల్ కోరుతూ ప్రసన్నకుమార్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యం బుధవారం మరోసారి విచారణకు రాగా.. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ఓ.మనోహర్‌రెడ్డి వాదనలు వినిపించారు. పిటిషనర్‌పై నమోదైన సెక్షన్లు ఏడేళ్లలోపు శిక్షకు వీలున్నవేనన్నారు. ఆ సెక్షన్లు ఆయనకు వర్తించవని తెలిపారు. ప్రశాంతిరెడ్డి ఆదేశాలతో ఆమె అనుచరులు ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటిని ధ్వంసం చేశారని.. ఈ ఘటనపై ఫిర్యాదు చేసినా పోలీసులు కేసులు నమోదు చేయలేదని తెలిపారు. ఆయనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ వాదనలు వినిపిస్తూ... ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ప్రతిష్ఠను దిగజార్చేలా పిటిషనర్ అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. ఘటన జరిగిన తర్వాతి రోజు కూడా తన వ్యాఖ్యలను సమర్థించుకుంటూ మరో వీడియో విడుదల చేశారని తెలిపారు. అర్నేష్‌కుమార్ కేసులో సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం.. నిందితుడిని అరెస్టు చేయాలో వద్దో నిర్ణయించే పూర్తి విచక్షణాధికారం దర్యాప్తు అధికారికి ఉందన్నారు. భావప్రకటన స్వేచ్ఛ పేరుతో ఇష్టారీతిన మాట్లాడడానికి వీల్లేదని ఇటీవల సుప్రీంకోర్టు పేర్కొందని.. ఆ తీర్పు ప్రతి ఇంకా అందుబాటులోకి రాలేదని తెలిపారు. ముందస్తు బెయిల్ పొందేందుకు పిటిషనర్ అనర్హుడని అన్నారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి.. ప్రసన్నకుమార్‌రెడ్డికి ముందస్తు బెయిల్ మంజూరు చేయలేమని ప్రకటించారు. ఆయన విషయంలో అర్నేష్‌కుమార్ కేసులో సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పాటించాలని పోలీసులకు స్పష్టం చేశారు.

కసిరెడ్డి 'వంట' పిటిషన్‌పై విచారణ 22కి వాయిదా

- మూడోసారి పైలా దిలీప్ బెయిల్ పిటిషన్



విజయవాడ, జూలై 16(ఆంధ్రజ్యోతి): జైల్లో వంట చేసుకోవడానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ మద్యం కుంభకోణం ప్రధాన నిందితుడు కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను విజయవాడ ఏసీబీ కోర్టు 22వ తేదీకి వాయిదా వేసింది. మద్యం కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న పైలా దిలీప్ ఏసీబీ కోర్టులో బుధవారం మూడోసారి బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. ఇప్పటికే రెండుసార్లు ఆయన బెయిల్ పిటిషన్‌ను కోర్టు తిరస్కరించింది. తనకు కొద్దినెలల క్రితమే వివాహమైనందున బెయిల్ ఇవ్వాలని కోరాడు. బ్యారక్‌ను మార్చాలని చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పీఏ బాలాజీ కుమార్ యాదవ్ దాఖలు చేసిన పిటిషన్‌ను ఏసీబీ కోర్టు కొట్టేసింది. బాలాజీ కుమార్ గుంటూరు జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. తనను ఇతర ఖైదీలు ఉన్న బ్యారక్‌లోకి మార్చాలని, తన బ్యారక్‌లో విద్యుద్దీపాలు వెలగడం లేదని పిటిషన్ దాఖలు చేశారు. అన్నీ సక్రమంగానే ఉన్నాయంటూ జైలు అధికారులు కోర్టులు వివరాలు అందజేశారు. దీంతో ఆయన పిటిషన్‌ను కొట్టేస్తూ కోర్టు తీర్పును ఇచ్చింది.

మోహిత్‌రెడ్డిపై తొందరపాటు చర్యలొద్దు

- మధ్యంతర ఉత్తర్వులు 23 వరకు పొడిగించిన హైకోర్టు



అమరావతి, జూలై 16(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిపై ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోవద్దంటూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను హైకోర్టు ఈ నెల 23 వరకు పొడిగించింది. ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను 23వ తేదీకి వాయిదా వేసింది. బుధవారం హైకోర్టు సింగిల్ జడ్జి ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. మద్యం కుంభకోణం కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వైసీపీ నేత చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుమారుడు మోహిత్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది సి.నాగేశ్వరరావు వాదనలు వినిపిస్తూ... ఈ కేసులో పిటిషనర్‌ను నిందితుడిగా(ఏ39)గా చేర్చారన్నారు. మోహిత్‌రెడ్డి తండ్రి వద్ద పనిచేసిన సెక్యూరిటీ సిబ్బంది ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా పిటిషనర్‌ను నిందితుడిగా చేర్చారన్నారు. పిటిషన్‌పై విచారణను వాయిదా వేయాలని కోరారు. పిటిషనర్‌పై తొందరపాటు చర్యలు వద్దంటూ ఇదే హైకోర్టులోని మరో న్యాయమూర్తి మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చారని, వాటిని పొడిగించాలని కోరారు.

ఆ ఫ్లాట్ ఏజెన్సీకిచ్చాం.. ఎవరున్నారో తెలీదు!

- ఏపీ లిక్కర్ స్కాం నిందితులతో వ్యాపార లావాదేవీలు లేవు: శ్రవణ్ రావు

హైదరాబాద్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): దుబాయ్‌లో తమ కుటుంబ సభ్యుల పేరుతో ఉన్న ఫ్లాట్‌ను ఓ రెంటల్ ఏజెన్సీకి లీజుకు ఇచ్చామని ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడిగా ఉన్న శ్రవణ్ రావు స్పష్టం చేశారు. ఆ ఏజెన్సీ వారు ఎవరికి అద్దెకు ఇచ్చారో, అందులో ఎవరున్నారో తమకు తెలియదని వెల్లడించారు. 'శ్రవణ్ రావు దుబాయ్ ఫ్లాట్‌లో లిక్కర్ స్కాం నిందితుల మకాం' పేరుతో 'ఆంధ్రజ్యోతి'లో బుధవారం ప్రచురితమైన కథనంపై శ్రవణ్ రావుకు చెందిన సంస్థ వివరణ ఇచ్చింది. 'శ్రవణ్ రావు కుటుంబ సభ్యులు గతంలోనే దుబాయ్‌లో ఫ్లాట్ కొనుగోలు చేశారు. అయితే ఆ ఫ్లాట్‌ను హాలీడే హోమ్స్ అనే ఏజెన్సీకి 2023లో లీజుకు ఇచ్చారు. ఆ సంస్థ తాత్కాలిక పద్ధతిలో భారత్‌తోపాటు ఇతర దేశాల నుంచి దుబాయ్ వచ్చే వారికి అద్దెకు ఇస్తోంది. హాలీడే హోమ్స్ ఆ ఫ్లాట్‌ను ఎవరికి అద్దెకు ఇస్తుందనే విషయంతో యజమానికి ఏ సంబంధం లేదు. ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన లిక్కర్ స్కాంలో నిందితుడిగా ఉన్న రాజ్ కసిరెడ్డితోగానీ, ఆ కేసులో మిగతా నిందితులతోగానీ శ్రవణ్ రావు, అతని కుటుంబ సభ్యులకు ఎలాంటి వ్యాపార లావాదేవీలు లేవు. 2023 నుంచి దుబాయ్‌లోని ఫ్లాట్ శ్రవణ్ రావు కుటుంబం ఆధీనంలో లేదు' అని వెల్లడించింది.

గ్రావెల్ అక్రమ మైనింగ్‌పై నివేదిక ఇవ్వండి

- తిరుపతి జిల్లా కలెక్టర్‌కు హైకోర్టు ధర్మాసనం ఆదేశం



అమరావతి, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని శ్రీసిటీని ఆనుకొని ఉన్న అటవీ, ఇరిగేషన్ భూముల్లో గ్రావెల్ అక్రమ మైనింగ్ చేస్తున్నారంటూ దాఖలైన పిల్‌పై హైకోర్టు స్పందించింది. అక్కడ అక్రమంగా మైనింగ్ జరుగుతోందా? ఇరిగేషన్ కాలువలో పూడికతీత వల్ల పర్యావరణానికి నష్టం జరిగిందా? అనే విషయాన్ని పరిశీలించి నివేదిక సమర్పించాలని తిరుపతి జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది. పర్యావరణానికి జరిగిన నష్టాన్ని అంచనా వేసి, బాధ్యుల నుంచి సొమ్ము వసూలు చేయాలని కలెక్టర్‌కు స్పష్టం చేసింది. విచారణను రెండువారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో శ్రీసిటీ యాజమాన్యం నీటివనరులను పూడ్చివేస్తోందని పేర్కొంటూ తిరుపతి జిల్లాకు చెందిన మద్రాసుబాబు హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. అక్రమమైనింగ్‌ను నిలువరించడంతో పాటు నీటి వనరులను పునరుద్ధరించేలా అధికారులను ఆదేశించాలని కోరారు. పిల్ బుధవారం విచారణకు రాగా ప్రభుత్వ న్యాయవాది సోమరాజు వాదనలు వినిపిస్తూ.. కాలువలో పూడికతీతకు ఐఐటీకి అనుమతులు ఇచ్చామన్నారు. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేస్తామన్నారు.

అక్రమ మైనింగ్ కుట్రలో శ్రీలక్ష్మి భాగస్వామి



- నిబంధనలకు విరుద్ధంగా ఓఎంసీకి మేలు
- ఉద్దేశపూర్వకంగానే 'క్యాప్టివ్' పదం తొలగింపు
- టీ- హైకోర్టులో సీబీఐ వాదనలు
- ఆమె లంచాలు తీసుకున్నట్టు ఆధారాల్లేవు
- శ్రీలక్ష్మి తరఫు న్యాయవాది వాదనలు.. తదుపరి విచారణ నేటికి వాయిదా

హైదరాబాద్, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఓబులాపురం మైనింగ్ కంపెనీకి (ఓఎంసీ) మైనింగ్ లీజు ఇచ్చే వ్యవహారానికి సంబంధించిన కుట్రలో అప్పటి పరిశ్రమల శాఖ కార్యదర్శి వై. శ్రీలక్ష్మి భాగస్వామిగా ఉన్నారని సీబీఐ పేర్కొంది. ఓఎంసీ కేసు నుంచి తనను తప్పించాలని పేర్కొంటూ శ్రీలక్ష్మి దాఖలు చేసిన క్రిమినల్ రివిజన్ (డిశ్చార్జి) పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కే లక్ష్మణ్ బుధవారం విచారణ కొనసాగించారు. ఈ సందర్భంగా సీబీఐ తరఫున స్పెషల్ పీపీ కాపాటి శ్రీనివాస్ వాదనలు వినిపించారు. "ఓఎంసీ డైరెక్టర్లు బీవీ శ్రీనివాస్‌రెడ్డి, గాలి జనార్దన్‌రెడ్డిలతో కలిసి శ్రీలక్ష్మి అక్రమ మైనింగ్ కుట్రలో భాగస్వామి అయ్యారు. ఎంఎండీఆర్ యాక్ట్ సహా అన్ని రకాల నిబంధనలు ఉల్లంఘించి ఓఎంసీకి లీజులు కట్టబెట్టారు. దీనికోసం ఇతరుల దరఖాస్తులను ఉద్దేశపూర్వకంగా తిరస్కరించారు. వారి దరఖాస్తులు ఎందుకు తిరస్కరించరాదో చెప్పాలని 15 రోజులు గడువు ఇచ్చి.. ఆ గడువు కూడా ముగియకముందే ఓఎంసీకి అనుకూలంగా జీవో ఇచ్చారు. ఉద్దేశపూర్వకంగానే కాప్టివ్ మైనింగ్ అనే పదాన్ని తొలగించి.. అక్రమ మైనింగ్‌కు, విదేశాలకు ఎగుమతులకు సహకరించారు. ప్రత్యేకంగా అప్పటి ఉమ్మడి ఏపీ ప్రభుత్వానికి స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని గాలి జనార్దన్‌రెడ్డి హామీ ఇచ్చారు. సదరు స్టీల్ ప్లాంట్ కోసమే ఐరన్ ఓర్ ఉపయోగిస్తామని హామీ ఇచ్చినందుకే లీజు కేటాయించారు. రాష్ట్రంలో ఏర్పాటు చేసే స్టీల్ ప్లాంట్ కోసం ఐరన్ ఓర్‌ను ఉపయోగించేందుకు క్యాప్టివ్ అనే పదం పెట్టాల్సి ఉండగా, సదరు పదాన్ని తొలగించి ఓఎంసీకి అక్రమ లబ్ధి చేకూర్చారు." అని పేర్కొన్నారు. శ్రీలక్ష్మి తరఫున సీనియర్ న్యాయవాది వివేక్ రెడ్డి వాదనలు వినిపించారు. "పరిశ్రమల శాఖ కార్యదర్శిగా పదవీ బాధ్యతలు చేపట్టే నాటికే శ్రీలక్ష్మి కంటే ముందు ఉన్న కార్యదర్శి కృపానందం, అప్పటి మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఓఎంసీకి లీజు కేటాయించాలని ప్రొవిజనల్‌గా నిర్ణయం తీసుకున్నారు. ఓఎంసీ మైనింగ్ ప్రణాళికను కేంద్ర ప్రభుత్వం ఆమోదించడంతోపాటు అటవీ అనుమతులు సైతం మంజూరు చేసింది. ఆమె కంటే ముందున్న కార్యదర్శి, మంత్రిపై కేసు వీగిపోయినప్పుడు తనపై కేసు ఎలా ఉంటుంది.? ఆమె లంచం తీసుకున్నారన్న ఆరోపణలకు సైతం ఎలాంటి రుజువు లేదు. ఇదే విషయం సీబీఐ తన చివరి చార్జిషీట్‌లో పేర్కొంది." అని తెలిపారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి తదుపరి విచారణను గురువారానికి వాయిదావేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.